# సుమతి

అంతర్జాల సమగ్ర కుటుంబ మాసపత్రిక

01-06-2025 సంపుటి -3 జూన్ సంచిక-4 రూ.25/-







# సుమతి

## (సమగ్ర సకుటుంబ మాసపత్రిక)

## తెలుగు సాహితీ జగత్తులో

## అనతి కాలంలోనే ధ్రువతారగా సుమతి ని నిలిపినందుకు

## ధన్యవాదాలు తెలుపుతూ

- ఎడిటోరియల్ బోర్డ్


## సుమతిలో ప్రకటనలు ఇవ్వండి

అనతి కాలంలోనే అశేష పాఠకలోకానికి చేరువైన

సుమతి సకుటుంబ మాసపత్రికలో ప్రకటనలు ఇవ్వండి

కవర్ పేజి కలర్ :రూ.5000/-

కవర్ పేజి బ్లాక్ అండ్ వైట్ :రూ. 3000/-

లోపలి పేజీల్లో కలర్ :రూ2000 /-

లోపలి పేజీల్లో బ్లాక్ అండ్ వైట్ :రూ.1000 /-


ఆరోగ్యకరమైన సాహిత్యాన్ని కుటుంబం మొత్తానికి అందించాలని తెలుగు భాషకు

మరింత ఉన్నత స్థానాన్ని కల్పించాలని మీ ముందుకు ప్రతి నెల ఒకటవ తారికునే వస్తుంది.



# సుమతి పరివారం


## సుమతి
మాసపత్రిక

సంపుటి :4 సంచిక:3

జూన్ 2025

సంపాదకురాలు
అవుతు శ్రీవిద్య

సహ సంపాదకురాలు
జి .జ్ఞానిక

ముఖచిత్రం
మోక్ష

గ్రాఫిక్స్
జ్ఞానిక

చందా వివరాలు
సంవత్సర చందా రూ 250
ఐదేళ్ళ చందా రూ 1200
ప్రకటనలు , చందాలకు మరియు
రచనలు ,అభిప్రాయాలు
పంపవలసిన చిరునామా

SUMATHI.POTILU@GMAIL.COM

ప్రచురణ
సుమతి పబ్లికేషన్స్
(RC NO.:538/2006)
హౌస్ నం :26 -46 -79


# సంపాదకీయం

"సమాధానం చెప్పలేని ప్రశ్నలు ఉండొచ్చు కానీ, ప్రశ్నించలేని సమాధానాలు ఉండకూడదు." అన్నాడు శాస్త్రవేత్త రిచర్డ్ ఫైన్మాన్. విజ్ఞానశాస్త్రం యొక్క విశిష్టతను చాటే వ్యాఖ్య ఇది. "ప్రతి అంశాన్ని ప్రశ్నించాల్సిందే.. అంగీకరించే సమాధానం వచ్చే దాకా అడుగుతూ ఉండాల్సిందే!" అన్నది ఆ మాటల సారాంశం. ప్రకృతిలోని ప్రతి విషయాన్ని కొందరు అతీతశక్తులకు అన్వయిస్తారు. ఏ శక్తో నడిపిస్తే నడిచే ప్రపంచం ఇదని వేదాంతం వల్లిస్తారు. ఇలాంటి మాటలు విని ఊరుకుంటే– మనం ఇంత శాస్త్ర సాంకేతిక ప్రగతిని సాధించి ఉండేవాళ్లం కాదు కదా! కాబట్టి– ఎదిగే పిల్లలకు మెట్ట వేదాంతాలు పనికిరావు. ప్రశ్నించటానికి వీల్లేని నమ్మకాలను వాళ్ల మీద రుద్దొద్దు. ప్రశ్నించే పిల్లలు ఎప్పటికప్పుడు నేర్చుకుంటారు. ఆత్మవిశ్వాసంతో ఉంటారు. పరిష్కారాలను తెలుసుకుంటారు. కొత్త సంగతులను కనుక్కుంటారు. పిల్లలు వారికి వారుగానే వాటిని నిర్మించుకుంటారు. పెద్దలు పక్కన ఉండి అవసరమైన సహకారం అందించాలి.

సుమతి

## సుమతి – సుభాషితాలు

డబ్బు ఎవరికోసమైనా ఖర్చు చెయ్యండి
సమయాన్ని మాత్రం అర్హత ఉన్నవాళ్ళకే ఖర్చు చెయ్యండి

## లోపలి పేజీలలో....

# ఈ నెల సాహితి సుమాలు...

### ఫీచర్స్ అందరి కోసం


5 ముఖచిత్ర కథ
6 ఈ నెల కవిత
7 నడుస్తున్న చరిత్ర
17 అంతర్నేత్రం
54 జీవన చిత్రాలు
65 నాలుగో కోతి
64 సెటైర్
67 యాత్ర
85 నమ్మకాలూ –నిజాలు
87 కరెంట్ అఫైర్స్
90 అవగాహన
92 యువతా తెలుసుకో
94 భేతాళ భారతం
96 మన కథానాయికలు
99 కార్టూన్స్ పేజి
100 వార్తల్లో వ్యక్తి
108 చదవాల్సిన పుస్తకం
111 చూడాల్సిన సినిమా
115 క్రాస్ రోడ్స్ కబుర్లు
118 మన పురాణాలు
121 వాల్ పోస్టర్
124 వెబ్ పోస్టర్
134 ధర్మసందేహాలు
135 సైన్స్ కథలు
137 సృజన
138 పిల్లలు పిడుగులు
139 రాశి ఫలాలు


### సీరియల్స్


19 పంచవటి( కామెడి సీరియల్ )
42 రక్షకుడు (క్రైం సీరియల్ )
47 బాబా బాబా బ్లాక్ షీప్ ( సీరియల్ )
52 యూనివర్సిటీ
56 ఓడిన గెలుపు
102 ఆమె ఎవరు (క్రైం సీరియల్ )
125 పడి లేచిన కెరటం ( సీరియల్ )


### కథలు


24 స్పర్శ
27 ఇల్లెక్కాడా ?
32 భారతి బస్సుయాత్ర
36 చివరకు అదే గెలిచింది
63 నేర వేరిన కరుణ కల
72 నేను మనిషినే కదా
76 గీతోప దేశం
80 అందం
129 ఘటశ్రీ గారికి ఘన్న సన్మానం


### కవితలు


23 యమజాన్
30 అమ్మ దొరికింది
35 ఎండిన చేప
38 ఇది చాలదు
51 నిశీధి రాత్రి


★★★



# వానాకాలం వ్యాధుల కాలం

వానాకాలం మొదలు కాగానే పడే వానలు అప్పటి వరకూ పడిన ఎండల కారణంగా కాస్త హాయిగానే అనిపిస్తాయి. కానీ ఎడతెరిపి లేకుండా వానలు కురిస్తేనే అసలు ఇబ్బందులు మొదలవుతాయి. ఆరోగ్యా సమస్యలు కూడా అక్కడినుంచే మొదలయ్యేది. వానాకాలంలో, ముఖ్యంగా ప్రాంతంలో, సీజనల్ వ్యాధులు మరియు ఇతర ప్రమాదాల నుండి మిమ్మల్ని మీరు రక్షించుకోవడానికి కొన్ని జాగ్రత్తలు తీసుకోవడం చాలా ముఖ్యం.

జాగ్రత్తలు:

మంచినీరు:

వానాకాలంలో నీరు కలుషితమయ్యే అవకాశం ఉంది. కాబట్టి, మంచినీటిని బాగా కాచి చల్లార్చి తాగడం మంచిది. అలాగే, నీటిని నిల్వ చేసే ప్రదేశాలను శుభ్రంగా ఉంచండి.

ఆహారం:

వేడి వేడి, శుభ్రమైన ఆహారం తీసుకోవడం మంచిది. వీలైనంత వరకు వీధి అమ్మేవారి దగ్గర ఆహారం తీసుకోకుండా ఉండటం మంచిది.

దుస్తులు:

వానలో తడవకుండా జాగ్రత్తపడండి. అవసరమైతే గొడుగు లేదా రెయిన్ కోట్ వాడండి. తడిసిన బట్టలను వెంటనే మార్చుకోండి, తడిసిన బట్టలతో ఎక్కువసేపు ఉండటం వలన జలుబు, జ్వరాలు వచ్చే అవకాశం ఉంది.

విద్యుత్తు:

వర్షాల సమయంలో విద్యుత్తు తీగలు తెగిపడే ప్రమాదం ఉంది. కాబట్టి, విద్యుత్తు స్తంభాలు, తీగల దగ్గరకు వెళ్ళకుండా ఉండటం మంచిది.

పారిశుధ్యం:

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా దోమలు, ఈగలు వంటి వాటి ద్వారా వచ్చే వ్యాధుల బారిన పడకుండా ఉండవచ్చు.

శరీర ఆరోగ్యం:

రోగనిరోధక శక్తిని పెంచే ఆహారాన్ని తీసుకోవాలి. విటమిన్ సి అధికంగా ఉండే పండ్లు, కూరగాయలు తినడం మంచిది. అలాగే, ఇంట్లో చిన్న పిల్లలు, వృద్ధుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి.

పశువులు:

పశువులను కూడా వానాకాలంలో వచ్చే వ్యాధుల నుండి రక్షించాలి. పశువుల వైద్యుడిని సంప్రదించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

రవాణా:

వానాకాలంలో రోడ్లు జారిపోయే అవకాశం ఉంది, కాబట్టి ప్రయాణించేటప్పుడు జాగ్రత్తగా ఉండాలి. బైకులు, కార్లు నడిపేటప్పుడు వేగాన్ని నియంత్రించండి.

# విజయముద్ర

ఏల్చూరి సుబ్రహ్మణ్యం

వినువీధిలో
వికార ప్రేత జీవాలు
కారు మేఘాల బారు
ఆకలో
ఆకలోయని
గోడు గోడుగ
రోదించి
డొక్కలెండి
కనుగుడ్లు
పీక్కుపోయి
కణికెడు కూటికి
ఘూర్ణిల్లిరి!
ముష్టిమూక
ముష్టిమూక
పదండి
పదండి
మెతుక్కు
మూగిన
కుక్కల్లారా!
పదండి
పదండి
కడుపు నిండిన
మెరుపు
ఉరుముతూ
వచ్చింది
గుడ్లురిమి

చూచింది
ధగ ధగ ధగ
భుగ భుగ భుగ
వెన్నాడి
వెన్నాడి
తరిమి కొట్టింది
మెరుపు
బిచ్చగాళ్లను
తరిమి కొట్టింది!
పరుగెత్తి పరుగెత్తి
కాలువిరిగి
సడి తప్పగ
బరువెక్కిన
కనురెప్పలు
మూతల పడి
సోలిపోయి
కుప్పకూలిరి
బిచ్చగాళ్లు
కుప్పకూలిరి
కూలిన జీవుల
లోహపాదముల
కసకస
త్రొక్కుచు
విలయముగా
జ్వలియించెను
మెరుపు!

చిందిపోసె
రక్తం!
పడగ చితికిన
పాము లాగున
పైకి దూకి
బిచ్చగాళ్లు
ఒక్కటై
ఒక కేక పెట్టిరి!
మెరుపును మింగిరి!
చల్లారని ఆకలి
చల్లారని చిచ్చుకు
శాంతి శాంతి!
పిడుగులు
పిడుగులు!
విప్లవం విప్లవం
పైకి చిందిన
పచ్చి రక్తం
పురిటి వాకిట
పేద జీవుల
విజయ ముద్రగ
ఎగురుచున్నది
ఎర్ర జెండా!




మే 7వ తేదీన ప్రారంభమైన మిస్ వరల్డ్  సందడి అనేక వివాదాలను మూటకట్టుకుని మే 31న తుది పోటీలతో ముగిసింది.మిస్ వరల్డ్ 2025 విజేతగా థాయిలాండ్‌కు చెందిన ఒపల్ సుచాత చౌసీ నిలిచారు. మిస్ యూనివర్స్ 2024లో మూడవ రన్నర్ అప్ గా నిలిచిన ఆమె ఎట్టకేలకు తన కలను నిజం చేసుకున్నారు. ఆకర్షణీయమైన వ్యక్తిత్వం, బలమైన స్టేజ్ ప్రెజెన్స్, సామా జిక కారణాలపట్ల నిబద్ధతకు సరైన గౌరవం దక్కింది. మిస్ వరల్డ్ 2024 క్రిస్టినా పిజ్కోవా తాజాగా ఎంపికైన 72వ ప్రపంచ సుందరికి కిరీటాన్ని ధరించజేశారు. తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, జూలియా మోర్లీ, క్రిస్టినా పిజ్కోవా చేతుల మీదుగా విజేతగా నిలిచిన ఓపల్ సుచాత కిరీటాన్ని స్వీకరించారు.

ఈ పోటీల్లో ఒకటవ రన్నరప్ గా ఇది యోపియా, రెండవ రన్నరప్ గా పోలాండ్, మూడవ రన్నరప్ గా మిస్ మార్టినిక్ నిలిచారు. “మీరు మిస్ వరల్డ్ ఎన్నికైతే ఏం చేస్తారు” అని జడ్జిలు అడిగిన ప్రశ్నలకు... ‘సామాజిక సేవా నిబద్ధత, ముఖ్యంగా విద్య, మానసిక ఆరోగ్యం గురించి ఆమె చేస్తున్న కృషిని కొనసాగిస్తానని చెప్పారు. తెలం గాణ ప్రభుత్వ, మిస్ వరల్డ్ ఆర్గనైజేషన్ సంయుక్త నిర్వహ ణలో హైదరాబాద్ వేదికగా మిస్ వరల్డ్ పోటీలు  జరిగాయి.

సుమారు 108కి పైగా దేశాల నుంచి సుందరీ మణులు పాల్గొనగా దశలవారీగా కొందరు నిష్క్రమించారు. ఇక ఫైనల్స్లో 40 మంది అందాల భామలు పాల్గొనగా టాప్ 8వ దశలో మిస్ ఇండియా నందిని గుప్తా ఎలిమినేట్ అయ్యారు. అన్ని దశలను దాటిన మిస్ థాయిలాండ్ ఒపల్ సుచాత చువాంగ్ శ్రీ ప్రపంచసుందరి కిరీటాన్ని కైవసం చేసుకుంది. మిస్ వరల్డ్ విజేతగా నిలిచిన ఓపల్ సుచాతకు 1 మిలియన్ డాలర్ల ప్రైజ్ మనీ దక్కుతుంది. అంటే మన కరెన్సీలో చెప్పాలంటే 8.5 కోట్ల రూపాయలు. 1770 వజ్రాలు పొదిగిన కిరీటాన్ని ఆమె ధరించారు. ఈ ప్రైజ్ మనీని మిస్ వరల్డ్ ఆర్గనైజేషన్తో పాటు ప్రధాన స్పాన్సర్లు ద్వారా లభిస్తుంది. అంతేకాకుండా వజ్రాలతో చేసిన కిరీటాన్ని స్వీకరించారు. మిస్ వరల్డ్ 2024ను క్రిస్టినా పిజ్కోవా గెలుచుకున్న సంగతి తెలిసిందే.

'బ్యూటీ విత్ ఏ పర్పజ్' నినాదంతో 'మిస్ వరల్డ్' పోటీలను 1951లో 'ది మిస్ వరల్డ్ ఆర్గనైజేషన్' మొదలుపెట్టింది. భారత్కు చెందిన నందిని గుప్తా సహా 108 దేశాల నుంచి యువతులు మిస్ వరల్డ్ పోటీలకు హాజరయ్యారు. ప్రాథమిక పోటీ ల తర్వాత మూడు దశల్లో జరిగే క్వార్టర్ ఫైనల్స ఒక్కో ఖండం నుంచి పదేసి మంది (అమెరికా, కరీబియన్స్ నుంచి 10, ఆఫ్రికా: నుంచి 10, ఐరోపా నుంచి 10, ఏషియా, ఓషీనియా నుంచి 10 మంది )ని ఎంపిక చేశారు. గత ఆదివారం మొదటి దశ క్వార్టర్స్ పోటీలు ముగిశాయి. ప్రతి ఖండం నుంచి 10 మంది చొప్పున 40 మందిని ఎంపిక చేశారు. ప్రతి ఖండం నుంచి ఎంపికైన 10 మంది. నుంచి రెండో దశలో 5 గురిని (టాప్ 5) ఎంపిక చేశారు.
ఇలా ప్రతి ఖండం నుంచి ఎంపికైన 5 గురిలో మూడో దశలో ఇద్దరిని (టాప్ 2) ఎంపిక చేశారు. అంటే, అప్పుడు పోటీలో 8 మంది నిలిచారు. ఈ 8 మందిలో సెమీ ఫైనల్లో భాగంగా ప్రతి ఖండం నుంచి ఎంపికైన ఇద్దరిలో ఒకరిని టాపర్గా ఎంపిక చేశారు. పోటీ లలో చివరి దశకు చెందిన నలుగురు కంటెస్టెంట్లను జ్యూరీ సభ్యులు నిర్దేశిత ప్రశ్నలు అడిగారు. పోలాండ కు చెందిన మాజా క్లాజాను నమ్రత శిరోద్కర్,. ఇథియోపియా కంటెస్టెంట్ను దగ్గుబాటి రాణా, మార్టినిక్ కంటెస్టెంట్ను మాజీ మిస్ వరల్డ్ మానుషి చిల్లర్.. థాయిలాండ్ కంటెస్టెంట్ను సోనూ సూద్ ప్రశ్నలడిగారు. వారిచ్చిన



సమాధానాల ఆధారంగా విజేతను నిర్ణయించారు.

మిస్ వరల్డ్ 2025: విజేతను ఎలా నిర్ణయిస్తారు?
ప్రాథమిక పోటీల తర్వాత మూడు దశల్లో జరిగే క్వార్టర్ ఫైనల్స్‌కు ఒక్కో ఖండం నుంచి పదేసి మంది (అమెరికా, కరీబియన్స్ నుంచి 10, ఆఫ్రికా నుంచి 10, ఐరోపా నుంచి 10, ఏషియా, ఓషీనియా నుంచి 10 మంది )ని ఎంపిక చేస్తారు.

గత ఆదివారం మొదటి దశ క్వార్టర్స్ పోటీలు ముగిశాయి. ప్రతి ఖండం నుంచి 10 మంది చొప్పున 40 మందిని ఎంపిక చేశారు. ప్రతి ఖండం నుంచి ఎంపికైన 10 మంది నుంచి రెండో దశలో 5 గురిని (టాప్ 5) ఎంపిక చేశారు.

ఇలా ప్రతి ఖండం నుంచి ఎంపికైన 5 గురిలో మూడో దశలో ఇద్దరిని (టాప్ 2)ను ఎంపిక చేశారు. అంటే అప్పుడు పోటీలో 8 మంది నిలిచారు. ఈ 8 మందిలో సెమీ ఫైనల్లో భాగంగా ప్రతి ఖండం నుంచి ఎంపికైన ఇద్దరిలో ఒకరిని టాపర్‌గా ఎంపిక చేశారు.
అలా ప్రతి ఖండం నుంచి మిగిలిన ఒక్కరి మధ్య ఫైనల్ పోటీ జరుగుతుంది.

ప్రస్తుతం ఫైనల్ బరిలో నిలిచిన నలుగురిలో ఏషియా, ఓషీనియా గ్రూప్ నుంచి భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న నందినీ గుప్తా, యూరప్ ఖండం నుంచి మిస్ ఐర్లాండ్ జాస్మిన్ గర్హాట్, ఆఫ్రికా నుంచి నమీబియాకు చెందిన సెల్మా కామనియా, అమెరికా కరీబియన్ గ్రూప్ నుంచి మార్టినిక్‌కు చెందిన ఆరెలీ జోచిమ్‌లు ఎంపికయ్యారు.

తుది పోటీ (ఫైనల్స్)లో పాల్గొనేదీ ఈ నలుగురే. వారిలో ఒకరు 'మిస్ వరల్డ్' కిరీటం దక్కించుకుంటారు. మిగిలిన ముగ్గురిని ప్రతిభను బట్టి రన్నరప్‌లుగా ప్రకటిస్తారు.

మిస్ వరల్డ్' కిరీటం దక్కించుకోవడంలో ఇండియా, వెనెజ్వెలాలు అగ్రస్థానంలో ఉన్నాయి.ఇప్పటివరకు భారత్ నుంచి ఆరుగురు ఈ కిరీటాన్ని దక్కించుకున్నారు.

రీటా ఫారియా (1966), ఐశ్వర్యా రాయ్ (1994), డయానా హైడెన్ (1997), యుక్తాముఖి (1999), ప్రియాంకా చోప్రా (2000), మానుషి చిల్లార్ (2017) మిస్



వరల్డ్ అయ్యారు.
వెనెజ్వేలా కూడా ఆరుసార్లు విజయంతో ఇండియా సరసన నిలిచింది.
తర్వాతి స్థానాల్లో యూకే (5), యూఎస్ఏ (3), దక్షిణాఫ్రికా (3) ఉన్నాయి.

## వివాదాలు:

పోటీదారుల్లో ఒకరైన మిస్ ఇంగ్లండ్-2024 మిల్లా మాగీ అర్ధంతరంగా పోటీల నుంచి తప్పుకోవడం, తిరిగి స్వదేశానికి వెళ్లిన తర్వాత వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం చర్చనీయాంశమైంది. తెలంగాణ ప్రభుత్వం ఈ విషయమై విచారణకు కమిటీ వేసింది. మిస్ వరల్డ్ ఆర్గనైజేషన్ కూడా తన వివరణతో ప్రకటన విడుదల చేసింది.
భారతదేశంలో మిస్ వరల్డ్ పోటీలు జరగడం ఇది మూడోసారి. తొలిసారి 1996లో బెంగళూరులో నిర్వహించారు. వీటి నిర్వహణలో బాలీవుడ్ సూపర్ స్టార్ అమితాబ్ బచ్చన్‌కు చెందిన ఏబీసీఎల్ ( అమితాబ్ బచ్చన్ కార్పోరేషన్ లిమిటెడ్) కంపెనీ నాడు కీలక పాత్ర పోషించింది.రెండోసారి 2024లో ముంబయి, దిల్లీలో నిర్వహించారు. మార్చి 9న ముంబయిలో జరిగిన ఫైనల్‌లో చెక్ రిపబ్లిక్‌కు చెందిన క్రిస్టినా 'మిస్ వరల్డ్' కిరీటాన్ని దక్కించుకున్నారు.



మూడోసారి మిస్ వరల్డ్-2025 పోటీలకు హైదరాబాద్ వేదిక గా మారింది. అంతేకాదు గతంలో కన్నా భిన్నంగా తెలంగాణ ప్రభుత్వం స్వయంగా ఆతిథ్యం ఇస్తోంది. 'తెలంగాణ, జరూర్ ఆనా' స్లోగన్‌తో తెలంగాణ పర్యటక శాఖ ఈ పోటీల నిర్వహణలో భాగస్వామిగా (కో-హోస్ట్) బాధ్యతలు తీసుకుంది.
తెలంగాణ పర్యటకానికి ఒక బ్రాండింగ్ తీసుకురావడం, ఇక్కడి ఉత్పత్తులకు, కళలకు ప్రపంచవ్యాప్తంగా ప్రాచుర్యం తీసుకురావడమే లక్ష్యంగా వీటిని ఏర్పాటు చేసినట్లు ప్రభుత్వం చెబుతోంది.

మే 10న గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో ప్రారంభ వేడుకలు నిర్వహించారు. వివిధ దేశాల నుంచి ఈ పోటీలకు వచ్చిన పోటీదారులంతా తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటుచేసిన కార్యక్రమాల్లో పాల్గొన్నారు.
ర్యటక ప్రాంతాలైన నాగార్జునసాగర్‌లోని బుద్ధిస్టు థీమ్ పార్క్, హైదరాబాద్‌లో చార్మినార్, లాడ్ బజార్, చౌమహల్లా ప్యాలస్, ఓరుగల్లు కోట తదితర ప్రాంతాల్లో సందడి చేశారు. తెలంగాణ సచివాలయానికి కూడా వెళ్లారు.

# నడుస్తున్న చరిత్ర

## మోడల్ నుంచి మిస్ వరల్డ్ దాకా..



21 ఏళ్ల థాయిలాండ్ సుందరి సుచాతా చువాంగ్ మిస్ వరల్డ్ 2025 కిరీటాన్ని సొంతం చేసుకుంది. ఈ పురస్కారం పొందిన తొలి థాయ్ యువతిగా రికార్డుకెక్కింది. జననం: 2003 సెప్టెంబర్ 20న సాధారణ మధ్య తరగతి కుటుంబంలో జన్మించిన సుచాతా కెరీర్ మోడల్ గా ప్రారంభమైంది. అక్కడ నుంచి అందాల పోటీలవైపు దృష్టిసారించింది. తొలిసారి 2021లో అందాల పోటీల్లో పాల్గొంది. తల్లిదండ్రులు చిన్న వ్యాపారం నిర్వహిస్తుండేవారు. సుజాత ప్రాథమిక, సెకండరీ విద్యను కజోన్కిట్సుస్కా స్కూల్లో పూర్తిచేసింది. ప్రస్తుతం పొలిటికల్ సైన్స్లో బ్యాచిలర్ డిగ్రీ చదువుతోంది.

2021లో మొదటిసారి అందాల పోటీలకు సిద్ధమైంది. అయితే ఆ పోటీలలో ఆమెకు చోటుదక్కలేదు. దీంతో నిరాశ చెందకుండా. మరుసటి ఏడాది (2022) స్వదేశంలో జరిగిన మిస్ యూనివర్స్ పోటీలలో పాల్గొంది. 18 ఏళ్ల వయసులో మూడవ రన్నరప్ గా నిలిచింది. అయితే మొదటి రన్నరప్ నికోల్నీ రాజీనామాతో ఈమె రెండవ రన్నరప్ గా గుర్తింపు పొందింది. ఇక గతేడాది బ్యాంకాక్లో జరిగిన మిస్ యూనివర్స్ పోటీలలో థాయిలాండ్కు ప్రాతినిధ్యం వహించింది. అనేక ప్రత్యేక అవార్డులు గెలుచుకుంది. మిస్ చార్మింగ్ టాలెంట్, మిస్ బ్యూటీ అండ్ కాన్ఫిడెంట్ వంటి పురస్కారాలు నెగ్గింది. చివరగా మిస్ యూనివర్స్ కిరీటాన్ని తలపై అలంకరించుకుంది.

ఆ తర్వాత 17 నవంబర్ 2024లో మెక్సికో సిటీ వేదికగా జరిగిన మిస్ యూనివర్స్లో థర్డ్ రన్నరప్ గా నిలిచింది. 125 దేశాల నుంచి అందాల భామలు ఈ పోటీలో పాల్గొన్నారు. తాజాగా హైదరాబాద్ వేదికగా జరిగిన మిస్ వరల్డ్ పోటీల్లోనూ తన అందచందాలకు తోడు, సమయస్ఫూర్తి, సేవాదృక్పథాన్ని చాటుతూ కిరీటం సొంతం చేసుకుంది.16 ఏళ్లకే క్యాన్సర్ బారిన పడిన సుచాతా చువాంగ్ శ్రీఆ ముప్పు నుంచి ధైర్యంగా బయటపడ్డారు. అప్పటి నుంచి థాయ్ లాండ్ లో రొమ్ము క్యాన్సర్పై అవగాహన కల్పిస్తున్నారు. క్యాన్సర్ బాధితులకు అండగా నిలుస్తున్నారు. ఇందుకోసం నిధులు సేకరించడంతోపాటు, కొన్ని సంస్థలతో కలిసి పనిచేస్తున్నారు. ప్రభావితం చూపే లక్ష్యంతో యువత ముందడుగు వేయాలని ఆమె పిలుపునిస్తున్నారు. "ఓపల్ ఫర్ హర్" అనే నినాదంతో మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొన్నారు సుచాత. ఈ నినాదం ద్వారా ప్రపంచ వ్యాప్తంగా ప్రభావం చూపాలన్నదే లక్ష్యమన్నారు.

## నిరసనలు:

కొలతలేసి మహిళల అందాన్ని లెక్కించే అందాల పోటీల వెనుక కార్పొరేట్ల మాయాజాలం ఉంది. జనాభాలో 60 శాతం యువతే. వారిని ఆకర్షించి తమ సౌందర్య సాధనాలు, ఉత్పత్తుల అమ్మకాలు పెంచుకోవడానికే ఈ అందాల పోటీలు. వీటిపై పలు దేశాల్లో వ్యతిరేకత వచ్చింది. శ్రమైక సౌందర్యానికి గౌరవం ఇవ్వాలే తప్ప మిగతా మహిళలలో ఆత్మన్యూనత పెంచేదిగా ఉన్న ఈ పోటీలను వ్యతిరేకిస్తున్నాంఅని అనేక మహిళా సంఘాలు అనేకమార్లు నిరసనలు తెలిపాయి

భారత్‌లో బెంగళూరు వేదికగా 1996లో తొలిసారి మిస్ వరల్డ్ పోటీల నిర్వహణకు కొన్ని వారాల ముందు నుంచే ఈ పోటీలను వ్యతిరేకిస్తూ దేశంలో పలుచోట్ల ఆందోళనలు జరిగాయి. మహిళా సంఘాల సభ్యులు కొంతమంది సామూహిక ఆత్మహత్యకూ వెనుకాడబోమని హెచ్చరికలు చేయడం చర్చనీయాంశం అయింది. అప్పట్లో బీజేపీ కూడా వీటిని వ్యతిరేకించింది.

అందాల పోటీల వల్ల భారతదేశంలో పాశ్చాత్య సంస్కృతి పెచ్చుమీరుతుందని, మహిళలను వ్యాపార వస్తువు చేస్తున్నారనే ఆరోపణలు తొలి నుంచీ ఉన్నాయి. మహిళావాదులు చాలామంది ఈ పోటీలను వ్యతిరేకిస్తూ వస్తున్నారు. 1996లో ఈ పోటీలకు వేదికైన బెంగళూరులో పెద్ద ఎత్తున ఆందోళనలు జరిగాయి.

ఇప్పుడు హైదరాబాద్‌లోనూ అందాల పోటీలు నిర్వహించవద్దంటూ ఇటీవల కొన్ని మహిళా సంఘాల సభ్యులు నిరసన వ్యక్తం చేశారు. వారిని ముందస్తు అరెస్టులు చేయడం ద్వారా పోలీసులు ఈ పరిస్థితిని చక్కదిద్దాల్సి వచ్చింది. సాంస్కృతిక, చారిత్రాత్మక, పర్యటక ప్రదేశాల సందర్శనలో భాగంగా మిస్ వరల్డ్ పోటీదారులు రామప్ప దేవాలయానికి వెళ్లినప్పుడు స్వాగత కార్యక్రమంలో భాగంగా వారి కాళ్లను స్థానిక మహిళలతో కడిగించారంటూ ఒక వివాదం నడిచింది.పోటీల నుంచి మిస్ ఇంగ్లండ్ మిల్లా మాగీ అర్ధంతరంగా తప్పుకోవడం, నిర్వహణ తీరును తప్పుపడుతూ ఆమె చేసిన వివాదాస్పద వ్యాఖ్యలను ఇంగ్లండ్‌లో 'ది సన్' టాబ్లాయిడ్ ప్రచురించడంతో అందాల పోటీలకు వివాదాల సెగ ఎక్కువైంది.మిల్లా ఆరోపణల నేపథ్యంలో, ఒక సీనియర్ ఐఏఎస్ అధికారితో తెలంగాణ ప్రభుత్వం విచారణ జరిపించిందని, ఆమె ఆరోపణలకు ఎలాంటి సాక్ష్యాధారాలు లేవని ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ పీటీఐకి వెల్లడించారు. మాగీ ఆరోపణలను మిస్ వరల్డ్ ఆర్గనైజేషన్ చైర్మన్ అండ్ సీఈవో జూలియా మోర్లే ఖండిస్తూ ఒక ప్రకటన విడుదల చేశారు.



# అందాల భామల కన్నీటి కధలు

మిస్ వరల్డ్ పోటీదారుల్లో ఒక్కొక్కరిదీ ఒక్కో విషాద గాథ విశ్వవేదికపై తమ వాణి వినిపించిన సుందరీమణులు... ఏడేళ్ల వయసులోనే యోని ఛేదన.. ఆ దురాచారంపై పోరు 16 ఏళ్లకే అత్యాచారం బారిన.. హక్కుల కోసం ఆరాటం ఊహ తెలియనప్పుడే లైంగిక వేధింపులు.. వాటిపై పోరాటం .

మహిళల ప్రాణాలను హరించే ఆటవిక ఆచా రాలను భరించింది ఓ వనిత అదృష్టవశాత్తు బతికిన ఆమె. కొండంత ధైర్యం తెచ్చుకుంది. ఆ దేశంలో మహిళల మాన, ప్రాణాలను దెబ్బతీసేలా ఉన్న మూఢాచారాలపై పోరా టాన్ని ప్రారంభించింది. పదహారేళ్లకే అత్యాచా రానికి గురైంది మరో మహిళ. కొన్నేళ్ల తర్వాత ఆ క్షోభ నుంచి బయటపడిన ఆమె. తమ దేశంలో బాలికల పట్ల జరుగుతున్న హింసకు వ్యతిరేకంగా పనిచేస్తోంది. తెలిసీ తెలియని వయసులోనే లైంగిక వేధింపులు ఎదుర్కొంది. ఓ బాలిక. కాస్త వయసు వచ్చేసరికి తమ దేశంలో ఇలాంటివి సర్వసాధార ణంగా జరుగుతున్నాయనే విషయం ఆమెను తీవ్ర ఆందోళనకు గురి చేసింది. ఇలాంటి వాటిని రూపుమా పాలనే లక్ష్యంతో ఒక సంస్థను ప్రారంభించి ప్రజలను చైతన్యం చేస్తోంది. పైన చెప్పిన అతివలు ఎవరో సామాన్య మహిళలు కాదు. మిస్ వరల్డ్ కిరీటం కోసం పోటీ పడుతున్న సుందరీమణులు. ప్రస్తుతం అందాల పోటీల్లో మెరుస్తున్న అనేక మంది జీవితంలో ఈ స్థాయికి రావడానికి ఎన్నో కష్టాలు, వేధింపులను ఎదుర్కొన్నారు.

నిన్నటిని మార్చలేం. కానీ, ప్రయత్నిస్తే రేపటిని మార్చగలం. ఆ ప్రయత్నమే నేను చేస్తున్నాను. మాది సోమాలియా. కూడు, గూడు కోసం మా అమ్మానా న్నలు, నేను ఒంటెపై తిరుగుతూనే ఉండేవాళ్లం చ దురదృష్టం, మేం ఎక్కడ ఉన్నా ఆ ప్రాంతాన్ని ఖాళీ చేయించేవారు.



అలా తిరుగుతూ చివరకు బ్రిటన్ వెళ్లి స్థిరపడ్డాం.

అయినా, సోమాలియా అమ్మాయిగా ఆ దేశంలో బాలికల దుస్థితిని మార్చడానికి ప్రయత్ని స్తూనే ఉన్నాను. సోమాలియాతో పాటు ఆఫ్రికా, మధ్య ప్రాశ్చ దేశాల్లో ఫిమేల్ జెనిటల్ మ్యుటిలేషన్ (ఎఫ్ ఎం) (ఆడవాళ్లకు సున్తీలాంటిది(ఖత్నా) ఓ దురాచా రంగా కొనసాగుతోంది. సోమాలియాలో 98% మంది మహిళలకు ఇది జరిగింది. మిగిలిన వారికి ఎందుకు కాలేదంటే, వారింకా ఆ వయసుకు రాలేదంతే, ఆ బాధి తుల్లో నేనూ ఒకరిని చాలా మందికి ఈ ఎఫ్ ఎం అంటే ఏమిటో తెలియదు. అలాంటి వారికోసమే నా అనుభవం చెప్పాలనుకుంటున్నాను. అప్పుడు నాకు ఏడేళ్ల వయసు. నేను ఆరు బయట ఆడుకుంటుండగా ఓ గదిలోకి తీసుకువెళ్లి బట్టలన్నీ విప్పేశారు. అక్కడ ముగ్గురు ఆడవాళ్లు నా కోసమే బ్లేడ్లు, కత్తెరలతో వేచి చూస్తున్నారు. వారేమీ డాక్టర్లు కాదు. వైద్య పరంగా శిక్షణ కూడా తీసుకోలేదు. వారు నా జననేంద్రియంపై చర్మాన్ని పూర్తిగా తొలగించారు. లోపలి చర్మం కూడా కొంత తీసేశారు. అరుస్తూనే

# నడుస్తున్న చరిత్ర

ఉన్నాను. పట్టించుకునే వారే లేరు. పైగా నోర్మ్ముసుకో... అయిపోయింది.. ధైర్యం గా ఉండు. ఇది జరుగుతున్నందుకు గర్వపడు. ఇది మన సంప్రదాయం. అంటూ చెప్పారు. కోత పూర్త యిన తర్వాత మందపాటి దారంతో కుట్టేశారు. కేవలం, మూత్రం, రక్తం పోవడానికి ఓ సన్నటి ద్వారం మాత్రమే ఉంచారు. నన్ను ఓ చీకటి గదిలో కాళ్లు చేతులు కట్టేసి వదిలేశారు. ఏడుస్తూనే ఉన్నాను నేను బతికిబయట పడ్డానంటే అది నా అదృష్టం. ఎందుకంటే, ఈ ప్రక్రియ తర్వాత చాలా మంది బాలికలు చనిపో తారు కూడా. మా అమ్మ, జామ్మ అందరూ ఈ ఎఫ్ జీఎం చేయించుకున్న వారే. ఆడవారికి ఈ బాధలు తప్పవనే వారు చెప్పేది. ఇది సంప్రదాయం, పాటించా. అనే చెబుతుంటారు. అదెలా.. మూఢాచారాలు ఇంకెం త కాలం. అందుకే నేను పోరాటాన్ని ప్రారంభించాను. పర్యవసానాలు ఎలా ఉంటాయో తెలుసు అయినా ఫౌండేషన్ ను ప్రారంభించాను. చిన్నారుల శరీరం. ఆత్మను దెబ్బతీసేలా సంప్రదాయాలు ఉండకూడదు. మహిళలకూ హక్కులుంటాయని, వారి శరీరంపై వారికి నియంత్రణ ఉండాలనే ఫిమేల్ ఇనీషియేటివ్ ఫౌండేషన్' ప్రారంభించాను. నేను పడిన బాధలు మరే బాలికా పడకూడదనే పోరాటం సాగిస్తున్నాను. –మిస్ వరల్డ్ సోమాలియా, జైనాబ్ జామా

మనం చిన్నతనంలో ఎలా ఉన్నామన్నది కాదు.. యుక్త వయసుకు వచ్చాక మన ఆశలు, ఆశయా లను చేరుకోగలిగామా..!



మనం కోరుకున్న జీవి తాన్ని పొందగలిగామా.? అన్నది ప్రశ్నగానే మిగిలి పోతుంది. మరీ ముఖ్యంగా ఆఫ్రికా దేశాల్లో నేను పుట్టి పెరిగిందంతా జాంబియాలోనే, యుక్తవయ సుకు వచ్చాకే ఈ ప్రపంచం ఎలా ఉంటుందో తెలి సింది. నాకు 16 ఏళ్లు వచ్చేసరికి నాలోని స్వేచ్చను లాగేసుకున్నారు. పదహారేళ్లకే పెళ్లి చేశారు. పదహా రేళ్లకే మానభంగానికి గురయ్యాను. ఇన్నేళ్లుగా ఆ క్షోభను భరిస్తూనే గడిపేశాను. ఎందుకంటే, నాకు జరిగిన అన్యాయం గురించి మాట్లాడే శక్తి నాకు లేదు. ఈ రోజు ఆ శక్తిని పొందగలిగాను. అందుకే ఎనిమిదేళ్ల తర్వాత ఈ సంఘటన గురించి చెబుతు న్నాను. ఎందుకంటే, నేను జాంబియాలో అభాగ్యుల ప్రతిబింబంగా భావిస్తున్నాను. వారి కలలు కూడా ఛిద్రమయ్యాయి. వారిని కలల తీరాలకు చేర్చాల న్నదే నా ప్రయత్నం. మన నుంచి ఏదైనా తీసుకోగ లరమో కానీ, విద్య, నైపుణ్యాలను మాత్రం తీసుకువెళ్లలేరు. చాలా మంది చెబుతుంటారు. ఈ ప్రపం చాన్ని ఎవరూ మార్చలేరని, నిజమే, మనం పరిపూ ర్ణత కోసం వెంపర్లాడుతున్నాం కానీ, మనం చెప్పా ల్సిన కథనం మార్చాల్సి ఉంది. విద్యతోనే జ్ఞానం వస్తుంది. ఆ జ్ఞానం మనకు శక్తినిస్తుంది. ఆ శక్తే మనం కోరుకున్న సమాజానికి నాంది పలుకు తుంది. దానికోసమే నా తపనంతా––మిస్ వరల్డ్ జాంబియా, ఫెయిత్ బ్వాల్యా



కేమాన్ ఐల్యాండ్ చాంబర్ ఆఫ్ కామర్స్లో ఉద్యో గిగా నేను అన్ని కార్యక్రమాలనూ నిర్వహిస్తుం టాను. మరీ ముఖ్యంగా యువత సమాజంలో మిళి తమయ్యేందుకు తోడ్పడే రీతిలో ఈ కార్యక్రమాలుం టాయి. వారికి నైపుణ్యాలను నేర్పిస్తుంటాను. నేనో బాడీ బిల్డరు. జిమ్లో లేకపోతే ఓ మంచి పుస్త కంతో ఉంటా. లిటరేచర్ అభ్యసించిన నేను జర్నలి గానూ సేవలనందించాను. ఇవేవీ చేయనప్పుడు గాయనిని,

ముఖ్యంగా కరావోకే, మా నగరంలో కరా వోకే రాణిగా నాకు పేరుంది. అయితే ఇవన్నీ ఓ వైపు మాత్రమే నేను డిప్రెషన్(కుంగుబాటు) బాధితురా లిని కేమాన్ ద్వీపంలో ప్ర ముగ్గురు విద్యార్థుల్లో ఒకరు తమ జీవితాలను అర్ధంతరంగా ముగిస్తు న్నారు. అంతేనా, 13% మంది ఆ ప్రయత్నాలను చేస్తున్నారు. నేను కూడా వారిలో ఒకరిని, పదహారేళ్ల వయసులో యాంగ్జైటీ(ఆందోళన), డిప్రెషన్ బాధితు రాలిని, నా చుట్టూ మనుషులు ఉండేవారు, కానీ ఒంటరిగానే భావించేదాన్ని. నేను అందరినీ చూసి నవ్వేదాన్ని కానీ, లోలో పం ఏడుస్తూనే ఉండే దాన్ని. ఎన్నో నిద్రలేని రాత్రులు. జీవితమంతా విషాదమేనా అని భావి స్తున్న వేళ కుటుంబన భ్యులు అందించిన తోడ్పాటు, చికిత్స నన్ను ఆ ఆందోళనల నుంచి బయటపడేసింది. మన నిశ్శబ్దం మన జీవితాలకు ముగింపు పలకవచ్చేమో. ఆ నిశ్శబ్దాన్ని ఛేదిస్తేనే వెలుగులు ప్రసరిస్తాయి. అన్న ఆలోచన నేను కొత్త జీవితాన్ని ప్రారంభించడా నికీ కారణమైంది. ఒకప్పుడు నేను మా దేశంలోని ఎంతోమంది డిప్రెషన్ బాధితులలో ఒకరిని, ఇప్పుడు శారీరకంగా, మానసికంగానూ యువత పిట్గా. ఉండేలా తోడ్పడుతున్నాను.
–జాడా రామూన్, మిస్ కేమాన్ ఐల్యాండ్



మిస్ వరల్డ్ గెలుస్తానా..? లేదా..? అన్నది అప్రస్తుతం. కానీ, తర తరాలుగా మహిళలు తీర్చిదిద్దుతున్న ఓ మహిళగా విశ్వ వేదికపై నా వాణిని వినిపించాలనుకున్నాను. మన అమ్మ, అమ్మమ్మ, అందరూ తమ బాధను ఓ శక్తిగా మలచుకున్నారు. వారే తనను ఈ రోజు మీ ముందు ఇలా నిలిపారు. వారు ఎన్నో ఆకలి రాత్రులు గడి పారు. వారు తిన్నా తినకపోయినా నా కడుపు నింపేవారు. వారు. మేల్కొన్నప్పటికీ నేను తనవితీరా నిద్రపోయే అవకాశం కల్పించే వారు. అయినప్పటికీ అకస్మాత్తుగా, ఓ రాత్రి వేళ తలుపులు గట్టిగా. కొట్టిన శబ్దాలు. తర్వాత మూగ రోదనలు నాకేమీ అర్థమయ్యేది. కాదు. పొద్దుట చూసే సరికి అంతా నిశ్శబ్దం.. అది గృహ హింస, ఇక్కడ ప్రేమకూ నియమాలుంటాయి. భద్రతకు మాత్రం ఎలాంటి, హామీ ఉండదు. నేను సాధికా రిత కల్పించాలని, లింగ పరమైన వివక్షకు వ్యతిరేకంగా గళమెత్తాను. ఇంటి నుంచే మార్పు మొ మా సొంత పట్టణంలో ఈ కార్యక్రమం ప్రారంభించాను. ప్రతి మహిళకూ ఈ ప్రపంచంలో రక్షణ ఉందనే భావన కల్పించాలి. అదే నా ప్రయత్నం.
– మిస్ వరల్డ్ జమైకా, తజే లౌరికా బెన్నెట్

కెనడా నుంచి ఓ ఆదివాసీ మహిళ మిస్స్వ రల్డ్ వేదిక పైకి రావడం ఇదే తొలిసారి. ఇది నాకెంతో సంతోషాన్ని కలిగించే అంశం. నేను కెనడాలోని మారుమూల ప్రాంతంలో ఆదివాసీ తెగలో పుట్టాను. జనాభా మహా అయితే 600 ఉంటుంది. కెనడాలో మా తెగ అమ్మాయిలు. మహిళలు ఎదుర్కొనే కష్టాలు వర్ణనాతీతం. నేను దాదాపు 12సార్లు హత్య చేయబడి ఉండాలి. ఇప్పటికీ మా జాతి ప్రజలు కెనడాలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరీ ముఖ్యంగా రెసిడెన్షియల్ స్కూల్ వ్యవస్థ కారణంగా మా ఇళ్ల నుంచి బలవంతంగా పిల్లలను తీసుకువెళ్లి ఈ. స్కూల్స్లో చేర్పిస్తారు. మా భాష, సంస్కృతి అన్నిం టినీ నాశనం చేస్తున్నారు. దాదాపు పదివేలకు పైగా మా జాతి ప్రజల సమాధులు ఈ రెసిడెన్షియల్ పాఠ శాలల్లో ఉండి



ఉంటాయి. మా అంటీ అంకుల్ సమా దులు కూడా దానిలో భాగం, ఇవన్నీ చూస్తూ పెరి గిన నాకు అమ్మే స్ఫూర్తి, మనం పడే బాధకు కూడా ఓ మహోన్నత కారణం ఉండాలని ఆమె నూరిపోశారు. క్షమాగుణం గురించి తెలి పారు. ఇవే నన్ను ధైర్యంగా ముందుకు వెళ్లేందుకు, మా ఇంటిని వసతి గృహంలా మార్చేందుకు ప్రోత్సహించాయి. మేము ఓ 15 మంది పిల్లలకు వసతి కల్పించడంతో పాటుగా వారి జీవితాల్లో మార్పు తీసుకు వచ్చాము. మిస్ వరల్డ్ పోటీలకు రావడానికి కారణం కూడా ఓ మహోన్నత లక్ష్యం కోసమే మా జాతి సాధికారతకు కృషి చేయడానికి ఇక్కడి వరకూ వచ్చా 'రే కనెక్టింగ్ విత్ రిబ్బన్స్" అంటూ ప్రాజెక్టును ప్రారంభించాను. మా తెగలో రిబ్బన్ స్కర్ట్స్ ధరించడం సంప్రదాయం. ఈ ప్రాజె క్టుకు 10వేల డాలర్ల వరకు నిధులను సేకరించాను. ఒకవేళ మిస్ వరల్డ్ కిరీటం గెలిస్తే, అది ఓ చరిత్ర కావొచ్చు కానీ, ఇతరులు ఆ బాటలో నడిచేలా నేను మార్గం వేయలేకపోతే ఆది నిష్ఫలమేగా–ఎమ్మా మారిసన్, మిస్ వరల్డ్ కెనడా

.మా దేశంలో పిల్లలపై లైంగిక వేదింపులు చాలా ఎక్కువగా జరుగుతున్నాయి. ఒక్క పనామాలో మాత్రమే కాదు, ప్రపంచవ్యాప్తంగా ఈ ఘటనలు పెరుగుతు న్నాయి. అయినప్పటికీ ఏ ఒక్కరూ మాట్లాడటం లేదు. ఈ తరహా వేదింపులు నేనూ ఎదుర్కొన్నాను. నిజానికి ఈ వేదింపుల బారిన పడ్డానని కూడా తెలియని వయసులో నేను ఆ అనుభవాన్ని ఎదుర్కొన్నాను. ఈ తరహా లైంగిక వేధింపుల పట్ల అవగాహన కల్పిస్తే ఎన్నో ప్రాణాలను కాపాడవచ్చు. అందుకే పన్నేయాంగ్ యునిడోస్ (యునైటెడ్ ఫర్ చిల్డ్రన్) ఫౌండేషన్ అదికార ప్రతినిధిగా ఈ అంశాల పట్ల అవగాహన కల్పించే



నాకు తెలిసి మనలో చాలామంది ఏదో ఒక వయసులో లైంగిక వేధింపుల బారిన పడిన వారే. అది మనకు ఊహ తెలిసినప్పుడు కావచ్చు లేదంటే అంతకంటే ముందు కావచ్చు. అది ఎందుకు తెలియదంటే, నిశ్శబ్దం. దీని గురించి చర్చించడానికి ఎవరూ ఇష్టపడకపోవడం. ఆ నిశ్శబ్దాన్ని ఛేధించాల్సిన ఆవ శ్యకత ఉంది. ఎందుకంటే, మన సమాజంలో అతిపెద్ద సమస్య ఈ లైంగిక వేధింపులు. ఈ తరహా వేధింపుల గురించి మాట్లాడటం కష్టమే, కానీ, ఎక్కడో ఓ చోట ముగింపు పలకాలంటే, మాట్లాడాల్సిందే. – మిస్వరల్ పనామా, కరోల్ రోడిగ్

సంగీతం మొదలు స్కేటింగ్, మోడలింగ్, మిలటరీ, టీచర్. అమ్మాయిగా నా జీవి తం ఏమైనా లేనే లేదు. అదే వివక్ష వేధింపులు 14 ఏళ్ల 365 ప్రారంభమైంది.



స్వీడిష్ ఫెడరేషన్ అఫ్ వాలెం టరీ డిఫెన్స్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్లో కెరీర్ ప్రారంభమైంది. మగవారితో పోలిస్తే 10 రెట్లు ఎక్కువగా నేను కష్టపడాలని వెంటనే అర్థ మైంది. ఎందుకంటే అమ్మాయిని. అయితే అదంతా కూడా స్వీడిష్ నేవీతో కలిసి యూరప్ అంతటా తిరిగినంత వరకే అప్పుడే పురుషా ధిక్య సమాజంలో మహిళకు ఏం కావాలో అర్థమైంది. ఆ నౌకలో 36 మంది సిబ్బంది ఉంటే ముగ్గురమే మహిళలం ఓ రోజు మా కమాం డింగ్ ఆఫీసర్ నన్ను పచ్చుకు లాక్కెళ్లి బల వంతం చేయబోయాడు. అప్పుడు నా వయసు 17 ఏళ్లు అప్పుడే అనుకున్నాను నేను కాకపోతే ఇంకెవరు మార్పు తీసుకువస్తారని అప్పుడే స్వీడిష్ సాయుధ దళాలలో అధికారాన్ని ఎంతగా దుర్వినియోగం చేస్తున్నారో ఓ పరిశో ధనా వ్యాసం రాశాను. అలాగే 'బూట్స్ బు హీల్స్' అంటూ నా కథనే ఓ పుస్తకంగానూ రాయబోతున్నాను. నా లాంటి అమ్మాయిల రక్షణ కోసమే స్వీయ రక్షణ తరగతులను ప్రారంభించాను. – మిస్ వరల్డ్ స్వీడన్, ఇసాబెల్ ఆన్



## అంతర్నేత్రం





# ఆత్మ జ్ఞానమే నిజమైన విద్య

మీ జీవి తంలో మీరే ప్రముఖమైన వ్యక్తి . చాలా మంది భగవంతుడు ముఖ్యమైనవాడని భావిస్తారు. కానీ మీకు భగవంతుడు అవస రమని అనిపించినప్పుడు మాత్రమే ఆయన ముఖ్యుడవుతాడు. ఆయన గురించి మీరు తెలుసుకోకూడదనుకుంటే.. మీ ప్రపంచంలో ఆయనకు ఏమాత్రం ప్రాధాన్యత ఉండదు.
తెలుసుకోవాల్సింది అదే...

మిమ్మల్ని మీరు తెలుసుకోవడం చాలా ముఖ్యం ప్రఖ్యాత గ్రీకు తత్త్వవేత్త సోక్రటీస్ తన బోధలలో నిన్ను నీవు తెలుసుకో, అర్ధ చేసుకో' అనేవాడు. ఇదే విషయాన్ని కబీర్ దాస్ కూడా చెప్పాడు. "ఆత్యజ్ఞానం' అంటేనే నిన్ను నువ్వు తెలుసుకోవడం మనం ప్రతి దాన్ని తెలుసుకోవాలనుకుంటాం. ఇవేమిటి అదేమిటి, అతనెవరు, ఏం చేస్తూ ఉంటాడు... ఇలా ప్రతి దాని గురించి వివ రాలు తెలుసుకోవడానికి ప్రయత్నిస్తాం కానీ మనిషి తను ఎవరో తెలుసుకోవడం కోసం. ఎన్నడూ తనవైపు తిరిగి చూసుకోడు.

# పరిణితి

మనకు సంబందించి ప్రధానమైన అంశాలు రెండు ఉన్నాయి. ఒకటి మనం జన్మించడం జన్మించాం కాబట్టి మనం ఇక్కడ ఉన్నాం. రెండోది.. మనం జన్మించాం కాబట్టి ఏదో ఒక రోజు ఈ లోకాన్ని వదిలిపో వడం కూడా తప్పనిసరిగా జరుగుతుంది. కానీ ఈ రెండో మాట చాలామందికి నచ్చదు. అలా జరగకుండా ఉండాలని ఎంతోమంది అనేక రకాల పాట్లు పడుతూ చేస్తారు. పద్ధతిగా తింటారు, బరువు పెరగ కుండా చూసుకుంటారు. ఎందుకంటే మన మనందరం ఎప్పటికీ బ్రతికే ఉండాలని కోరు కుంటాం. ఏదో ఒక రోజు అంతమైపోతామ నేది ఆలోచించాలని కూడా అనుకోం..

ఇంతకు మీరెవరు? ఏఏ పదార్థా లతో మీరు తయారయ్యారో తెలుసా? అ న్, హైడ్రోజన్, కార్బన్, కాల్షియం నైట్రోజన్, పాస్పరస్.. ఈ మూలకాలతో మీరు తయార య్యారు. మీలో ఉన్నదానిలో డెబ్బై శాతం నీరే. ఈ నీరు నడుస్తుంది, మాట్లాడుతుంది.... ఇది అద్భుతం కాదా!

ఇంతకు మీరెవరు? ఏఏ పదార్థా లతో మీరు తయారయ్యారో తెలుసా? అ న్, హైడ్రోజన్, కార్బన్, కాల్షియం నైట్రోజన్, పాస్పరస్.. ఈ మూలకాలతో మీరు తయార య్యారు. మీలో ఉన్నదానిలో డెబ్బై శాతం నీరే. ఈ నీరు నడుస్తుంది, మాట్లాడుతుంది.... ఇది అద్భుతం కాదా! కానీ దీన్ని మీరు అద్భుతంగా భావించరు. ఈ భూమండ లంలో కూడా డెబ్బై శాతం నీరు. మీరు కూడా డెబ్బై శాతం నీరే! బయట జరుగు తున్న వాటిని చూసి ఆశ్చర్యపోవడం మీ నైజం. కానీ మీలోపల జరుగుతున్న వాటిని చూసి ఆశ్చర్యపోవాలని నేను చెబుతున్నాను.. ఏ పదార్థాలతో మీరు తయారయ్యారో... బయట ఉన్నవన్నీ కూడా ఆ పదార్థాలతోనే తయారయ్యాయని గ్రహించండి. మీ లోప లికి వస్తూ పోతున్న శ్వాస మీ సొంతం. అందులో దాగి ఉన్న ఆనందం కూడా మీ సొంతమే అందువల్ల మిమ్మల్ని మీరు తెలు సుకోకుండా మిగిలినవన్నీ తెలుసుకున్నా తెలుసుకోకపోయినా ఎటువంటి తేడా ఉండదు. మిమ్మల్ని మీరు తెలుసుకోవాలనే ఆరాటం మీరు కలగనంతవరకు జీవితం అసంపూర్ణంగా మిగిలిపోతుంది, జీవితాన్ని కొనసాగించడానికి మీకు ఈ సమయం లభించింది. అసలైన ఆనందంతో మీ జీవి తాన్ని పరిపూర్ణం చేసుకోగలితే... తద్వారా కలిగే ఆనందాన్ని మీరు మాత్రమే ఆస్వాదిం చగలరు. మీలో ఉన్న, మీ హృదయంలో ఉన్న దైవాన్ని తెలుసుకొని, స్వయంగా అను భూతి చెందితే... సమస్తం మీరు తెలుసుకు న్నట్టేనని వేదాలు, శాస్త్రాలు చెబుతున్నాయి. ఆత్మజ్ఞాన విద్యే అన్ని విద్యల్లో శ్రేష్ఠమైన విద్య కాబట్టి తనను తాను తెలుసుకున్న వ్యక్తికి మాత్రమే తాను ఇక్కడ ఎందుకు జీవిస్తున్నదీ తెలుస్తుంది.

★★★

కామెడి సీరియల్

# పంచవటి

## ఓ పదిళ్ళ లోగిలి



అలేఖ్య

'ఓరేయ్ తాతారావ్ మనకు ఈ గెటప్పులు సరిగ్గా సరిపోయాయిరా. నిజంగా మనల్ని కూడా సన్యాసులు అనుకుంటారు" వర్మ గారుతన ఆహార్యంచూసుకుంటూ అన్నారు

" ఈ వయసులో మనం సన్యాసులం కాక సంసారులమా? "నిజం మాట్లాడాడు తాతారావు

"నిజమే అనుకో, కాని సరసానికి వయసుతో సంబంధం ఏముంది, అది మనసుకు సంబంధించింది"అంటూ తాతారావు మాటలను సరిచేసారు వర్మ గారు.

"మనసు, మట్టిగడ్డ, పెళ్లైన దగ్గరనుంచి ఆ మనసును బయటకు రానివ్వకుండా మీ చెల్లాయి తన నోటితో దానికి పెద్ద తాళం వేసింది" నిట్టూరుస్తూ అన్నాడు తాతరావు

వర్మ గారు నువ్వుతూ "నువ్వు మరీ చెపుతావు, ఏభార్యకు భర్త మీద ప్రేమ వుండదు

# కామెడి సీరియల్

**జరిగిన కథ**
ఉమా ,శంకరం భార్య భర్తలు. ఉమా ఉళ్ళోని పోలీస్ స్టేషన్ లో ఎస్ ఐ గా పనిచేస్తూ ఉంటె , శంకరం చెట్టు కింద ప్లీడరు గా పేరుపడి వాదించటానికి కేసులు లేక ఇంటిదగ్గరే ఉండి ఇంటిపనులు చుసు కుంటూ ఉంటాడు . వర్లుగారి స్నేహితుడు తాతారావు వంటపని ఇంటిపని చేస్తూ భార్య చాటు భర్తగా గడుపుతుంటాడు . కాలనీ చుట్టూ అపార్ట్మెంట్లు రావటం తో నీటి ఎద్దడి రావటంతో మినిష్టర్ని కలవల్నుకుంటారు వర్లు గారు . మునిసిపల్ కమిషనర్ ణి కలిసిన ఫలితం ఉండదు .హెడ్ కానిస్టేబులు రంగనాథం శంకరం దగ్గరకు చిన్న చిన్న కేసులు తీసుకువస్తుంటాడు .తాతారావు కొడుకు పద్మనాభం అందరిని పార్టీకి పిలుస్తాడు.పార్టీలో రియల్ ఎస్టేట్ కింగ్ హరీష్ ని అందరికి పరిచయం చేస్తా డు పద్మనాభం . కొంత మంది రౌడీలు తమ ఇల్లు ఆక్రమించారని శంకరాన్ని సంప్రదిస్తాడు ఆ ఉరి పోస్టు మాస్టర్ .ఉమ శంకరం కలిసి వాళ్ళ ఆట కట్టిస్తారు .కోబ్రా పేరుతో కోసి నది పరివాహక ప్రాంతంలో కట్టిన ఇళ్ళను కులగొడతారు మాహనగర్ మునిసిపాలిటి వాళ్ళు .పేదవాళ్ళు శంకరం దగ్గరకోస్తారు కేసు వాదించమని . సి .ఎం స్వామిజి గురించి ఆరా తీస్తాడు .స్వామిజి సిటిలో పెద్ద సభకు ప్లాన్ చేస్తాడు .
**ఇక చదవండి**

చెప్పు "

"ప్రేమలేదని నేనెప్పుడు అన్నాను. , ప్రేమ లేకే టన్నులు టన్నులు వుంది. అది ఎక్కువయ్యే నేను చస్తున్నా.. అసలు మా పెళ్లైన కొత్తల్లో జరిగిన విషయం వింటే.. మా ఆవిడకు నా మీద ఎంత ప్రేమ వుందో నీకు తెలుస్తుంది'

"నువ్వు చెప్పందే ఎలా తెలుస్తుందిరా..! "నేను ఉద్యోగం లో చేరిన కొత్తల్లో ఓ పదిహేను రోజులు సిక్ అయాను నీకు గుర్తుందా.. "

'ఆ అవును గుర్తుంది.. టైఫాయడో ఏదో వచ్చిందని చెప్పినట్టున్నావు.."

"టైఫాయిడా ..నా బొందా ..ఏ మాయ రోగం లేదు .."

" మరి ఎందుకు రాలేదు ?"

" కొత్త కాపురం అని చెప్పి మా మావగారు ఓ పది రకాల స్వీట్లు ,హాట్లు పట్టుకొచ్చాడు .."

" మంచిదే కదరా ..ఇంటిల్లిపాది ఓ నాలుగు రోజులు పండగ చేసుకునే పని "
"అందరికి పెడితే అలాగే జరిగేది ..కాని మా ఆవిడ మా నాన్న మీకోసమే తెచ్చాడు మీరే తినాలి అని పట్టుబట్టింది .కొత్త పెళ్లి కూతురు కదాఅని ..ఆవిడా మాట తీసేయ్యలేక,అన్ని నేనే తిన్నా ..అంతే ఓ నాలుగు రోజులు వదిలిపెట్టకుండా జడిచ్చి కొట్టాయి .."

# గిలిగింతలు పెట్టె హాస్య వల్లరి
# కడుపుబ్బా నవ్వించే
# కామెడి సీరియల్

" ఏమిటవి .."
" 3మితవి అని చిన్నగా అంటావు ఏమిట్రా ,విరోచనాలు ఆ దెబ్బకి ఓ నాలుగు రోజులు మంచం మీద నుండి లేగిస్తే ఒట్టు "

ఆ మాటలకు వర్లు గారు పది పది నవ్వటం మొదలు పెట్టారు

" ఏమిటో అంతగా నవ్వుతున్నారు మాకు కూడా చెపితే నవ్వుతాము కదా .." అప్పుడే వచ్చిన శంకరం మాట కలిపాడు

" ఏముంది అబ్బాయి మినన్నకు ఎప్పుడు నేను లోకువె కదా ...."

" అవును నాన్నా ..ఎందుకు అంకుల్ని ఎప్పుడు అలా ఏడిపిస్తుంటారు ..."

" ఎడిపిస్తున్నానా ..ఎరా నిన్ను ఏడిపిస్తున్నానా ...."వర్లు గారు గట్టిగా అడిగారు

" అంత గట్టిగ అడిగితే పాపం అంకల్ ఏమి చెపుతారు ....అసలే భయస్తులు .."

"భయస్తుడా ...ఎవరు ...వీడా ....ఎరా నీకు భయమేస్తుండా...అసలు వీడు కాలేజిలో ఏమి చేసేవాడో చెపితే .."

"ఒరేయ్ ఇప్పుడవన్నీ ఎందుకు ...ఇంతకి మా డ్రస్సులు ఎలా ఉన్నాయ్ అబ్బాయి "

" ఎందుకురా మాట మారుస్తావ్ ..నన్ను చెప్పని .." వర్లుగారు ఎదో చెప్ప బోయారు

"ఏమిటి అంతా కబుర్లు చెప్పుకుంటున్నారు అవతల టైం అవుతోంది .." ఈలోపు ఉమా కుడా అక్కడికి వచ్చింది "

" మేము రెడీ అమ్మా .."

"అచ్చం స్వామిజిల్లానే ఉన్నారు మామయ్యా .."

" వీడు వేషం వేస్తే ఎవ్వడు గుర్తుపట్టాడు తల్లి ..." ఉడికిస్తూ అన్నాడు తాతారావు

" సరే సరే ..బయలుదేరండి .." అంటూ అందరు పోలీస్ జీపు ఎక్కారు

" ఇప్పుడు మనం ఎక్కడికి వెళుతున్నాం ..."అనుమానంగా అడిగాడు శంకరం

" గచ్చి బౌలి స్టేడియం దగ్గరకు .."

ఆకదికేందుకు .."

" అక్కదేనండి యాగాలు జరిగేది .."

"ఒకే..."అంటూ తల ఆడించాడు శంకరం

★★★★

ఉమా ఎక్కినా జీపు నేరుగా వచ్చి యాగాలు జరుగుతున్న గచ్చి బౌలి స్టేడియం ముందు ఆగింది

అందరు కిందగి దిగారు .శంకరం అక్కడే ఆగిపోతు వాళ్ళను వెళ్ళమన్నట్టు సైగ చేసాడు .

ఉమ వర్లు గారిని , తాతారావుని వెంట బెట్టుకుని స్టేడియం లోపలి వెళ్ళబోయింది .
అక్కడ ఉన్న ఎస్ ఐ " మేడం మీరు లోపలి వెళ్ళకూడదు .అంటూ వాళ్ళ వంక ఎగ దిగా చూడ సాగాడు

" నాకు తెలుసు ..కాకపోతే ఈ స్వామీజీ లు దారి తప్పి పోతే ..ఇక్కడ దిగబెట్టమని ఎస్ పి గారే పురమాయించారు .."

ఎస్ పి మాట వినగానే ,ఎస్ ఐ కొద్దిగా వెనుకంజ వేసాడు " ఒకే మాదం వాళ్ళను మాత్రం లోపలకు పంపుతాను అన్నాడు ..ఎవరి ఏమిటి అని అడగకుండానే

" థాంక్ యు బిడ్డా .."అంటూ వర్లు గారు ఏమి తెలియనట్టు ఎస్ ఐ ణి దీవించి ..లోపలి అడుగు పెట్టారు ..వర్లు గారిని అనుసరించాడు తాతారావు

★★★

" అంతా సక్రమంగా సాగుతుందా .." స్వామిజి తన అంతరంగిక శిష్యుడు శరత్ వంక చూస్తూ అడుగాడు

" అంతా ఓకే స్వామీ ..యాగాలు మొదలయ్యాయి ..."

" యాగాలు పూర్తయ్యాక స్వామిజి ప్రసాదాలిస్తారు అని నా దగ్గరకు తీసుకురండి ..మిగతాది నేను చూసుకుంటా .అన్నట్టు హోమం లో నేను వెయ్యమన్న పౌడర్ నెయ్యి లో కలిపారా ."

" ఎవ్వరికి తెలియకుండా కలిపాం స్వామీ ...ఇంతకి ఏమి పౌడర్ స్వామీ ...అది "

' అది ఒక కెమికల్ ...దాన్ని నేతితో కాని నూనె తో కలిపి మంటల్లో వేస్తే ..సువాసన భరితమైన పొగ వేస్తుంది .."

" ఓహ్ సుగంధ భరితమా..."

" నీ మొఖం ...నీకు తెలిసింది అంతే ..బయటవాల్లకు సుగంధ భరితం ...లోపల వాళ్లకు సమ్మోహన వాయువు .."

" అంటే ..అర్ధం కానట్టు ..మొఖం పెట్టాడు .. శరత్

ఆ పొగ పీల్చిన వాళ్ళు మనం చెప్పినట్టు వింటారు ..ఒక రకంగా వాళ్ళు మనకు బానిసలుగా మారతారు

"అంటే డ్రగ్స్ లా నా స్వామి..'

అవును డ్రగ్స్ తీసుకుంటే మనకు లోబడతారు , కాని ఈ గాలి పిలిస్తే చాలు వాళ్ళ మెదళ్ళు మొద్దుబారి మనకు లోబడతారు

"మరి యాగం చేయించే మన శిష్యులు ..."

" వాళ్ళు ఎప్పుడో మన వశం అయ్యారుగా ..ఇంకా కొత్తగా అయ్యేది ఏముంది ..అందుకే మనం ఏమి చెపితే అది చేస్తున్నారు వాళ్ళు .

" ఒకే స్వామీ ..."

" వాళ్ళు మత్తులో ఉన్నప్పుడే నువ్వు నా దగ్గరకు తీసుకురా ..."

" తప్పకుండా ..ప్రసాదం ఇవ్వటానికేగా ..'

" అవును ...."

" ఆ ప్రసాదం ఎదో నాకు ఇవ్వవచ్చు కదా ...."

" ఏమి శరత్ నీకు ఎక్కువ రోజులు బతకాలని లేదా .." కాస్త కోపం తో అన్నారు స్వామిజి

" వద్దులే స్వామీ .." అంటూ అక్కడ నుంచి కదిలాడు శరత్

★★★

స్టేడియం లోపల చాలా హోమ గుండాలు ఉన్నాయి .దాదాపు ఓ వెయ్యి దాక ఉంటాయి .ప్రతి హోమ గుండం దగ్గార ఇద్దరు స్వామిజి ఇష్యులు ఉన్నారు .ఎదురుగా సిటీ లోని కోటీశ్వరులు అనబడే వాళ్ళు భార్యలతో సహా వచ్చి అక్కడ ఇద్దరిద్దరు ఎదురుగా కూర్చున్నారు

స్వామిజి శిష్యులు మంత్రాలు చదువుతుంటే , హోమం లో నెయ్యి వేస్తున్నారు దమపతులు .హోమం లోనుంచి చిన్నగా పొగలు రావటం మొదలు పెట్టాయి .

(ఇంకా ఉంది )

# 'యమ'జాన్

ఈ శ్రీనివాస రెడ్డి

పళ్ళు తోముకునే వేప పుల్లలు
వళ్ళు రుద్దుకునే సబ్బు బిళ్ళ లు
పోయ్యి కింద ఆవు పేడ పిడకలు
ఉట్టి మీది ఎర్ర మట్టి పిడతలు
కావేవి అనలైన్ లో ఆర్డర్లకు అనర్హం

పేదవాడి పేగులు నింపే గంజి నీళ్ళు
లేని వాడి ఆకలి తీర్చే పచ్చడి బద్దలు
చెట్టు కొమ్మన వేలాడే తాటి ముంజలు
నెల పొరల దాగిన లేత తేగలు
కావేవి అంతర్జాలంలో అమ్మకానికి అనర్హం

పరాయి పాలకులు పారిపోయినా
ప్రపంచీకరణ పుణ్యమా అని ప్రతి
వస్తువు మీద హక్కులు మావేనంటు
అర్ధ పావల సరుకును బేరం లేని ధరలకు
అమ్మజుపుతున్నారు ఆన్లైన్ అంగళ్ళలో

ప్రతి ఇంటికి ఇప్పుడు యజమాని యమజానే
ప్రతి కడుపు నింపేది ఇప్పుడు జమాట స్విగ్గిలే
పరాయితనానికి పాకులాడి బానిసలుగాబతికేస్తూ
ఆన్లైన్ వ్యామోహం లో అవసరానికి మించి
ఖర్చు పెడుతూ బిచ్చగాళ్ళుగా మిగులుతున్నాం

ఇవాళోరేపో మనుషుల్ని కుడా అడుగుల లెక్కన
అంగుళానికింత అంటూ అమ్మకానికి పెడతారు
రేపో మాపో తల్లి పాలను తండ్రి రక్తాన్ని
లీటర్ల లెక్కన పాకెట్లు కట్టి అమ్మజుపుతారు
కోనేవాళ్ళు  ఉండాలేగాని అమ్మేవాళ్ళకేమి తక్కువ

కథ

# స్పర్శ



**ఓట్ర ప్రకాశ రావు**

ఎక్స్ ప్రెస్ ట్రైన్ వేగంగా వెళ్తోంది .ఆ ఇద్దురు ఆగంతకులు రిజర్వేషన్ కంపార్టుమెంటులో నడుస్తూ వెళ్తున్నారు .అక్కడ ఒక్కసారిగా ఆగారు .తల్లీ కూతురు లోయర్ బర్త్ లో నిదురపోతున్నారు .ఇద్దరూ ఒకరినొకరు సైగ చేసుకొన్నారు. ఒకడు ఆ పాపను ఎత్తుకొన్నాడు.

మత్తుమందున్న జేబురుమాలు తీసుకొని ఆ పాపతల్లి ముఖం మీద పెట్టాడు. “ ఎవరో వస్తున్నారు” పాపను ఎత్తుకొన్న వ్యక్తి అన్నాడు మెల్లగా. ఆమె ముఖం పై వుంచిన ఆ చేతిగుడ్డను తీసేసాడు. ‘పరవాలేదు కొద్దిగా పీల్చివుంటుంది. పక్క స్టేషన్ వచ్చేంతవరకు లేవదులే’ అనుకొన్నాడు. ఒకడు ఆ పాపను ఎత్తుకొని వెళ్తే, వెనుకనే రెండవ వ్యక్తి బయలుదేరాడు. పాపను ఎత్తుకొని వెళ్లిన వ్యక్తి నేరుగా లెట్రిన్ తలుపు తెరిచి లోనికి వెళ్ళాడు. తన జేబులోని షేవింగ్ రేజర్ తీసుకొని పాపకు గుండు కొట్టాడు . కింద పడ్డ పాప వెంట్రుకలను తన దగ్గరున్నచిన్న సంచిలో వేసాడు .

తలుపు తెరవగానే “ఇక నీ పనే “ అంటూ గుండుతో నున్న పాపను అందించాడు .పాప జుట్టు వున్న సంచిని బోగీ తలుపు తెరచి పారవేసాడు .

పాలరాతిలా అందంగా ఉన్న పాపకు సంచిలోనున్న మేకప్ సామాన్లు వుపయోగించి నల్ల రంగున్న పాపలా మార్చాడు.వేసుకొన్న గౌను తీసి అంతకుముందే సిద్ధంగా వేరొక గౌను వేసాడు. నుదుటికి విబూది పూసి బొట్టు పెట్టాడు. ఆ పాప దుస్తులు సంచిలో వేసుకొన్నాడు. కన్న తల్లి చూసినా గుర్తుపట్టలేనంతగా వుంది అనుకొన్నాడు. బయటకు రాగానే బోగీ తలుపు తెరిచి పారవేసాడు ఆ పాప ధరించిన దుస్తులు బయట పారవేసాడు. ఆ పాపను తీసుకొని వెళ్లి అక్కడున్న స్త్రీఈకిచ్చాడు. ఆమెనవ్వుతూ తీసుకొని పాపను పడుకొనబెట్టి పైన తువ్వాలు కప్పింది .

"ఇక ఎంత సేపవుతుంది "

"మరో ముప్పావు గంటలో స్టేషన్ రాగానే మనం ముగ్గురం దిగేస్తాము."

"ఈలోగా ఈ పాప అమ్మ లేచిందంటే.."

"మత్తుమందున్న జేబురుమాలు దానిమీద వుంచానుగా. మరో గంట దాకా లేవదనుకొంటాను"

" ఈ పాప లేచిందంటే "

" పాల బుడ్డీ ఉందిగా పాలు తాగించు"

"తెలివి తక్కువగా ప్రవర్తించవద్దు .ఇది పాలు తాగే పాప కాదు. పాల బుడ్డీ ఇవ్వడానికి మూడేండ్ల బిడ్డ " మెల్లగా చెబుతున్నా కోపంగా అంది .

"ఈ పాప లేచిందంటే నిదురపుచ్చడానికి ప్రయత్నించు, లేదంటే దాని తల్లికిచ్చినట్లు నిదురపోయేలా మత్తుమందు ఇచ్చేద్దాం." అన్నాడు

ఎక్స్ ప్రెస్ ట్రైన్ చీకట్లను చీల్చుకొంటూ వేగంగా వెళ్తోంది

ఆ ముగ్గురూ ఎప్పుడెప్పుడు స్టేషన్ వస్తుందని ఆతృతతో ఎదురుచూస్తున్నారు.

మత్తుమందు ప్రభావంతో గాఢంగా నిదురపోతున్న ఆ తల్లికి నిదురలో కూడా పాపకు సంబందించిన కలలే. కొంతమందికి కన్న తల్లులు కలలు కంటున్నా పక్కన పడుకున్న బిడ్డ స్పర్శ దూరంకాగానే కల కూడా హెచ్చరించే అవకాశం వుంటుంది. అందుకే తల్లీ బిడ్డలా అనుబంధాన్ని గొప్పగా చెప్పుకొంటారు. కలలో పాప కిందపడి అమ్మా అంటూ అరిచింది. ఆ తల్లి ఒక్క సరిగా పాపను అందుకొనడానికి చేతులు జాచింది . పాప దొరకలేదు.


నిదురలోనే పక్కన పడుకొన్న పాపపై చేయి వేసింది .పాప పై చేయి పడలేదు.ఒక్కసారిగా బలవంతంగా కళ్ళు తెరిచింది .కన్నతల్లి ప్రేమముందు తనకు పెట్టిన మత్తుమందు ఓడిపోయింది, పాప కనపడలేదు ."అయ్యో పాప కనపడలేదు" బిగ్గరగా అరిచింది .

పయనిస్తున్న ఐదుమంది యువకులు ఒక్కసారిగా లేచారు.ఆ ఐదుగురూ మిలటరీలో కొత్తగా చేరిన యువకులు . సెలవుమీద తమ ఊరికి వెళ్తున్నారు. మరుక్షణమే అక్కడి లైట్లు వెలిగింది . రాత్రి పదిగంటల వరకు తమతో మామయ్యా అంటూ ఆడుకున్న పాప ఒక్క సారిగా కనపడక పోవడంతో దిగ్భ్రాంతితో అయోమయానికి గురయ్యారు

" నాకేమో తల తిరుగుతున్నట్లు.. అన్నా ..కాపాడండి " అంటూ ఐదుగురివైపు చూస్తూ చేతులు జోడిస్తూ ఏడవసాగింది.

కన్న బిడ్డ కనబడలేదన్న ఆందోళన వలన శరీరంలో మత్తు ప్రభావం చూపించలేకపోయింది. మత్తుమందు గల జేబురుమాలు భయంలో సరిగ్గా ఉంచకపోవడం ఆగంతకుడు చేసిన పొరపాటు .

"పోయిన స్టేషన్ నందు బండి కదిలేంతవరకు మనతో ఆడుకొంది . బండి స్టేషను దాటగానే పాప పడుకొంది ఆతరువాత బండి ఎక్కడా నిలబడలేదు.మరలా స్టేషన్ రావడానికి మరో ముప్పావు



గంట వుంది .పాప ఇంకా ఈ బోగీలో ఉంటుంది.ఎక్కడికీ పోయివుండదు "అన్నాడు అద్విక్

" ఒక్క బోగీలో కాదు రెండు బోగీలలో .. ఈ ఎక్స్ ప్రెస్ నందు చివర రెండు బోగీలు రిజర్వేషన్ బోగీలు,ఈ రెండు దాటి ఎక్కడికీ పోలేరు.దీని వెనుక వున్న లేడీస్ కంపార్ట్మెంటుకు, ముందున్న జనరల్ కంపార్టుమెంటుకు వెళ్ళడానికి దారిలేదు ." అన్నాడు విహాన్

" మీరు ముఖం కడుక్కోండి " అంటూ వాటర్ బాటిల్ అందించాడు. కృతిన్

ఆమె ముఖంపై నీరు చల్లుకొంది,

" మీరు మాతో పాటు రండి, రెండు కంపార్ట్మెంట్లలోనే ఉంటుంది .ఎక్కడికీ పోదు. ధైర్యంగా వుండండి " అన్నాడు చైతన్య

"నేను రెండు బోగీల తలుపులు లాక్ చేసి స్టేషను వచ్చినా దిగకుండా ప్రయాణికులను వుంచుతాను. అలాగే పక్క స్టేషనుకు ఫోన్ చేసి పోలీసులను ఈ రెండు బోగీల దగ్గర ప్లేట్ ఫారం వైపు ,ఇటువైపు వుండి తనికీ చెయ్యమని చెబుతాను" అంటూ సెల్ ఫోన్ తీసుకొన్నాడు అంకిత్ .

బోగీ నందు అన్ని లైట్లు ఆన్ చేశారు .విసుక్కున్న ప్రయాణికులకు వివరించి చెప్పగా కొంతమంది సహకరించడానికి ముందు కొచ్చారు.

రెండు బోగీలు వెతకడం కోసం ఇద్దరు ఒక బోగీనందు ,మరో ఇద్దరు ఇంకొక బోగీనందు వెతుకుతున్నారు .పాప తల్లి ఆ ఇద్దరితో వెళ్ళింది.

" పాప కనబటాం లేదని వెతుకుతున్నాం" అని చెప్పాడు.

పాపను దొంగలించిన అగంతకుడు "అయ్యయ్యో" అంటూ బాధపడుతున్నట్లు నటించాడు

" అయ్యో అలాగా , మా పాప నిద్రపోతోంది లేపకుండా చూసి వెళ్ళండి" అన్నాడు.

పాపపై కప్పిన దుప్పటి తీసింది ఆమె . నల్లటి ఆకారంతో గుండుతోనున్న పాపను చూసి తన పాప కాదంది .ఆమాటలతో ఆ స్త్రీ తో పాటు వచ్చిన ఆ ఇద్దరు అగంతకులు ఒక్కసారిగా బతికిపోయాం అని మనసులో అనుకొంటూ ఊపిరి పీల్చుకొన్నారు.

పాప కనబడలేదన్న విషాదంతో ఆమె అలాగే నిలబడి ఇక యెక్కడని వెతకాలో అర్థంకాక ఏడవసాగింది. ఆమెతో పాటు వచ్చిన ఆ ఇద్దరు మిలిటరీ కుర్రాళ్ళ లో ఒకడు వెనక్కు తిరిగి మెల్లగా ఒక్కొక్క బర్త్ పరిశీలనగా చూస్తుంటే ఒక వృద్ధురాలు వెనుకనే వచ్చింది.

" బాబూ ఒక్క నిముషం " అని చెప్పగానే నిలబడ్డాడు.

" నేను ఎక్కిన స్టేషన్ లోనే వాళ్ళు ఎక్కారు .కానీ వాళ్ళు ఎక్కినప్పుడు వాళ్ళ దగ్గర పాప లేదు "అంటూ తన అనుమానం చెప్పింది .

అనుమానం కాదు కాదు ఆ పాపనే ఇలా మార్చారన్న భావన కలిగింది .వెంటనే వెనక్కు తిరిగాడు.

సరిగ్గా అదే సమయాన ప్రక్కలైనులో వేగంగా హారన్ కొడుతూ వస్తున్న ఎక్స్ ప్రెస్ బండి వెళ్ళగానే ఉలిక్కి పడి తూలి పడింది. అదేసమయాన వేగంగా వచ్చిన గాలికి పాపా కాళ్ళపైనున్న పలుచటి తువ్వాలు తొలగింది . ఆమె చేతులు ఆ పాప కాళ్ళను తాకింది . మత్తుమందు ప్రభావం ఇంకా పూర్తిగా పోకున్నా ఆమెలో ఒక్క సారిగా షాక్ తగిలినంతగా ఉలిక్కిపడింది.మత్తు పూర్తిగా పోయింది. ఆ స్పర్శతో ఆమెలో మెదడు ఒక్కసారిగా చురుకుగా పనిచేసింది. కళ్ళు లేని తల్లి అయినా పదిమంది పిల్లలలో స్పర్శతో తనబిడ్డను కనిపెట్టగలదంటారు, ఆ స్పర్శ తన కూతురుదేనన్న సంకేతం . " ఈ పాప నాదే " బిగ్గరగా అంటూ ఒక్కసారిగా ఎత్తుకొంది .

" అయ్యో నా పాపను ఏమిటి ఇలా చేశారు" అంటూ గట్టిగా ఏడుస్తున్న శబ్దానికి పాప లేచి "అమ్మా" అంటూ గట్టిగా తల్లిని పట్టుకొని ఏడవసాగింది

ఆ అగంతకుడి చెంప చెళ్ళుమనిపించిన తరువాత " నేను మిలటరీ వాడిని నిజం చెబుతావా. నా బలం చూపించాలా. పాపను ఏం చేసావు." మిలిటరీ కమాండరులాగా గట్టిగా గర్జించాడు అద్విక్ .

" పిల్లలను అమ్మే ముఠాకు చెందిన వాళ్ళం .పాపకు ఏమీ కాలేదు. ఎవరూ గుర్తు పట్టకూడదని గుండు కొట్టి రంగు కొట్టాను." వణుకుతూ అన్నాడు

వృద్ధురాలు చెప్పు తీసుకొని " అమ్మ తనానికి మచ్చ కలిగించేలా నడచుకొనే నీవు ఒక ఆడదానివా, ఛీ.. ఛీ నీతిలేనిదానా " అంటూ ఆయువతిని కొట్టసాగింది .

కన్నబిడ్డను దుఃఖం, సంతోషంతో గట్టిగా తన గుండెలకు అదుముకొన్న ఆ తల్లి కళ్ళలో కన్నీరు జలపాతంలా కారసాగింది

(అయిపోయింది)

కథ

# "ఇల్లెక్కాడా?"



మధుపత్ర శైలజ

సుందరానికి పెళ్ళయి, సుగుణ భార్యగా వచ్చి రెండేళ్ళవుతోంది. సుగుణ, ఒక్క విషయంలో తప్ప మిగిలిన అన్ని విషయాలలోనూ సుందరాన్ని మెచ్చుకుంటూ ఉంటుంది. అతని ఆ ఒక్క బలహీనతే వారి కాపురంలో ఆమెను పైచేయిగా నిలబెట్టింది. వారానికి ఒక్కసారి పుచ్చుకునే మందు, పెళ్ళయిన తరువాత భార్య మాటకు కట్టుబడి నెలకు ఒకసారిగా మార్చుకున్నాడు సుందరం. పెళ్ళికి ముందే ఉన్న అలవాటుని అదుపులో ఉంచుకుంటూ, ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ ఇంత కాలం గడిపినందులకు, ఆ విషయంలో కూడా అతను బుద్ధిమంతుడే.

అత్తమామలు వీళ్ళింటికి వచ్చినప్పుడల్లా, "మీ అబ్బాయికున్న దురలవాటుని దాచి, పెళ్ళి చేసి నా గొంతు కోసారు" అని దెబ్బలాడుతూండేది సుగుణ. వాళ్ళు కూడా "ఆ ఒక్క విషయంలో మాత్రం మాచేయి దాటి పోయాడు, నీవే ఎలాగో ఒకలాగ దారిలోకి తెచ్చుకోవాలి" అని చెపుతూండేవారు.

పెళ్ళయిన కొత్తల్లోనే, ఇక నెలకొకసారి తప్ప మిగతా రోజులలో మందు తాగటానికి వీలులేదని, మాట తప్పితే మామిడాకులు మా "విడాకులు అవుతాయి" అంటూ అందరిలోను నొక్కినొక్కి చెప్పింది. "నెలకొక్కసారికైనా గొంతు తడుస్తుంది కదా" అని మనసులో అనుకొని ఆ షరతుకు ఒప్పుకున్నాడు సుందరం.

"అలాగే మద్యం సేవించిన రోజు మాత్రం మీరు ఇంటికి రావద్దు. మీ దోస్తుల ఇళ్ళలోనే పడుకోవాలి" అని తెగేసి చెప్పింది సుగుణ. దానికి కూడా సుందరం ఔననక తప్పలేదు.
ఓ రోజు "తన స్నేహితుడు సుధీర్ పుట్టిన రోజు పార్టీ వుందని, రాత్రికి ఇంటికి రాను" అని చెప్పి ఆఫీసుకు వెళ్ళాడు సుందరం. ఆ సాయంత్రం ప్రక్కింటి బాబాయిగారిని "ఈరోజు రాత్రి మీఅబ్బాయి ఇంటికి రానన్నారు, ఒక్క దానినే ఉండాలి కాబట్టి మీ కుక్క జూలీను కట్టేయకుండా వదిలేయండి" అని అడిగింది.
తన పెద్ద కూతురి పోలికతో ఉంటుందని, ఆయనకు సుగుణ అంటే చాలా ఆపేక్ష. ఆమె అడిగిన విధంగానే జూలీను వదిలేసి పక్కింటి బాబాయిగారు పడుకున్నారు.
సుగుణ రాత్రి భోజనం ముగించుకుని ముందు, వెనుక కిటికీ తలుపులతో సహా అన్నింటికి గట్టిగా గడియలు పెట్టేసి, పడుకుంది.
సుందరం పార్టీ అయ్యాక సుధీర్‌తో కలిసి అతని ఇంటికి వెళ్ళాడు. అక్కడ వాచ్‌మెన్ సుధీర్‌తో "మీ అక్కా బావగార్లు వచ్చారు. నాదగ్గర ఉన్న మీ డూప్లికేట్ కీ తీసుకుని పైకెళ్ళి పడుకున్నారు" అని చెప్పాడు.
సుధీర్ "ఏం చేద్దాంరా, మనపరిస్థితి 'ముందు నుయ్యి వెనుక గొయ్యి'లా తయారయ్యింది" అన్నాడు సుందరంతో.
"ఇక చేసేదేముంది. మా ఇంటిడాబాపైకి ఎక్కి ఈరాత్రికి పడుకుందాం, అయితే డాబాపైకి వెళ్ళటానికి మెట్లు లేవు జాగ్రత్తగా పైపులైన్ పట్టుకుని వెళ్ళాలి" అన్నాడు సుందరం.
సుందరం ఇంటికి చేరిన ఇద్దరు స్నేహితులు, పైపులైన్ మీదనుంచి పైకి ఎగబాకుతున్నారు.
సుధీర్‌కు ఇది కొత్తగావటంతో ఇబ్బందిపడుతున్నాడు. అప్పుడు అతనికి వీళ్ళింట్లో తిరిగే జూలీ గుర్తుకొచ్చింది. "ఏరా కుక్క పడుకునుంటుందా? మనల్ని చూసి మొరగదు కదా" అని అడిగాడు.
"ఈసమయంలో దాని గొడవెందుకు? అయినా దానిని కట్టేసి ఉంటారులే" అన్నాడు సుందరం.
వీరు చేసిన శబ్దానికి జూలి వీళ్ళను చూడనే చూసింది. అది పరిగెత్తుకుని వీళ్ళున్న చోటికి వచ్చి అరవటం మొదలుపెట్టింది. పైకెక్కుతున్న వీళ్ళను అందుకోవాలని అది కూడా పైకి ఎగురుతోంది. సుందరానికి జూలీ తన కాలు కొరికేస్తుందేమో అన్నంత భయం కలిగింది. "త్వరగా ఎక్కరా సుధీర్! లేకపోతే జూలీ నా కాలు పట్టుకునేలా వుంది" అన్నాడు వణుకుతున్న స్వరంతో. ఎలాగో అతి కష్టం మీద పైకి చేరుకున్నారు మిత్రులు.
జూలీకి తన అరుపులను కేర్ చేయని వీళ్ళను వదలాలనిపించలేదు కాబోలు, వెళ్ళి తన యజమానితో తిరిగి వచ్చింది. పక్కింటి బాబాయిగారు తమ మేడమీదకొచ్చి టార్చ్‌లైట్‌ను మిత్రులమీదకు ఫోకస్ చేశారు.
"అరే సుందరం!" ఈ అర్ధరాత్రిపూట డాబాపైన ఏమిటి? అని కాసేపు ఆశ్చర్యపోయి, తరువాత సుగుణ చెప్పిన విషయం గుర్తుకొచ్చి "ఏమిటయ్యా సుందరం? తాగొచ్చింది చాలక ఇదేం గొడవ? ఇంట్లో హాయిగా చిలకాగోరింకల్లా ఉండక, ఊళ్ళో కుక్కలతో నక్కలతో ఈ చెడుసావాసాలేమిటి?" అంటూ చివాట్లు పెడుతున్నాడు. "పక్కన ఉన్నది నీ దోస్తా?" అని అడిగాడు.
అప్పటికి పూర్తి మత్తులోఉన్న స్నేహితులకు ఈయన మాటలు చెవికెక్కితేగా? సుధీర్ "ఒరేయ్ సుందరం! ఈ పెద్దాయనకి మన కచేరి వినిపిద్దామా? అందుకో మన పాట" అంటూ "జగమే మాయా బ్రతుకేమాయా" అని ఇద్దరూ పెద్ద గొంతుకలతో పాడటం మొదలుపెట్టారు.
"తిక్కసన్నాసుల్లా ఉన్నారే, అసలు ఇంటాయనకు చెప్పి వీళ్ళను వెంటనే ఖాళీ చేయించేద్దును, కానీ మా అమ్మాయి మొఖం చూసి ఊరుకుంటున్నాను" అని మనసులో అనుకొని, "ఆపండి మీ గోల! అయినా మీరు అపర దేవదాసు లనుకున్నారా? సందర్భానుసారంగా పాడుతున్న పాట బాగానే ఉంది, కానీ మీ పక్కన ఒక్కటిలేక లోటుగా అనిపిస్తోంది" అన్నారాయన.
"అన్నీ ఉన్నాయే! ఇదిగో నా చేతిలో మందు బాటిల్, వీడి చేతిలో సిగరెట్ ప్యాకెట్ ఇంకేంకావాలి" అని దబాయించాడు సుధీర్
"ఆ పాటలో ఆరెండే కాదు, మరోటి కూడా ఉంది. ఉండండి ఇప్పుడే ఆలోటు కూడా పూడుస్తాను" అంటూ "జూలీ వెళ్ళవే వాళ్ళ పనిపట్టు" అని దాన్ని రెచ్చగొట్టారాయన. యజమాని పక్కనే ఉన్నాడనే ధైర్యం కాబోలు జూలీ రయ్యిమంటూ అరుస్తూ ఎగురుతోంది వాళ్ళను జేరటానికి.
"చప్పుడు చేయకుండా పడుకోండి.

లేకపోతే ఇప్పుడిటుగా వచ్చే గూర్ఖా మీ పని పడతాడు. బుద్ధి సరయిన దారిలో పడుతుంది" అంటూ బాబాయిగారు జూలీని తీసుకెళ్ళి పడుకున్నారు.

జూలీ అరుపులతో ఆవీధిలోని వారికి రాత్రంతా నిద్రలేదు. గంటకొకళ్ళుగా వచ్చి బాబాయిగారిని నిద్రలేపి కుక్కను అదుపుచేయమని చెప్పేవారే! తలుపులన్నింటిని వేసుకుని లోపల పడుకున్న సుగుణకు మాత్రం నిద్రాభంగం అవ్వలేదు.

తెల్లవారింది. నిద్రలేచి బయట ముగ్గువేద్దామని వచ్చిన సుగుణ దగ్గరకు, "అమెకు ఈవిషయం ఎప్పుడెప్పుడు చెబుదామా" అని ఎదురుచూస్తున్న బాబాయిగారు, వచ్చి అర్ధరాత్రి అల్లుడు, అతని స్నేహితుడు తాగొచ్చి చేసిన గొడవ నంతటిని పూసగుచ్చినట్లుగా చెప్పారు. "ఇది సంసారులుండే కాలని. ఇంకోసారి ఇలా జరిగితే పోలీసు కంప్లయింట్ ఇస్తాను" అని అన్నారాయన. దాంతో సుగుణ కోపం నషాళానికంటింది.

బారెడు పొద్దెక్కక పైపులైను మీదగా జారుకుంటూ స్నేహితులిద్దరు దిగివచ్చారు. సుధీర్ "వదినా బాగున్నారా?" అంటూ సుగుణను పలకరించాడు. వాళ్ళిద్దరు పిచ్చాపాటీ మాట్లాడుకుంటూంటే, సుందరం నెమ్మదిగా బాత్‌రూంకు జారుకున్నాడు. సుందరం బయటకు వచ్చేటప్పటికి సుధీర్ లేడు.

భార్యాబర్తల మధ్యన నిశ్శబ్దం రాజ్యమేలింది. వంటచేసి, బాక్సులో సర్ది సుందరాన్ని ఆఫీసుకు పంపించింది సుగుణ. "ఈపూటకు మౌనరాగం ఆలపిస్తోందన్నమాట, సాయంత్రానికి వాతావరణం ప్రశాంతమైపోతుంది" అనుకున్నాడు సుందరం.

ఆమధ్యాహ్నం మూడుగంటల ప్రాంతంలో ఓ అపరిచిత వ్యక్తి వచ్చి, నరసరావుపేట కుర్చీలో పడుకుని పేపరు చదువుతున్న పక్కింటి బాబాయిగారిని, "ఏమండీ! ఇక్కడ సుందరంగారిల్లెక్కడ?" అని అడిగాడు.

దానికి బాబాయిగారు "మరోసారి చెప్పండి! ఏంకావాలి?" అని అడిగారు.

"వారికి చెవుడేమోనని" ఆవచ్చిన వ్యక్తి ఈసారి వినేవారి చెవుల్లో కర్ణభేరి చిల్లుపడేలా గట్టిగా "సుందరంగారిల్లెక్కడా?" అని అడిగాడు.

బాబాయిగారు ఆవ్యక్తి వంక అనుమానపు దృక్కులతో ఓసారి కిందనుండి మీదకు పరికించి, దీర్ఘాలోచన చేసి, "ఓహో తమరా! రాత్రి 'జగమేమాయ' ఇంకా దిగలేదా? మరోసారి 'సుందరం ఇల్లెక్కాడా' అంటున్నారు. ఉండండి, మీకు బాగా మర్యాద చేయాలి లోపలికి రండి" అని పక్క గదిలోకి తీసుకెళ్ళి గభాలున బయటకొచ్చి గదికి గొళ్ళెం పెట్టేశారు.

పోలీసులకు ఫోను చేసి పరిస్థితిని వివరించి రమ్మనమని చెప్పి, స్థిమితంగా వాలుకుర్చీలో పడుకుని తిరిగి పేపరు పఠనంలో మునిగిపోయారు. ఈయన ఫోను భాగోతం విన్న గదిలోని వ్యక్తి లబోదిబోమని గొడవ చేస్తున్నాడు. అతని కేకలు వింటూ "వీనుల విందుగా ఉంది లేకపోతే రాత్రి తాగొచ్చి అల్లరి చేస్తారా? ఇప్పుడు తిక్క తిన్నగా కుదురుతుంది. శ్రీకృష్ణ జన్మస్థానంలో కూర్చుని "కలయిదనీ, నిజమిదనీ తెలియదులే, బ్రతుకింతేనులే.." అని పాడుకుందువుగాని" అని మనసులో అనుకున్నారు.

ఇంతలో పోలీసు జీపు వచ్చి ఆగింది. ఇనస్పెక్టరుగారు, ఒక కానిస్టేబుల్ వచ్చి, "ఏమిటి సంగతి?" అని అడిగారు.

"రాత్రి జరిగిన న్యూసెన్సు, మళ్ళీ పగలు కూడా వచ్చి తన స్నేహితుడి గురించి అడగటంచెప్పి, తప్పించుకు పోతాడేమోనని గదిలో బంధించి ఉంచాను" అన్న సంగతి చెపుతూ, బాబాయిగారు గది గొళ్ళెం తీసారు.

ఆ అపరిచితవ్యక్తి ఎవరో తరుముతున్నట్లుగా ఇనస్పెక్టరుగారి ముందుకొచ్చి, "సార్!..." అంటూ కన్నీళ్ళు పెట్టుకున్నాడు.

బాబాయిగారిచ్చిన కంప్లయింట్ గురించి చెప్పినతరువాత, "మీరా! ఏమిటి మీరు తాగుతారా?" అని అశ్చర్యంగా అడిగారు ఇనస్పెక్టరుగారు ఆ అపరిచితవ్యక్తిని.

"మీకు తెలుసుగా సార్! నేను చిట్‌ఫండ్ సంస్థలో రికవరీ ఏజెంట్‌ను. నేను సుందరంగారి నుండి వాయిదా వసూలు చేసుకుందామని ఆయన అఫీసుకెళ్ళి అడిగితే, ఈరోజు డబ్బు తేవటం మరచిపోయాను. కాస్త ఇంటికెళ్ళి తీసుకుంటారా? డబ్బు రెడీగానే ఉంది అంటూ అడ్రస్సు ఇచ్చారు. నేనేమో పక్కింటి తలుపు తట్టబోయి, ఈయనకు దొరికిపోయాను. 'సుందరంగారి ఇల్లెక్కడా?' అన్న నా ప్రశ్న ఈపెద్దాయనకు ఎలా

వినబడిందో? ఏమో? నేను చెప్పేది
వినిపించుకోకుండా ఈ పెద్దమనిషి
ఇలా చేశారు" అని మొత్తుకున్నాడా
చిట్ ఫండ్ ఆఫీస్ ఏజెంట్.
ఈలోగా బాబాయిగారు సుగుణను
పిలిచి, "ఏమ్మా! ఇతను మన
సుందరం స్నేహితుడేగా! రాత్రి వచ్చి
గొడవ చేసింది ఇతడే కదా" అని
అడిగారు. "అయ్యో! ఇతను మావారి
స్నేహితుడు కాదండి. చిట్ ఫండ్
సంస్థలో ఏజెంట్ గా పనిచేసే ఇతనికే
మేము నెలనెలా వాయిదాలు కడతాం"
అని చెప్పింది.
"నాకు 'సుందరంగారు ఇల్లెక్కడా?'
అన్నట్లుగా వినబడటంతో ఈ
సమస్యవచ్చింది. మిమ్మల్ని
అనవసరంగా పిలచాను. అలాగే
ఏజెంట్ గారిని కూడా నొప్పించాను.
మీరిద్దరు నన్ను మీతండ్రినే అనుకుని
క్షమించండి" అన్నారు బాబాయిగారు.
"అసలు విషయం తెలుసుకుని
కేసు బుక్ చేద్దామని వచ్చాను. అదే
మీ మాటపై కేసు రాసుంటే మీ
అందరు స్టేషన్‌కు రావలసి వచ్చేది.
ఇకపై పోలీసులతో వ్యవహరించే
ముందు కాస్త నిజానిజాలను మీరే
నిర్ధారించుకుని కంప్లయింట్
చేయండి" అని సున్నితంగా చెప్పి,
నమస్కరిస్తూ వెళ్ళిపోయారు
ఇనస్పెక్టరుగారు.
జరిగిన దానికి సుగుణ కూడా
సిగ్గుపడుతూ, ఇద్దరికి క్షమాపణ
చెప్పింది. సుగుణ వాయిదా
కడతానన్నా "వద్దే వద్దు అమ్మా! నేను
సుందరంగారి దగ్గర తీసుకుంటాను"
అని బ్రతుకుజీవుడా అంటూ బయట
పడ్డాడు రికవరీ ఏజెంట్.
బాబాయిగారికి సర్దిచెప్పి సుగుణ
ఇంటికి తిరిగి వచ్చింది. ఆ రాత్రి
సుందరానికి జరిగిన విషయం
చెప్పి మీ నిర్వాకం మూలంగా
బాబాయిగారు, చిట్ ఫండ్ ఏజెంట్
గారు, ఇనస్పెక్టరుగారు ఎంతగా
ఇబ్బంది పడింది చెప్పింది.
"ఇంకెప్పుడు మద్యం ముట్టకండి"
అంటూ గట్టిగా అంటున్న సుగుణ
మాటల్లోని నిజాన్ని గ్రహించిన
సుందరంలోని మనిషి మేల్కొన్నాడు.

★★★★

# అమ్మ దొరికింది

ఎస్ .శ్రీనివాస రావు



ఏ మైలబడిన స్త్రీత్వమో మాయలోని మాతృత్వాన్ని
మలినాల దుర్గంధపు తొట్టిలో వదిలేసింది

మనిషి పేర్చుకున్న పరువు, మర్యాదల హోమగుండంలోకి
అమ్మ ప్రేమ తొలిమొగ్గ సమిథలా విసరివేయబడింది

కన్నవారు చేసిన పాపపు పేగు మెడకు చుట్టుకుని
అన్నెం పున్నెం ఎరుగని నెత్తుటిగుడ్డు అనాథగా మారింది

కాయకష్టం చేయలేని అసంపూర్ణ దేహమొకటి
దయగల తల్లుల భిక్షకోసం దారివెంట సాగిపోతున్నది

తగలబడ్డ తలరాతను వ్రాసి, జానెడు పొట్టను సృష్టించిన
దేవుడి మీద కోపం చెత్తకుండిలో ఆకలి కేకగా మారింది

కదులుతున్న దేహపు కాళ్ళకు సంకెళ్ళు పడ్డాయి
“ఈనాటి ఈ కేక, ఆనాడు అమ్మ చెప్పిన తన కేక
ఒకటేనా...”

శబ్దం వచ్చిన దిశగా అడుగులు వేగంగా పడ్డాయి
ఎంగిలి విస్తరాకు మీద తడి ఆరని భ్రూణం

నాటి కుంతి నుంచి నేటి కన్యల వరకు అదే చరిత్ర
నేల మీద తుడిచి పెట్టలేని కర్ణుడి వారసత్వం

మలినంలోని పసికందును చేతులలోకి తీసుకుంది
ఎవరి కడుపు పంటో ఆమె ఒడిని గుడి చేసుకుంది

పుట్టిన బిడ్డ కంటికి కనిపించే తొలిరూపం “అమ్మ”
ఆ దిక్కులేని జన్మకు, మరో దిక్కులేని అమ్మ కనిపించింది

ఎవరూ లేరనుకున్న ఒంటరితనాలిప్పుడు ఒకరికి ఒకరైనాయి
అనాథకు, అనాథే తోడన్న వాస్తవం..మరోసారి రాజముద్ర వేసుకుంది

లోకం తెలియని పసివాడికి ఆకలి తెలిసిన అమ్మ దొరికింది
కన్నతల్లి వదిలేసినా మనసున్న తల్లి జోలె అతనికి ఊయలగా మారింది...

కథ

# పేరు పెట్టి పిలిచిన చాలు



మద్దూరి నరసింహమూర్తి,

“శివా, నిన్న రాత్రి గరికిపాటి వారి ప్రసంగంలో ఒక విశేషం తెలియచేసేరు, విన్నావా”

“లేదు నారాయణా, ఆ సమయానికి మా టి వి లో సమస్య వచ్చి వినలేకపోయేను. ఏమిటి సెలవిచ్చేరేమిటి”

“ఏ మనిషైనా తను తినే తిండి పట్ల తన ఆరోగం పట్ల జాగ్రత్త వహిస్తే, ఆ మనిషి 70 సంవత్సరాలు జీవించే సౌలభ్యం కలిగిస్తాడట ఆ భగవంతుడు. ఆ పైన జీవించేదంతా బోనస్ గా గ్రహించాలట. ఎంత బాగా చెప్పేరేం?”

“నిజమే, అలా తగిన జాగరూకత వహించనక పోవడం వలననే మనం ఎనిమిది స్నేహితులలో ఆరుగురు స్నేహితులను పోగొట్టుకొని మన ఇద్దరం మాత్రమే మిగిలేము”

“సరిగ్గా చెప్పేవు శివా. అష్ట దిక్పాలకుల్లాగా మన దేశానికి ఉన్న ఎనిమిది దిక్కులనుంచి కేంద్ర స్థానమైన ఈ నాగపూర్ కి చేరుకున్నాము మనం ఎనిమిదిమంది, అందరి అబ్బాయిలు ఇక్కడ పనిచేస్తుండడంతో. అందరం తెలుగు వారే అవడం పైగా అందరి ఇళ్ళకి ఈ పార్క్ కేంద్ర స్థానం అవడంతో, మన ఎనిమిదిమంది స్నేహితులు కాగలిగి ఎనిమిదేళ్లుగా కలిసి మెలిసి ప్రతీ రోజూ సాయంత్రాలు ఇక్కడే ఆనందంగా గడిపేం”

“కానీ నారాయణా నీకు తెలియంది ఏముందీ, కరోనా మహమ్మారి మన ఎనిమిదిమందిలో ఇద్దరిని నిర్దాక్షిణ్యంగా మన నుంచి తీసుకొని పోయింది. ఆ ఇద్దరి అకాల మరణంతో దిగ్భ్రమ నుంచి తేరుకోలేని కామేశ్వరరావు వారిద్దరూ పోయిన రెండు నెలలకే గుండె నొప్పితో పోయేడు. తన తిండి యావ తగ్గించుకోక మిఠాయి కనిపిస్తే చాలు తినేస్తూ, చక్కెర వ్యాధి ముదిరి, మరో ఆరు నెలలకు రాఘవరావు మనకు శాశ్వతంగా దూరమైపోయేడు”

“అంతేకాదు శివా, రాఘవరావు కాలం చేసినది గమనించైనా బుద్ధి తెచ్చుకొక ‘బ్రతికున్న నాలుగు రోజులు కావలసినది తినక నోరు కట్టుకొని బ్రతికి ఏమి లాభం’ అంటూ మిట్ట వేదాంతం వల్లించిన వెంకటేశ్వర్లు కూడా మరో ఆరు నెలలకు ఆ తిండి యావకే బలైపోయేడు”

“పోనీ నలుగురమైనా స్నేహితులం మిగిలేము అనుకున్నది మూన్నాళ్ల ముచ్చటగానే మిగిల్చి మన్మథరావు మరో ఏడాదికి బాల్టీ తన్నేసాడు కదా నారాయణా”

“అక్కడితో లింగు లిటుకు మంటూ మనం ఇద్దరమే మిగిలేం కదా శివా”

ఒక్క రెండు నిమిషాలు అక్కడ నిశ్శబ్దం గడిచిన తదుపరి --

“నాదొక సలహా నారాయణా, చెప్పనా”

“చెప్పు”

“మన ఇద్దరి పుట్టిన రోజు యాదృచ్ఛికంగా ఒక రోజే అవడం మనం ఆ రోజు ఉచితరీతిని గడుపుదామన్నది నా ఆలోచన నారాయణా”

“అంటే”

“వచ్చే ఆదివారం మన 70 వ సంవత్సారానికి ఆఖరి రోజు. కాబట్టి గరికిపాటి వారు చెప్పినట్టు ఆ రోజు తరువాత మనకు లభించే జీవితం బోనస్ లెక్కే కదా”

“అవును. అయితే ఏమి చేద్దామంటావు”

“మన పుట్టినరోజున అనగా మనం 71 లో అడుగుపెట్టిన రోజు, అందునా సోమవారము అయింది కనుక, ఇద్దరం కలిసి శ్రీ త్రయంబకేశ్వరుడి దర్శనం చేసుకుందాము”

“మంచి ఆలోచన చేసేవు శివా”

“నీ పేరులో ఉన్న శివుడు, నా పేరులో ఉన్న నారాయణుడు, మనలను సృష్టించిన బ్రహ్మ ముగ్గురూ కిలిసి వెలసిన క్షేత్రం కాబట్టి మనం ఆరోజున త్రిమూర్తులను దర్శనం చేసుకున్న పుణ్యాన్ని మూటగట్టుకోవచ్చు కదా నారాయణా”

“శివా, నువ్వు ఇప్పుడు చెప్పినదానికి చిన్న సవరణ చెప్తాను నేను”

“చెప్పు”

“మనం ఆదివారం సాయంత్రం ఒకసారి శ్రీ త్రయంబకేశ్వరుడి సంధ్యా హారతి దర్శనం చేసుకుందాము. మరునాడు ఉదయమే త్వరగా లేచి ప్రభాత సమయాన మరొకసారి దైవ దర్శనం చేసుకొని, మహానది జన్మస్థలాన్ని దర్శించుకొని వచ్చి తిరిగి మరొకసారి శ్రీ త్రయంబకేశ్వరుడి దర్శనం చేసుకొని తిరుగు ప్రయాణం చేద్దాం. అప్పుడు ముగ్గురు మూర్తులను మూడేసి సార్లు దర్శించడమే కాక, మహానది జన్మస్థల దర్శన భాగ్యం కూడా మూట కట్టుకున్నవారము అవొచ్చు, ఏమంటావు శివా”

“ఇంత మంచి ఆలోచనను నేను మాత్రం ఎందుకు కాదంటాను?”

“మన పుట్టిన రోజున ఇంట్లో ఉండము కాబట్టి మన 70 వ సంవత్సారానికి ఆఖరి రోజు అయిన ఆదివారం మన ఇద్దరి కుటుంబాలు కలిసి ఉదయం భోజనం చేద్దాము. మన ఇద్దరికీ కార్లు ఉన్నా, నడపడం తెలిసి ఉన్నా, ఒక కారు అద్దెకు తీసుకొని ఆ డ్రైవరు కారును నడుపుతూ ఉండగా ఎటువంటి టెన్షన్ లేకుండా మన ప్రయాణం చేసి వద్దాము. ఏమంటావు నారాయణా”

“మంచి ఆలోచన చేసేవు. మన రెండు కుటుంబాలు కలిసి చేసే భోజనం మాత్రం మా ఇంట్లో చేద్దాము, సరేనా శివా”

“పిలిచి భోజనం పెడతానంటుంటే కాదనే మూర్ఖుడెవడైనా ఉంటాడా నారాయణా”

“భోజనాలు చేసి, మధ్యాహ్నం రెండు గంటల సరికి మా ఇంటి నుంచే మనం ఇద్దరం బయలుదేరదాము”

“మరి మన భార్యలు కూడా మనతో వస్తాము అంటారేమో”

“అందుకే, వారికి తీసుకొని వెళ్లకపోవడానికి గల కారణం ముందే వారికి చెప్తే సరి శివా”

“ఏమిటా కారణం”

“మన ఆడవారు వారి ప్రస్తుత వయసులో మహానది జన్మస్థలం చూడడానికి నడవలేరు. అలాగని వారిని త్రయంబకంలో హోటల్ లో వదలి వెళ్ళడం సముచితం కాదు అని వారికి బోధపరిస్తే సరి”

“ఈ ఆలోచన బాగుంది. వారిని హోటల్ లో వదలి వెళ్తే మనం కూడా ప్రశాంతంగా వెళ్ళి రాలేము కూడా”

“అవును అదీ నిజమే. మనం వచ్చేవరకూ వారు కూడా ప్రశాంతంగా ఉండలేరు కదా”

“అదీ నిజమే”

ఆ విధంగా శివ నారాయణ ఇద్దరూ వారి 70 వ సంవత్సారానికి ఆఖరి రోజు అయిన ఆదివారం మధ్యాహ్నం రెండు గంటలకు అద్దె కారులో త్రయంబకానికి బయలుదేరేరు.

వారి ఆలోచన ప్రకారం ఆ రోజు

శ్రీ త్రయంబకేశ్వరుని సంధ్యా హారతి దర్శనం చేసుకొని హోటల్ గదిలో విశ్రమించేరు.
మరునాడు అనగా వారిద్దరూ 71 వ సంవత్సరంలో అడుగుపెట్టిన రోజున శ్రీ త్రయంబకేశ్వరుని ప్రభాత దర్శనం కూడా చేసుకొని, ఉదయం 7 గంటలకు మహానది జన్మస్థలానికి నడక సాగించేరు.
కష్టతరమైన ఆ నడక ప్రయాణం కబుర్లు చెప్పుకుంటూ పూర్తి చేసి అనుకున్న ప్రకారం మహానది జన్మస్థలంలో చుక్క చుక్కలుగా మాత్రమే పడే ఆ జీవనది ధారను చూసిన వారు అమిత ఆశ్చర్య ఆనందాలకు లోనయ్యేరు.
తిరుగు ప్రయాణం నడకలో ఆ ముచ్చట్లే ముచ్చటించుకుంటూ వచ్చి ఇద్దరూ క్రిందన ఆత్మారాముడికి శాంతినిచ్చి ఒక గంట విశ్రాంతిగా నడుం వాల్చేరు.
మరలా, అదే రోజు శ్రీ త్రయంబకేశ్వరుని సంధ్యా హారతి దర్శనం చేసుకొని, రాత్రి భోజనం సమయానికి ఇంటికి చేరుకోవచ్చని, ఏమాత్రమూ ఆలస్యం చేయకుండా కారులో ప్రయాణం ఆరంభించేరు.

ఉదయం చేసిన నడకతో అలిసిన వారిద్దరూ ఆ కారు నడుస్తూంటే ఎప్పుడో వారికి తెలియకౌండానే నిద్రలోకి జారుకున్నారు. సుమారుగా నాగపూర్ చేరుకుంటున్న సమయాన డిప్పర్ లైట్లు వేయకుండా ఎదురుగా వస్తున్న లారీని సరిగ్గా గుర్తించలేని కారు డ్రైవరు అసమర్థత వలన, వారు కూర్చున్న కారును పక్కకు తిప్పే ప్రయత్నంలో అక్కడే ఆగి ఉన్న మరొక లారీని గుద్దుకొన్నది.

అప్పుడు సంభవించిన పెద్ద శబ్దానికి తెలివొచ్చిన ఇద్దరూ చెరో వైపుకు ఎగిరి పడుతూ —
"శివా" అంటూ నారాయణ--
"నారాయణా" అంటూ శివ--
వేసిన ఆఖరి కేకలతో పుట్టినరోజు గిట్టినరోజు ఒకటిగా నిలిచి వారిద్దరి ప్రాణాలు అనంత వాయువులలో కలిసిపోయేయి.
శ్రీ త్రయంబకేశ్వరుని దర్శన పుణ్య భాగ్య మహిమ కాబోలు — వారిద్దరి ఆత్మలనూ తీసుకొని పోవడానికి, ఆ పరమాత్ముని పనుపున వచ్చిన ఇద్దరు శైవులతో వారిరువురూ కలిసి కైవల్యపథానికి తుది ప్రయాణం సాగించేరు.
యాదృచ్ఛికంగా ఆ సమయాన త్రయంబక పుణ్యక్షేత్రంలో ఎవరో పుణ్యాత్ముడు చెప్తున్న ప్రసంగంలోని ముత్యాల్లాంటి మాటలు ఈ విధంగా వినిపిస్తున్నాయి —

"బిడ్డ పేరు పెట్టి పిలచినైనను చాలు

ఆత్రమున అక్కున చేకూర్చుకొని

ముక్తినొసగు మహానుభావుడే

శ్రీ త్రయంబకేశ్వరుడు"

★★★★

# ఎండిన చేప

బి హెచ్ గౌరీ శంకర్

బ్రతుకు సంద్రానికెదురీత
పరిధి లేని కడలి వాలు జీవితం
గంగమ్మకు జాలి మిన్న
ప్రభుత కు దయరాదన్న
జారిపోతున్న కన్నాల వలలో
రంగు వెలిసిన జాలరి బ్రతుకు
మూడు లకారాలు కడితే
సబ్సిడీ ల పథకాలు... మరి డబ్బో
బిమా లేని బోటు.. ధీమా లేని బ్రతుకు
సరిహద్దులు దాటి... శిక్షలు పాలై
ఆకలి కొక్కెనికి ఎర.. జాలరి
వ్యాపార రక్కసి మరబోట్లు
సంప్రదాయ నీడన.. మృత్యు మీనాలు
కమిటీలు... కమిషన్లు.. ప్రత్యేక ఆఫీసర్లు
అంతా మీకోసమనే తెల్ల కాగితాలు
అయినా కడుపు నిండని బ్రతుకులు
వారంతా ఓటర్లు... అంతే..
కానీ...
అవి... వేట నేర్చిన చేతులు
తిరగబడితేనే బ్రతుకని అనుకుంటే
కలసి... ఉరికితే... తల వంచేను
అవధులు లేని అవధి అయినా....
మరి.....

కథ



# చివరికి " అదే " గెలిచింది

జి .విజయకుమార్

సుబ్బారావు పట్టె మంచం మీద ఇటూ దొర్లుతున్నాడు కానీ..నిద్ర పోవడం లేదు. కాదు.. కాదు నిద్ర పట్టక నరక యాతన అనుభవిస్తున్నాడు.. నెల రోజులుగా.సకల సౌకర్యాలు ఉన్న అతని గదిలో అది  దొంగలా దూరింది.ఎక్కడో మూలన నక్కింది.రాత్రిళ్లు మనశ్శాంతి లేకుండా చేస్తోంది.

బతుకు బాటలో ..అన్ని రంగాలలో గెలిచి..నేడు సౌకర్యవంతంగా.. ఆత్మ సమృద్ధితో జీవిస్తున్న సుబ్బారావు జీవితంలో నేడు..అశాంతి.. అసహనం.. ఆందోళనలు నిత్య కృత్యంగా మారింది.

ఇంటా బయటా.. సుబ్బారావు కు గౌరవమే.అడపాదడపా అభినందనలు.. అంతులేని.. అభిమానాలు..ఆనందకరమైన జీవనం సాగిస్తున్నాడు.కానీ..ప్రస్తుతం చీకటి పడితే.. నిద్ర లేనికాళరాత్రి కరాళ నృత్యాలే. సుబ్బారావు బతుకును చిందర వందరచేసిన...అది ..ఓ అల్ప జీవి.ఇసుమంతైనా లేని..ఓ  పాడు( డే) దోమ..!

వినడానికి, చదవడానికి వింతగా హాస్యం గా ఉన్నా..ఇది నిక్కచ్చి నిజం.ఎవరు నమ్మినా ..నమ్మక పోయినా. ఓ పాడు దోమ..సుబ్బారావు పడక గదితిష్ట వేసింది.శుభ్రంగా తిని.. నడుంవాల్చగానేనిద్రా దేవి కరుణించే వేళ..అతని అసలుకష్టాలు మొదలవుతున్నాయి.

అర కొర నిద్రా సమయంలో.. చెవి చెంత సన్నటి దోమ సంగీతం. మొదట లైట్ గా తీసుకొన్న సుబ్బారావు బాధలు దిన దినప్ర వర్తమానంగా మారింది.

దుప్పటిని నిండుగా కప్పు కొని.. నిద్రకు ఉపక్రమిస్తే.. క్రమక్రమంగా అర్ధ రాత్రి వేళకు దోమసంగీతం.. కర్ణ కఠోరంగా మారింది. సహజంగా సంగీత ప్రియుడైన.. సుబ్బారావు.. లలిత సంగీతంఅంటే చెవి కోసుకొనే సుబ్బారావు.. దోమ అరపులను తట్టుకోలేక రాత్రంతా.. నిద్ర లేముతో దోమను తోలుతూ గడిపి..తెల్లారింతర్వాత..మద్రాస్ ఐస్.. వ్యాధి సోకిన వాడిలా తయారయ్యాడు.ఆఫీసు కు వెళుతూ..భార్యను పిలిచి తన పడక గదిలో దోమల మందుపెట్టమనిపురాయించి.. వెళ్లాడు.

మొదటి రోజు రాత్రి.. పడక గదిలోఘాటు వాసన..చూస్తే మంచం కింది మస్కెటో కాయలు పొగలు కక్కుతోంది. తొలిసారి కాస్త ఇబ్బంది పడ్డా .....దోమ బాధ తీరుతుందని కుదుట పడ్డాడు. అర్ధరాత్రి వరకు హాయిగా నిద్ర పట్టిందిసుబ్బారావు కి. ఆపై.. సన్నగా..పీలగా..ఘీంకారంగా అతని నిద్రను..కంటున్న కలనుచెదరకొట్టింది.

మళ్లీ..అదే దోమ..పాడు దోమ..! ఆశ అడి ఆశై..నిద్రకరువై..గుండె బరువై.. కొరివి దయ్యం లా మేల్కొనే ఉన్నాడు అతను.

మరుసటి రోజు.. మరో మేధావి ఫ్రెండ్ బోడి సూచన మేరకు ఒడోమాస్ క్రీమ్ కొనుక్కొని ఒంటికి..రెంటికి పూసుకుని.. ( దుప్పటి ) మూసుకొని నిద్రకు ఉపక్రమించాడు.

ఆ క్రీము కంపు దుర్గంధం లా ఉంది. దోమ సంగతి దేవుడెరుగు. సుబ్బారావు కే డోకు వచ్చింది.అర్ధరాత్రి దాటినా.. దాని ; ఉనికి, సంగీతం కానలేదు.. వినపడలేదు.రాత్రి రెండు గంటలకు ..అది..తీరిగ్గా వాయిద్య కచేరీ మొదలెట్టింది.

దిక్కు తోచని సుబ్బారావు ఎవరేమి చెప్పినా పాటించడం మొదలెట్టాడు దెయ్యం పట్టిన వాడిలా. ఒకరు.. దోమల బ్యాటు పని చేస్తుంది అంటే కొని చార్జ్ పెట్టి ట్రై చేశాడు. మరొకరు.. ఫారిన్ టూ ఇన్ ఒన్ మస్కెటో రాకెట్ సూపర్ అంటే విదేశాలలో ఉన్న కొడుకు కు చెప్పి ప్రయోగాలు చేశాడు. ఫలితం శూన్యం.

విసిగిపోయిన సుబ్బారావు కు పనమ్మాయి ఓ నాటు చిట్కా చెప్పింది.

నిప్పుల కుంపటి లో పచ్చి వేపాకు వేసి మంచం కింద పెట్టమని.

ఆ ఘాటుకు సుబ్బారావు కు నిద్ర కరువు. అది మాత్రం యధావిధిగా కచేరి మొదలెట్టింది.

మరెవరో..మంచి నీళ్ల మూకుడులో పచ్చ కర్పూరం పెట్టమన్నారు.. మంచి సువాసన వచ్చింది..దాంతో బాటు ఆ ;దోమ కూడా. మునిసిపల్ కార్పొరేషన్ హెల్త్ ఆఫీసర్‌గా ఉన్నఫ్రెండ్ తో చెప్పి..ఫాగింగ్ చేయించాడు. పనిలో పనిగా.. బ్లీచింగ్ కూడా చల్లించాడు. నో..యూస్..మందులకు అడిక్ట్ అయినట్టు..మ్యుటేషన్ తో ముదిరి పోయినట్టు..ఆ దోమ చిరాయువుగా బతికే ఉంది.

సుబ్బారావు కే చచ్చినంత పనైంది. ఈ లోగా క్రెడిట్ కార్డు నుంచి మెసేజ్ వచ్చింది.

మొత్తం నలభై తొమ్మిది వేలు వెంటనే కట్టమని.

అవును..మరి సుబ్బారావు దోమను చంపడానికి ఉపయోగించిన ఆయుధాల తాలూకు.

బిత్తర మొహం వేసుకుని కూర్చున్న సుబ్బారావు తో ...ఆయన సతీమణిఓ అద్భుతమైన సలహా ఇచ్చింది. ఆ రాత్రి .....సుబ్బారావు ధీమాగా నిద్రకు ఉపక్రమించాడు. ఫ్యాను ఫుల్ స్పీడ్ లో పెట్టుకుని,కంబళి ఒంటి నిండా కప్పుకుని ...!
చాన్నాళ్ళకి సుబ్బారావుకి హాయిగా నిద్ర పట్టింది . ఆ దోమ ఉందో ...చచ్చిందో అని ......!
అతని మనసు చెబుతోంది...ఆ పా (డు)డే’దోమ ఇంకా బతికి ఉందని ,తన రక్తాన్ని రుచి చూడడానికి వేచి చూస్తోందని ....!

★★★★

# ఇది చాలదూ?!!

అగస్త్యప్రగడ హేమంత

ఎన్నటికీ వాడని
నవ్వుల పువ్వుల్ని
దోసిళ్ళతో ఎత్తి దాచుకుంటాను!
రేయంబవళ్ళూ నా పైనే ఉండే
ఆ కన్నుల వెన్నెల్లో
ఆటలాడుకుంటాను!
వలపుల వసంతాలూ,
మధురోహల పవనాలూ,
పలుకుల తేనెల వానల్లో,
కురిసే వలపు సోనల్లో
తడిసి ముద్దయ్యే క్షణాలూ,
లోకాన్నే మరపించేంతటి
ముద్దు, మురిపాలూ!
ఇన్నిటినీ అందించే తనని...
"నీకేం కావాలీ?"... అనడిగితే...
చెప్పిందేవిటంటే...
"నీ తోడే చాలు!
జన్మజన్మాలూ!"... అని!
ఇది చాలదూ జీవితానికి!
అసలు... ప్రేమంటే... ఇది కాదూ?



# ఆంజనేయులు -అమెరికా రిటర్న్

ధారావాహిక



## ఎపిసోడ్ –6 తోఫా కా తుఫాన్

ఆంజనేయులు ఈ సారి ఇండియా వెళ్ళినప్పుడు ఏదో ఒకటి గట్టిగా ప్లాన్ చేసి డబ్బుకి ఉబ్బు పేరుకు పేరు సంపాదిం చాలని నిర్ణయం తీసుకున్నాడు. ఇదే విషయాన్ని తన తింగరి బ్యాచ్ కూడా తెలియ చేశాడు. వాళ్లందరూ ఓరోజంతా బుర్రలను గోడ కేసిగట్టిగా కట్టుకున్నా ఒక్క ఆలోచన కాదుగదా , ఒక్క ఇసుక రేణువు కూడా రాలలేదు. అప్పటికి గాని వాళ్ళకు అర్ధం కాలేదు తమవి వట్టి మట్టి బుర్రలని.

చివరికి ఊళ్ళో ఓపెద్దాయన్ని సలహా కోసం అడిగితే, 'ఓస్, ఇంతేనా ఏముందిరా. ఎలక్షన్లలో నిలబడితే సరి .. డబ్బుకు డబ్బు... పేరుకు పేరు . "అంటూ శలవిచ్చాడు

'నిజమే అనుకో...ఏదోఒక పార్టీమనవాడికి టిక్కెట్టు ఇవ్వాలిగా... .... ఇచ్చినా మనవాడు గెలవాలిగా... మనోడేమో ఇక్కడ వుండడాయే , చుట్టపు చూపుగా వచ్చిపోతుంటాడు.. ఎలా? "

"డబ్బులు ఉండాలే గాని .. ఇవన్నీ చాలా చిన్న విషయాలు "

"చిన్న విషయాలా ? 'అర్థంకెలేదు . . "అన్నాడు కోతి మూకలోని ఓ కొండ ముచ్చు

# ధారావాహిక

"అవున్రా అబ్బి , ఏముంది రాష్ట్రానికోసముద్రం. జిల్లాకోనది, ఊరికో కాలువ, విధికో చెరువు, ఇంటికో కుళోయి ఏర్పాటు చేస్తే మీవాడి పేరు మారుమోగి పోతుంది, దాంతో ఆ పార్టీల వాళ్ళే మీవాడి వెంట పడతారు టిక్కెట్టు ఇస్తామని "అంటు చావు కబురు వ చల్లగా చెప్పాడు

"ఇవన్నీ జరిగేవి కావుకాని పదరాపోదాం" అంటు అక్కడ నుంచి కదిలారు

జరిగింది మొత్తం ఫోన్ చేసి ఆంజ నేయ లకు చెప్పారు. అంతా విన్న ఆంజనేయులికి నీరసం వచ్చినంత పనైంది. కాని అంతలోనే మెరుపు లాంటి ఆలోచన వచ్చింది. అటువంటి ఆలోచన వచ్చినందుకు తనని తనే మెచ్చుకుంటూ, ఇండియాకు ప్రయాణం కట్టాడు.

★★★ ★

మన వాడు ఇండియా చేరుకోగానే, తనకోతి మూకను పోగేసి తన ఆలోచన వాళ్ళ ముందు ఉంచాడు.

తమకి అటువంటి అద్భుతమైన ఆలోచన రానందుకు తమని తామే తిట్టుకున్నారు. అలాంటి ఆలోచనలు వస్తాయి కాబట్టే ఆంజనేయులు అమెరికా వెళ్ళాడు, తామింకా ఇక్కడే వున్నాము అని సరిపెట్టుకున్నారు.

డిసెంబరు,జనవరి మాసాలలో లో క్రిస్మస్ తరువాత సంక్రాంతి పండగలు ఒక దాని తరువాత వస్తాయి కాబట్టి, అప్పుడు నియోజక వర్గంలోని పెద్దలందరికీ ఉచితంగా పండుగ కానుకలిస్తే తన పేరు మారు మో) గిపోతుందని ,దాంత ఏదో ఒక పార్టి పిలిచి టిక్కెట్టు చచ్చినట్టు ఇస్తుందని తన స్నేహితులకు చెప్పాడు

.

"అవును... అవును "అంటూ ఖాళీ బుర్రలు తెగ ఊపారు .వెంటనే ఏర్పాట్లు చెయ్యటానికి ముందుకు దూకింది కోతి మూక.



పండగ కానుకలు ఆడవాళ్ళకు మాత్రమే ఇవ్వాలని నిర్ణయించారు. ఎందుకంటి ఇంట్లో ఆడవాళ్ళకు ఇస్తే ఇంటిల్లి పాదిని వాళ్ళే ఓట్లు వేయిస్తారు. అందుకనే ప్రతి పార్టీ ఆడవాళ్ళకే ఎక్కువగా తాయిలాలు ఇస్తూ వుంటుంది.

ఆడవాళ్ళకు కాబట్టి చీర జాకెట్టు , అరడజను గాజులు, పసుపుకుంకమ, ఓ స్వీట్ పాకెట్ ఇవ్వాలని నిర్ణయించారు. వీటన్నిటిని ఓ సంచీలో పెట్టి ఇస్తే బాగుంటుందని అనుకున్నారు. కనీసం ఒక్కో కానుక రెండు వందలన్న లేనిదే రాదని అర్ధమయ్యింది .

నియోజక వర్గంలో మొత్తం ఏభైవేల మందిపైనే ఆడవాళ్ళు వున్నా రని తేలింది. అందరికీ కానుకలిస్తే కోటి రూపాయల దాకా అయ్యేటట్టుంది అని ఆంజనేయులు వెనకడుగు వేసాడు.

"అందరికీ ఎందుకిస్తామన్నా, నాలుగైదు వేల ముందికి ఇచ్చి, అందరికీ ఇచ్చాం అని చెపుతాం ఎవరు చూడోచ్చారు" ఓ అరగుండు వెధవ సలహా ఇచ్చాడ

అదేదో బ్లాగానే వుంధని ఓ పదిలక్షలుఖర్చు పెట్టి, ఐదు వేల కానుక సంచులు తయారు. చేయటానికి పూనుకున్నారు.

ఓ పెద్ద బహిరంగ సభ ఏర్పాటు చేసి కానుకలన్ని , అక్కడ ఇస్తే భారీ ఎత్తున ప్రచారం వస్తుందని మరో పావలా మెదడు స్నేహితుడు సలహా ఇవ్వటంతో అందరూ దానికి ఓకె అనేసారు

.

ఆంజనేయులు అర్ధ రూపాయి ఖర్చుపెట్టి అరవైరూపాయలు ప్రచారం కోరుకునే రకం. సంచిమీద రెండు పక్కల తన ఫోటో వేయించుకున్నాడు. సంచి ఖరీదు వంద రూపాయ లైతే లోపల సామాను మరోవందరూపాయలతో సరిపెట్టారు. తక్కువకు వస్తాయని చీర జాకెట్లు 'సూరత్ నుంచి తెప్పిస్తే ఆరు మూరలు ఉండాల్సిన చీర

మూడు మూరలు కుడా లేదు. బాకెట్టు ముక్క పట్టుకుంటే పిగిలి పోయేటట్టు వుంది.అయినా విప్ప దీసి ఎవడు చూస్తాడులే అని వాటిని సంచిలో తోసేసారు.

స్థానిక ఎమ్ఎల్యేను బహిరంగ సభకు పిలవాలని చూశారు కాని, ఆంజనేయులి ఆలోచన గ్రహించిన ఎమ్ ఎల్యే , రేపు తన సిటుకు పోటీ వస్తాడని సున్నితంగా రాలేనని చెప్పి తప్పుకున్నాడు.ఎవరన్నా సినిమా హీరోయిన్ చేత కానుకలు ఇప్పిస్తే ఇంకా పెరుస్తుందని వాకాబు చేసారు . వాళ్ళు లక్షల్లో డిమాండు చెయ్యటం తో ,చివరకి, అట్టే చేతిలో సినిమాలు లేని ఓ హీరోయిన్ చేత కానుకలు ఇప్పిస్తే ఖర్చు తగ్గుతుందని వస్తుందని ఆలోచన చేశారు. ఆంజ నేయులు ఇచ్చే పారితోషకానికి ఆ హీరోయిన్ ఒప్పుకుంది.

బహిరంగ సభ ముందురోజు అన్ని న్యూస్ పేపర్లలో పెద్ద ఎత్తున కానుకల పంపిణీ గురించి ప్రచారం నిర్వహించారు.

★★★

కానుకాలు పంపిణీ చేసే రోజు రానే వచ్చింది. సభ ఏర్పాటు చేసిన ప్రాగంణం మొత్తం ఇసక వేస్తే రాలనంత జనంతో నిండిపోయింది. వాళ్ళందర్నీ చూసి ఆంజనేయులు తన ఆలోచన ఫలించినందుకు లోలోపల సంబర పడిపోయాడు .

తనకు పెద్ద ఎత్తున ప్రచారం వస్తోందని, త్వరలో ఎం ఎల్యే అవ్వబోతున్నాన్నని పగటి కలలు కనటం ప్రారంభించాడు .

కాని అక్కడ జరిగింది వేరు . కానుకలు పరిపణీ మొదలయ్యే వరకు నిశ్శబ్దంగా వున్న జనం, పంపిణీ మొదలవ్వగానె ఒక్క సారిగా తోసుకుంటూ, వేదిక మీదకు దూసుకొచ్చారు. ఆదెబ్బకు వేదిక మొత్తం కూలి పోవటం, వేదిక మీద వున్న వాళ్ళందరూ గాయ పడటం జరిగిపోయాయి .

అక్కడ పోలిసు బందోబస్తు లేకపోవటం , క్యూ లైన్లు సరిగా లేకపోవటం తో జనం ఎవరి ఇష్టం వచ్చినట్లు వాళ్ళు తోసుకుంటూ ,వేదిక మీద వున్న కానుకల సంచులను ఎవరి చేతికి చిక్కినవి వాళ్ళు తీసుకుని పోయారు. ఆ గందరగోళంలో అసలేం జరుగుతుందో ఎవ్వరికీ అంతుబట్టలా. ఆతోపులాట లో ఊపిరాడక ఒకరిద్దరు మహిళలు సొమ్మసిల్లి పడిపోయారు . చాలామంది గాయ పడ్డారు . అక్కడ ఎవరి గోల వల్లడీలా తయారయ్యింది . ఏడుపులు పెడబొబ్బలు , హాహాకారాలతో సభా ప్రాంగణం హోరెత్తింది . దాంతో మన కోతి మూకకు భయం వేసి అక్కడనుంచి చల్లగా జారుకున్నారు .

★★★

మర్నాడు పేపర్ల నిండా జరిగిన ఘోరం గురించి తాటి కాయంత అక్షరాలతో వార్తలు ప్రచురించారు. దీనకంతటికీ కారకుడైన ఆంజనేయులును అరెస్టు చెయ్యాలని ప్రతిపక్షాలు, మహిళా సంఘాలు దుమ్మెత్తి పోశాయి. పోలీసులు ఎక్కడ కేసుపట్టి బొక్కలో తోస్తారో అని గాయపడ్డ వాళ్లకు భారీ ఎత్తున డబ్బు ముట్ట చెప్పాడు.పోలీసులకు కూడా భారీగానే ముట్ట చెప్పాల్సి వచ్చింది . పనిలో పని అని , లోకల్ ఎం ఎల్యే కుడా అంజ నేయులను బెదిరించి భారి మొత్తాన్ని గుంజాడు.

చివరికి ఆంజనేయులు లేని పేరు కోసం పాకులాడి వున్న పేరు, డబ్బు పోయిందని ఉసూరు మంటూ అమెరికా కి తిరుగు ప్రయాణం కట్టాడు .

★★★★★

క్రైం సీరియల్

సీరియల్




# రక్షకుడు



డా.సి.ఎస్.జి .కృష్ణమాచార్యులు

నీహారిక మదిలో ఎన్నో ఆలోచనా తరంగాలు. ఒక దానికొకటి పోటీ పడుతూ ఆమె మదిని కల్లోల పరుస్తున్నాయి.

అక్షయ్. నేను మాత్రమే అక్షయ్ ని నమ్ముతున్నాను. నా స్నేహితులు, నా తండ్రి, అక్షయ్ ని ఒక మోసగాడని విశ్వసిస్తున్నారు. అక్షయ్ పొందు కోసం ఆడపిల్లలు తహతహ లాడుతారని, అతడు స్వేచ్ఛగా వారితో రిసార్టులకు, హోటళ్ళకు వెడతాడనీ తెలుసు. అక్షయ్ ప్రేమ పట్ల తనకున్నసందేహాలను వ్యక్తపరచిన ప్రతి సారి. అతడు ఎంతో ప్రేమతో బుజ్జగించి, నమ్మకాన్ని నిలబెట్టే మాటలు చెబుతాడు.

“ డార్లింగ్! నీ అదృష్టానికి వాళ్ళు అసూయ పడుతున్నారు. రేపు ఒక అంతర్జాతీయ ఖ్యాతి పొందిన కళాకారుని భార్యగా నీ కెంత గౌరవముంటుందో వూహించు. నీతో పెళ్ళి కావడం ఆలశ్యం, అందరికీ టాటా చెప్పేస్తా, నీ తోడిదే నా లోకం, నీవే నా రతీ దేవివి”

అక్షయ్ చెప్పే మాటలు నీటి మూటలేనా? అతనితో జీవితం గురించి నేను కనే కలలు కల్లలవుతాయా?

మాధవ్. అసిస్టెంటు ప్రొఫెసరుగా మంచి పేరున్నవాడు. అతను నాన్న స్నేహితుని కొడుకు. శిష్యుడు .

## క్రైం సీరియల్

**జరిగిన కథ:**
నీహారిక , మాధవ్ ను తన స్నేహితురాళ్ళకు పరిచయం చేస్తుంది .మాధవ్ తన గురువు గారి మాట కాదనలేక నిహారిక మెడలో తాళి కడతాడు . కాని నీహారికకకు ఆ పెళ్లి ఇష్టం ఉండదు,ఆక్షయ్ ని ప్రేమిస్తుంది .నీహారిక ఆస్తికి మాధవ్ రక్షుడిగా నియమిస్తాడు అతని మాస్టారు .నిహారిక తాను ప్రేమించిన ఆక్షయ్ స్వార్ధపరుడని తెలిసి అతన్ని వదిలేస్తుంది . నిహారిక మాధవ్ ణి పెళ్లి చేసుకోటానికి ఒప్పుకుంటుంది.

**ఇక చదవండి**

అందువల్ల నాన్నకు, విధేయుడిగా వున్నాడు. ఆ విధేయత, నాన్న చనిపోయాక నాయందు చూపిస్తాడా? ఒక వేళ, నాన్ననమ్మినట్లు, అక్షయ్ నన్ను మోసగిస్తే, ఇతనే భర్తగా బాధ్యత తీసుకుంటాడా, లేక నా ఆస్థి నాకు యిచ్చి వెళ్ళిపోతాడా? నిన్న నా స్నేహితులుకూడా అతని మాయలో పడిపోయారు. ఏం జరుగుతుందో?
మేనత్త. "ఆమె దేవత కాదు. నిన్ను మోసం చేసింది. అమ్మగురించి, నా గురించి తప్పుడు మాటలు ప్రచారం చేసింది", అని నాన్న వాదన. నాన్న ఎన్నో సార్లు అమ్మను చూడడానికి రమ్మని పిలిచినా తను వెళ్ళలేదు. అమ్మ వస్తానంటే, రావద్దు, పరీక్షలున్నాయని అబద్ధాలతో ఆమెను రానివ్వలేదు. ఆమె వచ్చినప్పుడు ఆమెతో మనసు విప్పి మాట్లాడలేదు. ఇప్పుడనిపిస్తోంది. తప్పు చేసానా అని. అసలు విషయమేమిటి? ఎందుకు అమ్మ వెళ్ళిపోయింది? ప్రేమికునితో రొమాన్సుకా? అతనికి సహాయంగా వుండడానికా?
నాన్న. అసమర్ధుడా? తనకి తెలిసి ఆయన భార్యను ఎంతగానో ప్రేమించాడు. అమ్మనాన్నలను చూస్తూంటే, సీతా రాములను, రాధా కృష్ణులను చూసినట్లు వుండేది. అలాంటిది," అమ్మ తన స్నేహితునికి సహాయం చెయ్యడానికి అతని దగ్గర వుంటుంది. మనం అప్పుడప్పుడు వెళ్ళి చూడ వచ్చు" అని నాన్న ఎలా చెప్పగలిగాడు? స్నేహితునికి కాళ్ళు విరిగితే అమ్మ ఎందుకు అక్కడ వుండాలి? కూతురు కన్నా, భర్త కన్నా స్నేహితుడే యెక్కువా?
అలోచనల సుడిగుండం లో చిక్కువడిన ఆమె అలసిపోయింది. నేరుగా కల్యాణి దగ్గరకు వెళ్ళింది. డిపార్టుమెంటు లైబ్రరీలో కూర్చుని పుస్తకం చదువుతున్న కల్యాణి, నీహారికను చూసి బయటికి వచ్చింది.
" కల్యాణీ! రా కాఫీడేకి వెళ్ళి కాఫీ త్రాగాలి. బుర్ర పగిలిపోతోంది."
"ఏమైంది బుర్రకి?
"ముందు రా అక్కడ చెప్పుకుందాం"
అంటూ నీహారిక కల్యాణి చేయి పట్టుకుని ముందుకు నడిచింది.
ఇద్దరూ కాఫీడేలో ఒక మూల కూర్చున్నారు. అక్కడ వాళ్ళిద్దరే వున్నారు.
"ఇప్పుడు చెప్పు. ఏమైందీరోజు ? "
"మాధవ్ తో పెళ్ళికి ఒప్పుకున్నాను"
" గుడ్. మరి అక్షయ్ కి చెప్పావా?"
"చెప్పాను. చేసుకోమన్నాడు. బెర్క్లీలో (అమెరికాలోని సంగీత కళాశాల) తన కోర్సు పూర్తయ్యాక వస్తా నన్నాడు ."
" అంటే మాధవ్ ని కరివేపాకులా తీసి పడేస్తారన్న మాట"
"అలా వుండడానికి అతనే ముందుకు వచ్చాడు."
"అతను రాలేదు. మీ నాన్న రప్పించాడు. నీ ఆస్థిని కాపాడలేని అక్షయ్ నీకు అవసరమా?"
"నువ్వు అక్షయ్ వైపు ఆలోచించు. అతను చదువు, ప్రోగ్రాములతో ఎంత బిజీగా వున్నాడో మనకు తెలుసు. అలాంటి వాడిని లాయర్లతో, కోర్టు కేసులతో ఎందుకు ఇబ్బంది పెట్టాలి? అవసరానికి సహజీవనం చేసినట్లే, ఈ పెళ్ళి"
" నాకెందుకో ఇందులో ఒక అపశ్రుతి వినబడుతోంది. ఏదైనా మాధవ్ అన్యాయమై పోతున్నాడు."
"అది అతని స్వయం కృతాపరాధమే. నేను ఈ పెళ్ళి చేసుకోను అని చెప్పవచ్చు కదా? నేను అతనిని ఇష్టపడనని తెలిసీ అతను ఈ బాధ్యత తలకెత్తుకున్నాడు. క్షీర సాగర మధనం వేళ, శివుడు హాలాహాలం త్రాగితే, లక్ష్మిని మహా విష్ణువు

స్వీకరించాడు. అలాంటిదే ఇది కూడా.
"
కల్యాణి సాలోచనగా నీహారిక వైపు చూసింది. కాఫీ త్రాగుతున్న మిషతో ఆమె మౌనంగా వుండిపోయింది. ఆమెకు ఒక విషయం అర్థమైంది. వేటగాడి వలలో లేడిపిల్ల చిక్కుకుంది. ఆ వలను అది స్వర్గధామమని నమ్ముతోంది. మాటలతో విషయం అర్థం కాదు. అనుభవ పూర్వకంగానే వాస్తవాలు బోధపడాలి. అంత వరకు నీహాను కాపాడుకోవాలి. ఆ వుద్దేశ్యంతో నీహారికను కొన్ని ఆంతరంగిక విషయాలను అడిగి తెలుసుకోవాలనుకుంది.

" నీహా! నీకు అభ్యంతరం లేకపోతే కొన్ని ప్రశ్నలడుగుతాను చెప్తావా?"

"అడుగు. నేను నీ దగ్గర ఏదీ దాచాలనుకోవడం లేదు."

"గుడ్. అక్షయ్ నీతో సెక్సుకు సంబంధించిన చర్చలు జరిపాడా?"

"అంతగా లేదు. కొన్ని విషయాలు చెప్పబోతే నేనే ఆ మాటలు ఇప్పుడెందుకని చెప్పాను".

"నీకు వీడియో కాల్ చేసినప్పుడు, తన శరీరాన్ని చూపించాడా? "

" ఒక సారి చూపడం మొదలుపెట్టాడు. నేనే వద్దన్నాను"

"నిన్ను చూపమన్నాడా?"

"ఆ! ఒక సారి బాగా బ్రతిమిలాడుకున్నాడు. టాప్ తీసాను కానీ, ఏడుపు వచ్చేసింది. ఎందుకింత బలవంత పెడుతున్నావని యేడ్చేసా! అప్పుడు అతను వద్దు బ్రా తీయకు, అలాగే వుండనీ అని కాల్ ముగించాడు. అతనికి ఆశాభంగమైందనుకుంటా. రెండు రోజులు మాట్లాడలేదు. "

" అతను ఎప్పుడైనా నీ రిసెర్చ్ గురించి అడిగాడా?"

" లేదు. అతనికి అంత అసక్తిలేదు. కానీ చెబితే వింటాడు. అతనికి పరిశోధనలో వుండే ఎత్తు పల్లాల గురించి తెలియదు కదా!"

"బాగుంది నీహా! ఏడ్చి మంచి పని చేసావు. ఎప్పుడూ నీ శరీరం నీ అధీనంలో వుండాలి. ఇందులో మొగమాటమన్నది వుండకూడదు. అతడు సెక్స్ గురించి మాట్లాడితే సిగ్గు పడకుండా విను. అతడు అతని ఆలోచనలు, ప్రయోగాలు నీకు చెప్పే ప్రయత్నం చెయ్యవచ్చు. ఖచ్చితంగా అతను వికృత సెక్స్ చేష్టలకు అలవాటు పడి వుంటాడాని నా అనుమానం. అది తెలుసుకోవాలి."

"వికృత చేష్టలంటే?"

"ఆదేనే. ఫిఫ్టీ షేడ్స్ ఆఫ్ గ్రే పుస్తకం చదివావు కదా. అవే"

" నేను చదవలేదు. బోరు కొట్టింది"

"నా తల్లే! నీ కావ్యాల్లో వుండే శృంగారం అక్షయ్ తో నీకు కనబడదు. అలా సున్నితగా వుంటుందని నువ్వు పడకెక్కితే, అల్ల కల్లోలమే."

నీహారిక బుగ్గలు ఎరుపెక్కాయి.

"నేనేమంత అమాయకురాలిని కాదులేవే"

"అవునో కాదో! అవతలివాడు అక్షయ్ అయినా మన్మధుడైనా నీ వీడియోలు బయటకు రాకుండా చూసుకో."

"అలాగే " అంటూ, నీహారిక లేచింది. స్నేహితురాలితో ఎన్నో విషయాలు పంచుకోవడం వల్ల ఆమె శిరో భారం తగ్గింది. ఆమె వుల్లాసంగా బయటకు నడిచింది.

@@@@

ఏప్రియల్ 22, సోమవారం ఉదయం 11 గంటల, 55 నిమిషాలకు వివాహ ముహుర్తం నిశ్చయమైంది. ముహుర్తం గురించి తెలియగానే, మైత్రేయి స్నేహితులతో సరదాగా యిలా అంది.

"సోమవారానికి ఆధ్యాత్మిక, లౌకిక విశిష్టతలున్నాయి. హిందూమతంలో సోమవారం శివునికి ప్రీతికరమైనది. సోమ అనే శబ్దానికి " చంద్రుడు" అనే అర్థమే కాక, స+ ఉమ అనగా ఉమా సహితుడు అని శివపరమైన అర్థము చెప్పవచ్చు. అంటే చంచలమైన చంద్రుడు మన నీహారిక, స్థిరమైన గరళ కంఠుడు మన మాధవ్. లౌకికంగా వారంలో అది మొదటి పని దినం కావడంతో నూతన కార్యాలకు అది అనువుగా వుంటుంది. ఆ రకంగా వీరి జీవితానికి తొలి దినంగా చక్కగా కుదిరింది".

అయితే ఈ వివరణ నీహారికకు నచ్చలేదు. మీరు అతిగా ఆలోచిస్తున్నారని చికాకు పడింది. వివాహ పత్రిక అందుకున్న ప్రొఫెసర్లందరూ వెంకట రమణ దగ్గరకు వచ్చి సంఘీభావం ప్రకటించారు. వెంకటరమణ సంతోషంతో " మీరంతా నాకు తోడుగా నిల్చి ఈ శుభకార్యం జరిపించండి. వధూవరులను ఆశీర్వదించండి" అని ఆహ్వానించాడు.

ఆయన అనందాన్ని ఇనుమడింపచేస్తూ, ఆయన చెల్లెలు, తమ్ముడు సకుటుంబంగా వచ్చారు. వచ్చిపోయే వారితో యిల్లంతా సందడిగా మారింది. మాధవ్ దగ్గరలో వున్న అపార్టుమెంటుల్లో

## క్రైం సీరియల్

ఖాళీగా వున్నమూడింటిని వాటి యజమానులనడిగి తీసుకున్నాడు. అక్కడ వసతి సౌకర్యాలు యేర్పాటు చేసాడు. అందువల్ల వెంకట రమణకి ఎటువంటి ఇబ్బంది లేకుండా పోయింది. ఆయన ప్రశాంతంగా విశ్రాంతి తీసుకోవడానికి, చెల్లెలు, తమ్ముడుతో మాట్లాడుకోవడానికి వీలైంది.

రాత్రి భోజనాలైనాక, వెంకటరమణ, ఎదురు చూసిన సంభాషణ మొదలైంది. ఆయన చెల్లెలు, తమ్ముడు ఆయన చెంత కూర్చుని, తమ కోరికల జాబితా వెల్లడించారు.

"అన్నయ్యా! నా కుటుంబం సంగతి తెలుసుకదా! ఆయన సంపాదన బొటా బొటీగా మేం బ్రతకడానికి సరిపోతోంది. అమ్మాయి చదువుకు సహాయం చేసావు. ఇంక పెండ్లి వుంది. చూస్తున్నావుగా ఈ రోజుల్లో వివాహం అంటే ఎంత ఖర్చుతో కూడుకున్నదో. ప్రి వెడ్డింగ్ షూట్, నిశ్చితార్థం, సంగీత్, పెళ్ళి, హనీమూన్ ఇలా ఎన్నో అంశాలతో పెళ్ళి ఒక బృహత్కార్యక్రమమైంది. కట్నాలు వద్దంటూనే లాంఛనాల పేరిట గుంజేస్తున్నారు. నువ్వు నా బిడ్డ పెళ్ళికి సహాయం చేయకపోతే ఎవడో ఒకడి కిచ్చి గుళ్ళో జరిపించాల్సిన దుస్థితి నాది" అంటూ ఆయన చెల్లెలు రమణి కన్నీళ్ళు పెట్టుకుంది.

ప్రక్క గదిలో వున్న నీహారిక నిశ్శబ్దంగా ఈ సంభాషణ వింటోంది. ఆమెకు తండ్రి ఏమంటాడోనని కుతూహలంగా వుంది.

"అమ్మా ప్రతి సంవత్సరం లక్ష రూపాయలకు తక్కువ కాకుండా నీకు పంపుతూ వున్నాను. అందులో కొంత దాచుకుని పెళ్ళికి ఖర్చు చేస్తారని అనుకున్నాను. నువ్వు చెప్పినట్లు బావ సంపాదన అంత తక్కువేమీ కాదు. ఆయన పియఫ్ లోన్ తీసుకుని పెళ్ళి చేస్తానని చెప్పాడు. కూతురు పెళ్ళి చేయలేని అసమర్థుడు కాదు నీ భర్త. నా సాయమడిగి ఆయనను చిన్నబుచ్చడమెందుకు?"

"ఆయన అంతే. పెళ్ళి కూతురు చీరకి యాభై వేలు కావాలంటే పది వేలు చాలంటాడు. అలా నాసిరకంగా చేస్తే అత్తారింట్లో దానికి గౌరవం వుంటుందా?"

" చూడు రమణి, ఎంత చెట్టుకు అంత గాలి. మనం పేద వాళ్ళం. అన్నయ్యలా గొప్పలకు పోకూడదు. ఆయన లక్షల్లో జీతం తీసుకున్న ప్రొఫెసర్. మనది గుమాస్తా స్థాయి" అని వెంకటరమణ తమ్ముడు శేషగిరి నిష్ఠూరంగా అన్నాడు.

వీరి మాటలు వింటున్న నీహారికకు ఒళ్ళు మండింది. ఇన్నాళ్ళూ నాకు వీరు చెప్పిన మాటలు అబద్ధాలే. నాన్న తగినంత సాయం చెయ్యదనిచెప్పేది. తను నిజమే అనుకునేది..శుభమా అని నాన్న నా పెళ్ళి చేస్తూంటే, ఆడబడుచు ఇలా కన్నీళ్ళు పెట్టవచ్చా? నా పెళ్ళికి నేను కట్టే చీర ఖరీదు అయిదు వేలు. ఆ మాటే గొంతెత్తి అరవాలని అనిపించింది ఆమెకు.

వీరి మాటలకు వెంకట రమణ కోపం తెచ్చుకోలేదు. తండ్రి మాట విని చదువుకుని ప్రయోజకుడయ్యాడు తను. వినక చెడు తిరుగుళ్ళు చదివి, ఇలా గుమాస్తా అయ్యాడు శేషగిరి. రమణి కూడా అంతే. చదివిస్తా అంటే, "వద్దు నాన్నా! నాకు పెళ్ళి చేసెయ్యి", అని ఇరవైయేళ్ళకే పెళ్ళి చేసుకుని, అత్తారింటికి వెళ్ళిపోయింది. స్వయంకృతాపరాధానికి బాధ పడక, నన్ను ఎందుకు నిందిస్తున్నారని ఒకప్పుడు అడిగే వాడు. అడిగి ప్రయోజనం లేదని, అర్థమయ్యాక అడగడం మానేశాడు. ఆయన ప్రశాంతంగా వారికి బదులిచ్చాడు.

"ముందు పెళ్ళి కుదరనీ. బావతో మాట్లాడి, అవసరమైన సాయం చేస్తాను.అది కూడా నా బిడ్డే. నువ్వు దిగులు పెట్టుకోకు"

"నాకు తెలుసు అన్నయ్యా నువ్వైనా వదినైనా సహాయం చేస్తారని. ఇప్పుడు దేవత లాంటి వదిన లేదు. ఈ లోగా నీకేదైనా అయితే, మా గతి యేమిటి? నీహారిక చిన్న పిల్ల. నీ అల్లుడు అసాధ్యుడని చెప్తున్నారు. మమ్మల్ని లోనికి రానిస్తాడో లేదో?" అంటూ ముక్కు చీదింది రమణి.

" నాకూ అదే భయం అన్నయ్యా ఏ కష్టం వచ్చినా, నువ్వు వున్నావనే ధైర్యం వుండేది. నీకేదైనా అయితే, మాకు దిక్కెవరు అన్నయ్యా!" శేషగిరి గొంతు గద్గదమైంది.

ఈ హైవోల్టేజ్ డ్రామా వింటున్న నీహారికకు రక్తం సల సల మరిగింది. పెళ్ళి ఇంట్లో చావు ఆలోచనలు, వాటా కోసం అభ్యర్థనలు. ఎంత నీచత్వం! నీహారికకు ఇంకో విషయం బోధపడింది. వీరికి తన మీద, తన సామర్థ్యం మీద యెంత మాత్రం నమ్మకం లేదు. ఆమెలో వాళ్ళను నిలదీయాలన్న కోరిక వుధృతమైంది. సరిగ్గా మాధవ్ అప్పుడే రంగ ప్రవేశం చేసాడు.

# క్రైం సీరియల్

“ పిన్నీ, చిన మామయ్యా, మామయ్య మనసు తెలిసిన మీరిలా బాధ పడటం వుచితం కాదు. ఇది పెళ్ళి వారి ఇల్లు. పిన్నీ, నువ్వు ఈ ఇంటి ఆడబడుచువి, నీ కన్నీరు ఇంటికి శుభం కాదు. నువ్వు లక్ష్మీ దేవిలా నట్టింట తిరిగితే, మామయ్యకు సంతోషంగా వుంటుంది. నీహారికకు తల్లిలేని లోటు తీరుతుంది”.

మాధవ్ మాటలు విన్న నీహారిక ఆశ్చర్యపోయింది. వరుసలు కలుపుతూ, వారికి క్లుప్తంగా, మృదువుగా చెప్పవలసిన మాటలు చెప్పాడు. తను కూడా అవే మాటలు చెప్పాలనుకుంది. కానీ చాలా కోపంగా అరిచి చెప్పాలనుకుంది . ఈ లౌక్యమే నాన్న మెచ్చుకునేది, ఈ లౌక్యమే, నన్నుభయపెట్టేది అని అనుకుంది. ఆమె ఆలోచనలను భగ్నం చేస్తూ, ఇందిర, కల్యాణి గల గల నవ్వుకుంటూ లోనికి వచ్చారు. నీహారిక సంతోషంతో వారిని హగ్ చేసుకుంది. ఇంత వరకు పెద్దవాళ్ళు మాట్లాడుకుంటున్నారని దూరంగా నిలుచున్న నీహారిక కజిన్స్ ఆమె గదిలోకి వస్తూ, “మిస్ నీహారిక, రేపు మిసెస్ అయిపోతోంది, దేవతలార దీవించండి” అని అల్లరి చేసారు. కబుర్లతో, హాస్యంతో, నవ్వులతో, చప్పట్లతో ఆ గది సందడిగా మారింది.

(ఇంకా ఉంది )

# బ్రిటన్ గాట్ టాలెంట్





బ్రిటన్ గాట్ టాలెంట్

బ్రిటన్స్ గాట్ టాలెంట్ లో, అస్సాంకు చెందిన బినితా చెత్రీ అనే తొమ్మిదేళ్ల అమ్మాయి మూడవ స్థానంలో నిలిచింది. ఆమె అద్భుతమైన నృత్య నైపుణ్యాలకు, ముఖ్యంగా బ్యాక్‌ఫ్లిప్‌లకు ,హ్యాండ్‌స్టాండ్‌లకు ప్రసిద్ధి చెందింది. ఆమె ప్రదర్శనలు న్యాయనిర్ణేతలను ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి.

బినితా చెత్రీ బ్రిటన్స్ గాట్ టాలెంట్ 2025లో పాల్గొంది మరియు మూడవ స్థానంలో నిలిచింది. ఆమె అస్సాంలోని కర్బీ అంగ్లాంగ్ ప్రాంతానికి చెందినది. ఆమె నృత్యం, ముఖ్యంగా బ్యాక్‌ఫ్లిప్‌లు మరియు హ్యాండ్‌స్టాండ్‌లతో కూడిన క్లిష్టమైన కదలికలు ఆమెకు ప్రశంసలు తెచ్చిపెట్టాయి. ఆమె ప్రదర్శనలను న్యాయనిర్ణేతలు మరియు ప్రేక్షకులు ఇద్దరూ ఎంతో ఆనందించారు.

బినితా చెత్రీ యొక్క బ్రిటన్స్ గాట్ టాలెంట్ ప్రయాణం ఆమె నృత్య ప్రతిభకు ఒక ఉదాహరణగా నిలిచింది, మరియు ఆమె మూడవ స్థానంలో నిలిచినందుకు ఆమె దేశం గర్వపడుతోంది. గ్రాండ్ ఫినాలే నుండి శ్రీమతి చెత్రీ తోటి ఫైనలిస్టులు, పోటీ విజేత మాంత్రికుడు హ్యారీ మోల్డింగ్ మరియు రన్నరప్ అయిన డ్యాన్స్ గ్రూప్ ‘ది బ్లాక్అవుట్స్’ లతో కలిసి నిలబడి ఉన్నట్లు చూపించే వీడియో క్లిప్‌ను కూడా ఆయన పంచుకున్నారు. ఫైనల్స్ ప్రత్యక్ష ప్రసారం సందర్భంగా, బినితా చెత్రీని రెండవ రన్నరప్‌గా ప్రకటించారు




బాబా  హిందీలోగానీ, ఇంగ్లిష్‌లోగాని ప్రసంగించేవారు.ఆయన  మాట్లాడుతున్నప్పుడు శిష్యులందరూ కళ్ళు మూసుకుని ఉండాలనే నిబంధన ఉండేది. వివాదాస్పద విషయాలపై తన అభిప్రాయాలతో ఎంతో ప్రసిద్ధి పొందారు.ఆయన  అభిప్రాయాలు చాలా వివాదాస్పదంగా ఉండేవి. వాటిని నిషేధించాలని భారత పార్లమెంటులో అనేకసార్లు చర్చలు జరిగాయి. విభిన్నవర్గాల ప్రజలను ఆకర్షించేందుకు ఆయన  అనేక భిన్నమైన సబ్జెక్టులను ఎంచుకునేవారు. ఈయన కోసం వచ్చేవారు మిశ్రమనేపథ్యాలు కలిగి ఉండేవారు. ఆయన ప్రసంగాలు వినడానికి అన్ని వయసులవారు, అన్ని మతాలవారు గుమిగూడేవారు. ఆయనతో పరిచయం ఉన్నవారెవరైనా ఆయన శిష్యుడిగానో, ప్రత్యర్థిగానో ఉండేవారే కానీ ఉదాసీనంగా ఉండేవారు కాదు. త్వరలోనే బాబా  పట్ల ఆకర్షితులైన విదేశీ పర్యటకులు రావడం మొదలైంది. బాబాను ఎవరు కలవాలనే విషయంపై ఆయన కార్యదర్శి లక్ష్మి జాగ్రత్తగా ఉండేవారు. ముందుగా వారందరరినీ ‘ మెడిటేషన్’ లో పాల్గొనమని కోరేవారు. తరువాత వారు బాబాను  కలిసేవారు. సిటీ లో తన ఆశ్రమానికి సంబంధించిన కార్యక్రమాలపై నిఘా పెరిగిందని బాబాకు అనుమానం రావటం తో , తన ఆశ్రమాన్ని గోవాకు మార్చాలని నిర్ణయించాడు .

**జరిగిన కథ:**
సుఖ్ భోగ బాబా అసలు పేరు చంద్ర చంద్ర మోహన్ . చిన్న తనం లోనే తల్లి తండ్రులను కొల్పోవటం తో , అనాధ ఆశ్రమం లో పెరుగుతాడు . చిన్నతనం నుండే ధ్యానం యోగా వంటివి నేర్చుకుని తనదైనా దారిలో బతకటం నేర్చుకున్నాడు . బాబా తన కూతుళ్ళను కిడ్నాప్ చేసాడని ప్రొ గంగాధర్ ప్రెస్ మీట్ పెడతాడు.పోలీసులు బాబా ఆశ్రమాన్ని తనిఖీ చేస్తారు . ప్రొఫెసర్ కూతుళ్ళు తమంతట తామే వచ్చామని చెప్పటం తో చేసేది ఏమి లేక వేనుతిరుగుతారు .బాబా భక్తులకు ప్రసాదం లో మత్తు మంది కలిపి ఇచ్చి వాళ్ళను తన బానిసలుగా చేసుకుంటాడు .

**ఇక చదవండి**

గోవా చేరుకన్నాక, బాబా ఎవరినీ కలవకుండా ఏకాంతంగా ఉండటం మొదలుపెట్టారు. తొలినాళ్ళలో ఆయన ఆశ్రమ తోటలో ప్రజలను కలుసుకునేవారు. తరువాత ఆయనను కలవడం ప్రజలకు సాధ్యం కాకుండా పోయింది. ఆయన తన చుట్టూ బలమైన నమ్మకమైన వారు మాత్రమే ఉండాలని కోరుకునేవారు. తన ఆశ్రమానికి కేవలం ఉత్సుకతతో మాత్రమే వస్తున్నారని గ్రహించిన సందర్భంలో ఆయన చాలా మంది భారతీయులను విస్మరించడం మొదలుపెట్టారు.క్రమేణా విదేశి భక్తుల సంఖ్య పెరుగుతూ ఉండటం తో ఆశ్రమ ప్రవేశ రుసుము కూడా పెంచారు. ఇదే కాకుండా తన భారతీయ అనుచరులను తగ్గించేందుకు ఆయన ఆంగ్ల ప్రసంగాలు ఇవ్వడం మొదలుపెట్టారు. గోవా లో బాబా ఆశ్రమం కారణంగా పర్యటకం పెరిగింది. ప్రపంచపటంలో గోవా గుర్తింపు పొందడానికిఆశ్రమం కూడా కీలక పాత్ర పోషించింది. గోవా ప్రభుత్వం ఆర్థిక స్థిరత్వం తీసుకురావడంతోపాటు నగరానికి అనేక రంగులు కూడా అద్దింది.

ఆశ్రమంలో అనేక థెరపీలు ఇవ్వడం మొదలైంది. దీంతో డబ్బు ప్రవాహంలా వచ్చి పడేది. ఈ థెరపీలన్నింటిలోనూ సెక్స్ థెరపీ చాలా ముఖ్యమైనది. ఇందులో ఎలాంటి పక్షపాతం లేకుండా లైంగికతను ఆమోదించేవారు. లైంగిక విషయాలలో నైతికతకు, కట్టుబాట్లకు ఇక్కడ చోటులేదు. ఎటువంటి ఈర్ష్య, బంధమనే భావన లేకుండా మనం పనిచేయాలని దేవుడు కోరుకున్నాడు. ఈ చికిత్సలలో పాల్గొనేందుకు భారతీయులను అనుమతించేవారు కాదు. ఇలా ఎందుకు చేసేవారో ఎవరికీ అర్ధమయ్యేది కాదు. దీనిపై ఆయనకు అనేక ప్రశ్నలు ఎదురయ్యేవి. విదేశీయుల జీవన విధానం, ఆలోచనాధోరణి

భారతీయులకంటే పూర్తి భిన్నమైనదని, వారికి ఇలాంటి చికిత్సలు అవసరమని, కానీ భారతీయులకు నిశ్శబ్ద ధ్యానం సరిపోతుందని బాబా చెప్పేవారు . ఆశ్రమంలో లైంగిక భాగస్వాములను మార్చుకోవడాన్ని ప్రోత్సహించేవారు.

బాబా బోధించే "సంభోగ్ సే సమాధి"క్రియను బూతు పని గా భావించేవారు. ఇది వారి మనోభావాలను గాయపరిచింది. ఎందుకంటే సెక్స్ గురించి బహిరంగంగా మాట్లాడటం మన వ్యవస్థలో నేరం . ఈ ప్రక్రియ బోధించటం వల్ల ఆయన సెక్స్ కోరికలను అణిచివేయాలనుకునే అనేక మంది సాధువులకు శత్రువు అయ్యారు. ఆయన తన అభిప్రాయాలను బహిరంగంగా వ్యక్తం చేయడం లైంగిక భాగస్వాములను మార్చుకోవడానికి ప్రోత్సాహకంగా మారుతోందని భావించేవారు. ఆశ్రమంలో మహిళల్లో లైంగిక స్వేచ్ఛను ప్రోత్సహిస్తున్నారనే నిందలు కూడా ఆయనపై వచ్చాయి. ఆశ్రమంలో సన్యాసినులు బహిరంగ లైంగిక జీవితం గడపడం మొదలుపెట్టినప్పటి నుంచి అంటువ్యాధులు ప్రబలడం ఎక్కువైంది.జనాలకు ఏది కావాలో ఆయనకు బాగా తెలుసు. ఎటువంటి జనాలు తన దగ్గరకు వస్తారో కూడా తెలుసు.అక్కడో వైద్య కేంద్రం కూడా ఏర్పాటైంది. ప్రపంచం నలుమూలల నుంచి వచ్చిన డాక్టర్లు, నర్సులు అందులో ఉండేవారు. ఆశ్రమంలోని ఫుల్ టైమ్ వర్కర్లకు, ఆశ్రమవాసులకు అక్కడ ఉచితంగా వైద్యం అందించేవారు.

స్వల్పకాలంలోనే బాబా ఆశ్రమం లక్ష చదరపు మీటర్లకు పెరిగింది, దేశం లోనే పెద్ద ఆస్రమంగా మారింది . ఆధ్యాత్మికత లో పడి ఆయన కోసం వచ్చే వారి లో చాలా మంది ఉన్నత తరగతుల వారు ఉంటారు. వారికి జీవితం లో అన్నీ అమరి ఉంటాయి. ఇక మిగిలింది ఆధ్యాత్మికత, మోక్షం, కైవల్యం."ఈ మోక్షం అనేది మానవ ప్రయత్నం తో సాధ్యం కాదు", అని బాబా చెబుతారు. ఎందుకంటే ఆ స్థితి లో "నేను" అనేది ఉండకూడదు. మనిషి ప్రయత్నం చేస్తున్నపుడు "నేను" తప్పకుండా ఉంటుంది. అలానే కైవల్యం అనేది కొన్ని రోజుల్లోనో , సంవత్సరాలలోనో సాధించేది కాదు. ఎందుకంటే, అలా సాధించే దానిలో "అహం" అన్నది తప్పకుండా ఉంటుంది. పాత వాసనలు ఉంటాయి.

ఇవన్నీ చెప్పి తన అభిమానులను నిరాశ పరచదలుచుకోనట్లు కనపడుతుంది. ప్రయత్నం చేయాల్సిందే నంట. ఎందుకంటే ఈ జన్మ లో కాకపోయినా మరో జన్మ లో అయినా ఆ స్థితి నిన్ను వరించినపుడు, నీ వ్యక్తిత్వ వ్యవస్థ అందుకు సిద్ధం గా ఉంటుందట. మతం యొక్క కఠినతలకు తలొగ్గి మీ మనస్సును జైలులో బంధించడం కంటే, మీతో మరియు మరొక వ్యక్తితో మీరు ఏమి కోరుకుంటున్నారో దాని గురించి నిజాయితీగా ఉండటం మంచిదిఅని

మనదేశంలో, వందల సంఖ్యలో పెద్ద బాబాలు, వేల సంఖ్యలో చిన్న సన్నకారు బాబాలు, స్వాములు ఉన్నారు. మరి అందరూ తేలు కుట్టిన దొంగ లాగా గమ్మున ఊరుకున్నా ఎందుకు? డేరాబాబా ను ఖండించలేదు ఎందుకు? స్వాములు బాబాలు ఎక్కడి దొంగలు అక్కడే గప్ చుప్ ఎందుకయ్యారు? ప్రజలే నిజాలు గ్రహిస్తూ అప్రమత్తంగా ఉండాల్సిన సమయం వచ్చింది. నిజానికి బాబా కావడం గొంగళి పురుగు సీతాకోకచిలుక అయినట్టు,ఎన్నో కష్టనష్టాలకు వోర్చి బాబులు స్వాములు అవుతున్నారు. విఐపిలను ఆకర్షిస్తున్నారు. స్వామీజీ బాబాజీలు కావడం అంత తేలికైన పని కాదని తెలుస్తోంది. దానికి ఎంతో సాధన అవసరం. మోసం దగా హత్యలు దోపిడీలు ఇలాంటివన్నీ అవలీలగా చేయగల నేర్పరితనం ఉండాలి. అది కళే, కానీ దగుల్బాజీ కళ. చిత్తశుద్ధి లేని రాజకీయ నాయకుల వలే వీరిది కూడా,తరతరాల జనాన్ని సమూలంగా నాశనం చేసేకళ.హంతకుడు, గూండా అయిఉంది కూడా బయటి ప్రపంచానికి ఒక దేవదూత గా ఆధ్యాత్మిక గురువుగా కనబడడం ఎంత కష్టం.

సంత్ రాంపాల్, రామ్ రహీం గుర్మిత్ సింగ్ ధీరేంద్ర బ్రహ్మచారి, చంద్ర స్వామి, కంచి శంకరాచార్య, లాంటి వారంతా అరెస్టయ్యారు. కొందరికి బాగానే శిక్షలు పడ్డాయి. సంత్ రాంపాల్ రామ్, రహీమ్,గుర్మిత్ సింగ్ లకు ఉరి శిక్ష విధించడం కోర్టు తీర్పు తప్పని ఒక పార్లమెంటు సభ్యుడు సెలవిచ్చాడు. రాజ్యాంగ విలువలను పక్కనపెట్టి, మతవిశ్వాసాల దృష్టితో చూసే వారికి కోర్టు తీర్పులు నచ్చక పోవడంలో ఆశ్చర్యం లేదు. అందుకే బాబాలు స్వాములను మాత్రమే జైలుకి పంపడం కాదు, వారికి సహకరించిన వారికి, వారికి మద్దతుగా నిలబడిన వారిని కూడా శిక్షించాలి. నేరస్తులు తప్పించుకోకుండా జాగ్రత్తపడాలి. ఇటీవలికాలంలో కోర్టులు బాబాలకు,కునుకు పట్టడీయడం లేదు. మంచి మంచిపరిణామమే. అయినా ఇంకా తీవ్రతరం చేయాల్సి ఉంది.

సమాజం ఇలా నేర వ్యవస్థ గా,ఎలా ఎలా వ్యవస్థగా మారుతుందో, 1950లోనే ప్రపంచాన్ని కదిలించిన గొప్ప చలన చిత్రాలు వచ్చాయి. ఉదాహరణకు రాజ్ కపూర్ “ఆవారా” “మోరియాపుకో”” “ఫ్రాన్సిస్ కొప్పలా” “గాడ్ ఫాదర్” లాంటివి కొన్ని.అకారా పరిషత్ సెప్టెంబరు 2017 న దొంగ బాబాల లిస్ట్ విడుదల చేసింది. అందులో మొదటి పేరు గుర్మిత్ డేరా బాబా. రెండో పేరు రాధే మాది,గ్రుహహింస, బెదిరింపులు అక్రమాస్తులు,కూడబెట్ట టం,లాంటివిఆమెపై ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల మరో చెడు కారణంతో ఆమె వార్తలకెక్కింది. ఒక పోలీస్ స్టేషన్ ఉద్యోగులంతా ఆమెను సగర్వంగా పోలీస్ స్టేషన్ కు ఆహ్వానించి. అక్కడ డ్యూటీలో ఉన్న డిఎస్పి ఆమెను తన కుర్చీలో కూర్చోపెట్టి, పక్కన చేతులు కట్టుకు నిలుచున్నాడు. అతను ఆమెకు భక్తుడైతే, తన ఇంటికి తీసుకెళ్లి కాళ్లు కడిగి సేవలు చేసుకోవాల్సింది. శాంతి భద్రతలను కాపాడాల్సిన ఒక ఉన్నతాధికారి శాంతి భద్రతలకు భంగం కలిగించే ఒక మహిళను తన సీట్లో కూర్చో పెట్టటమంటే రాజ్యాంగ స్ఫూర్తికి విఘాతం కలిగించడం అన్నమాట. ఇక లిస్టులో ఉన్న మూడో పేరు ఆశారాం బాబు. ఆయన జైలు ఊచలు లెక్క పెడుతున్నాడు. 4వ పేరు ఆచారం బాబు తనయుడే, ఆయన పేరు నారాయణ సాయి తండ్రి అంతటివాడే లైంగిక వేధింపులకు జైలు పాలై బెయిలుపై ఇంటికొచ్చాడు. ఇక 5వ పేరు రాంపాల్. అనేక సంవత్సరాలు జైలు శిక్ష అనుభవించాడు సరైన సాక్ష్యాలు దొరకలేదని ఇటీవల విడుదలయ్యాడు. అయితే ఇంకా అతనిపై దేశ ద్రోహం కేసు హింసను ప్రేరేపించిన కేసు ఉన్నాయి. 6 నిర్మల్ బాబా, 7 ఓం బాబా, 8 సచిన్ దత్తా, 9 ఇచ్చాచారి భీమ్నంద్ 10 మల్కా సింగ్ 11 ఆచార్య కృష్ ముని, 12 స్వామి అసీమానంద, 13 బృహస్పతి గిరి, 14 ఓం నమశ్శివాయ బాబా, వీరంతా జాతీయ అంతర్జాతీయ స్థాయిలో ప్రాచుర్యం పొందిన దొంగ బాబాలు స్వాములు. ఇంకా ఇందులో చేరాల్సిన స్వాములు గురువులు చాలా మందే ఉన్నారు. ఏ కారణం వల్లనో రాసలీలల నిత్యానంద పేరు లిస్టులో కి రాలేదు. వీరంతా దేశంలో వేరు వేరు ప్రాంతాల్లో ఉన్నా, చేస్తున్న పనులు మాత్రం ఒక్కటే. వేలకోట్లు అర్జించటం, భూకబ్జాలు మహిళలను లైంగికంగా లొంగదీసుకోవడం, అడ్డొచ్చిన వారిని హత్య చేయించడం, బడా రాజకీయ నాయకుల్ని ఉన్నతాధికారులు తమ వైపు తిప్పుకోవడం, వారికి సహాయ పడటం, అవసరమైనప్పుడు వారి సహాయం తీసుకోవడం.

# నిశీధి రాత్రి..

దేవి గాయత్రి

నువ్వు వస్తావని తెలుసు
మీ కఠోర గాత్రంతో నన్ను
పిలుస్తావనీ తెలుసు
నిన్ను చేరక తప్పదని తెలుసు

ఏదో ఒక నిశీధి రాత్రి
ఈ నిశ్శబ్ద యుద్ధములో
నేను మాత్రమే నీకు విజయాన్ని
అందిస్తానని తెలుసు

గాలివాన వెలసిన రాత్రి
ఎంతటి ఏకాంతం
మనసును విచ్ఛిన్నము చేసిన
బాణాలు తొలగిపోయి

నీతో కలిసి పోయే ఆ క్షణం
అంతా నిశ్శబ్దం
నువ్వు నాకోసం మల్లెల పరిమళాలు
మోసుకొస్తావని తెలుసు

నీ గురించి విషం నింపి
నాలో భయాలు ప్రేరేపించి
నీకు దూరం చేసినా
నీకు తెలుసు
నేను నిన్నే కోరుకుంటానని
నాకు తెలుసు నువ్వు వస్తావని

ఈ పరాధీనమైన బ్రతుకు నుంచి
నన్ను తప్పిస్తావని
ఏ నిశబ్ద నీడలోనో నన్ను వరించి
నీ దరికి చేర్చుకుంటావని..
.

సీరియల్



సీరియల్

# యూనివర్సిటీ

పాంచజన్య

“ సార్ ..స్టీఫెన్ రాజా గారు మీకోసం వచ్చారు ...”పి ఏ వినయంగా చెప్పాడు

“ స్టీఫెన్ రాజా నా ..వాడేవడయ్యా ..ఎప్పుడు ఆ పేరు వినలేదే ...”జయరాం పి ఏ వంక చూస్తూ అన్నాడు

జయరాం ప్రతి పక్ష నేత విజయభాస్కర్ కు కుడి భుజం ..ఆయన ఎంత చెపితే అంత . రానున్న రోజుల్లో విజయభాస్కర్ తప్పకుండా గెలుస్తాడని ఇప్పటికే జనం అనుకుంటున్నారు . జనమే కాదు విజయ భాస్కర్ కోసం జయరాం చేయించిన సొంత సర్వే లో కూడా అదే నిజమయ్యింది . దానితో రోజు ఎవరో ఒకళ్ళు జయరాం ను కలుస్తూనే ఉన్నారు , పార్టీలోకి వస్తామని

“ అదేనండి .యునివర్సిటీ ప్రొఫసర్ .మీ చుట్టూ నాలుగు రోజులనుంచి తిరుగుతున్నాడు ..”

“ యా గుర్తుకొచ్చింది ...అయినా అతనికి మనతో పనేముంది ..కొంపదీసి ఎం ఎల్ ఏ టిక్కట్టు కావాలంటాడ ఏమిటి ..”

“ లేదు సార అతనికి అంత సీన్ లేదు ...”

“ మరి ..”

“ యునివర్సిటి వి సి పోస్టుకి అనుకుంటా...’

" వి సి పోస్టా ?..ఆలు లేదు చులు లేదు అల్లుడి పేరు సోమ లింగం అన్నారట వెనకటికి ....యలక్షన్లు జరగాలి మనం గెలవాలి ....ఎదో ఒకటి చెప్పి పంపు ..."

" చెప్పను సార ..కాని స్వాతి ముత్యం లో కమల హాసన్ లా పట్టు విడవకుండా తిరుగుతున్నాడు .."

" సరే రమ్మను ..అదేదో నేనే చెపుతాను.." ఆనాడు జయరాం కాస్త చిరాగ్గా

పి ఏ బయటకి వెళ్లి స్టీఫెన్ రాజాని వెంట బెట్టుకు వచ్చాడు

స్టీఫన్ రాజా రావటం రావటం తోనే జయరాం కాళ్ళ మీద పడి పోయాడు

"అయ్యో మాస్టారు లేవండి మీఎరు చదువుకున్నవాళ్ళు..." అంటూ కంగారు పడ్డాడు జయరాం

" మీరు పెద్దవాళ్ళు ..మీకు నమస్కారం చెయ్యటం లో తప్పులేదు .." అంటూ నసిగాడు రాజా

" నమస్కారం చెయ్యండి కాని ఇలా కింద ఆపాది పొరలు దండాలు పెట్టొద్దు ..చూసే వాళ్ళకు బాగుండదు ..ఎవరన్నా పత్రికల వాళ్ళు చూస్తే ..వార్తలు వండి వడ్డిస్తారు .ఇంతకి ఏ పని మీద వచ్చారు ."

"అదే సార్ ...వి సి ..పోస్టు .."

"ఇంకా ప్రభుత్వం రాలేదుగా ...నలుగు నెలలు ఓపిక పట్టండి ..ఇప్పుడున్న వి సి మీద చాల గొడవలు జరుగుతున్నట్టు ఉన్నాయి .."

" అవును సార్ .తన ఇష్టం వచ్చి నట్టు చేస్తున్నాడు ..."

"ఇంకెంత కాలం ఉంది అతని సర్వీసు ..."

" ఉంటుందండి మరో రెండేళ్ళు .."

" మరి మీరు రెండేళ్ళు ఆగాలి కదా .."

"మీరు తలుచుకుంటే అదెంత సార్ ..."

" అదేమిటి అతను దిగి పోతే కదా మీరు ఆ సీట్లో కూర్చునేది ..."

" అవుననుకోండి ..."

" మరి .."

"" మీరు ఉ అంటే ..నేను అతన్ని దించే పనిలో ఉంటా...."

" అది అంత తేలికా ..."

" ఈ రోజుల్లో ఏముంది సార్ ...కుర్రాళ్ళకి నాలుగు డబ్బులు పడేస్తే ధర్నాలు చేస్తారు అదే పనిగా దానితో విసిగి పోయి అతనే రాజీ నామా చేస్తాడు "

' మీరు మాకన్నా పెద్ద రాజకీయ నాయకుల్లా ఉన్నారే .."

" ఎదో అంత మీ అభిమానం .."

" సారే ..మీరు ఆ పని మీద ఉండండి ..ప్రభుత్వంఏర్పడే వరకు రాకండి మళ్ళి

.."అలాగే సార్ .."ఎదో భరోసా దొరికినట్టు ఆనందంగా అక్కడనుంచి వెనుతిరిగాడు రాజా

★★★

" అన్నా ...డబ్బులు కావాలి .."రాజేంద్ర స్టీఫెన్ రాజా కి ఎదురుపడి అడిగాడు

"ఏమి ఇరగ దీసావని ఎప్పుడు డబ్బులు డబ్బులు అంటావు .."

"మొన్న కుర్రాళ్ళను పెట్టి గొడవ చేయించా కదా సార్ , పేపర్లో కుడా వచ్చింది .."

" ఆహా అది నీ ప్రతాపమేనని అందరు అనుకుంటున్నారు ..తూ " అంటూ ఊసాడు స్టీఫెన్ రాజా

" అమరి ఎవరి ప్రతాపం సార్ .." కోపం తో ఉగి పోయాడు రాజేంద్ర

" నీకు తెలియదా ... అంతా ఆ వామ పక్ష విద్యార్థులే చేసింది ...పోలీసులు రాగానే నువ్వు వెనెక్కి తిరిగి చూడకుండా పారిపోయింది నాకు తెలియదా .."

స్టీఫెన్ రాజా మాటలకు గొంతులో తడి ఆరిపోయింది రాజేంద్రకి ..

" అదికాదు అన్నా పోలీసులను చూడగానే భయం వేసింది .."

" అంత భయపడే వాడికి నికేందుకురా రాజకీయాలు ...బుద్దిగా చదువుకో.." అంటూ కోప్పడ్డాడు

" రాజేంద్రకి ఏమి మాట్లాదాడ్లో అర్ధం కాలా ..మనసులో మాత్రం ఎదో ఒకటి చేసి తన యునివర్సిటీ లో తను అంటే ఏమిటో నిరూపించుకోవాలని ఆ క్షణాన నిర్ణయించు కున్నాడు

(ఇంకా ఉంది )



# పాటలతో పరిరక్షణ

అధిక ఉష్ణోగ్రతల కారణంగా ఈ యేడాది ఒడిశాలో 4,500 హెక్టార్లకు (11,120 ఎకరాలు) పైగా అడవులను మంటలు ప్రభావితం చేశాయి. ఈ సమస్య ప్రతి యేటా ఎదుర్కొనేదే. అధికారులు సీసీ కెమెరాలు, ఉపగ్రహ డేటా వంటి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి మంటలను ట్రాక్ చేస్తున్నారు. అడవిలో ఎండు ఆకులను కాల్చడం వల్ల కూడా వేడిగాలులు, పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో ఈ మంటలు వేగంగా వ్యాపిస్తున్నాయి. వాటిని ఆర్పడం మరింత కష్టతరం అవుతోంది. ఈ నేపథ్యంలో అగ్ని ప్రమా దాల నుంచి గ్రామ ప్రజలను రక్షించడం కోసం ఒకప్పుడు పురుషులు జట్లు జట్లుగా కలిసి ఊళ్లన్నీ తిరిగి పాటలు పాడి అగ్నిప్రమాదాలు జరగకుండా ఏం జాగ్రత్తలు తీసుకో వాలో అవగాహన కల్పించేవారు. ఇప్పుడు ఆ బాధ్యతను స్త్రీలు స్వీకరించడమే కాదు. మరింత బాగా అవగాహన కల్పిస్తూ... ప్రమాదాల నుంచి రక్షిస్తున్నారని కియోంఝర్ జిల్లాలోని అటవీ డిప్యూటీ పరిరక్షకుడు హనుమంత్ ధమ్ ధేరే అన్నారు.


ఒడిషా రాష్ట్రంలోని ముర్గపహాడి గ్రామంలోని మహి ళలు సంవత్సరాల తరబడి నిశ్శబ్దంగా పొలం పనులు, పిల్లలను సాకడం చేస్తుండేవారు. దీంతోపాటు అడవుల్లో పువ్వులు, కట్టెలు సేకరిస్తుంటారు. ఉపాధి లేనప్పుడు వారి భర్తలు నగరాల్లో పని చేస్తుంటే వీళ్లు ఇళ్లను నడిపిస్తుండే వారు. రెండేళ్లుగా మహిళలు కూడా బృందాలుగా చేది, పాటలు పాడుతూ అవగాహన కల్పిస్తున్నారు. ఇది వారి స్వీయ గౌరవాన్ని పెంచడమే కాదు సమాజంలో వారి పాత్రను మరింత బలపరుస్తోంద

ఈ ప్రయత్నం ఫలితంగా ఆటవీ ప్రాంతాల్లో అగ్ని ప్రమాదాలు 20–30 శాతం తగ్గినట్లు అధికారులు చెబుతు న్నారు. ఈ సంవత్సరం ప్రారంభంలో ధర్మే కొన్ని మహిళా సంకీర్తన బృందాలను చేర్చుకున్నారు. ఈ బృందాలు స్థానిక భాషలలో పాడతాయి, వాటిని స్థానిక ప్రజలు సులభంగా అర్థం చేసుకోవడంతోపాటు అవగాహ నతో ఆటవీ పరిరక్షణకు పాటు పడుతుంటారు. ఈ పని చేసినందుకు గాను ఈ బృందాలకు అటవీశాఖ నుంచి ఆదాయం కూడా లభిస్తుం సంకీర్తన మండళ్ళు 15వ శతాబ్దం నుంచి ఉన్న సంప్రదాయ గీతాల సమూహాలు. ఈ సంప్రదా యాన్ని ఆధునిక అవసరాలకు అన్వయించి, పర్యావరణ పరిరక్షణలో ఉపయోగిస్తున్నారు. దీన్ని ఒక సాంస్కృతిక పునరుజ్జీవనంగా పరిగణించవచ్చు. అయితే, సంకీర్తన మండలి బృందాలలో సాధారణంగా పురుష గాయకులు, నృత్యకారులు ఉండేవారు. వీరు డ్రమ్స్ వాయించడం, మతపరమైన భక్తిపాటలు పాడేవారు. గ్రామాల్లోని పురు షులు ఫ్యాక్టరీలలో పని చేయడానికి హైదరాబాద్, బెంగ ళూరు వంటి నగరాలకు వలస వెళ్లినప్పుడు సంకీర్తన మండళ్ళు దాదాపుగా పనిచేయడం లేదు. మేం దానిని పున రుద్ధరించాలని నిర్ణయించుకున్నాం' అని ముర్గపహాడిలోని బృందానికి నాయకత్వం వహిస్తున్న 35 ఏళ్ల ప్రమీలా ప్రధాన్ చెప్పారు. ప్రధాన్ బృందంలో 17 మంది ఉండగా, వారిలో తొమ్మిదిమంది మహిళలు ఉన్నారు. పురుషులు ఈ మండళ్ళను వదిలి వెళ్లాక, గ్రామీణ మహిళలు 'సంకీర్తన మండలి' అనే సంప్రదాయ సంగీత సమూహాన్ని మళ్లీ ప్రారంభించారు. ఈ గీతాలు దేవుని గురించి మాత్రమే కాక, ప్రకృతి పరిరక్షణ, అగ్నిప్రమాదాల నివారణ వంటి సామాజిక అంశాలను కూడా ప్రస్తావి స్తాయి.

ఇది ఒకవైపు వారిని సాధికారతవైపుకు తీసుకెళ్తుం డగా, మరోవైపు పర్యావరణాన్ని రక్షించడంలో సహాయప డుతోంది.

రాష్ట్రంలో దాదాపు 20,000 సంకీర్తన బృందాలు ఉండగా వాటిలో కనీసం 1,000 బృందాలు మహిళలే నిర్వహిస్తున్నారు.

ఆటవీ మంటలు వారి ఆదాయాలను, పిల్లల పోషణను ప్రభా వితం చేస్తున్నాయని మహిళలు అంటున్నారు. 'కుటుంబ పోషణ కోసం అడవిదుంపలు, ఆకుకూరలు, పుట్టగొడుగులను సేకరిస్తాం, పెద్ద అగ్నిప్రమాదం జరిగితే, ప్రభుత్వం నుంచి మాకు లభించే బియ్యంతోనే సరిపెట్టుకోవాలి. ఇప్పుడు సమాజానికి ఉపయోగపడేలా సంకీర్తన మండలిలో చేరినందుకు మాకు ఉపాధి కూడా లభిస్తోంది ఏళ్ల బాలమతి చెప్పారు.కేతకి నాయక్ కి 10 ఏళ్ల వయసులో పెళ్లి అయ్యింది. ఇప్పుడు ఆమెకు పాతికేళ్లు, ఇద్దరు పిల్లలు ఉన్నారు. 'నా చిన్న తనంలో పాటలు పాడేదాన్ని పెళ్లయ్యాక నా నోరు మూతపడి పోయింది. ఇప్పుడు బృందంలో చేరి, ఊరంతా తిరిగి పాటలు పాడుతున్నాను. ప్రజలు నన్ను ఆశీర్వదిస్తున్నారు' అని ఆనం దంగా చెబుతుంది. ఇప్పుడు ఈ మండళ్ళలో యువతులు, విద్యార్థులు కూ చేరి శిక్షణ తీసుకుంటున్నారు. దీని ద్వారా తరువాతి తరం వుల పరిరక్షణకు ఏం చేయగలరో నేర్చుకుంటున్నారు.



# ఓడిన గెలుపు



వాడపల్లి పూర్ణ కామేశ్వరి

ఇతరుల మనసులోని ప్రేమను గుర్తించాలనే భగవంతుడు మనకు జ్ఞానేంద్రియాలనిచ్చాడు. నేను సంపాదించిన కీర్తి ప్రతిష్టలేవీ నా ఆఖరి దశలో నాకు తోడుగా లేవు. నేను సంపాదించిన డబ్బు నాతోటి రాదు. నాతో నేను వెంట తీసుకు వెళ్ళ గలిగేది ప్రేమానుభూతులు, అందమైన జ్ఞాపకాలు మాత్రమే. అనుభవ పూర్వకంగా అవే మనతో ఉంటాయి. అంతా మన హృదయంలోనే వుంది. మన చేతుల్లోనే వుంది. ప్రపంచంలో అత్యంత ఖరీదైన మంచం ఏదో తెలుసా? రోగంతో, బాధతో పడుకున్నపుడు పడుకున్న మంచం. సంపాదించిన డబ్బుతో నీ కారు నడపడానికి డ్రైవరును పెట్టుకో గలవు, డబ్బును సంపాదించి పెట్టడానికి ఉద్యోగస్తులను నియమించుకోగలవు కానీ ఎన్ని కోట్లు పోసినా, నీ బాధను అనుభవించే వ్యక్తిని సంపాదించుకోలేవు. ఎంత డబ్బు గుమ్మరించినా చేజారిన జీవితాన్ని మాత్రం తిరిగి పొంద లేవు. జీవితంలో మనం ఎంత గొప్ప స్థితిలో వున్నా కథ ముగిసే రోజు, తెర పడే రోజు ఒకటి వస్తుంది. అప్పుడు ఎంత ఆరాట పడినా కాలం వెనక్కు వెళ్ళదు. నీ కుటుంబాన్నీ, నీ స్నేహితులనూ ప్రేమించు, డబ్బును కాదు. నేను ఈ ఆఖరి ఘడియల్లో ఉండి చెబుతున్నాను, మీరు కాస్త ముందే కళ్ళు తెరవండి. నీ వారందరినీ ఆనందంగా వుంచు, ఆ ఆనందమే నీకు అనుభూతులుగా మిగులుతాయి" తన ఆఖరి సందేశాన్నీ ఒక మెసేజ్ రూపం లిఖించి ప్రపంచానికి అందజేసారు స్టీవ్ జాబ్స్. ఇది వారి యదార్ధ ఆఖరి సందేశం.

**జరిగిన కథ:**
హరిత బ్రిగేడియర్ జనరల్ మనస్విని దగ్గర పి ఏ గా పనిచేస్తూ ఉంటుంది.హిమ మనస్విని ఇంట్లో అన్ని పనులు చుసుకోటానికి హిమ చేరుతుంది .మనస్విని తల్లి డా అమృత మరణిస్తుంది . పలకరించటానికి హరిత వెళుతుంది .

**ఇక చదవండి**

కొన ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్న అమ్మ పక్కన కూర్చుని తన ఫోనులో వచ్చిన ఆ మెసేజ్ ని చదువుతోంది మనస్వినీ దేవి.

ఎన్నెన్నో ఆలోచనలు ఆమె గుండెల్ని పిండేస్తున్నాయి. ఆ మెసేజీలో ఉన్న ఒక్కొక్క మాటా తనకు చురకల్లా తగులుతున్నాయి. స్టీవ్ జాబ్స్ ఇచ్చిన యధార్ధ సందేశం అమ్మ అక్షరాలా పాటించింది. అమ్మ జీవితంలోని ఒక్కో అనుభూతినీ పోగు చేసుకుంది. జీవితాంతం సేవ, అంకిత భావంతో బ్రతికినా ఆనందాన్ని వదులుకోలేదు. అందుచేతనే చివరకు సంతృప్తి కరమైన మనోదశను పొందింది. స్టీవ్ జాబ్స్ కన్నా అమ్మే ధనవంతురాలు. ప్రశాంతంగా పడుకున్న అమృతగారికి మళ్ళీ దగ్గూ, దానితో పాటూ ఆయాసం వచ్చింది. అమ్మకు మందు వేయడానికి వచ్చిన హిమను చూసి మరిన్ని ఆలోచనలు తనలో కదలాడాయి. కంగారు పడిపోతూ విలవిలలాడింది మనస్విని. హిమ మాత్రం 'కిం కర్తవ్యం' అన్నట్టు, తాను చేయవలసినది చేసుకుంటూ పోతోంది.

ఆ క్షణంలో హిమను చూసిన మనస్వినికి మొట్టమొదటి సారిగా మేరు పర్వతం అంత ఎత్తైన వ్యక్తిని చూస్తున్న అనుభూతి కలిగింది. తన బిడ్డలకు అవసరమైనప్పుడు కూడా అమ్మను విడిచిపెట్టి వెళ్ళలేని స్థితిలో ఉన్నప్పుడు కూడా ఎన్నడూ బాధపడలేదు. సూర్యుని వెలుతురుని కూడా చూడలేనంతగా ఇంటికే పరిమితమైపోయినా దానికీ చికాకు పడలేదు. ఏళ్ళ తరబడి ఇంటి పట్టునే వుండి అమ్మకు నీడలా నిలిచి రేయింబవళ్ళూ సేవలు చేసింది. "హిమా, అమ్మకు నువ్వే మందు సరిగ్గా వెయ్య గలవు. నేను వెయ్యలేక పోతున్నాను. ఏ పనీ నాకు చేతకాదని నేను ఎప్పుడూ అనుకోలేదు. పట్టుదలతో ఎంతటి పనైనా సాధించవచ్చునని ప్రగాఢంగా నమ్మిన దాన్ని. కానీ నిన్ను చూసి, నేను చేయలేని పనులు ఎన్నో ఉన్నాయని ఇప్పుడు తెలుస్తోంది. అవునులే, చంటిపిల్లలకు వేసినట్టు మందు వేయాలన్నా బుజ్జగిస్తూ గోరు ముద్దలు పెట్టాలన్నా, నాకెలా చేతనవుతుంది. అమ్మను కాలేని నాకు మాతృమూర్తిగా చేసే ఆ పనులు చేతకాలేదు. నాకు బిడ్డలుంటే కదా? లాలించి పెంచిన నాడు కదా, ఎవరికైనా ఈ పనులన్నీ చేతనైయ్యేదీ" ఆమె నోటి వెంట అప్రయత్నంగా వస్తున్న మాటలకు ఎలా స్పందించాలో కూడా తెలియని అయోమయంలో పడిపోయింది హిమ.

స్టీవ్ జాబ్స్ స్పీచ్ విన్నాకా మొదటి సారి అలాంటి ఆలోచనలు మనస్విని హృది తలుపులను తట్టాయి. అమ్మ ఎంతగా చెప్పినా అప్పుడు బోధ పడలేదు. చేతులు కాలాకా ఆకులు పట్టుకోవడం అన్నట్టు ఇప్పుడు తెలిసినా పెద్ద ప్రయోజనం లేదు. ఐతేనేం, ప్రతీ మార్పూ ఆహ్వానించ దగినదే.

స్వయంగా తనకు జీవితంలో ప్రయోజనకరంగా లేకున్నా, బాధ్యతగల ఉన్నత పదవిని అలంకరించి వున్న తనకు ఈ మార్పు వల్ల, అనేక ప్రయోజనాత్మక

నిర్ణయాలకు దారి తీసినా అది ఆహ్వానించ తగ్గ విషయమే.

★ ★★

గత ఇరవై ఏళ్లుగా నేనూ, హిమా అమ్మకు రెండు కళ్ళుగా మిగిలి పోయాము. ఒకటి పేగుబంధమైతే మరొకటి ఏ బంధమూ లేని అనుబంధం. రక్తంతో గట్టి పరిచే ఆ పేగు బంధంలో అనుబంధం సహజంగానే పెనవేసుకు పోతుంది. మరి హిమది ఎలాంటి బంధం? సంబంధం లేని ఆ బంధానికి అనుబంధం ఎలా ఏర్పడిందీ. జీతం పేరుతో నేను నియమించుకున్న పని మనిషిగా వచ్చిన ఆమె అమ్మ ప్రేమతో ఇంతగా పెనవేసుకు పోవడమేమిటి? సేవలో తరించి పోవడమేమిటి? పేగు బంధం కంటే గొప్ప బంధం ఇది. పవిత్ర బంధం.

ప్రపంచాన్నంతా చూసి, కోట్లు గడించి ఎన్నో ఆస్తులకు అధిపతియైన స్టీవ్ జాబ్స్ చెపుతున్న సందేశాన్ని హిమ అలవోకగా తన జీవన శైలిగా ఎలా చేసుకుంది. ఆ వాస్తవాలన్నీ జీవితంలో అన్వయించుకోవడమంటే ఎంతటి మానసిక బలం కావాలి. ఎలా? హిమకు ఎలా ఇంత బలం వచ్చింది. అంతటి జీవిత అనుభవం ఎక్కడిది? అంతటి చదువూ, పరిజ్ఞానమో, ప్రాపంచిక తెలివితేటలో అబ్బే పరిస్థితి తనకు లేదే!! అతి సామాన్య కుటుంబంలో పుట్టిన సగటు స్త్రీ. అలాంటిది ఆమెకెక్కడిది ఇంతటి అపారమైన ఆత్మస్థైర్యం?

ఐ.ఏ.ఎస్ పరీక్షలకు రేయింబవళ్ళూ చదివి, ప్రపంచంలోని అన్ని విషయాలనూ సేకరించి, పుస్తకాల పుటలలోనివన్నీ ఆకళింపు చేసుకుని, నిర్విరామ కృషితో, అకుంఠిత దీక్షతో చదివి ప్రిలిమినరీ పరీక్షలో ఉత్తీర్ణురాలై ఏడుకొండలూ ఎక్కడంలో అత్యంత కఠినమైన మోకాలు పర్వతాన్ని మోకాటిన ఎక్కినంత సాధన అయ్యింది. మెయిన్ మరియు వైవా పరీక్షలు పూర్తయ్యే సరికి హిమాలయాలనే అధిరోహించినంత పనైయ్యింది. అలాంటి నాకు కదా ప్రపంచం మీద అవగాహన ఎక్కువగా ఉండాలి. ప్రాపంచిక జ్ఞానం ఎక్కువ కలగాలి. అలాంటిదీ!!!"

గొంతులో పచ్చి వెలక్కాయ పడ్డట్టు అయ్యింది. ఒక్క క్షణం ఆలోచనలకి గండి పడ్డట్టైంది. అంతర్మథనంలో మరింత వేగం పుంజుకుంది. ఒక్కసారి హిమ వంక తదేకంగా చూసింది.
"ఆమెకు లేని కష్టాలా? ఆమె ఎదుర్కోని ఎదురు దెబ్బలా? ఒక్క పరీక్షకు నేనింతగా సాధించాననుకుంటే, జీవితమంతా పరీక్షలే హిమకు. ఆమె ఎంత చదివుంటుందో? ఐతే ఈ విషయం ఆలోచనలోకైనా రావడానికి నాకు ఇంత సమయం పట్టిందా? ఆలస్యం అయిపోలేదూ?
నా జీవితం లో 'తోడు' అనే భాగం ఖాళీగానే ఉండి పోయింది. దేశంలోనే అత్యున్నత పదవికి పెట్టే పరీక్షల్లో ఉత్తీర్ణురాలినై ఉన్నత పదవిని చేపట్టాను నేను. జీవితంలోనూ అంతటి గెలుపే పొందానా? అది కాస్త ఆలోచించాల్సిన విషయంగా నిలిచింది. పదవిని పొంది జీవితాన్నోడానా?"

మహాభారత మహా కావ్యంలో పంచ భర్తృకగా పిలువ బడిన పాంచాలి తన పతులను ప్రశ్నించింది. 'తన్నోడి తామోడేరా, లేక తామోడి? తామోడాకా తన్నోడే అవకాశమేదీ?' ఐదుగురు వీరులకూ జవాబు చెప్పలేని ప్రశ్నగా అది మిగిలింది. అలాగే, నేడు నా అంతరాత్మా నన్ను నిలదీస్తోంది. "నేను గెలిచి ఓడానా? ఓడి గెలిచానా?"

ఈ రెంటికీ అతీతంగా ప్రేమకే ప్రతిరూపంగా నిలిచిన హిమను చూసి, "నీదే అసలైన గెలుపు. నిజమైన గెలుపు. జీవితమే పరీక్షగా నిలిచినా, దెబ్బ మీద దెబ్బలు తగులుతున్నా, ఎదురు దెబ్బలు ఎదురుగా నిలిచి వెక్కిరిస్తున్నా, ప్రేమను మాత్రం నీ నుండి దూరం కానీ లేదు. అదే నీకు ధైర్యమైయ్యింది. అదే నీకు శ్రీరామ రక్ష అయ్యింది. నిజమైన గెలుపు నీదే హిమా, నీదే" మనసులోనే హిమను అభినందించింది మనస్విని. అహంకారంతో ఏళ్ళ తరబడి ఆమె చుట్టూ నిర్మించుకుని పటిష్టం చేసుకున్న అహంకారపు కోట బీటలు వారుతోంది. తన చుట్టూ తాను నిర్మించుకున్న కంచుకోట ఇప్పుడు డొల్లగా అనిపిస్తోంది. ఐతే, ఇప్పుడు బహిరంగంగా దాన్ని ఒప్పుకునే ధైర్యం ఉందో, లేదో! ఆమెకంతటి ధైర్యం లేదు.

'నా చుట్టూ నేను నిర్మించుకున్న కోట. పట్టాలతో, హోదాలతో

అబద్ధపు దర్పంతో నిర్మించుకున్న ఆ కోట. నాతోనే అదీ కడతేరుతుంది. ఆ దర్పాన్ని విడిచి నేనుండగలనా? ఒక్కనాటికీ ఉండ లేను. 'నేను' ఆ నేనుని వదలలేని బుద్ధిజీవి నేను. నేను అన్నది లేనిదే నాకు ఉనికే లేదు. ఆ నేనుతోనే నా వ్యక్తిత్వం ముడిపడి వుంది. ఆ నేను లోనే నాకు గుర్తింపు' కొరడా దెబ్బ కొట్టింది అంతరాత్మ. భర్తను పోగొట్టుకుని ఇద్దరు పసి పల్లలతో తన వద్దకు ఉద్యోగం కోసం వచ్చిన హిమ ఇంకా తన కళ్ళలో మెదుల్తోంది. ఆమె తనతో చెప్పుకున్న ఆమె కథ, కథ కాదు. ఒక జీవితపు చిరునామా. ఆమె కథే ఆమె పట్టుదలకు నిదర్శనం. జీవితాన్ని ఆమె నడిపించిన తీరుకు ఆ కథే ప్రత్యక్ష సాక్షి.

అవసరానికి మించిన గురువూ, ఆకలికి మించిన రుచి లేదంటారు. అందుకేనేమో జీవితమే ఆమెకు గురువైయ్యింది. అనుకోకుండా తగిలిన ఎదురు దెబ్బలే ఆమెకు నడక నేర్పాయి. పుటంలో వేస్తే పుత్తడి మెరిసినట్టు, కష్టాలలో కాలిన ఆమె మరింత వన్నెతో మెరిసింది. తన కష్టాలన్నీ మరచిపోయి అమ్మకు అహర్నిశలు సేవలు చేస్తోంది.
ఆ నిశ్శబ్దపు ఘడియల్లో, జీవితపు చివరి మజిలీలో వున్న అమ్మ పక్కన కూర్చుని హిమ కథను పదే పదే తలచుకుంది మనస్విని.
తూ.గో.జిల్లాలో ఒక చిన్న గ్రామం. జగన్నాధపురం. నూరు గడపల ఊరది. ఊరంతా రామయ్యగా పిలుచుకునే రామచంద్రయ్య పేరుకు తగ్గట్టు శ్రీరామచంద్రుడే. తనకున్న నాలుగెకరాలనూ సాగు చేసుకుంటూ ఉన్నంతలో ఆనందంగా తన కుంటుంబంతో జీవిస్తున్న సగటు వ్యక్తి. మితభాషి. కుంటుంబాన్ని మించిన సిరులూ, తృప్తిని మించిన సంపదలూ లేవని నమ్మిన మనిషి. ఉన్నదాంట్లో జీవించడమే ఆనందమన్న సిద్ధాంతాన్ని ప్రగాఢంగా నమ్ముతూ ఆచరణలోనూ పెట్టే వ్యక్తి. రామయ్య భార్య దుర్గ. ఇంటిని చూసి ఇల్లాలుని చూడమన్నట్టు, ఉన్నదాంట్లో పొందిగ్గా సంసారాన్ని గడుపుకునే వైనం ఆ ఇంటిని చూడగానే తెలుస్తుంది. ప్రేమానురాగాలే సంపదలుగా చేసుకున్న కాపురం వారిది.

"ఆడ పిల్లా? తొలిచూరు కొడుకుడతాడనుకున్నాను రా రాఁవుడూ. వంశోద్ధారకుడొస్తాడనీ" బుగ్గ నొక్కుకుంటూ అంది రామయ్య తల్లి.

"అదేంటమ్మా అలా అంటావు. సాక్షాత్తూ మహాలక్ష్మి పుడితేనూ" నోట్లో మిఠాయి పెడుతూ అన్నాడు. కంటే కూతుర్నే కనాలి అని లోలోపలే గర్వపడ్డాడు రామయ్య. రామయ్యకు ఆ చిన్నారి పంచ ప్రాణాలైయ్యింది. హిమబిందు అని నామకరణం చేసుకున్నారు. కాలు కింద పెడితే కందిపోతుందేమోనన్నంత అపురూపం. కందిపోవడానికి కాలు కింద పెడితేనే కదా. హిమను గుండెల మీదే పెంచుతున్నాడు, అరచేతుల్లోనే నడిపిస్తున్నాడు. హిమబిందు అని పేరైతే పెట్టుకున్నారు కానీ, ఎప్పుడు గారంగా ముద్దు-ముద్దుగా పిలిచుకోవడమే అలవాటు. "చిన్నలూ, కన్నలూ బుజ్జులూ.. రా.. రా... నా బంగారు తల్లి ఎదురొస్తే అన్నీ జయాలే" ఇంట్లోంచి బయటకు వెళుతూ ఆమె చిరునవ్వులు చూసేందుకు పెట్టుకున్న నెపమది. భుజం మీది కండువాను ఆ చిన్నారి చేతుల మీదుగానే అందుకోవడం అలవాటు చేసుకున్నాడు. చిన్నారిని ముద్దు పెట్టుకుని కానీ ఇంట్లోంచి కాలు బయట పెట్టడు రామయ్య. నా తల్లి తెచ్చిన సిరులు అంటూ, కొత్తపంటల సంబరాల సంక్రాంతి పండుగను ఆ సంవత్సరం కూడా అంగరంగ వైభవంగా చేసుకున్నారు.

హిమకు మూడో ఏడు దాటింది. "దుర్గమ్మ మళ్ళీ నీళ్ళోసుకుందిరా. ఈ సారైనా పురుష సింహం పుట్టాలి. నీకు కొడుకు పుట్టి నన్ను పున్నాగ నరకాల్లోంచి బయటపడేసే వంశోద్ధరాకుడవుతాడు" పాత పాటే పాడింది రామయ్య తల్లి. రెండవ కాన్పు మగ పిల్లవాడు పుట్టాడు. బామ్మకు వెయ్యి ఏనుగుల బలమొచ్చినట్టైయ్యింది. వేలుంది కదా అని గాల్లోండినట్టు మనవడు పుట్టండంతోనే ఆమెకు మోక్షమార్గం కనిపించేస్తుందన్నది ఆమె పిచ్చి నమ్మకం. వేర్రి చాదస్తం. పిల్లాడికి హరీష్ అని పేరు పెట్టుకున్నారు.
హిమకు హరీష్ అంటే ఎనలేని

## సీరియల్

ప్రేమ. బుజ్జి బాబు, బుజ్జి బాబు అంటూ ఒక్క క్షణం వాణ్ణి వదిలి వుండేది కాదు.
ముచ్చటగా ముగ్గురు అనే రోజులవి. హరీష్ కు రెండున్నరేళ్ళు దాటాయి. దుర్గ మూడవ కాన్పుకు మరో మూడు నెలలు.

మూడవ కాన్పుకు దగ్గర పడుతున్న కొద్దీ దుర్గ ఆరోగ్యం దెబ్బతిన సాగింది. ఒంట్లో రక్తం తక్కువగా వుందని మందులు ఇచ్చారు వైద్యులు. సరిగ్గా అదే సమయంలో ఊరంతా విషజ్వరం సోకింది. ఆ విషజ్వరం తాకిడికి కడుపులోని బిడ్డ ఆరోగ్యం ప్రభావితమైంది. పురిటి వరకూ ఆ విషయం పసిగట్టలేక పోయినా, పురుడు వచ్చేసమయానికి మాత్రం బిడ్డకి మానసిక ఎదుగుదల లోపం ఉందని తేల్చి చెప్పేసారు డాక్టర్లు.
అసలే అంతంత మాత్రంగా ఉన్న దుర్గ ఆరోగ్యం, మానసిక ఎదుగుదల లోపంతో పుట్టిన బిడ్డను చూసి మరింత క్షీణించింది. ఆ బిడ్డను అలా చూస్తూ భరించలేక పోయింది. మానసికంగా కుంగిపోయింది. శరీరానికి జబ్బొస్తే మందులు ఇవ్వగలం కానీ ఆమె మనసును పీడిస్తున్న బాధకు మందులివ్వలేమని తేల్చేసారు వైద్యులు. కృష్ణపక్ష చంద్రకళల్లా రోజురోజుకూ కాంతి విహీనమైంది దుర్గ పరిస్థితి.
జర్వంతో పది రోజుల పాటు బాధపడి ఆ పై పోరాడే శక్తిలేక మృత్యువు వడిలో చేరింది. పండంటి కాపురం చెదిరినట్లైపోయింది. రోజులు ఎలా గడుస్తున్నాయో తెలియని పరిస్థితి.

అప్పటికి హిమకు ఎనిమిదో ఏడు. రామయ్య పిచ్చివాడై పోయాడు. మానసిక ఎదుగుదల లేని చంటి పిల్లను తల్లి లేకుండా పెంచడం చాలా కష్టమై పోతోంది. నెలలు గడిచేకొద్దీ రామయ్య మరింత కృంగి పోయాడు. వైద్యం చేయించడం ఒక ఎత్తైతే, ఇరవైనాలుగు గంటలూ కనిపెట్టుకుని చూసుకోవడం మరో ఎత్తు. ఆ పిల్లను చూసుకోవడం కష్టమవుతున్నది ఆ పరిస్థితిలో హిమ, హరీష్ లను అసలు చూసుకోలేని అసమర్ధతతో సతమతమైపోయాడు. పని మానేస్తే మిగిలిన పిల్లలను చూసుకోవడానికి దారేదీ? సతమతమైపోతూ నలిగిపోతున్న రామయ్యకు దేవుడే ఒక దారి చూపాడు. దేవుడిలా తన స్నేహితుడు శివరామ్ ఒక సలహా ఇచ్చాడు. మనసంతా బాధ కలిగినా, ఆలోచించకా అదే సరైన మార్గమనిపించింది. స్నేహితుడు శివరామ్ సలహానే శిరోధార్యమనిపించింది.
"రాఁవుఁడూ, కొత్త బస్సు స్టాండు వద్ద, సీ.ఎమ్.సీ ఆసుపత్రి వారిదే ఒక సంస్థ పెట్టారు. మానసికంగా ఎదుగుదల లోపం వున్న పిల్లలకోసము ఆ సంస్థ వారు హోమ్ ను ఏర్పరిచారు. హేమని అక్కడ చేర్చు. తప్పు చేస్తున్నానన్న భావన వద్దు. హిమ, హరీషలను సవ్యంగా పెంచాలంచే నీకు ఆ మాత్రం వెసులు బాటు కావాలి. ఊళ్ళోనే కాబట్టి, వీలున్నప్పుడల్లా వెళ్ళి చూసి వస్తూ వుండ వచ్చు. ఇప్పుడు ఇంతకంటే మంచి మార్గం మనకి లేదు" ఆత్మీయంగా చెప్పాడు శివరామ్.

మనసు పిండేస్తున్నా, వేరే దారిలేక ఆ చిన్నారిని హోమ్ లో చేర్చాడు. ఇక హిమా హరీషలను రెండు కళ్ళుగా పెంచుతున్నాడు రామయ్య. ఇద్దరూ బడికి వెళ్ళి చక్కగా చదువుకుంటున్నారు.

(ఇంకా ఉంది )



# ఐ పి ఎల్ మత్తులో యువత

భారత క్రికెట్ లో పెను సంచలనంగా మారిన ఐపీఎల్ వినోదంగా అయితే ఇప్పటికీ తిరుగులేని క్రేజ్ తో కొనసాగుతూ ఉంది. అయితే దీని వల్ల పెడధోరణలు మొదలై కూడా చాలా కాలమే అవుతూ ఉంది. ఐపీఎల్ ఆరంభం అయినా రెండు మూడేళ్లకే బెట్టింగ్ ప్రబలంగా మారింది. వేసవి వినోదాన్ని వ్యసనంగా కూడా మార్చుకోవడం మొదలైంది. మొదట్లో ఎవరో పనిలేని వాళ్లే బెట్టింగులు వేసే పరిస్థితి ఉండేది. ఆ తర్వాత ఇది విద్యార్థులను అంటుకుంది! బెట్టింగ్ యాప్స్ తో బెట్టింగ్ తామరతంపరల్లా అల్లుకుంది.

అతి సర్వత్ర వర్జతే అన్నారు పెద్దలు . అది భోజనమైనా , వినోదమైనా , వివాదమైనా ...ఐ పి ఎల్ ఆట అయినా అతిగా ఆడితే అది సమాజానికే ప్రమాదం .నేటి యువత ఈ ఐ పి ఎల్ మోజులో పడి తమ విలువైన కాలాన్ని , డబ్బును పోగొట్టుకుంటున్నారు అనేది పచ్చి నిజం .దీనికి తోడు ఇటీవల ఐ పి ఎల్ విజయోత్సవం లో పాల్గొని కొంతమంది తమ ప్రాణాలను సైతం పోగొట్టు కున్నారు .అనేక వివాదాలు , ఆరోపణల మధ్య కొనసాగుతున్న ఇటువంటి ఆట అవసరమా ?

18 యేళ్ల కిందట ప్రారంభం అయిన ఇండియన్ ప్రీమియర్ లీగ్ ఆది నుంచి ఒక సంచలనం. 2007లో టీమిండియా టీ20 ప్రపంచకప్ ను సాధించడంతో ఐపీఎల్ కు బీజాలు పడ్డాయనుకోవాలి. అప్పటికే ప్రపంచంలో క్రికెట్ తెలిసిన దేశాలు పరిమిత ఓవర్ల క్రికెట్ వెంట పరుగులు మొదలుపెట్టాయి. ఇండియాలో కూడా ఐపీఎల్ కన్నా మునుపే ఇండియన్ క్రికెట్ లీగ్ ఐసీఎల్ మొదలైంది. అయితే అప్పటి వరకూ సంప్రదాయేతర క్రికెట్ కు తను వ్యతిరేకం అన్నట్టుగా పరిమిత ఓవర్ల క్రికెట్ పై బీసీసీఐ ఆసక్తి చూపలేదు! ఎప్పుడైతే సుభాష్ చంద్ర ఐసీఎల్ ను మొదలుపెట్టాడో అప్పుడు బీసీసీఐ గుర్రుమంది. ఐసీఎల్ ఆడే క్రికెటర్లపై నిషేధం విధించింది!

# నాలుగో కోతి

అయినా కొన్ని పదుల మంది యువ క్రికెటర్లు ఐసీఎల్ బాట పట్టారు. ఆ తిరుగుబాటును అణిచివేసే ఉద్దేశం కూడా ఐపీఎల్ ఆరంభం వెనుక ఉంది! ఒక దశలో సుభాష్ చంద్రకు బీసీసీఐ రాజీ ప్రతిపాదనలు కూడా పంపింది. కావాలంటే ఒక ఐపీఎల్ ప్రాంచైజ్ ను అప్పగిస్తామని.. ఐసీఎల్ ను రద్దు చేయాలంటూ ప్రతిపాదన చేసింది. అయితే చివరకు ఆ





అవసరం కూడా లేకుండానే ఐసీఎల్ కనుమరుగు అయ్యింది!

ఐపీఎల్ ప్రాంచైజ్ ల వేలంతోనే సంచలనం రేపింది. మొత్తం ఎనిమిది నగరాల వేదికగా ప్రాంచైజ్ లను ప్రకటించి వేలానికి కార్పొరేట్ కంపెనీలను ఆహ్వానించింది బీసీసీఐ. ఒక్కో ప్రాంచైజ్ ను సగటున నాలుగు వందల కోట్ల రూపాయల పై ధరకు అమ్ముకుంది పదేళ్లకుగానూ! హైదరాబాద్ ప్రాంజైజ్ ను కూడా అప్పట్లో డీసీ యాజమాన్యం 400 కోట్ల రూపాయల ధరకు కొనుక్కొంది! అత్యధిక ధర ముంబై పలికినట్టుగా ఉంది. రాజస్తాన్ మూడు వందల కోట్ల రూపాయల స్థాయిలో తక్కువ ధర పలికింది! ప్రాంచైజ్ హక్కుల అమ్మకం ఒక సంచలనం అయితే, ఆటగాళ్ల వేలం ప్రక్రియ మరింత సంచలనంగా నిలిచింది. అప్పటి హిట్టర్లకు రికార్డు ధరలు పలికాయి! ఐకానిక్ ప్లేయర్లకు కోట్ల రూపాయలు దక్కాయి!

బెట్టింగ్ యాప్స్ ను ఇప్పుడు ఐపీఎల్ స్వయంగా ప్రమోట్ చేస్తూ ఉంది. స్టార్ క్రికెటర్లు, మాజీ క్రికెటర్లు, బీసీసీఐ ఇలా ఈ విషయంలో తీవ్రంగా కృషి చేస్తూ ఉన్నారు. బెట్టింగ్ యాప్ లను స్కిల్డ్ గేమ్స్ గా చెప్పుకుంటూ ఉన్నారు.
అయితే అంతిమంగా ఆర్థిక అంశాలే ఇందులో ముడిపడిఉన్నాయనే వాస్తవాన్ని దాస్తూ ఉన్నారు. బెట్టింగ్ యాప్ లను దేశ వ్యాప్తంగా నిషేధించాలంటూ కోర్టులను ఆశ్రయించిన వారికి కూడా ఇంకా ప్రయోజనం లభించడం లేదు! మరి ఐపీఎల్ దుర్మార్గాలు ఇవే అనుకుంటే.. దురాభిమానం

# నాలుగో కోతి

మరో సమస్యగా మారింది. ఐపీఎల్ జట్లపై విపరీతమైన అభిమానాలను పెంచుకుని మరి కొందరు నష్టపోతూ ఉన్నారు. వీరు సమయాన్ని నష్టపోతూ ఉండవచ్చు, ఆర్థికంగా నష్టపోతూ ఉండవచ్చు, మానసిక ప్రశాంతతనూ నష్టపోతూ ఉండవచ్చు. ఇన్నాళ్లూ అవే. అయితే బెంగళూరులో ఆర్సీబీ విజయోత్సవం ప్రాణ నష్టానికి కూడా కారణం అయ్యింది!

ఇప్పటికే బెట్టింగ్, ఫిక్సింగ్ వ్యవహారాలు ఐపీఎల్ కు కొత్త కాదు. వీటితో ఐపీఎల్ యాజమాన్యాలే సంబంధాలు ఉన్న దాఖలాలు కూడా ఎప్పుడో బయటపడ్డాయి. దాంతో రెండు జట్లపై గతంలో రెండేళ్ల నిషేధాలు కూడా పడ్డాయి. ఇప్పటికీ ఐపీఎల్ విషయంలో ఫిక్సింగ్ ఆరోపణలకు కొదవలేదు. అయినా కొన్ని కోట్ల మంది ఈ పోటీని ఉల్లాసంగానే చూస్తూ ఉన్నారు. చూడటం వరకూ వారి వినోదం. అయితే హద్దుదాటిన అభిమానాలు, ఆకతాయి చేష్టలకు కూడా ఐపీఎల్ ఇప్పుడు కారణంగా మారడం శోచనీయం.

18 ఏళ్ల ఐపీఎల్ చరిత్రలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (RCB) తొలిసారి ఐపీఎల్ టైటిల్‌ను గెలుచుకున్న ఆనందం విషాదంగా మారింది. బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వద్ద బుధవారం రాత్రి జరిగిన భారీ తొక్కిసలాటలో ఎనిమిది మంది అభిమానులు మృతి చెందగా, 25 మందికి పైగా గాయపడ్డారు.


1ఐపీఎల్ కప్ గెలిచిన తరుణంలో, అభిమానుల సంబరాల కోసం చిన్నస్వామి స్టేడియంలో ప్రత్యేక సెలబ్రేషన్స్ ఏర్పాటు చేశారు. అయితే, అభిమానులు ఊహించిన దానికంటే భారీ సంఖ్యలో స్టేడియం వద్దకు చేరుకోవడంతో తొక్కిసలాట చోటుచేసుకుంది. అభిమానులు ఒక్కసారిగా లోపలికి దూసుకురావడంతో పోలీసులు సైతం పరిస్థితిని అదుపు చేయలేకపోయారని అధికారులు తెలిపారు. తక్కువ సమయంలో ప్రభుత్వం నుంచి అనుమతి రావడం, సరైన ఏర్పాట్లు చేయలేకపోవడమే ఈ ప్రమాదానికి కారణమని భావిస్తున్నారు.

క్రికెట్ , సెల్ ఫోన్ , డ్రగ్స్ నేటి యువత ను పెడతోవ పట్టిస్తూ వారి భవిష్యత్తును నాశనం హేస్తున్నాయి .ఇటువంటి వాటిని అరికట్ట లేకపోవటం మన ప్రభుత్వాలకు సిగ్గు చేటు .



సెటైర్


నెట్టింటి రామాయణం







# పేరులో ఉంది 'పాకిస్తాన్' !



ఈ. సాయి అలేఖ్య

యుద్ధం నేపథ్యం లో  కేంద్ర ప్రభుత్వం మన దేశం లో నివసిస్తున్న పాకిస్తానీయులను అర్జంటుగా  దేశం  విడిచి వెళ్ళమని అదేశాలిచ్చింది . అంతేకాకుం వాళ్ళ వీసాలు కూడా కాన్సిల్ చేసింది.అంతే ,దేశభక్తి నరనరాల్లో డ్రైనేజి కాలవలా  పొంగి పొర్లుతున్న కొంత మంది కుహనా దెస భక్తులు , అసలు పాకిస్తాన్  అనే పేరు మనదేశంలో వినపడగూడదు అని కంకణం కట్టుకుని, ఓపది మందిని పోగేసుకుని భాగ్యనగరం లోని కరాచి  బేకరి పై పడిపోయారు. ఇంక్జా నయం వీళ్ళు సికిందరాబాదు ,హైదరాబాదు పేర్లు మార్చమని గోడవచేయలేదు అంత వరకు సంతోషం .

అసలు' కరాచి' బేకరీకి పాకిస్తానుకు ఏ సంబంధంలేదు. నిజానికి ,మైసురు పాక్ కు  మైసూరుకు  వున్న సంబంధమే' కరాచి బేకరికి ' పాకిస్తాను'కు  వున్న సంబంధం, అంతే. కరాచి బేకరిని  మొదలుపెట్టింది 'ఖాన్‌చంద్ రమనాని' అనే సింధు హిందూ వ్యాపారస్తుడు . దేశ విభజన సమయంలో, పాకిస్తాన్ నుండి భారతదేశం వచ్చి హైద్రాబాద్ లో స్థిర పడింది ఈ కుటుంబం .1953 లో కరాచి బాకరీ  ప్రారంభమైంది.

# నెట్టింటి రామాయణం

కాని ఇవేవి తెలియని మన దేశభక్తులు కరాచి పాకిస్తాన్ లోని నగరం కాబట్టి ఆపేరు వుండటానికి వీల్లేదని, బేకరీపై దాడి చేసి బేకరీని ధ్వంసం చేశారు.
మరికొంత మంది నెట్టింటి దేశ భక్తులకు పులి హోరలో పులి కనపడినట్లు ,ఒక్క కరాచి, బేకరీ ఏమిటి, అసలు పాకిస్తాన్ పేరు ఎక్కడుంటే అక్కడ మార్చాల్సిందే అంటూ సామాజిక మాధ్య మాల్లో కావు కావు మని కాకుల్లా అరుస్తున్నారు.

. 'మైసూర్ పాక్ "లో పాక్ ' పేరు తీసేసి ఏ "మైసూర్ భారత్ " అనో 'మైసూర్ ఇండియా అనో పెట్టాలని గోల చేసే వారు ఎక్కవయ్యారు. మైసూరు పాక్ అసలు పేరు మెసూరు పాకం అని అజ్ఞానులకు తెలియకపోవటం మన దురదృష్టం . మైసూరు పాకం వాడుకలోకి వచ్చే సరికి మైసూరీ పాక్ గా మారింది. ఆ లెక్కన కరివేపాక్ .. కూడా కరివే భారత, అవ్వాలి, కాని దాని అసలు పేరు కరివేపాకు.

మైసూరుపాక్ లో మెస్సూరు ఎంత వుందో పాకిస్తాను కూడా అంతే వుంది. కాని ఇటు వంటి పనికిమాలిన విషయాల మీద ఏదో ఒక గొడవ చేసి పేరు సంపాదించాలని చూస్తు న్నారు కొంత మంది సైబర్ తీవ్ర వాదులు. వీళ్ళు పాకిస్తాన్ సైన్యం కన్నా ప్రమాద కారులు.

వీళ్ళతో గొడవ ఎందుకు అనుకునాడో ఏమో, జైపూర్ లో ఓ స్వీట్ షాప్




యజమాని మైసూర్ పాక్ పేరు మార్చి, మైసూర్ శ్రీ అని అమ్ముతున్నారు. జైపూర్ లోదొరికే మిఠాయిల పేర్లన్నీ మారిపోయాయి, మోతి పాక్ మోతి శ్రీ గా, ఆమ్ పాక్ – ఆమశ్రీ గా, స్వర్ణభస్మ పాక్ ,స్మర్ణ భస్మ శ్రీగా ఇలా పాక్ ఎక్కడుంటే అక్కడ శ్రీ తగిలించి అమ్ము తూ తమ దేశ భక్తి ని చాటుకుంటున్నారు.

ఇది ఇలా వుంటే కామారెడ్డి పట్టణం లో అశోక్ నగర్ లోని ఓ వీధికి సిందూర్ వీధి అని నామకరణం చేసారు. ముందు ముందు సిందూర పల్లెలు, కాలనీలు , సిందూర నగరాలు వచ్చినా

ఆశ్చర్యపోనక్కరలేదు.యుద్ధం ఆగిపోయింది కాబట్టి సరిపోయింది లేకపోతే ఇంకెన్ని పేర్లు మార్చాల్సి వచ్చేదో .

ఒక వేళ యుద్ధం మళ్ళీ మొదలైతే , ఈసారి ఈ 'అపరేషన్ మాంగల్యం 'అనో లేక 'ఆపరేషన్ సుమంగళి ' అనో పేరు పెడతారు మన ప్రభుత్వ పెద్దలు . బహుసా వాళ్ళు తెలుగు సీరియల్స్ ఎక్కువుగా చుస్తారనుకుంటా .

అయినా పేరు లో ఏముంది చెప్పండి ..మన మనసులో ఉండాలి కాని దేశ భక్తి.ఈ సోషల్ మీడియా దేశ భక్తుల్ని యుద్ధంలో పాల్గొన మంటే









# ఒంటి మిట్ట కోదండరామస్వామి

ప్రతి ఏటా శ్రీరామ నవమి రోజున తెలంగాణలోని భద్రాచలంతో సహా అన్ని రామాలయాల్లో మధ్యాహ్నం పూట, అభిజిత్ ముహూర్తంలో సీతారాముల కల్యాణం నిర్వహిస్తుంటారు.

అయితే, ఆంధ్రప్రదేశ్‌లోని ఒంటిమిట్ట కోదండరామస్వామి ఆలయంలో మాత్రం శ్రీరామ నవమి పర్వదినాన కాకుండా నాలుగైదు రోజులు (తిథుల ప్రకారం) ఆలస్యంగా చతుర్దశి పౌర్ణమి రోజున కల్యాణం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అది కూడా సంధ్యకాలంలో, వెన్నెల వెలుగుల్లో కల్యాణం నిర్వహిస్తారు.
శ్రీరాముడు మధ్యాహ్నం 12 గంటలకు జన్మించినప్పుడు ముక్కోటి దేవతలు హాజరయ్యారట. సూర్యాస్తమయం తర్వాతే చంద్రుడు రావాలి. కానీ, సూర్యుడు అస్తమించకుండా ఉండిపోవడంతో చంద్రుడు శ్రీరాముడిని చూడ్డానికి రాలేకపోయాడు. రాలేకపోయానని చంద్రుడు ముభావంగా ఉండడం గమనించిన శ్రీరాముడు, నేను రామచంద్రుడు అని నీ పేరే పెట్టుకుంటానని సముదాయిస్తాడు. అప్పటికీ చంద్రుడిలో మార్పు రాకపోవడంతో ద్వాపర యుగంలో రాత్రి 12 గంటలకు కృష్ణావతారంలో జన్మిస్తానని చెప్పినా చంద్రుడు బాధపడుతూనే ఉంటాడట.

నీకోసం ఒంటిమిట్టలో వెన్నెల రాత్రిలో నా కల్యాణం జరిపించుకుంటానని చెప్పిన తర్వాత చంద్రుడు సంతోషించాడని ఒక కథ. పాలసముద్రాన్ని చిలుకుతున్నప్పుడు చంద్రుడు, లక్ష్మీదేవి జన్మించారని పురాణాలు చెబుతున్నాయి. కలిసి జన్మించారు కాబట్టే చంద్రుడిని చందమామ అంటాం. మరోవిధంగా చూస్తే రాముల వారిది సూర్యవంశం, సీతాదేవిది చంద్రవంశం.భారతీయ సంస్కృతిలో కన్యాదానం చేసే వధువు తరఫు వారికి అనుకూల సమయం వెన్నెల రాత్రి కాబట్టి, సీతారామ కల్యాణం కూడా వెన్నెల రాత్రి చేస్తారు అనేది పురాణం.

ఒంటిమిట్ట ఆలయంలోని మూల విగ్రహంలో ఒకే శిలలో రాముడు, సీత, లక్ష్మణుల విగ్రహాలు చెక్కారు. ప్రతి రామాలయంలో సీతారామలక్ష్మణుల పక్కన హనుమంతుడి విగ్రహం కనిపిస్తుంది. కానీ, ఈ ఆలయంలో హనుమంతుని విగ్రహం ఉండదు. పూర్వకాలంలో మునులు యాగం చేస్తున్నప్పుడు రాక్షసుల బాధ ఎక్కువై రాముడిని ప్రార్థిస్తే, ఆ సమయంలో రాముడు కోదండము, పిడిబాకు పట్టుకొని ఆ యాగాన్ని రక్షించాడని, అదే సమయంలో ఇక్కడ వెలిశారని కథ ప్రచారంలో ఉంది.అప్పటికి రాములవారికి ఆంజనేయస్వామి పరిచయం కాలేదు కాబట్టి ఇక్కడ ఆంజనేయస్వామి విగ్రహం ఉండదని చెబుతారు.

సీతారామలక్ష్మణుల విగ్రహాలు ఏకశిలలోనే ఉండడంతో ఈ క్షేత్రానికి ఏకశిలా నగరం అనే పేరు కూడా ఉందని కూడా అర్చకులు చెబుతున్నారు.

ఆంధ్రప్రదేశ్ వైఎస్ఆర్ కడప జిల్లాలో ఉన్న ఒంటిమిట్ట కోదండ రామాలయం పురాతన ఆలయాల్లో ఒకటి. ఇక్కడ కోదండరాముడు, సీతాదేవి, లక్ష్మణులు కొలువైవున్నారు.కడప నుంచి తిరుపతికి వెళ్లే మార్గంలో, 27 కిలోమీటర్ల దూరంలో ఒంటిమిట్ట ఉంటుంది.

ఒంటిమిట్ట రాజగోపురం నిర్మాణం చోళ శిల్ప శైలిలో ఉంటుంది. ఫ్రెంచి యాత్రికుడు ట్రావెర్నియర్ 16వ శతాబ్దంలో ఈ రామాలయాన్ని సందర్శించినప్పుడు భారతదేశంలోని పెద్ద గోపురాలలో ఈ రామాలయ గోపురం ఒకటని చెప్పారని చరిత్రకారులు చెబుతారు. ఒంటిమిట్ట దేవాలయం ఆర్కిటెక్చర్ పరంగానూ చాలా విశిష్టమైన దేవాలయం. చోళులు, విజయనగరం సామ్రాజ్యం వాళ్లు కట్టారు. మొదలుపెట్టిన వాళ్లు చోళులు. పూర్తి చేసింది విజయనగర సామ్రాజ్యం వారు. రెండు శైలులూ కనిపిస్తాయి. రంగ మండపంలో 32 స్తంభాలు



ఉంటాయి.
మండపం ఓపెన్ ఎయిర్ థియేటర్ లాగా ఉంటుంది.పైన రూఫ్ ఉన్నా గాలి వస్తుంటుంది. ఇక్కడ స్తంభాలు పోలో స్టైల్లో ఉంటాయి. పైన స్ట్రక్చర్ ఉంటుంది, అంటే విగ్రహాలు మలిచి ఉంటాయి. విశాల ఆవరణ ఉండే ఒంటిమిట్ట కోదండ రామాలయానికి మూడు గోపుర ద్వారాలు ఉన్నాయి. ఆలయ ముఖద్వారం ఎత్తు సుమారు 160 అడుగులు ఉంటుంది. చోళ, విజయనగర వాస్తుశైలి కనిపించే ఆలయ స్తంభాలపై రామాయణ, భాగవత కథలు కూడా కనిపిస్తాయి. ఆలయానికి ఎదురుగా సంజీవరాయ దేవాలయం. పక్కనే రథశాల, రథం ఉంటాయి.



రాష్ట్ర విభజనానంతరం నుంచి ఏపీ ప్రభుత్వం అధికారికంగా ఒంటిమిట్టలో శ్రీరామ నవమి వేడుకలు నిర్వహిస్తోంది. ఈ ఆలయ నిర్వహణను ప్రభుత్వం తిరుమల తిరుపతి దేవస్థానముల బోర్డుకు అప్పగించింది.



అప్పటి నుంచి ఆలయ నిర్వహణతో పాటు సీతారామ కల్యాణ వేడుకలను టీటీడీనే నిర్వహిస్తూ వస్తోంది.



# నెరవేరిన కరుణ కల



దేవి గాయత్రి

కరుణ రూమ్ లో కూర్చుని టీవీ ఆన్ చేసింది, టైలరింగ్ ప్రోగ్రాం వస్తుంది, అది చూడగానే కరుణకు తన చిన్నతనం గుర్తొచ్చింది, తండ్రి బట్టలు కుట్టే టైలరు అయినా ఏ కష్టం తెలిసేది కాదు.

ఉన్నదాంట్లో తన తండ్రి తన తమ్ముడిని చెల్లెలను అల్లారి ముద్దుగా పెంచాడు,

తమ్ముడు దయ, చెల్లెలు జాలి, ముగ్గురు కలిసి మెలిసి మెలసి ప్రేమగా ఉండేవారు.

ఆస్తిపాస్తులు లేకపోయినా ఆనందంగా బ్రతికే వాళ్ళం అనుకుంటూ ఉండగా,
వంట మనిషి శకుంతల వచ్చి ఓ కరుణమ్మ అని పిలవగానే ఈ లోకంలోకి వచ్చింది కరుణ.

కరుణకు 16 ఏటా తన చిన్న తాత కొడుకు కోటేష్ తో వివాహం జరిగింది,

కోటేష్ వాళ్లది చాలా పెద్ద వ్యవసాయ కుటుంబం
పదిమంది దాకా పనివాళ్ళు ఉన్నారు,
అయినా కరుణకు తృప్తి లేదు.

తనకు చిన్నప్పటినుంచి ఒక ఆలోచన ఉండేది,
తల్లి చనిపోయిన తన తండ్రి తమ ముగ్గురిని ఏ లోటు లేకుండా అల్లారి ముద్దుగా పెంచి పెద్ద చేశాడు.

నాన్న కంటే మేమున్నాం,
నాన్న లాంటి వారి కోసం ఏదైనా చేయాలని,
కలలు కనేది, తన దగ్గర అంత స్తోమత లేనందుకు సర్దుకుపోయేది,

ఇప్పుడు అత్తగారింట్లో అన్నీ ఉన్నా, దయా, జాలి,ని
పిలిచి పండక్కి బట్టలు కూడా ఇవ్వలేని నిస్సహాయ స్థితిలో తానుంది.

తన పుట్టింట్లో ఉన్నప్పుడే అంతో ఇంతో స్నేహితులకు సహాయం చేసేది,
పెన్ను పుస్తకాల రూపంలో,

అది తల్చుకొని నిరాశగా కూర్చుంది కరుణ
ఎవరికోసం శాంతి లేని సౌఖ్యము
సంతోషం లేని సంపదలు
భరోసా ఇవ్వలేని బంధాలు
అంతుపట్టని ఆలోచనలనతో.....

ఎంత ఉన్నా ఒక్కరికి సహాయం చేయరు ఒకరితో ఒకరు మనస్ఫూర్తిగా మాట్లాడుకోరు,

ఎప్పుడు హడావుడి పనులు, తల్లి ప్రేమమ్మ ఆప్యాయతగా పిలిచిన సరిగ్గా మాట్లాడని కొడుకులు,

బంధాల విలువ తెలియని మూర్ఖపు కట్టుబాటులో అహంకారపూరిత ఆలోచనలతో
అన్ని నేనేనంటూ గర్వంతో దురుసు మాటలతో
తన ప్రతాపాన్ని చూపించే మామగారు.

కరుణ అంతరంగంలో ఆలోచనల కెరటాలు తరిమి వేస్తున్న,
ఏదో తెలియని ఆరాటం ఏదో ఒకటి చేయాలనే పోరాటం,

అలసిపోయిన బ్రతుకులలో ఆనందం నింపాలని మొదట వృద్ధాశ్రమం పెట్టాలని,

ఎలాగైనా మామగారిని ఒప్పించి వచ్చే దీపావళి నాటికి అయినా
నెలకొల్పాలని ఆలోచనలో పడింది కరుణ,
ఒకరోజు కోటేష్ తో కరుణ ఏమండీ మన ఇంటి వెనుక ఉన్న ఖాళీ స్థలంలో ఏదైనా వృద్ధులకు ఉపయోగపడే విధంగా ఆశ్రమం నిర్మిద్దాము,

అని నచ్చజెప్పబోయింది కరుణ
ఆశగా, భర్త ముఖంలో రంగులు మారాయి కరుణ భయపడింది,
అయినా పట్టుదలతో గట్టి సంకల్పంతో
ఎలాగైనా వృద్ధాశ్రమం పెట్టాలి అని.....

మామ గారిని ఒప్పించాలని అనుకుంటూ ఉండేది కరుణ ఒకరోజు పని వాళ్ళతో మాట్లాడి మామగారు లోపలికి వస్తున్నారు,

అప్పుడు కరుణ మామగారిని చూసి నమస్కారం చేసి మీతో కొంచెం మాట్లాడాలి మామయ్య అన్నది,

సుగుణ , మామగారు ధనంజయ రావు గారు చాలా గట్టిగా చెప్పమ్మా అన్నారు,

మామ గారికి విషయం చెప్పింది
ధనంజయ రావు గారు చిన్నగా నవ్వి వెళ్లిపోయారు
కరుణ నిల్చుండి పోయింది ఆలోచిస్తూ.

మావయ్య గారిని చూసి రెండు వారాలు అయింది
కానీ అందరూ ఒకే ఇంట్లో ఉంటాం,

ఒకరి కంటికి ఒకరు కనిపించరు
ఒకరితో ఒకరు మాట్లాడరు,

ఇంకా ప్రేమలెక్కడ? కంటికి కనబడితే గాని తెలియని అపేక్షలు
అంతలోనే మరిచిపోయే ప్రేమలు
అనురాగ బంధాలు ఎక్కడ?
ఏదో ఆలోచించుకుంటూ
వెళ్ళిపోయింది కరుణ..

మధ్యాహ్నం 1:30 కి జనార్దన్ రావు గారి చెల్లెలు తిరుపతమ్మ గారు చాలా బాధపడుతూ వచ్చారు అన్నయ్య అన్నయ్య అనుకుంటూ ఏమైంది అడిగారు జనార్దన్ రావు గారు?

తిరుపతమ్మ గారు చాలా దుఃఖ స్వరంతో నా కోడలు శాంతా నన్ను శాంతంగా ఉండనివ్వడం

లేదు అన్నయ్య కూర్చుంటే తప్పు
లెగిస్తే తప్పు నోటికొచ్చినట్లు
మాట్లాడుతుంది,

నేను ఆ ఇంట్లో ఉండలేకపోతున్నాను,
కొడుకు గిరి తో మాట్లాడదామంటే
సర్దుకుపోవచ్చు కదా అమ్మ ఇవన్నీ
నేను ఎక్కడ చూడను అంటున్నాడు...

వాడిని మాత్రం ఏమనగలం అన్నయ్య
అని తిరుపతమ్మ నిట్టూర్చింది.

జనార్ధన్ రావు గారు మౌనంగా
ఉండిపోయారు,
ఒకరోజు అందరినీ పిలిచి మన
ఇంటికి పడమట పక్క ఉన్న ఖాళీ
స్థలంలో వృద్ధాశ్రమం ఏర్పాటు
చేద్దామని చెప్పారు.

కరుణ ఆశ్చర్యంతోను!
ఆనందంతోను! తబ్బిబ్బు అయింది!

మామగారు ఇంత తేలిగ్గా ఎలా
ఒప్పుకున్నారు అనుకుంటూండగ
వంట మనిషి శకుంతలమ్మ అసలు
విషయం చెప్పింది!

దీనికంతటికి కారణం నీ అత్తగారు
ప్రేమమ్మ గారు
ఆ తల్లి ఎంతగానో మొత్తుకొని
అయ్యగారితో చెప్పారు, అప్పటికి
ససేమిరా అన్నారు,

అమ్మగారు అరోగ్యం తన కలలు
జీవితంలో ఎదురైన సంఘటనలు,
జరిగిన విషయాలు, మొత్తం
అయ్యగారితో చెప్పుకొని
వాపోయింది,

ఇంత వయసు వచ్చింది ఏమి తృప్తి
మిగిలింది మనకు కలకాలం
ఉండము,
తిరుపతమ్మ లాంటి అభాగ్యులు
ఎందరో ఉన్నారు వారికి ఏదో ఒక
దారి చూపిస్తే మన జీవితాలకు ఒక
అర్ధం ఉంటుంది ఆలోచించండి అని
భావోద్వేగాలకు లోనైది.

జనార్ధన్ రావు గారు రాత్రంతా భాగా
ఆలోచించారు,
ఈ స్థాయికి రావడానికి ఆయన ఎన్ని
కష్టాలు పడ్డారు గుర్తు చేసుకున్నారు
74 ఏళ్ల వయసు పోతే ఏముంది,
ఇవాళ పోతే రేపటికి రెండు,

కాళ్లకు చక్రాలు కట్టుకుని
జీవితమంతా కష్టపడి
సంపాదించాను,
సొంత భార్యతో కూడా బాధలు
పంచుకోలేని గర్విష్టుని.

తను నా కోసం ఎన్ని కష్టాలు
పడిందో తన మాట ప్రకారం ఏదో
ఒకటి చేయాలి అనుకున్నారు
ధనుంజయ్ గారు..

రంగులు మాసిపోయిన ప్రేమ
రూపాలు.
ముక్క చెక్కలైన కుటుంబ వైనాలు.
రావాలి మాలాంటి వాళ్ళకి స్వర్ణ
యుగాలు.
చూడాలి ముందు తరం మన
మంచితనం..

అనుకుంటూ,ఒక నిర్ణయానికి
వచ్చారు.
దీపావళి రానే వచ్చింది,

అందరి ముఖాల్లో ఆనందం
నిండింది,
అందరూ కలసికట్టుగా
కష్టపడి,ప్రేమ నిలయం,అని పేరు
పెట్టి ఆశ్రమాన్ని నిర్మించారు,

76 మంది వృద్ధ మహిళలు
నివసిస్తున్నారు ,
వాళ్ళ జీవితంలో ఆనందం వెల్లి
విరిసింది
కళ్ళల్లో దీపకాంతులు వెలిగాయి...
చీకటి వెలుగుల రంగేళి జీవితమే
ఒక దీపావళి ..

ఆ విధంగా కరుణ కళ
నెరవేరింది.\
★★★.



# నేను ... మనిషినే కదా !

బైతి దుర్గం

సుబ్బరాజు ఇంటిల్లిపాదిని తెల్లవారుజామునే నిద్ర లేపాడు.అందరిని తరుముతూ హడావిడి చేస్తున్నాడు.

“మీ చాదస్తం పాడుగాను ,ప్రశాంతంగా ఉండనివ్వరా “ సూర్యకాంతం విసుక్కుంది.

“ఏంటి...ఆ..అపశకునం కూతలు ,వచ్చేవారు మీ అమ్మ తరపులా అల్లాటప్పావారు కాదు. నోరు మూసుకుని చెప్పింది చెయ్యి “ సుబ్బరాజు గయ్యి మన్నాడు.

.

“ఆపండి సంత గోల “అప్పుడే నిద్రాభంగం నుండి తేరుకున్న సునీల్ అన్నాడు.

“అవునురా,తండ్రీ సంపాదన మీద ఆధారపడే నీలాంటోనికి కూడా నేను లోకువ అయ్యాను రా “

సుబ్బరాజు,సునీల్ మధ్యన మాటల తూటాల శబ్దానికి చెవులు పగిలిపోతాయనే భయంతో రమ్య ఇంటి నుండి బయటకు పరుగెత్తింది.

సుబ్బరాజు బ్యాంకు లో మేనేజర్. అతనికి చిన్నప్పటి నుండి అమెరికా వెళ్లి ఉద్యోగం చేయాలని విపరీతమైన కోరికుండేది. తల్లిదండ్రులు తమని విడిచిపెట్టి పోవడానికి ఇష్టపడ లేదు. తరాలు తిన్న తరగని ఆస్తిని సంపాదించి సుబ్బరాజు చేతిలో పెట్టి ఏదో పని ఉన్నట్లు ఒకరెనుక ఒకరు తొందరగానే వెళ్లిపోయారు.తానోటి తలిస్తే, దైవమోటి ఇచ్చాడని బ్యాంకు ఉద్యోగంతో బండి లాగుతున్నాడు.

సూర్యకాంతం ను పెళ్లి చేసుకుని,సునీల్ రమ్యలకు తండ్రి అయ్యాడు. క్లర్క్ నుండి మేనేజర్ అయ్యాడు కాని అమెరికా కోరిక మాత్రం తగ్గలేదు.కొడుకుని అమెరికా పంపించి ఆ ముచ్చట తీర్చుకోవాలని సునీల్ ని బోలెడు డబ్బులు తగలేసి పెద్ద కాలేజీలో పేమెంట్ సీటు తీసుకుంటే,ఆ ప్రబుద్ధుడు బ్యాక్ లాగ్ సబ్జెక్టు లతో మూడేళ్ళ నుండి వీర పోరాటం చేస్తున్నాడు. తన ఆశలు ఆవిరి చేసిన కొడుకుతో రోజు గొడవ పడుతున్నాడు.

ఇలా కాదని యంబీఏ చదువుతున్న రమ్య కు విదేశీ సంబంధాలు చూసి అమెరికా పంపాలని దృఢ సంకల్పంతో అలుపెరుగని ప్రయత్నం చేసాడు.రమ్య ఆధునిక భావాలు గల అమ్మాయి. తనను అర్థం చేసుకుని,తన అభిప్రాయాలను గౌరవించే వ్యక్తినే పెళ్లి చేసుకోవాలని కోరిక.అందుకే ఉద్యోగం వచ్చిన తర్వాతే నచ్చిన వాడిని పెళ్లి చేసుకుని జీవితంలో సెటిల్ కావాలని రమ్య అనుకుంటే ,అమెరికా సంబంధాల పేరుతో సుబ్బరాజు చేస్తున్న హడావిడితో ప్రతి రోజు ఇబ్బందులు పడుతుంది.

ఎన్నో సార్లు తన అభిప్రాయం చెప్పాలని రమ్య ప్రయత్నంచింది. కాని సుబ్బరాజు వినలేదు.అమెరికా వ్యామోహం లో నిండా మునిగిన సుబ్బరాజు చాదస్తం ఇంటిల్లిపాదికి నరకం చూపిస్తుంది. వారం కొక సంబంధం పేరుతో రమ్య ను కాలేజి మాన్పించడం.ఏదో వంకతో ఆగిపోవడం ఒక రివాజుగా మారిపోయింది.

తాజాగా ఒక మ్యారేజ్ బ్రోకర్ ద్వారా ఎంతో కష్టపడితే ఈ సంబంధం వచ్చింది. అబ్బాయి తల్లిదండ్రులు ఇండియా లోనే ఉన్నారు.అబ్బాయి నిరంజన్ మాత్రం అమెరికా లో సాఫ్ట్ వేర్ ఉద్యోగం చేస్తున్నాడు.

సుబ్బరాజు కంటే నిరంజన్ రెండు ఆకులు ఎక్కువే చదివాడు. నిరంజన్ పెట్టిన కండిషన్లకు సుబ్బరాజు గంగిరెద్దులా తల ఊపాడు.ఈరోజే రమ్యను చూడడానికి నిరంజన్ వస్తున్నాడు. వారం రోజుల నుండి సుబ్బరాజు నిద్రపోవడం లేదు.తన కల నెరవేరువుతుందనే ఆశతో ఉబ్బితబ్బవుతున్నాడు.పది గంటలకు నిరంజన్,తల్లిదండ్రులు, మేనమామ తో వచ్చాడు.సుబ్బరాజు ఎదురెళ్ళి స్వాగతించి అతిథి మర్యాదలు ఘనంగా చేసాడు.

పెళ్లి చూపుల్లో రమ్య నిరంజన్ కు నచ్చింది.నిరంజన్ తన కండిషన్లు చెప్పడం మొదలెట్టాడు.

" మీ అమ్మాయి నాకు నచ్చినట్లే. మీ ఆస్తిలో నాకు సగం వాటా ఇవ్వాలి పెళ్లి రెండు కోట్లతో గ్రాండ్ గా జరిపించాలి..మీరు ఎప్పుడు కూడా అమెరికా రాకూడదు. మీరు మమ్మల్ని ఇక్కడకు రమ్మని ఫోన్ చేయవద్దు. మా ఇష్టం ఉంటే వస్తాము,లేకుంటే రాము మా పేరెంట్స్ ని కూడా మీరే చూడాలి.వారు ఇక్కడే ఉంటారు.మీ అమ్మాయి చేసే సేవ మీరు చేయాలి కదా ! "

"అన్ని మేము చేస్తే మీరేమి వెలగబెట్టుతారో " వెటకారంగా అన్నాడు సునీల్.

" ఇతడు నన్ను ఇన్సల్ట్ చేస్తున్నాడు. అమెరికా సంబంధము అంటే ఏమనుకున్నారు.నేను ఊ.. అంటే క్యూ కడతారు"కోపంగా అన్నాడు నిరంజన్.

"వాడొట్టి జులాయి వెధవ,వాని మాటలు పట్టించుకోకు "బ్రతిమాలాడు సుబ్బరాజు. మళ్లీ చెప్పడం ప్రారంభించాడు నిరంజన్.

అతని మాటలకు అడ్డుచెబుతూ "నేను ఒక్క విషయం మాట్లాడవచ్చా ? " రమ్య లేచి అంది.
ఏంటో చెప్పుమన్నట్లు సైగ చేసాడు నిరంజన్.

"నువ్వు నాకు నచ్చలేదు "విసురుగా అని లోపలికి వెళ్ళింది రమ్య.

"వ్వా...వ్వాట్ " షాక్ తిన్నవాడిలా నోరు తెరిచాడు నిరంజన్.
" ఆడవారి అభిప్రాయాలకు విలువనివ్వని నీలాంటి అహంకారులకు మేము పిల్ల నివ్వము.మేము మీలాంటి మనుషులమే !"

దయచేయండి అన్నట్లు

సూర్యకాంతం రెండు చేతులు జోడించింది.


“మీ కోసం క్యూ కడతారు కదా,అందులో ఎవరినైనా చూసుకోండి ,వెళ్ళండి “వ్యంగంగా సునీల్ అనేసరికి నిరంజన్ తల కొట్టేసినట్లయింది. ఏదో చెప్పబోతుంటే నిరంజన్ తల్లిదండ్రులు చేతులు పట్టుకుని

“ఎంత అమెరికా లో ఉంటే మాత్రం ,అందరు నువ్వు చెప్పినట్లు వింటారనుకోకు ,చేసిన ఘన కార్యం చాలు,” లాక్కెళ్లారు.

నిమిషాల వ్యవధిలో ఏమి జరుగుతుందో అర్థం గాని అయోమయ ప్రేక్షకుడిలా సుబ్బరాజు కూలుతున్న ఆశల సౌధాన్ని చూసి బిత్తరచూపులు చూస్తూ సోపాలో కూలబడ్డాడు.

★★★

## మోక్ష పదం.



పదమూడో శతాబ్దంలో జ్ఞానదేవ్ అనే ముని, కవి ఒక పిల్లల ఆట తయారు చేశారు. ఆ ఆట పేరు మోక్ష పదం.

మన సంస్కృతిని, ఆచారాలను అన్నిటినీ నాశనం చేసేందుకు కంకణం కట్టుకున్న బ్రిటిష్ వారి కన్ను ఆటల్లో కూడా మనవారు పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పిస్తున్నారు అని గ్రహించి ఆ ఆటని మొత్తం బ్రిటీష్ వారు మార్పు చేసి Snakes and Ladders గా విడుదల చేసారు, వారికి కలిసి వొచ్చిన అంశం అప్పటికి ముద్రణా వ్యవస్థ అందుబాటులోకి రావడం.

అలా మోక్ష పదం కాస్తా వైకుంటపాళిగా రూపాంతరం చెందింది.

పాత కొత్త ఆటలో వొంద చతురస్రములు ఉంటాయి, తేడా వొచ్చి మన

మునీశ్వరులు జ్ఞానదేవ్ రూపొందించిన ఆటలో
12వ చతురస్రరం అంటే 'నమ్మకం' అని, 51వ చతురస్రరం అంటే 'విశ్వసనీయత' అని
, 57 వ చతురస్రరం వొచ్చి 'దాతృత్వాన్ని' సూచిస్తుంది, అలాగే 76వ చతురస్రరం 'జ్ఞానాన్ని' సూచిస్తుంది, 78వ చతురస్రరం 'మునివృత్తి'ని సూచిస్తుంది. ఆ గళ్ళ క్రింద నిచ్చెన ఉంటుంది . ఆ గడిలో పాచిక పడితే నిచ్చేనె ఎక్కి వేగంగా ఆటలో పైకి వెళ్లే అవకాశం ఏర్పడుతుంది.

అలాగే 41వ గడి 'అవిధేయతకు' ప్రతీకగా ,44వ చతురస్రరం లో పడితే 'అహంకారం' అని, 49వ గళ్లోకి పడితే 'అశ్లీలత' అని, 52వ గడిలోకి ప్రవేశిస్తే 'దొంగతనం' అని, 58వ గడిలో 'అబద్దలాడుట' అని , 62వ చతురస్రరం లోకి ప్రవేశిస్తే 'తాగుబోతు' అని, 69వ గదిలోకి అడుగు పెడితే 'అప్పులుపాలు' అని,
73వ గడిలోకి ప్రవేశిస్తే 'హంతకుడు/హత్యలు' అని 84వ
చతురస్రరం లోకి వెళితే 'కోపిష్టి' అని, 92వ చతురస్రరం 'దురాశను' 95వ గడి 'గర్వాన్ని' సూచిస్తాయి. చివరగా 99వ గడి 'కామాన్ని'
సూచిస్తాయి. ఈ గళ్ళల్లో పాము నోరు తెరుచుకుని ఆయా గుణాలను బట్టి కిందకు జారిపోతారు.

ఆటలోనే మంచి చెడు నేర్చుకోవాలి అని ముని చెప్పకనే తెలుస్తుంది పిల్లలకు. చెడు మార్గన్ని ఎంచుకునే వారు అధం పాతాళానికి చేరుకుంటారు.
మంచి గుణాలు అలవర్చుకుంటే జీవితంలో పైకి ఎదుగుతాము అని ఆటలో కూడా చెప్పడం.

100వ చతురస్రరం లోకి ప్రవేశిస్తే "మోక్షం"

ప్రతి నిచ్చెన పై భాగంలో ఎవరో ఒక దేవుడు/దేవత లేకపోతే వివిధ స్వర్గాలో , కైలాసం, వైకుంఠం లేదా బ్రహ్మలోకం ఇలా ఉంటాయి

ఆట ఆడుతుంటే పిల్లలకు ఉత్సాహంగా నిజ జీవితంలోని ఒడిదుడుకులు కనిపిస్తాయి. నిచ్చెన ఎక్కితే మంచి కర్మలు చేసినట్టు, పాము నోట్లో పడితే పాపాలు పడినట్టు రూపొందించారు.

అంతటి మహత్తరమైన ఆటను కూడా వక్రీకరించి తమదైన ముద్రవేసుకొని ఏ విధమైన సందేశం లేకుండా చేశారు తెల్ల తోలు కప్పుకున్న నల్లటి మనసు ఉన్న బ్రిటీషర్స్. మన దౌర్భాగ్యం ఆ అటని మనం ఇష్టంగా ఆడడం చిన్నప్పుడు.

★★★★

కథ

# గీతోపదేశం



కృపాకర్ పోతుల

సాయంత్రం ఆరున్నర కావస్తోంది. బేంకులో అందరూ పనులు పూర్తిచేసుకొని, డెస్కులకి తాళాలు బిగించి ఇంటి మొహం పట్టే పనిలో నిమగ్నమై ఉన్నారు. 'డే బుక్' చెక్ చేయడం పూర్తిచేసి, కాంప్యూటర్ స్క్రీన్ మీదనుండి తలెత్తి చూసిన చంద్రహాస్ కి దిగాలుగా శూన్యంలోకి చూస్తూ కూర్చున్న సత్యజిత్ కనిపించేడు.

"ఏమైంది వీడికి... మూడు రోజులనుండీ 'మినీదేవదాసు' గెటప్ లో శోకరసం తెగ ఒలకబోస్తున్నాడు. ఈరోజు తేల్చెయ్యాలి వీడి సంగతేంటో" అనుకుంటూ సీటు దగ్గరనుండి లేచేడు చంద్రహాస్.

★★★★★

చంద్రహాస్, సత్యజిత్ ఇద్దరూ ఒకే బేచ్ కి చెందిన ప్రొబేషనరీ ఆఫీసర్లు. స్నేహితులు కూడా. రెండేళ్ళ ట్రైనింగ్ పూర్తయిన తరవాత ఇద్దరికీ విశాఖపట్నంలో, ఒకే బ్రాంచ్లో పోస్టింగ్ రావడం వారిమధ్య స్నేహం మరింత బలపడడానికి కారణమైంది.

చంద్రహాస్ కు సంవత్సరం క్రితమే పెళ్ళైపోయింది. సత్యజిత్ కి మాత్రం, నెలరోజులైంది పెళ్లై. పెళ్ళీ, దాని తరవాత హనీమూనూ విజయవంతంగా ముగించుకొని, వారంరోజుల క్రితమే డ్యూటీలో తిరిగి జాయిన్ అయ్యాడు.

అప్పటినుండీ, మధ్యాహ్నం లంచ్ అవడం ఆలస్యం, గడియారం వేపు చూస్తూ కూర్చునేవాడు సాయంత్రం ఐదెప్పుడౌతుందా అని. ఐదవగానే సీటు సర్దేసి, 'యముడు'... అంటే బ్రాంచ్ మేనేజర్, ఎప్పుడు బయటకు పోతాడా అని కాచుక్కూర్చునేవాడు. బాసు నిష్క్రమించిన మరుక్షణం వింటినుండి సంధించిన బాణంలా దూసుకుపోయేవాడు. వెళ్ళిపోతున్నట్టు చంద్రహాస్ కు మాటమాత్రమైనా చెప్పేవాడు కాదు.

వయసులో కాకపోయినా, పెళ్ళి వరకూ సత్యజిత్ కంటే సీనియర్ అయిన చంద్రహాస్ స్నేహితుడి ఆత్రం చూసి తనలో తను నవ్వుకునేవాడు. బాగా ఏడిపించేవాడు కూడా.

★★★★★

సత్యజిత్ సీట్ దగ్గరకు వచ్చి, ఎదురుగా ఉన్న కుర్చీలో కూలబడ్డాడు చంద్రహాస్. "ఏరా కొత్తపెళ్ళికొడకా, 'యముండు' నిష్క్రమించి అర్ధగంట దాటిననూ ఇంకా ఇచ్చటనే అఘోరించుచుంటివేమి?" అని ప్రశ్నించేడు నాటకీయంగా.

బాధాతప్త దృక్కులొక రెండు చంద్రహాస్ వైపు సారించి, ఆఫీసు కప్పువేపు చూడసాగాడు సత్యజిత్, మూడురోజులుగా పెరిగిన గెడ్డాన్ని నిమురుకుంటూ.

"ఏఁవైందిరా? శనివారం సాయంకాలం వరకూ, రొమేంటిక్ హీరోలా ఇరగదీసేవ్. సోమవారం నుండి ట్రాజిడీ హీరో గెటప్ లో జీవించేస్తున్నావ్. అంటే ఆదివారం ఏదో జరిగుండాలి నీకూ మీ ఆవిడకీ మధ్య. కొంపదీసి మన బేచ్ మేట్ పద్మప్రియతో నువ్వు వెలగబెట్టిన "రొమేన్స్" సంగతి మీ ఆవిడ చెవిలో ఎవడైనా ఊదీసేడంటావేటి?" అడిగాడు చంద్రహాస్ వేళాకోళంగా.

సమాధానం ఇవ్వలేదు సత్యజిత్. ఆఫీసు కప్పు వేపు కేంద్రీదృతమైన దృష్టిని తను వేసుకున్న షూస్ వేపు మరల్చాడు. దీక్షగా పరిశీలించసాగేడు వాటిని. సత్యజిత్ ని అలా చూస్తుంటే చాలా నవ్వొచ్చింది చంద్రహాస్కి. 'అయ్యో పాపం' అని కూడా అనిపించింది దానితో జోకులకి కామా పెట్టి, విషయమేంటో తెలుసుకోవాలనుకున్నాడు.

"ఎందుకలా ఉన్నావో చెప్పరా మాఁవా?" అడిగాడు మృదువుగా.

స్నేహితుని గొంతులో మార్పు గమనించిన సత్యజిత్ అతని వైపు రెండుక్షణాల పాటూ బాధగా చూసి, ఏదో చెప్పాలన్నట్టు గొంతు సవరించుకొని, ఆ ప్రయత్నాన్ని విరమించి, నేలచూపులు చూడసాగాడు మళ్ళీ.

"ఏం జరిగిందో చెప్పరా జీతూ. ఏఁవీ చెప్పకుండా ఎన్ని రోజులలా నీలో నువ్వే బాధపడుతూ కూర్చుంటావు చెప్పు. నాక్కూడా చెప్పకూడనంత రహస్యమా అది?" అడిగాడు లాలనగా.

తల వంచుకు కూర్చున్న సత్యజిత్ నెమ్మదిగా తలెత్తి స్నేహితునివేపు చూసేడు. "ఇందూ నాతో మాట్లాడడం మానేసిందిరా. హాల్లో సోఫామీద పడుకుంటోంది ఆదివారం రాత్రినుండీ" అన్నాడు బాధగా కళ్ళు మూసుకొని.

"అంటే మూడ్రోజులనుండీ పస్తు పడుకుంటున్నవన్న మాట." అన్నాడు చంద్రహాస్ మళ్ళీ వేళాకోళంగా. "అయినా నెల్లాళ్ళ క్రితం పెళ్ళైన అమ్మాయికి మూడురోజులు భర్తని ఎండగట్టేసేటంత కోపం వచ్చిందంటే... ఆ వెధవ... అంటే నువ్వు... చాలాపెద్ద వెధవపనే ఏదో చేసుండాలి. ఏం చేసేవో చెప్పు. దాన్ని బట్టి లెటజ్ ట్రై టు ఫైండ్ ఎ వే ఔట్" అన్నాడు సీరియస్గా.

తల వంచుకున్నాడు సత్యజిత్. ఏమైనా చెప్తాడేమోనని నిముషంలో సగం పాటు ఎదురుచూసి, "సరే రా జీతూ. ఇట్ లుక్స్ లైక్ యూ ఆర్ నాట్ ప్రిపేర్డ్ టు షేర్ ఎనీథింగ్ విత్ మీ. నీ ఏడుపేదో నువ్వేడు; నే వెళ్తున్నా" అంటూ కోపంగా కుర్చీలోనుంచి లేవబోయిన చంద్రహాస్ చెయ్యిపట్టుకొని

"కోపం తెచ్చుకోకురా చందూ, విషయం చెప్తాను గాని నువ్వు జోకులేసి, ఏడిపించనని ప్రామిస్ చేస్తేనే చెప్తాను" అన్నాడు చిన్నకుర్రాడిలా బుంగమూతి పెట్టి.

"సరేలే గాని, అసలేం జరిగిందో చెప్పి చావు" అన్నాడు చంద్రహాస్ చిరునవ్వు నవ్వుతూ.

"అంటే చందూ, ఆదివారం, పౌర్ణమి కదా, రాత్రి బీచికి వెళ్ళేం రా ఇందూ నేనూ. 'తెన్నేటి పార్క్' దగ్గర, ఎలివేటెడ్ ప్లేస్లో కూర్చున్నాం. అప్పుడూ... అప్పుడే జరిగిపోయింది రా పెద్ద పొరపాటు. అసలేమైందంటే...".

★★★★★

రాత్రి ఎనిమిదిగంటలు కావస్తోంది. శరత్కాలపు చలి విశాఖపట్నాన్ని వణికిస్తోంది. కాని... కనీసం పల్చటి స్వెట్టర్స్ అయినా వేసుకోకుండా... సముద్రపుటొడ్డున, మంచుతో పాటూ మెత్తగా కురుస్తున్న వెన్నెలనీ, ఆ వెన్నెలలో తళతళలాడుతూ ఎగసిపడుతున్న సముద్రాన్నీ చూస్తూ, ఒకరినొకరు ఆనుకొని వెచ్చగా కూర్చున్నారు సత్యజిత్, ఇంద్రాణీ.

ఎంతసేపలా కూర్చునేవారోగాని, ట్రాన్స్ లోనుంచి ఒక్కసారిగా బయటపడిన సత్యజిత్... భావుకుడు పాపం... "ఇలా చూడిందూ... వెండిజలతారులా జాలువారుతున్న చల్లని వెన్నెలా, అందులో తడిచి ముద్దౌతూ, దాన్ని వెదజల్లుతున్న చంద్రుణ్ణి చుంబించడానికి ఎగిరెగిరి పడుతున్న జలరాశీ... ఎంత అందంగా ఉన్నాయో చూడు! అటువేపు చూడు... ఆ వెన్నెలనే చీరగా మార్చుకొని, తన సౌందర్యాన్ని కప్పుకోడానికి అవస్థ పడుతున్న సుందరమైన స్త్రీమూర్తిలా లేదూ అందమైన నా విశాఖపట్నం'!" అని వాగేడు కవితాత్మకంగా.

భర్త చేతులెక్కడెక్కడో సవరిస్తుంటే, అతని భుజంమీద తలవాల్చి, మత్తుగా వెచ్చగా కూర్చున్న ఇంద్రాణి నెమ్మదిగా కళ్ళు తెరిచి, ఒకవేపు వెలిగిపోతున్న సముద్రాన్నీ, మరోవేపు మెరిసిపోతున్న విశాఖపట్నాన్నీ ఒకసారి చూసి,

"'నీ విశాఖపట్నం అందంగానే ఉందిగాని జీతూ, నాకంటే అందంగా ఉందా!" అని అడిగింది అల్లరిగా నవ్వుతూ.

'విశాఖపట్నం అందంగా ఉంటుంది' అని ఎవరన్నా పూనకం వచ్చినోడిలా ఊగిపోయే సత్యజిత్ "ఆహాఁ నీకంటేనే కాదు, ఈ ప్రపంచంలో దేనికన్నా, ఎవరికన్నా కూడా నా కళ్ళకి విశాఖపట్నవేఁ అందంగా కనిపిస్తుంది. అందులో సందేహానికి తావేలేదు" అంటూ వాగేడు... తనలా వాగుతున్నది తన 'కొత్త పెళ్ళాం' దగ్గర అన్న ధ్యాసే లేకుండా.

★★★★★

"అంతేరా మాఁవా! ఆక్షణంనుంచీ ..." చెప్పబోతున్న సత్యజిత్ ని చెప్పనివ్వకుండా...

"ఇదట్రా నువ్వు చేసిన నిర్వాకం తింగరి వెధవా. నీ విశాఖపట్నం పిచ్చి గురించి బాగానే తెలుసుగాని, ఈ లెవెల్లో ఉందని మాత్రం ఎప్పుడూ అనుకోలేదొరేయ్. సరే... తరవాతేమైంది?" అడిగాడు చంద్రహాస్ విసుగ్గా.

"తరవాతా... తరవాత ఇంకేవుంటుంది మావాఁ. ఏదో తన పుణ్యవాఁ అని కడుపుకింత వండి పడేస్తోందిగాని, మిగిలినవన్నీ బంద్దైపోయాయిరా. అందుకే. ఇంటికి వెళ్ళాలనిపించడం లేదు. ఐదవుతుందంటే చచ్చేంత భయమేస్తుంది." గగ్గోలుపెట్టేడు.

"అఘోరించావులే! అయినా నువ్వు కొంచెం నయవేఁ 'నీకంటే మా ఊరు అందంగాఉందని' మాత్రమే వాగేవు. అదే మా అన్నైతే పెళ్ళైన కొత్తలో ఒదినని సినిమాకి తీసుకెళ్ళి, నోరుమూసుకొని సినిమా చూడకుండా, అందులో హీరోయిన్ని 'అక్కడ బాగుంది; ఇక్కడ ఇంకా బాగుంది' అంటూ తెగ రెచ్చిపోయాడట! ఆతరవాత వారంరోజులు వాడు పడిన పాట్లు... అవన్నీ ఎందుకులే గానీ, ఇంతకీ ఇప్పుడేం చేద్దామనుకుంటున్నావ్?" అడిగాడు స్నేహితుడివైపు సాలోచనగా చూస్తూ.

"అది తెలిస్తే ఇక్కడెందుకుంటాను మాఁవా ఈ టైంలో; నా ఇందూ దగ్గరే ఉండేవాణ్ని కదా" అన్నాడు ఎమోషనల్ గా. "నాకంటే సీనియర్వి కదా నువ్వు చెప్పు ఏంచెయ్యాలో" ప్రాధేయపడ్డాడు జాలిగా.

"ఏంచెయ్యాలో చిటికేలో చెప్పెయ్యడానికి ఇదేఁవన్నా సింపుల్ ఇష్యూనా. ఇట్ రిక్వైర్స్ సీరియస్ థింకింగ్. గిమ్మీ సం టైం" అని సత్యజిత్ మీద కేకలేసాడు చంద్రహాస్. ఐదునిమిషాలపాటూ సీరియస్ గా ఆలోచించి...

"ఐ గాట్ ద ఐడియా మాఁవా! అదేంటో తరవాత చెప్తాను గాని, కమాన్... బయల్దేరు" అంటూ స్నేహితుడి చెయ్యిపట్టుకొని బయటకు లాక్కుపోయాడు.

ఆతరవాత మూడుగంటలపాటూ జగదాంబసెంటర్లో షాపులన్నీ తిప్పి, పదివేలు పెట్టి చక్కటి డ్రెస్ ఒకటీ, ఇంకొక రెండువేలకి దానికి మేచ్ అయ్యే ఏక్సెసరీసూ కొనిపించాడు సత్యజిత్తో. అంతేకాకుండా...

"బాధపడకురా అబ్బాయ్. పెళ్ళాం దగ్గర నోటికేదొస్తే అది

వాగితే వచ్చిపడేవి ఇలాంటి కష్టాలూ, కర్చులేనని తెలుసుకో!" అని ఓదార్చాడు ఏడుపు మొహంతో డబ్బులు పే చేస్తున్న స్నేహితుడ్ని.

షాపులోనుంచి బయటపడ్డాక, సత్యజిత్ భుజం మీద చెయ్యివేసి "ఇక బయల్దేరు మాఁవా. మధ్యలో ఏదైనా పువ్వులకొట్టు దగ్గరాగి, మూడు మూరల సన్నజాజులు కొనడం మరచిపోకు. అన్నట్టు, ఇంకొక్క చిన్నమాట. ఇన్ని వేలు తగలేసి... ఐ మీన్ కర్చుపెట్టి... ఖరీదైన గిఫ్ట్స్ కొనుక్కెళ్ళేవు కదా అనిచెప్పి, మీ ఆవిడ నువ్వు వాగిన వెర్రివాగుడంతా మరచిపోయి, ఎగురుకుంటూ వచ్చి నీఒళ్ళో వాలిపోతుందని భ్రమించకు. అనుభవం మీద చెప్తున్నానూ... భార్య కోపం పోగొట్టడానికి, ఏ మగాడికైనా అందుబాటులో ఉన్న మార్గం ఒక్కటంటే... ఒక్కటేరా అబ్బాయ్. అదేంటంటే..." అని డ్రమటిక్గా చిన్న పాజ్ ఇచ్చి... ఏం చెప్తాడా అని ఉత్కంఠలో చూస్తున్న సత్యజిత్ని చిరునవ్వుతో చూస్తూ...

"కా....ళ్ళు, కాళ్ళు పట్టుకోవడం వినా, వేరు మార్గమేదీ లేదురా సోదరా!! సో... ఇంటికెళ్ళిన వెంటనే బహుమతులు మీఆవిడ చేతిలోపెట్టి, ఎలాంటి మొహమాటవూఁ పడకుండా, తన కాళ్ళు రెండూ గట్టిగా పట్టేసుకో. ఇంకెప్పుడూ అలాంటి పిచ్చివాగుడు వాగననీ, క్షమించాలని చెప్తేగాని కాళ్ళు వదిలిపెట్టననీ కాళ్ళావేళ్ళా పడు. అదృష్టం బాగుంటే, ఈరాత్రే నీకు మంచిరోజులు మళ్ళీ రావచ్చు. లేకపోతే ఏంచెయ్యాలో రేపు ఆలోచిద్దాం. ఆల్ ద బెస్ట్." అని గీతోపదేశం గావించాడు.

తరవాత తన 'బుల్లెట్' స్టార్ట్ చేసి, రెండడుగులు ముందుకు దూకించి, సడన్గా బ్రేక్ కొట్టి, తల వెనక్కి తిప్పి, "అన్నట్టొరేయ్ జీతూ, రిజల్ట్ ఏఁవైందో ఈ రాత్రే ఫోన్ చేసి చెప్పు సుమా. లేకపోతే, టెన్షన్ తో నిద్ర పట్టదు నాకు." అని చెప్పి, తుర్రుమన్నాడు.

"ఇదేదో ముందే చెప్పి చావొచ్చు కదురా సాడిస్ట్ వెధవా. ఉత్తపుణ్యానికి పన్నెండువేలు క్షవరం చెయ్యించి. ఆ తరవాత చెప్తావా స్కౌండ్రల్!" అని మనసులో ఇంగ్లీషులో తిట్టుకొని, కసి తీరకపోవడంతో అద్భుతమైన తెలుగు తిట్లొక నాలుగు, గట్టిగా బయటకు కూడా తిట్టి, తన బైక్ వేపు అడుగులు వేసాడు సత్యజిత్... ఇంటికి చేరుకొని తన అదృష్టాన్ని పరీక్షించుకునే సదుద్దేశ్యంతో.

★★★



# అందం

అందం

ఏమండీ..రేపు మనింటికి ఓ క్రొత్త పనిమనిషి వస్తోంది...”అంది సుమతి భర్త శ్రీకాంత్ తో. “ఔనా..ఎక్కడ దొరికిందేమిటి?”
“అదేమన్నా పారేసుకున్న వస్తువా? రోడ్డు మీద దొరకడానికి..! మా అమ్మకు చెబితే ఆవిడే ఏర్పాటు చేసింది..దానిది మావూరే. పేరు అపరంజి. దాని అయ్య సింహాద్రి. ఈ ఊర్లోనే ఆటో డ్రయివర్. దాని తల్లి కూడా సర్వెంటే. ఇంటిల్లిపాదీ కష్టపడితే గానీ వాళ్లకి గడవదు. పైగా కూతురు అపరంజికి సంబంధం కూడా కుదిరిందట. దాని పెళ్లి ఉన్నంతలో బాగా చేద్దామని డబ్బు కూడా కూడబెడుతున్నారట. ఇప్పుడు డబ్బు వాళ్ళకి చాలా అవసరం. అందుకని పెళ్లి నిశ్చయము అయిన కూతురని కూడా చూడకుండా మా అమ్మ చెప్పిందని మనింట్లో పనికి పెట్టడానికి ఒప్పుకున్నాడు..”
“ పోనీలే ..నీకు కాస్త విశ్రాంతి దొరుకుతుంది. అసలే ఈ మధ్య నీకు ఒంట్లో బాగుండటం లేదు.సరైన సమయంలో సర్వెంట్ మెయిడ్ ని ఎరేంజ్ చేయడం నాకూ చాలా సంతోషంగా ఉంది.నా తరపున అత్తయ్యకు థాంక్స్ చెప్పు..!”
భార్యంటే వల్లమాలిన ప్రేమ శ్రీకాంత్ కి.పనిమనిషి మానేసిన దగ్గరనుండీ భార్య పడుతున్న అవస్థ చూడలేక పోతున్నాడు. కొత్త సర్వెంట్ దొరకడంతో వూపిరి పీల్చుకున్నాడు.

మర్నాడు అపరంజి సుమతి ఇంట్లో పనిమనిషి గా చేరింది . ఆ పిల్లను చూసి ఆశ్చర్యపోయింది సుమతి. అపరంజి పేరుకు తగ్గట్టు బంగారు బొమ్మ లాగే ఉంది.ఎర్రటి రంగు.. విశాలమైన కళ్ళు..కొటేరు లాంటి ముక్కు..దొండపండు రంగు పెదాలు.. ముత్యాల్లాంటి పలువరస..మిస మిస లాడే పరువాలతో..యవ్వన శోభతో మెరిసిపోతోంది.సుమారు ఇరవై ఏళ్ళుంటాయేమో..పంజాబీ డ్రెస్ లో స్టైల్ గా వుంది. చదువుకున్న దానిలాగే ఉంది. నడకలో వొయ్యారం వొలకబోస్తోంది.

" రావే..రా!ఎప్పుడో నీ చిన్నప్పుడు చూశాను.ఇప్పుడు చాలా అందంగా తయారయ్యావు. స్టైల్ గా కూడా వున్నావు.ఎంతవరకూ చదువుకున్నావేంటి..?"" టెన్త్ క్లాసు అమ్మగారూ..! ఆ తరవాత మా అయ్య చదువు ఆపేయమన్నాడు.మా మావ సత్యం తో పెళ్లి కూడా ఖాయం అయిపోయిందమ్మగారూ..!ఇంకా ముహూర్తా లు పెట్టలేదు.." అంది. పెళ్లి మాట వచ్చినప్పుడు సహజంగా పడుచుపిల్లలకు ఉండవలసిన సిగ్గు ఆమెలో కనబడలేదు.

"అయితే ఈ పని చెయ్యడం నీ మావకిష్టమేనా..?"" మధ్యలో ఆడిట్టం ఏంటమ్మగారూ..? నా ఇష్టం.. మా అయ్య ఇష్టం..!,," అంది ఆరిందాలా." మరి నీ పెళ్లి ఖాయం అయిపోయింది కాబట్టి సగం పెళ్లి అయిపోయినట్లే..మరి నీ మావ ఇష్ట ప్రకారం నడుచుకోవాలి కదే..! "

" నేనంటే ఆడికి ప్రాణం అమ్మగారూ..! నేనేం చేసినా ఆడు కాదనడు. పైగా మా నాన్నే స్వయంగా మీ దగ్గరకు వెళ్ళమన్నాడు.– పని కోసం. పెళ్లై అత్తవారింటికి వెళ్ళేదాకా అయ్య మాటే ఇనాలి కదమ్మగారూ.." అంది లాజిక్ మాట్లాడుతూ. " గడుసుదానివే..!" అంటూ నవ్వింది సుమతి."నువ్వెంత అందంగా ఉన్నావో నీ పని కూడా అంత అందంగానూ , నీట్ గానూ ఉండాలి తెలిసిందా..? మీ అయ్యగారికి నీట్ నెస్ అంటే ప్రాణం."" అలాగే అమ్మగారూ..! మీరే చూస్తారుగా నా పనితనం.." అంటూ రంగం లోకి దూకింది అపరంజి.

సాయంత్రం ఆఫీసు నుండి వచ్చిన శ్రీకాంత్ అపరంజి ని చూసి మరింత ఆశ్చర్య పోయాడు. పనిమనుషుల్లో కూడా ఇంత అందగత్తెలుంటారా.. అని అనుకున్నాడు.సుమతి..! అంత అందగత్తె కాకపోయినా గొప్ప సుగుణవతి. శ్రీకాంత్ కు భార్య సుమతి అంటే ప్రాణం. ఆమె అడిగిందే తడవు క్షణాల్లో అమరుస్తాడు ఏదైనా సరే. సుమతికీ భర్త అంటే అమిత మైన ప్రేమ. అతను అడక్కుండానే అన్నీ సమకూర్చుతుంది.అతని అన్ని పనులు తానే స్వయంగా చూసుకుంటుంది. కాకుంటే సుమతికి ఆరోగ్యం సరిగా వుండదు. మోకాలి నొప్పులు ..అప్పుడప్పుడు కళ్ళు తిరుగుతూ ఉంటాయి బి పి వలన. ఎక్కువగా పని చేస్తే త్వరగా అలసిపోతుంది. అందుకని ఆమెను జాగ్రత్తగా చూసుకుంటూ ఉంటాడు.

శ్రీకాంత్ ఒక ప్రయివేటు కంపెనీలో మేనేజరు. మంచి జీతం. అంతకు మించి గొప్ప అందగాడు. మగవారికి సైతం అసూయ కలిగించే రూపం అతడిది. ఉంగరాల జుట్టు , తీరైన కనుబొమలు , విశాలమైన నుదురు,అందమైన మీసకట్టు, నిత్యం పెదాలపై చిరునవ్వు అతని సొంతం. ఆరడుగుల ఆజానుబాహుడు. నీట్ గా డ్రెస్ చేసుకుని టై కట్టుకుని హుందాగా వుంటాడెప్పుడూ..! అతణ్ణి చూసినవారెవరయినా క్షణాల్లో అతని పట్ల ఇష్టానికి గురౌతారు. ఎందరో అందమైన అమ్మాయిలను కాదని , మనసుకు నచ్చిన , వినయ శీలి అయిన సుమతిని వివాహం చేసుకున్నాడు. ఇద్దరిదీ అన్యోన్య మైన దాంపత్యం. అపరంజి పనిలో చేరిన దగ్గరనుండీ సుమతి కి ఆరోగ్యం కుదుటపడి చురుకుగా వుండగలుగుతోంది.

ఒకరోజు సుమతి శ్రీకాంత్ కి కాఫీ ఇచ్చి రమ్మని అపరంజి ని పంపింది. అడుగుల చప్పుడికి తలెత్తి చూశాడు శ్రీకాంత్. కాఫీ కప్పుతో నవ్వుతూ నిలబడి ఉంది అపరంజి.లంగా ఓణీ లో చక్కగా తయారై బుట్ట బొమ్మలా ఉంది.అపరంజిని పరిశీలనగా కొన్ని క్షణాల సేపు అలాగే కన్నార్పకుండా చూశాడు శ్రీకాంత్. అందమైన గుండ్రటి మొహం , ట్రాన్స్పరెంట్ ఓణీ లోనుండి వెండి కొండల్లా కనిపిస్తున్న వక్ష ద్వయం ,జాకెట్ కీ లంగాకీ మధ్య నున్న ఎర్రటి ఖాళీ ప్రదేశం, సన్నటి నడుము,పిరుదుల వరకూ వేలాడుతున్న జడగంటల జడ , పదారణాల పడుచు దనంతో మిస మిస లాడుతూ పాలరాతి శిల్పం లా ఉంది.ఆమె అందానికి ముగ్ధుడై కొద్ది సేపు అలా ఉండిపోయాడు. ఆయనలా చూస్తుంటే ఆమెకు గర్వంగా ఉంది.

" అయ్యగారూ.. కాఫీ..!" అని పిలిచింది. అతడు తేరుకుని " ఆ_ _ _! అక్కడ పెట్టు ..! " ,అని అక్కడి టేబుల్ చూపించాడు.

వయ్యారంగా నడుచుకుంటూ వెళ్లి కాఫీని డ్రెస్సింగ్ టేబుల్ పై ఉంచి అంతే వయ్యారంగా వెనక్కు తిరిగింది. శ్రీకాంత్ వైపు ఒక వాలు చూపు విసిరి కొంటెగా నవ్వి జడను సత్యభామ లా వెనక్కు వేసుకుని నడుస్తూ వెళ్లిపోయింది. అంత నిర్భయంగా తనవైపు వాలు చూపు విసిరిన ఆమెను చూసి ఆశ్చర్యపోయాడు.

కొద్ది రోజులు గడిచాయి. సుమతికి మళ్లీ నీరసంగా ఉండటంతో అన్ని పనులూ అపరంజి చేస్తోంది., శ్రీకాంత్ పనులతో సహా. స్నానానికి నీళ్లు పెట్టడం , టవల్ అందించడం.. అలా అందించేటపుడు కళ్ళలోకి కళ్ళు పెట్టి చూడటం , భోజనం వడ్డించేటపుడు కావాలని చేతులు తగిలించడం ఇవన్నీ శ్రీకాంత్ దృష్టి ని దాటిపోలేదు.అదంతా ఆమె వయసు ప్రభావం అని అనుకుని వూరుకునేవాడు. ఇంతలో సుమతి చెల్లెలు సృజన నిశ్చితార్థం అని ఫోన్ వచ్చింది.సుమతికి . భర్త ను వదిలి వెళ్లడం ఇష్టంలేదు.కానీ తప్పదు. స్వయంగా తోడ బుట్టినది.శ్రీకాంత్ కూడా “ వెళ్ళిరా..! నాకేం పరవాలేదు, నాలుగు రోజులేగా..” అన్నాడు.

“అయితే సరే..మీరు దేనికీ ఇబ్బంది పడకుండా అన్ని పనులూ అపరంజి ని చెయ్యమని చెప్పాను. ఏది కావాలన్నా ఆమెనే అడగండి , అన్నీ తనే అమర్చి పెడుతుంది..” అంది సుమతి.

“ సరే..సరే..అలాగే చేస్తాలే. నువ్వెళ్ళు.. చేరగానే ఫోన్ చెయ్యి..” అంటూ భార్యను ట్రైన్ ఎక్కించి అటునుండి అటే ఆఫీసుకు వెళ్ళిపోయాడు. ఆఫీస్ అయ్యాక కాసేపు ఫ్రెండ్స్ తో బాతాఖానీ కొట్టి ఇంటికి వచ్చేసరికి ఇల్లంతా నీట్ గా సర్ది ఉంది. స్నానం చేసి రాగానే వేడి వేడి కాఫీ అందించింది అపరంజి. పేపరు చూస్తూ కాఫీ త్రాగుతుంటే వంటింట్లో నుండి కుక్కర్ పెట్టిన శబ్దం వినిపించింది. అలాగే కూర వండుతున్న వాసన కూడా వచ్చింది. వంట చేస్తోందని అర్థం అయింది శ్రీకాంత్ కి. ఓ అరగంట అయ్యాక “ భోజనం వడ్డించమంటారా అయ్యగారూ..? “ అని అడిగింది. తలెత్తి చూస్తే అపరంజి .శ్రద్ధగా మేకప్ వేసుకుని వచ్చినట్లుంది. పసిడి అంచు పైట లోనుండి ఆమె ఎద సంపద కనువిందు చేస్తోంది. ఆమె పెదాలు తేనెలూరుతున్నట్లు తడిగా వున్నాయి. రోజూ కన్నా మరింత సెక్సీగా తయారైంది. భోజనం వడ్డించినంతసేపూ చేతులు తగిలిస్తూనే ఉంది. రైస్ వడ్డించేటపుడు ఆమె వక్షం అతని భుజానికి తగిలిస్తూ ఆమె పరువాలు అతనికి కనబడేలా వంగి వంగి మరీ వడ్డించింది. శ్రీకాంత్ భోజనం అయిపోయిన వెంటనే బెడ్ రూమ్ లోకి పోయి టి వి ఆన్ చేశాడు. అపరంజి కూడా భోజనం చేసేసి వంటిల్లు సర్దేసి బెడ్ రూమ్ లోకి వచ్చింది. “సరే..నువ్వెళ్ళు..రేపు ఉదయం వస్తావుగా..? “ అన్నాడు.

“ లేదయ్యగారూ..అమ్మగారు వచ్చే వరకూ నన్నిక్కడే పడుకోమన్నారు.. మీకు తోడుగా..” అంది..’ మీకు తోడుగా ‘ అన్న పదాన్ని ఒత్తి పలుకుతూ, కొంటెగా నవ్వుతూ.

“అదేంటి ..? మరి మీ ఇంట్లో చూడరా..? “

“ లేదు..చూడరు. అమ్మగారు మాట్లాడారు- - -!” ,అంది ధైర్యంగా, ధీమాగా. “,సరే..నీ ఇష్టం..! “ అనేశాడు శ్రీకాంత్. ఆమె వెళ్లి పావుగంటలో వచ్చింది, చేతిలో వేడి పాల గ్లాసుతో.

“ రోజూ మీరు నిద్రపోయే ముందు పాలు తాగుతారని అమ్మగారు చెప్పారు.అందుకే తీసికొచ్చాను.. త్రాగండి..!” అంది పాలగ్లాసు అందిస్తూ. ఆ పాల గ్లాసు అందుకుని గడ గడ త్రాగేసి ఖాళీ గ్లాసు ఆమె చేతికిస్తూ “ అమ్మగారు లేని లోటు భలే తీరుస్తున్నావే..!” అన్నాడు.“ మరే.. అమ్మగారు మిమ్మల్ని కంటికి రెప్పలా చూసుకోమన్నారు.” అంది గోముగా. ఆమె కంఠంలో ని మార్పుకు వింతగా చూశాడు శ్రీకాంత్. ఆమె కళ్ళు మత్తుగా కనిపించాయి. వెంటనే తలతిప్పి టీవీ వైపు దృష్టి నిలిపాడు .ఆమె గ్లాసు తీసుకుని బయటకు వెళ్లి పది నిముషాల్లో మళ్ళీ బెడ్ రూములో కి ప్రవేశించింది. కంగారుగా చూశాడు శ్రీకాంత్. అపరంజి ఇక రాదులే అని భావించి హాలీవుడ్ రొమాంటిక్ మూవీ పెట్టుకుని చూస్తున్నాడు. అపరంజి చూడనే చూసింది. ఏదో ముద్దులు పెట్టుకుంటున్న సీన్ వస్తోంది.పెదాలతో పెదాలు కలిపేసుకుంటూ క్రిందా మీదా పడుతున్నారు ఆడా , మగా. “ ఇంగ్లీషు సినిమాలా వుందే.. నాకు ఇలాంటి సినిమాలంటే భలే ఇష్టం..! “అంది.

“ నీకు అర్థం అవుతాయా..?” ఆశ్చర్యం గా అడిగాడు శ్రీకాంత్. “ డైలాగులు అర్థం కాకపోయినా స్టోరీ తెలిసిపోతుంది..”

“అయినా ఇది నువ్వు చూడకూడని సినిమా.” అన్నాడు. “ ఏం..? ఎందుకని..?” ప్రశ్నించింది అపరంజి ఏం తెలియనట్టు. “

నీలాంటి చిన్న వయసు వాళ్ళు , పెళ్లి కాని అమ్మాయిలు చూడవలసిన సినిమా కాదు. ఇది..ఇది రొమాంటిక్ మూవీ..” అన్నాడు. సెక్సు సినిమా అని చెప్పలేక. “ అయినా నాకిష్టమే.. ఇలాంటి సినిమాలు అమ్మా , నాన్నా నిద్రపోయాక టివి పెట్టుకుని చూస్తుంటాను..” అంది. వింతగా చూశాడు ఆమె వైపు. ఆమె నవ్వుతోంది. “సరే..చూడు..” అన్నాడు ఇంకేం అనలేక.

అక్కడ క్రింద కూర్చుని చూడటానికి అవకాశం లేదు. అందుకని మంచం మీదే ఓ చివరగా కూర్చుని టీవీ చూస్తోంది.మరో చివర శ్రీకాంత్ కూర్చుని ఉన్నాడు.సినిమా నిండా ముద్దులే. మధ్య మధ్యలో ఇంకా ఓవరైపోయి ఒకరి నొకరు హత్తుకుని దుస్తులన్నీ విప్పేసుకుని క్రిందా మీదా పడుతున్నారు. అపరంజి శ్రీకాంత్ దగ్గరికి జరిగింది నెమ్మదిగా.అదేం గమనించే స్థితిలో లేని శ్రీకాంత్ సినిమాలో లీనమై చూస్తున్నాడు. ఆమె వయసు వేడి ఆమెను నిలవనీయడం లేదు.ఆ హాట్ సీన్ల ప్రభావం వలన ఆమె ఒళ్ళు వేడెక్కి సెగలు రేపుతోంది. హఠాత్తుగా ఆమె శ్రీకాంత్ పెదవులందుకుని తన పెదాలతో కలిపేసింది.సినిమాలో చూపినట్లే అతడి తలను తన ఎద పైకి అదుముకుంది. తన వక్షానికి అతడి ముఖాన్ని హత్తుకుంటోంది. ఆమె గుండెల మధ్య చిక్కుకున్న శ్రీకాంత్ ఊపిరాడక ఉక్కిరిబిక్కిరి అవుతున్నాడు. ఆమె నుండి వేరవడానికి విశ్వ ప్రయత్నం చేస్తున్నాడు.సినిమాలోని హాట్ సీన్లు చూసి వేడెక్కిపోయిన ఆమె అతణ్ణి పట్టిన పట్టు వదల్లేదు.అతణ్ణి గాఢంగా వాటేసుకుని మంచంపై కి త్రోసి ముద్దుల వర్షం కురిపించింది. అతణ్ణి మరింతగా అల్లుకుపోయి కలవరిస్తోంది. “ బాబుగారూ..! మీరంటే నాకిష్టం..! మీ అందం ,మీ మంచితనం నన్ను పిచ్చిదాన్ని చేసింది.నన్ను మీదాన్నిగా చేసుకోండి.ప్లీజ్..నా కోరిక కాదనకండి..” అంటూ అతడి చేతుల్ని తన ఎదపై ఉంచుకుని నొక్కేసుకుంటోంది.ఆమె చేష్టలకు విస్తుపోయిన శ్రీకాంత్ బలవంతంగా ఆమె బాహు బంధం నుండి విడివడి ఆమెను దూరంగా నెట్టేశాడు. అయినా ఆమెలోని వేడి చల్లారలేదు.

,

” అయ్యగారూ..! ఒక్కసారి..నా కోరిక తీర్చండి.. మీకు పుణ్యం వుంటుంది..” అంది అర్థింపుగా . “ నీకేమైనా పిచ్చా..? నువ్వు పెళ్లి కావలసిన దానవు. పైగా నేను నీ యజమాని ని.నువ్వు నాకు సర్వెంట్ వి.ఏమిటి నీ ధైర్యం..?” ,అయినా ఆమె తన మొండి పట్టు విడిచిపెట్టలేదు.

“ మీరు నాక్కావాలి బాబుగారూ..! ఒక్కసారి.. మీలాంటి అందగాడి పొందు నాక్కావాలి.మీ కౌగిట్లో కరిగిపోవాలి.మీతో నాకా అనుభవం కావాలి.” అంది మళ్లీ. “ నువ్వేం మాట్లాడుతున్నావో నీకు తెలుసా..? నువ్విలా కోరుకోవడం తప్పు..! నా కంటే అందగాడే నీకు భర్తగా దొరుకుతాడేమో ఎవరికి తెలుసు..? “ అన్నాడు. “ లేదు బాబు గారూ..! దానికి అవకాశం లేనా..నాకా అదృష్టం లేదు..” అంది బాధగా. “ ఏం.?ఎందుకు లేదు..?” అడిగాడు శ్రీకాంత్ .

“ ,నా పెళ్లి నా మావతో కుదిరిపోయింది బాబుగారూ..! వాడు అస్సలు బాగోడు. నల్లగా తుమ్మ మొద్దులా ఉంటాడు.నాకు నచ్చడు. నా అందానికి తగినోడు కాదు.నాకూ మీలాంటి అందగాడిని చేసుకోవాలని కోరిక.కానీ నాకా అదృష్టం లేకుండా చేశారు మా వాళ్ళు.అందుకే మిమ్మల్ని కోరుకుంటున్నాను.మీ అందం నన్ను పిచ్చివాణ్ణి చేసింది.అందుకే ఈ అవకాశాన్ని జారవిడుచుకోకూడదని అనుకుంటున్నాను..”

“ అదిగో..మళ్లీ అదే మాట..నీ ఆలోచనే తప్పు.ఒక్కటడుగుతాను చెప్పు..నీ మావకు నువ్వంటే ఇష్టమేనా..?”

,అలా ఎందుకడిగాడో తెలీక – “ నేనంటే ఆడికి పిచ్చి ప్రేమ బాబూ.!” అంది. “ చూశావా.. నువ్వెంత పొరపాటు చేస్తున్నావో..? నువ్వు అందగత్తెవే.. సౌందర్య రాశివే..! కానీ నీ మావ అందంగా లేనంత మాత్రాన ఎవరో తెలియని ఒక అందగాడిపై మనసు పారేసుకుని అపరిచితునికి నీ శరీరాన్ని , శీలాన్ని అర్పించడం మంచి పనేనా..? నీకంటూ ఒక నీతి , కట్టుబాటు లేవా..? అందంగా ఉంటే చాలా..? నీకు మనిషి తోనూ , మనసు తోనూ పని లేదా..? నీ మావ కు నువ్వంటే ఇష్టం. అలాంటిది అతణ్ణి మోసం చెయ్యడం తప్పు కాదూ..?”

“ ఎలా అవుతుంది బాబుగారూ..? నాకూ ఓ మనసుంది. ఇష్టాఇష్టాలు ఉన్నాయి. పెళ్లి గాని అయిపోతే నా కోరిక తీరే దారి మూసుకుపోతుంది. ఇప్పుడు అవకాశం వచ్చింది. నా ఇష్టం , నా కోరికా ఇప్పుడు

తీర్చుకోకపోతే మరి జీవితంలో తీర్చుకోలేను.అందుకే మిమ్మల్ని కోరుకుంటున్నాను..తప్పా..? "

"ముమ్మాటికీ తప్పే..! నువ్వెలా అందగాడు భర్తగా రావాలని కోరుకుంటున్నావో , నీ మావ కూడా తను చేసుకోబోయే అమ్మాయి గుణవతి , శీలవతి అయి ఉండాలని కోరుకోడా..? " అన్నాడు. ఆమె ఏం మాట్లాడలేదు.

కొద్ది క్షణాల తరవాత ఆఖరి అస్త్రంగా " నాలాంటి అందగత్తె పొందు దొరుకుతుంటే మీరెందుకు కాదంటున్నారో అర్థం కావడం లేదు" అంది కొంచెం అసహనంగా.

" నువ్వింకా చిన్న పిల్లవనే అనుకుంటున్నాను..కానీ పెద్ద మాటలే మాట్లాడుతున్నావు. సరే.చెబుతాను విను.నువ్వనుకుంటున్నట్లు అందం శాశ్వతం కాదు.ఇంకా అందంగా వున్న వారికి మనసు అందంగా ఉండకపోవచ్చు నీలాగా..! అంత అందం లేకపోయినా మంచి వ్యక్తిత్వం తో ఎంతో ఉన్నతంగా నూ వుండొచ్చు మీ అమ్మగారి లాగా.! ఆమె మనసు చాలా మంచిది. లేకుంటే నీలాంటి వగలమారి వయ్యారి ని నా దగ్గర వదిలి వెళ్తుందా..?


నామీద ఆమెకి ఎంతో నమ్మకం. అలాగే నిన్ను కూడా నమ్మింది కనుకనే నాకు తోడుగా ఉంచింది నిన్ను.. అలాగే నీ మావ కూడా నిన్ను నమ్మాడు. అందుకే ఏం అనలేదు. రేపు పిల్లలు పుడితే నీ అందమూ తరిగిపోతుంది. అప్పుడు అతను నిన్ను వదిలేస్తే ఏం చేస్తావు..? వివాహబంధం అంటే అదే.ఒకరిపై మరొకరికి ఉన్న నమ్మకమే. నిన్ను ఇష్టపడిన వాడిని పెళ్లి చేసుకుంటే నీ జీవితం ఎంతో బాగుంటుంది. నిన్ను నువ్వు పవిత్రంగా అతనికి అర్పించుకో.

ఇప్పుడు ఇక్కడ జరిగింది మర్చిపో. సుమతి లాంటి యజమానురాలు దొరకడం నీ అదృష్టం. నీ పెళ్లి ఖర్చులూ అవీ తను చూసుకుంటుంది.నిన్ను మనసారా ఇష్టపడిన నీ మావ దగ్గరకు పవిత్రంగా, నిర్మలమైన మనస్సుతో వెళ్లు. నీకు నా ఆశీస్సులు ఎప్పుడూ ఉంటాయి.సరేనా..?" అంటూ దగ్గరగా వెళ్లి ఆమె తల నిమిరాడు.

అపరంజి కళ్ళు వర్షించడం మొదలుపెట్టాయి.. " నన్ను క్షమించండి బాబుగారూ.." అంటూ అతని కాళ్లపై పడింది పశ్చాత్తాపం తో.

★★సమాప్తం

# నమ్మకాలు- నిజాలు




సాధారణ ప్రజలు కుల,మత మూఢ విశ్వాసాలలో ఉన్నారంటే వారు చిన్నప్పటి నుండి అదే వాతావరణంలో పెరగడం వలన వారిలో అవి నాటుకు పోతాయి వారికి చదువు ఉండదు కాబట్టి వారు అదే ధ్యాసతో ఉంటారు
ప్రశ్నించే తత్వం కానీ విశ్లేషించే సామర్థ్యం కానీ ఆచరించే ధైర్యం కానీ ఉండవు.కానీ చదువుకున్న వారు విజ్ఞాన శాస్త్రాన్ని చదువుతారు ప్రశ్నించే తత్వం ఉంటుంది విశ్లేషించే సామర్థ్యం ఉంటుంది ఆచరించే ధైర్యం కూడా ఉంటుంది. కాబట్టి వారు మారాలి ఇతరులను మార్చడానికి ప్రయత్నం చేయాలి.అంతేకానీ వాళ్లే రూపాయికి పొరగాని సాధువుల సన్యాసులు, స్వాముల కాళ్ళపైపడడం అనేది చాలా తప్పు. చదువుతో వాళ్ల ప్రవర్తన మార్చుకోవాలి. విద్య,విజ్ఞానం ఇస్తుంది తప్పులను సరి చేస్తుంది. మనిషిని సమాజ వాంఛిత పౌరుడిగా తయారు చేస్తుంది. కాబట్టి విద్యావంతులైన వారు ఎవరైనా సరే వారి ప్రవర్తన మార్చుకుని విజ్ఞానం వైపు దృష్టిసారించి ప్రజలకు ఆదర్శప్రాయంగా ఉండాలి. విశ్వాసం నమ్మకం ఉంటే ఉండవచ్చు అది గడప లోపల మాత్రమే ఉండాలి. జనంలోకి వచ్చిన తర్వాత వారి ప్రవర్తన వైజ్ఞానికంగా చదువుకు దగ్గ రీతిలోఉండాలి. వారు నేర్చుకున్న విజ్ఞానం సైన్సు ప్రజల్లోకి తీసుకుపోవాలి. అంతేకానీ మూఢవిశ్వాసాలను మత మూఢవత్వాన్ని ప్రదర్శించకూడదు. విద్యావంతులు విజ్ఞానవంతులై విజ్ఞానాన్ని ప్రదర్శించకుండా మూఢవిశ్వాసాలు మత మూఢత్వంలోకొట్టుకొని పోవడం సమాజానికి తప్పుడు సంకేతాలు పంపినట్లు అవుతుంది.. వారు చదువుకు సార్థకం ఉండదు.


# మేలుకొలుపు


ఓ భౌతికశాస్త్ర ఆచార్యుడైన పుట్టపర్తి సాయిబాబా పాదసేవలో తరిస్తాడు,మరో జువాలజీ ఆచార్యుడైన మతోన్మాదంతో ,ద్వేషంతో దేశంలో విషం నింపుతాడు,బుద్ధి మంతుడైన ఓ ఇంజనీర్ దిగంబర జైన బాబాల ముందు మోకరిల్లుతాడు,ఓ భౌతికశాస్త్ర అధ్యాపకుడైనప్రతి ఉదయం ఎర్రచందనంతో తళతళమెరిసే నామం దిద్దుకుని మరచెంబులో మడి నీళ్ళు నింపుకుని కాలేజికి బయలు దేరతాడు.

శివుడు కలలో కనిపించి నేత్రదానం చెయ్యమన్నాడని కళ్లను పెరుక్కొనే వారు, మరణించిన కుటుంబ సభ్యుల్ని యేసు తిరిగి బతికిస్తాడని మృతదేహం పక్కన కూర్చొని ప్రార్థనలు చేసేవారు, తాంత్రికుల మాటలు నమ్మి కన్నబిడ్డలనే బలిచ్చేవారు, నేనే దేవుణ్ని అంటూ వీరంగాలు వేసేవారు. కలియుగం సమాప్తమైందని కృతయుగం ప్రారంభం అవుతుందని అప్పుడు మా బిడ్డలు బతికి వస్తారని తన కన్న బిడ్డలన్నారు ఉన్నత విద్యావంతులను సైతం చూసాము. మతాన్ని ఇంటికి పరిమితం చేసినా, అంతిమంగా సమాజానికి దీర్ఘకాలంలో హానిచేసే భావజాలానికి ప్రతినిధులుగానే మారుతున్నారు.

చదువుకున్న వారు తమ చదువు యొక్క సారాన్ని వంట పట్టించుకోకుండా మూఢత్వం వైపు మూర్ఖత్వం వైపు వెళ్తుంటే సాధారణ ప్రజలు కూడా వారిని అనుసరిస్తారు వారిని ఆదర్శంగా తీసుకుంటారు. ఈ విషయాన్ని విద్యావంతులైన వారు తెలుసుకోవాల్సి ఉంది. మన దేశానికి విద్యావంతులతో పాటు విజ్ఞానవంతులు కావాలి. మతాన్ని కులాన్ని కూకటి వేళ్ళతో పెకలించి తీసివేయాలి. అప్పుడే మన దేశం వైజ్ఞానికంగా అన్ని దేశాలతో సరిసమానంగా అభివృద్ధి పథంలో నడుస్తుంది అభివృద్ధి చెందిన దేశాల్లో ఒకటిగా పేరు గడిస్తుంది కానీ మా దేశం ఇప్పటికీ అభివృద్ధి చెందుతున్న దేశాల జాబితాలోనే ఉంది.. స్వాతంత్ర్యం వచ్చి 70 సంవత్సరాలు గడిచిపోయిన ఇంకా మనం శైశవదశలోనే ఉన్నాం మతమూఢత్వంలో కులాల కంపులోపొర్లాడుతున్నాం

★★★★






# కృత్రిమ మేధ తో పూర్తి సినిమా

సినిమా అంటే 24 కళల సమాహారం. దర్శకుడు, నటీనటుల నుంచి లైట్ బాయ్ వరకు ఎడిటింగ్ నుంచి వీఎఫ్ఎక్స్ వరకు వందలు, వేల మంది కలిసి పనిచేస్తే.. కొన్ని నెలల పాటు కష్టపడితేనేగానీ ఒక సినిమా పూర్తికాదు. కానీ ఇద్దరు వ్యక్తులు ఓ గదిలో కూర్చుని రెండు, మూడు కంప్యూటర్లు పెట్టుకుని, పూర్తిస్థాయి సినిమాను సిద్ధం చేసేస్తే!? కథ స్క్రిప్టు దగ్గరి నుంచి నటీనటులు, సంగీతం, పాటలు, గ్రాఫిక్స్ ఇలా మొత్తం 24 క్రాఫ్ట్స్’ పని, ఒక్కరే చేసేస్తే!! చేసేస్తే కాదు... ‘కృత్రిమ మేధ (ఏఐ)’ చేసి చూపిస్తోంది. ‘సినిమా’ చూపిస్తోంది. కంప్యూటర్ ముందు కూర్చుని తగిన సూచనలు ఇస్తే చాలు.

మనకు కావాల్సినట్టుగా దృశ్యాలను రూపొం దిస్తోంది. స్క్రిష్ట ప్రకారం.. సీన్లను, వాటికి తగినట్టుగా ఆడియోలను రూపొందించడం. కలిపి.. ఎడిట్ చేసి... సినిమాను సిద్ధం చేసేయడమే! ఇలా పూర్తిగా ఏఐతోనే తీసిన కన్నడ సినిమా 'లవ్ యూ' ఇటీవలే విడుద లైంది. అటు చైనాకు చెందిన పైరేట్ క్వీన్– యెుంగ్ సావో కూడా తెర పైకి వచ్చింది. ఈ రెండు చిత్రాలు ''సినిమా' భవిష్యత్తును వెండితెరపై కళ్లకు కడుతున్నాయి.

ఇద్దరు కూర్చుని తీసిన సినిమా 'లవ్ యూ'

కర్ణాటకలో ఇటీవలే విడుదలైన రొమాంటిక్, లవ్ సినిమా 'లవ్ యూ'. బెంగళూరు శివార్లలోని సిద్దెహళ్లికి చెందిన పూజారి, రచయిత నరసింహ మూర్తి, ఏఐ టెక్నీషియన్, గ్రాఫిక్ డిజై సర్ నూతన్, కలసి ఆరు నెలల్లో కృత్రిమ మేధ (ఏ) టూల్స్ సాయంతో ఈ సినిమా తీశారు. 15 మంది పాత్రధారుల (క్యారెక్టర్ల) తో 85 నిమిషాలు నిడివి ఉన్న ఈ సినిమాలో 12 పాటలు కూడా ఉన్నాయి. ఇందు లోని పాత్రధారులు, వారి నటన, దృశ్యాలు, సంగీతం, పాటలు, మాటలు మొత్తం అంతా కృత్రిమ మేధతో సృష్టించినవే. ఈ సినిమా నిర్మాణం కోసం అయిన ఖర్చు కేవలం రూ.10 లక్షలేనని, అది కూడా కంప్యూటర్లు, సాఫ్ట్ వేర్లు, ఏఐ సేవల సబ్ స్క్రిప్షన్ల కోసం అయిన ఖర్చే నని సినిమా మేకర్లు చెప్పాడు. 30 రకాల ఏ టూల్స్ వినియోగించామని తెలిపారు. సెన్సార్ బోర్డు ఈ సినిమాకు యూ/ఏ సర్టిఫికెట్ కూడా ఇచ్చింది. అయితే దీనికి తొలి ఏఐ సినిమాగా గుర్తింపు కోసం... కేవలం ఒక థియేటర్లో విడుదల చేశారు.

పూర్తిగా ఏ ఐతోనే నిర్మించిన "సైరేట్ క్వీన్ – ఝెంగ్ యి సావో చిత్రం . చైనాకు చెందిన పైరేట్ క్వీన్ మెుంగ్ 'సావో కూడా మొత్తంగా ఏఐతో నిర్మించిన చిత్రం. ఓ మహిళా సముద్రపు దొంగ (పైరేట్ ) నిజజీవిత కథతో.. మలేషియాకు చెందిన ఫ్యూచర్ స్టూడియోస్, సింగపూర్కు చెందిన ఫిజ్ డ్రాగన్ సంస్థలు సంయుక్తంగా ఈ సినిమాను సిద్ధం చేశాయి. స్క్రిప్టు రూప కల్పన నుంచి నటీనటులు, వారి గొంతు, సంగీత అంతా ఏఐతోనే సృష్టించామని మేకర్లు గతంలోనే ప్రకటించారు. ఈ ఏడాద్ ఏప్రిల్ 24నే ఈ సినిమా ప్రీమియర్ షోను ప్రదర్శించారు.



మాండరిన్ (చైనా), ఇంగ్లిష్ భాషల్లో ఈ ఏడాది జూన్ లేదా జూలైలో థియేటర్లలో విడుదల చేయనున్నట్లు ప్రకటించారు.

ఇటలీకి చెందిన 'ది డైరీ ఆఫ్ సిసిఫస్ (2023), స్విట్జర్లాండ్ కు చెందిన 'ది లాస్ట్ స్క్రీన్ రైటర్ (2024) సినిమాలకు కథ, స్క్రీన్ ప్లే మొత్తాన్ని ఏఐతోనే సిద్ధం చేశారు.

అమెరికాలో 'డ్రెడ్ క్లబ్ వాంపైర్స్ వెరిక్స్ (2024)' యానిమేటెడ్ సినిమాను చాలా వరకు ఏఐతోనే రూపొందించారు. దీనికి కేవలం రూ.40 వేలు మాత్రమే ఖర్చయినట్లు మేకర్లు ప్రకటించారు..

తమిళ సినిమా కంగువను ఎనిమిది భాషల్లో విడుదల చేసేందుకు. ఏఐ సాయంతో ఆయా భాషల్లో సూర్య గొంతు తోనే డబ్బింగ్ను సృష్టించారు.

ఏఐతో సినిమా అచ్చంగా మామూలు ఏఐతో తీసిన 'లవ్ యూ' సినిమాగానీ, షార్ట్ వీడి యోలుగానీ ఏవైనా పాత్రల ముఖకవళికలు, గొంతుకు తగినట్టుగా పెదాల కదలిక ఇంకా పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందలేదు. దీనితో చాలా వరకు లాంగ్ షాట్ సీన్లు సృష్టించాల్సి ఉంటుంది. ఇక పాత్రల శారీరక కదలికలు, హావభావాలు, చుట్టూ ఉన్న పరిసరాలు... ఒకే సీన్లోనూ, వేర్వేరు సీన్లలో కూడా అసాధారణంగా కనిపిస్తుంటాయి. మారి పోతూ ఉంటాయి. లవ్ యూ, పైరేట్ క్వీన్– యెంగ్ యి సావో సినిమాల్లోనూ ఇదే కనిపించింది. కానీ సినిమాల చరిత్రలో ఇదో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించిందని నిపుణులు చెబుతున్నారు. ఈ సినిమాల కోసం వాడిన ఏఐల కంటే మెరుగైనవి ఈ కొన్ని నెలల్లో అందుబాటులోకి వచ్చాయని.. మరింత స్పష్టమైన, మెరుగైన సినిమాలు తీయవచ్చని స్పష్టం చేస్తున్నారు.

ఏఐ 'సినిమా'కు ఏం కావాలి?

జస్ట్ ఒకట్రెండు ఆధునిక కంప్యూటర్లు, వీడియో, ఆడియో ఎడిటింగ్. సాఫ్ట్వేర్లు.. ఇచ్చిన సూచనలకు అనుగుణంగా దృశ్యాలను సిద్ధం చేసి ఇచ్చే 'జనరేటివ్ ఏఐ టూల్స్'ను సబ్ స్క్రైబ్ చేసుకోవడానికి అవసరమైన సొమ్ము .గూగుల్ జనరేటివ్ ఎఐ టూల్, డైరెక్టర్ ఏఐ, సినిమాటోగ్రా వర్ ఏఐ, స్టంట్స్ ఏఐ, రన్వే ఎమ్ ఎల్, క్లింగ్ ఐ, మినిమాక్స్.. ఇలా పదులకొద్దీ ఏఐ సినిమా టూల్స్ అందుబాటులో ఉన్నాయి. టూల్ 'వియో " ఆధారిత ఫ్లో టూల్, డైరెక్టర్ ఏఐ, సినిమాటోగ్రాఫర్ ఏఐ, స్టంట్స్ ఏఐ, రన్వే ఎమ్ ఎల్, క్లింగ్ ఏఐ, మినిమాక్స్. ఇలా పదులకొద్దీ ఏఐ సినిమా టూల్స్ అందుబాటులో ఉన్నాయి.

★★★

# చిన్న వయసులోనే పీరియడ్స్ ఎందుకు వస్తున్నాయి ?



అమ్మాయిల్లో ఎర్లి పిరియడ్స్ సమస్య పెరుగుతోంది. ప్రపంచవ్యాప్తంగా ఇదే జరుగుతోందని ప్రపంచ ఆరోగ్య సంస్థ వెల్లడించింది. హార్మోన్ ఇంబ్యాలెన్స్. పీరియడ్స్. ఈ రెండు అమ్మాయిలను విపరీతంగా ఇబ్బంది పెడతాయి. పీరియడ్స్ టైమ్ లో శరీరంలో మార్పులు వస్తాయి. శారీరకంగానే కాకుండ మానసికంగానూ నీరసపడిపోతారు. అయితే.. ఒకప్పుడు అమ్మాయిలు 15 ఏళ్లు దాటిన తరవాత కానీ మెచ్యూర్ అయ్యే వారు కాదు. కానీ ఇప్పుడు అంత కన్నా తక్కువ వయసులోనే మెచ్యూర్ అవుతున్నారు. చాలా త్వరగా పీరియడ్స్ వచ్చేస్తున్నాయి. అసలు ఇలా ఎర్లీ పీరియడ్స్ రావడం అసలు మంచిది కాదని వివరిస్తున్నారుడాక్టర్లు . దీంతో పాటు అసలు ఇలా జరగడం వెనక లైఫ్ స్టైల్ ప్రభావం ఎంత ఉంది. ఏం చేస్తే ఈ సమస్య నుంచి బయటపడొచ్చు అన్నది చూద్దాం .

ఎర్లీ పీరియడ్స్ అనేది ప్రపంచవ్యాప్తంగా ఉన్న సమస్య. చాలా మంది అమ్మాయిలకు చాలా త్వరగా పీరియడ్స్ వచ్చేస్తున్నాయి. రావాల్సిన సమయానికి ముందుగానే రావడం వల్ల చిన్న వయసులోనే ఎన్నో సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తోంది. వీటికి ముఖ్యమైన కారణాలు చెప్పారు పేరెంటింగ్ కోచ్ శ్వేత. డైట్, లైఫ్ స్టైల్ తో పాటు వాతావరణంలో మార్పులు ఇందుకు కారణమవుతున్నాయి.

# అవగాహన

జంక్ ఫుడ్ ఎక్కువ తీసుకుంటే బాడీలో టాక్సిన్స్ అధిక మొత్తంలో పేరుకుపోతాయి. ఈ మురికి ఎక్కువైందంటే హార్మోన్స్ బ్యాలెన్స్ దెబ్బ తింటుంది. తద్వారా ఎర్లీ పీరియడ్స్ వస్తున్నాయి. ఇలా జరగకుండా ఉండాలంటే ఆరోగ్యకరమైన ఆహారం అందించాలి. న్యూట్రియెంట్స్ అధికంగా ఉండే ఫుడ్ మాత్రమే తినిపించాలి. ప్రాసెస్డ్ ఫుడ్ పూర్తిగా అవాయిడ్ చేయాలి. హెల్తీ ఫ్యాట్స్, ప్రొటీన్స్ ఉన్న ఆహారం తినిపించాలి. ఆహారంతో పాటు వ్యాయామం తప్పనిసరి. కచ్చితంగా రోజూ ఏదో ఓ ఫిజికల్ యాక్టివిటీ ఉండేలా చూసుకోవాలి. కనీసం ఓ గంట పాటు ఆడుకోవాలి. లేదా బాడీ, మైండ్ బ్యాలెన్స్ అయ్యే వ్యాయామాలు చేయాలి. ఫిజికల్ యాక్టివిటీ ఉంటే ఎర్లీ పీరియడ్స్ ని తప్పించవచ్చు.

క్వాలిటీ స్లీప్ అనేది చాలా అవసరం. సరిగ్గా నిద్రకపోకపోతే ఇది ఆరోగ్యంపై ప్రభావం చూపిస్తుంది. హార్మోన్స్ బ్యాలెన్స్ తప్పి ఎర్లీ పీరియడ్స్ వచ్చే అవకాశముంటుంది. కనీసం 9 నుంచి 11 గంటల పాటు నిద్ర ఉండేలా చూసుకోవాలి. ముఖ్యంగా స్క్రీన్ టైమ్ ని తగ్గించాలి. హార్మోన్స్ ని దెబ్బ తీసే కెమికల్స్ ఉన్న ప్రొడక్ట్స్ ని అసలు వాడకూడదు. సెంట్ ,డియోడ్రెంట్ ఇలా..ఏదైనా సరే వీటిలో హానికర రసాయనాలు ఉంటాయి. ఎక్కువ మొత్తంలో వాడడం వల్ల నష్టం తప్పదు. అందుకే సహజసిద్ధమైన చిట్కాలను పాటించాలి.

ఇంట్లో పరిస్థితి బాలేకపోతే పిల్లలపై ఆ ఇంపాక్ట్ ఎక్కువగా ఉంటుంది. స్ట్రెస్ పెరిగి హార్మోన్స్ అదుపు తప్పుతాయి. అందుకే..ఇల్లు ఎప్పుడూ ప్రశాంతంగా ఉండేలా చూసుకోవాలి. ఏదైనా సరే ఓపెన్ గా మాట్లాడుకునేలా ఉండాలి. అమ్మాయిలపై ఆ చిన్న వయసులో ఒత్తిడి పడకుండా చూసుకుంటే చాలా మంచిది. బాడీ ఎప్పుడూ హైడ్రేటెడ్ గా ఉండాలి. అందుకే నీళ్లు ఎక్కువగా తాగాలి. నీటి శాతం ఎక్కువగా ఉండే పండ్లు కూరగాయలు తీసుకోవాలి. వీటితో పాటు ఫైబర్ అధికంగా ఉండే ఆహార పదార్థాలు ఇవ్వాలి. పెరుగన్నం పెడితే మంచిది. ఇలాంటి ఫర్మెంటెడ్ ఫుడ్ వల్ల గట్, హార్మోన్ హెల్త్ బాగుంటుంది.

1990లతో పోల్చి చూస్తే ఈ తరం అమ్మాయిలకు ఎర్లీ పీరియడ్స్ సమస్య ఎక్కువగా ఉందని 2009లో జరిగిన పీడియాట్రిక్ సర్వే వెల్లడించింది. ఇక ప్రపంచ ఆరోగ్య సంస్థ కూడా ఈ సమస్య గురించి ప్రస్తావించింది. సరైన విధంగా పోషకాలు అందకపోవడం, ఒత్తిడి పెరగడం, లైఫ్ స్టైల్ లో మార్పుల వల్ల ఇలా జరుగుతోందని చెప్పింది. ఆహారం వల్లే ఎక్కువ ముప్పు ఉంటోంది. అందుకే డైట్ పై ఎక్కువగా ఫోకస్ పెట్టాలి. దీంతో పాటు వ్యాయామం చేయించాలి. ఇప్పుడు చెప్పిన జాగ్రత్తలు తీసుకుంటే ఈ ఇబ్బంది తప్పుతుంది. ఆరోగ్యంగా ఉండేందుకు వీలవుతుంది.

★★★

## యువత తెలుసుకో
## నిన్ను నువ్వు మలుచుకో



# ప్రతి దినం ఓ సరి కొత్త జీవనం ?

ఉదయాన్నే ఎంత ప్రశాంతంగా ఉంటే రోజంతా అంతే రిలాక్స్డ్ గా ఉంటుంది. అలాకాకుండా గజిబిజీగా, అన్ ఈజీగా మీ డే మొదలైతే అదే రోజంతా కంటిన్యూ అవుతుంది. మనం ప్రతీరోజు కూడా కొత్తగా మంచి మెమొరీగా మారాలని కోరుకుంటాం. దీనికోసం రోజంతా హ్యాపీగా ఉండాలనుకుంటాం కూడా. కానీ, ఉండలేం. దీనికి కారనం మనం చేసే చాలా రకాల తప్పులే. అవి తప్పులని తెలియకుండానే చేస్తాం. ఇవి మనకి డెయిలీ హ్యాబిట్స్‌లా మన క్వాలిటీ డేని ఇబ్బందికరంగా మారుస్తాయి. రోజంతా గజిబిజీగా చేసేస్తాయి. ఏంటి మనం అంతా తప్పు చేస్తున్నామా అని ఆలోచిస్తున్నారా.. అవును చేస్తున్నాం.

అవేంటంటే, ఉదయం లేవగానే ముఖాన్ని కూడా చూడకుండా ఫోన్ చూసేవారు చాలా మందే ఉన్నారు. రాత్రంతా ఫోన్‌లోనే మునిగిపోతారు. ఆ తర్వాత కష్టంగా పడుకుని మళ్లీ లేవగానే ఎవరు మెసేజ్ చేశారు. సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేసిన రీల్‌కి లైక్స్ ఎన్ని వచ్చాయి. ఎవరెవరికీ మెసేజ్ చేద్దాం. ఇదే ధ్యాస. దీని వల్ల టైమ్ వేస్ట్. పైగా మానసిక ప్రశాంతత కూడా తగ్గుతుంది. కాబట్టి, లేవగానే ఫోన్ చూడకుండా ముందుగా ఫ్రెషప్ అయి ఏదైనా డ్రింక్ తాగి ప్రకృతిలో కాసేపు సేద తీరండి.

## అందుకనే పెద్ద వాళ్ళు

ఉదయం లేవగానే దేవుడి ముఖం చుదమంది , లేదా మీ చేతులను మీరే చూసుకోమని . అంటే మన గురించి మనమే ఓ నిమిషం అలోచించి ఆ రోజు ఏమి చెయ్యాలో నిర్ణయం తీసుకుంటే రోజంతా ప్రశాంతంగా ఉంటుంది

ఉదయం లేవకపోవడం, లేచినా పనులని ఆలస్యంగా చేయడం వల్ల రోజంతా గందరగోళంగా ఉంటుంది. హడావిడి పెరుగుతుంది. అలా కాకుండా కచ్చితంగా ఏ టైమ్‌కి ఏం చేయాలి. ఎలా పనులు చేసుకోవాలని ఇలాంటివన్నీ ఓ విషయంలో ముందుగానే డిసైడ్ మంచిది. దేవుడు లేచే సమయం తెల్ల వారు ఝాము 3 గంటలు , దేవతలు 4 గంటలు , మనుషులు 5 గంటలు , జంతువులు 6 గంటలకు రాక్షసులు 7 గంటలకు నిదర లేస్తారు . కాబట్టి ఉదయం 5 గంటలకు మేల్కొంటే మనకు రోజంతా ప్రశాంతంగా ఉంటుంది

మరుసటి రోజు గాయాలు అందరికీ ఉంటాయి. వాటిని ఉదయాన్నే గుర్తు తెచ్చుకుని మరీ బాధపడాల్సిన అవసరం లేదు. దీని వల్ల బాధ, ఏడుపు తప్పా మరేం లేదు. కాబట్టి, వాటిని తలుచుకోకుండా మనసుని ప్రశాంతంగా ఉంచుకోండి. మన లైఫ్‌లో మనకంటే చాలా మంది బాధపడుతున్నారు. ఉన్నదాంట్లోనే హ్యాపీగా ఉందామనే ఆలోచన రావాలి. ఇలా వస్తే మనం కూడా హ్యాపీగా ఉంటాం.

మార్నింగ్ డ్రింక్ అనగానే వేడి వేడి టీ, కాఫీలే గుర్తొస్తాయి ఎక్కువగా. ఇక్కడ కూడా మీరు ఆ టీ, కాఫీలోనే కాలు పెట్టినట్లు. ఉదయం లేవగానే వీటిని తాగే బదులలు హెల్దీ డ్రింక్ తాగండి. అంటే గోరువెచ్చని నీరు తాగండి. ఆ తర్వాత మరేదైనా తీసుకోండి. టీ, కాఫీలు తాగడం ఆరోగ్యానికి అంత మంచిది కాదు. దీంతో జీర్ణ సమస్యలు ఇతర సమస్యలు వచ్చే అవకాశం ఉంది. బ్రేక్‌ఫాస్ట్ స్కిప్ చేసి ఎక్కువగా లంచ్ చేస్తుంటారు. ఇది కొంతవరకూ మనకి మంచిగానే అనిపించినప్పటికీ దీని వల్ల బాడీ ఎనర్జీ లెవల్స్, మెటబాలిజంపై నెగెటీవ్ ఎఫెక్ట్స్ పడతాయి. అలా కాకుండా రోజంతా యాక్టివ్‌గా ఉండేందు హెల్దీ, ప్రోటీన్స్‌తో కూడిన బ్రేక్‌ఫాస్ట్ తీసుకోవడం చాలా ముఖ్యం.

★★★★

# ఊడలమర్రి ఉపన్యాసాలు

## బ్యుటి &బీస్ట్



విక్ర మార్కుడు ఊడల  మర్రి  చేరుకునే సరికి, చెట్టు కింద పెద్ద వేదిక గట్రా  ఏర్పాట్లు చేసి, దాని ముందు ఓ పది కుర్చీలు వేసి వున్నాయి. వాటి వెనకాల పిల్ల దెయ్యాలన్నీ గోల గోలగా అరుస్తున్నాయి.

విషయం ఏమిటో అర్థం కాక విక్ర మార్కుడు బుర్ర గోక్కుంటూ అక్కడే నిలబడి పోయాడు

విక) మార్కుడి రాకను గమనించిన భేతాళుడు  ఎదురు వెళ్ళి, రా మిత్రమా నీ కోసమే ఎదుడు చూస్తున్నా ,సమయానికివచ్చావు “ అంటూ విక్ర మార్కుడిని వేదిక ఎదురుగా కూర్చో బెట్టాడు.

“ ఏమిటి భేతాళా ఏం జరుగుతుంది ఇక్కడ’ అంటూ అడిగాడు.

‘అందాల పోటీలు “అన్నాడు పొడిపొడిగా

ఆ మాటకు అదిరి పడ్డాడు విక్ర మార్కుడు

“అందాల పోటీలా.. ఎవరికి?” అన్నాడు అయోమయంగా

“ఎవరికేమిటి… ఎవరికో ఎందుకు పెడతాము మా దెయ్యలకే “అన్నాడు భేతాళుడు నింపాదిగా

# భేతాళ భారతం

ఈ సారి మరింత ఆశ్చర్యానికి గురయ్యాడు విక్ర మార్కుడు

'దెయ్యాలకు అందాల పోటీలా " అనుకుంటూ తనలో తను గొణుక్కున్నాడు

" ఏమిటి రాజా అంటున్నారు .." సరిగా వినపడక అడిగాడు భేతాళుడు

" ఏమిలేదు ఇంత అర్జంటుగా ఈ అందాల పోటీలేంటి అని .."తన సందేహం బయట పెట్టాడు

"ఏమి చెప్పను ..మీ మనుషులు ఊరికినే ఉంటారా ..మీరేదో మిస్సు వరల్డ్ పోటీలు నిర్వహిస్తున్నారట కదా.."అంటూ ఆగాడు భేతాళుడు

" అవును ఆ విషయం మీకెలా తెలుసు .."అనుమానంగా అడిగాడు విక్రమార్కుడు

" ఆ నిర్వాహకుల్లో ఒకడు చచ్చి మాలో కలిసాడు ..వాడు వచ్చిన దగ్గర నుంచి మా దెయ్యాలను రెచ్చగొట్టి ..పోటీలు పెట్టమని ఒకటే గొడవ .."అంటూ నిట్టూర్చాడు భేతాళుడు

" అయినా దేయ్యలన్ని ఒకే రకంగా ఉంటాయి కదా ఇంక అందాల పోటి ఎందుకు ?" అనుమానం వ్యక్తం చేసాడు విక్రమార్కుడు

" అక్కడే నువ్వు పప్పులో కాలేసావు , మాలో కుడా చాల తెగలు ఉన్నాయి .కొరివి దెయ్యాలు , భూతాలు , పిశాచాలు ,ప్రేతాత్మలు ఇలా... ఇప్పుడు వీటన్నిటి లో ఎవరు అందంగా ఉన్నారో పోటిలో నువ్వే ఎంపిక చెయ్యాలి

" నేనా ?.." మళ్ళి ఆశ్చర్య పోయాడు విక్రమార్కుడు

" ఈ రోజేమిటి రాజా తెగ ఆశ్చర్య పోతున్నావు ..ఇంకా పోటిలో సుందరాంగులను చూస్తే ఇంకెంత ఆశ్చర్య పోతావో .."

" నిజమే ... ఏమిటో అంతా కలగా ఉంది ..అయినా ఈ పొయిల వాళ్ళ ఖర్చు తప్ప ఏమి ఉపయోగం ఉంది చెప్పు "అన్నాడు

" నేను మొదట అదే అనుకున్నా రాజా ..అసలే ఖజానా ఖాళీగా ఉంది ఎందుకులే అని "

" నువ్వు ఈ మాట అందరికి ఎదో సభలో చెప్పినట్టున్నావు .."

" అవును రాజా నిజంగానే ఖాళీగా ఉంది .పొద్దస్త మానం డబ్బులు డబ్బులు అని పీక్కు తింటుంటే కోపం వచ్చి వాగేశాను ."

" మరి ఇప్పుడెలా నిర్వహిస్తావు .."వాళ్ళు ఊరుకుంటారా ?"

" మా డబ్బుతో చేస్తే వాళ్ళు ఊరుకోరు , ఉళ్ళో వాళ్ళ డబ్బుతో చేస్తే .."అంటూ నవ్వాడు

"ఉళ్ళో వాళ్ళా ..ఎవరు వాళ్ళు .."

" ఏముంది స్పాన్సర్లను పట్టుకోవటమే .."

" స్పాన్సర్లా ..మీకా ...వాళ్ళెక్కడ నుంచి వస్తారు "

" ఎందుకు రారు రాజా ..మాకోసం క్షుద్ర పూజలు ,చేతబడులు చేసే మాంత్రికులు,బాబాలు, స్వామీజీలు బోలెడంత మంది .వాళ్ళు డబ్బులు ఇస్తారు ..లేకపోతే వాళ్ళను చంపుకు తినం . ఈ మద్య దెయ్యాల సినిమాలు కుడా ఎక్కువయ్యాయి ...ఆ నిర్మాతలను కుడా అడుగుతాము ..ఇంకా దెయ్యాల కధలు , నవలలు రాసే క్షుద్ర రచయతలు ఉండనే ఉన్నారు వాళ్ళు ఒక చెయ్యి వేస్తారు .."

" ఏమో అనుకున్న మాకన్నా మీకే స్పాన్సర్లు ఎక్కువగా ఉన్నారే .."

" మరి ..దేవుడికి భక్తితో కానుకలు ఇస్తే , మాకు భయంతో ఇస్తారు .."

" నిజమే ..అనుకో అయినా ఆ డబ్బు తో స్మశానం లో పాడై పోయిన సమాధులు బాగు చేయించవచ్చు.. ఇలా ఖర్చుపెడితే ఏమి ఉపయోగం .."

" నువ్వు భలే వాడివి విక్రమార్కా ..భేతాళుడు అనేవాడు ఒకడున్నాడు అని నీకు తెలుస్సు ,వీళ్ళకు తెలుసు ,..కాని ప్రపంచానికి తెలియదు కదా ..ఈ దెబ్బతో పోటిల పుణ్యమా అని మా ఊడల మర్రి పేరు నా పేరు ప్రపంచ వ్యాప్తంగా మారు మొగి పోతుంది .."

" నువ్వు కూడా రాజకీయం బాగా నేర్చు కుంటున్నావ్ భేతాళ .."

" అంతా నీ చలవే రాజా .."అంటూ నవ్వేసాడు భేతాళుడు

★★★★★

## మన "కథా"నాయికలు

# "ద్రౌపది "




ద్రౌపది (నవల) యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ వ్రాసిన నవల. ఈ నవల ఆంధ్రజ్యోతి ఆదివారం అనుబంధంలో ధారావాహికంగా వచ్చింది. తరువాత కొన్నాళ్ళకు పుస్తకరూపంలో అచ్చయింది. ఈ నవలకు 2009 లో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించింది. ఈ పుస్తకం కేవలం పాండవ కౌరవుల కథ మాత్రమే కాదు. ఇది ప్రధానంగా ద్రౌపది దృక్పథం నుంచి చెప్పబడిన కథ. ద్రౌపది మనోభావాల కథ. ఆమెకెదురైన విపరీత పరిస్థితులకు ఆమె స్పందనల కథ. ఈ కథలో ద్రౌపది ఒక నిస్తేజమైన, నిస్సహాయమైన, అణిగిమణగి ఉన్న పాత్ర కాదు. రక్తమాంసాలూ, జవసత్వాలూ, నిండు మనసుతో సజీవమైన మహిళ. ఆమె అసాధారణ సౌందర్యరాశి —— రూపేచ లక్ష్మి. సునిశితంగా ఆలోచించగల్గి, రాజనీతి తెలిసిన ఆమె ధర్మజునికి, ఇతర పాండవులకు కరణేషు మంత్రి. తన పతులపై విపరీతమైన అనురాగం కలిగిన ఆమె సోదరులైదుగురికీ శయనేషు రంభ. అనేక అవమానాలను, తన పతుల తప్పిదాలను సహించిన ఆమె క్షమయా ధరిత్రి.

నవలలో కురుక్షేత్ర యుద్ధం ఆఖరు దినాలలో ఒక ఉదయం ఈ కథ ప్రారంభమౌతుంది. యుద్ధం భీకర పర్యవసానాన్ని చూసి విచారపడుతున్న ద్రౌపది ఈ మారణహోమం జరగటంలో తన పాత్ర గురించి ఆత్మపరీక్ష చేసుకొంటూ ఉంటుంది. అంతకు ముందురోజు ఉదయం ద్రౌపదిని నిద్రలేపిన నకులుడు ద్రౌపది కుమారులు ఐదుగురినీ రాత్రికి రాత్రే అశ్వత్థామ సంహరించిన విషయం చెపుతాడు. ఆ వార్త విన్న ద్రౌపది వివశురాలవుతుంది. యుద్ధభూమిలో సోదరుడి, పుత్రుల మృతశరీరాలను చూసిన ద్రౌపదికి దుఃఖంతో పాటు కోపంకూడా వచ్చింది. అశ్వత్థామను చంపి పగతీర్చుకొమ్మని

తన భర్తలను నిలదీసింది.

చంపటానికి వచ్చిన పాండుపుత్రుల చేతిలో ఓడిపోయిన అశ్వత్థామ క్షమాభిక్ష కోరి తన తలపై ఉన్న చూడామణిని కోసి ఇచ్చాడని తెలిశాక ఆమె కోపం చల్లారుతుంది.

ఆ తరువాత యుద్ధంలో చనిపోయిన బంధువులకు పాండవులు తిలోదకాలు సమర్పిస్తుండగా కర్ణుడికి కూడా తిలోదకాలివ్వమని కుంతి కోరుతుంది. కర్ణుడు తన జ్యేష్టకుమారుడన్న సత్యాన్ని బయటపెట్టుంది. ఈ విషయం విన్నవారంతా ఆశ్చర్యపోతారు. కర్ణుడు తన భర్తలకి అన్న అనే విషయం ద్రౌపదిని విస్మయపరిచింది. ఈ విషయం ముందే తెలిసిఉంటే తనకూ కర్ణుడికీ మధ్య ఎలాంటి సంబంధ బాంధవ్యాలు ఉండేవన్న సందేహం ఆమెకు కల్గింది. ఆమె అంతకు ముందు కర్ణుని రెండుసార్లే చూసింది. ఆ రెండు సందర్భాలలోనూ ఆమెకు కర్ణుడిపట్లా తిరస్కారభావమో, అసహ్యామో కల్గాయి. తాను కర్ణుని రెండు సార్లే కలసినా తనజీవితమంతా కర్ణుని చుట్టే తిరిగినట్లుందని ఆమెకు తోచింది. ఆమె కర్ణుని మొదటిసారి చూసింది తన స్వయంవర సమయంలో. సూతపుత్రుడన్న కారణంతో కర్ణుని మత్స్యయంత్రం ఛేదించటానికి ప్రయత్నం చేయకుండా ఆమే ఆపించింది. ఆ తరువాత ఆమె కర్ణుని



చూసింది కౌరవసభలో. ఆరోజున తనను అవమానించటంలో కర్ణుడు ప్రముఖ పాత్రే వహించాడు. కర్ణుని హీనునిగా తలపోస్తున్న ద్రౌపదికి, కుంతి, కృష్ణుడు చివరిరోజుల్లో పశ్చాత్తప్త హృదయుడైన కర్ణుడి ఉదాత్తప్రవర్తన గురించి ఆమెకు తెలిపారు. మరణించిన కర్ణుడు అదృష్టవంతుడు. అతడి మరణం అత్యంత విషాదాన్ని ఏర్పరిచింది. అతనికి అద్భుత, విశిష్ట వ్యక్తి అనే కీర్తి వచ్చింది. తమకూ, కర్ణుడికీ ఉన్న బాంధవ్యం తెలిసిన పాండవులు విషాదభరితులయ్యారు. ధర్మరాజుకు రాజ్యం మీద విరక్తి కల్గింది. అతన్ని పట్టాభిషేకానికి సుముఖుణ్ణి చేసే బాధ్యత ద్రౌపదే తీసుకోవలసి వచ్చింది.

పట్టమహిషైన ద్రౌపదికి తన జీవనపథమ్మీద, తన వివాహంపైన ఉన్న ధర్మశంకలను, కృష్ణద్వైపాయనుడు (వ్యాసుడు), కృష్ణుడు తీర్చారు. పూర్వ జన్మలలో ఆమె వేదవతి, ఆ తరువాత మౌద్గల్య ముని భార్య ఇంద్రసేన. ఆమె పాతివ్రత్యానికి మెచ్చిన మౌద్గల్యుడు ఆమెతో ఏకకాలంలో ఐదురూపాల్లో (త్రిమూర్తులు, ఇంద్రుడు, మన్మథుడు) రమించాడు. ఆ తరువాతి జన్మలో ఆమె కాశీరాజు కుమార్తె అనామికగా జన్మించింది. పతికోసం ఘోరమైన తపస్సు చేసింది. పరమశివుడు ప్రత్యక్షమై ఏం కావాలని అడిగాడు. పతి అన్న పదాన్ని ఐదుసార్లు పలికింది ఆమె. ఐదుగురు పతులను అనుగ్రహించాడు శివుడు.

నీకు ఐదుగురు పతులున్నా అది ధర్మవిరుద్ధమని ఎవరూ భావించరు అని, ఆమె కోరుకొన్న విధంగా ఐదుగురితో సుఖించటానికి తగ్గ యవ్వనం, కామభోగేచ్ఛ, వారిని సేవించేందుకు అవసరమైన శుశ్రూషాభావం, కన్యాత్వం, సౌభాగ్యం అనుగ్రహించాడు. మరుజన్మలో ఆమె యజ్ఞం చేస్తున్న ద్రుపదుడికి అగ్నిగుండంలో లభించింది. ఆమెను పార్థునికివ్వాలన్న తలపుతో ఉన్న ద్రుపదుడు, పాండవులు మరణించారన్న మాట విని, ఆమెకు స్వయంవరం ప్రకటించాడు.


ద్రౌపది స్వయంవరం అవగానే పెద్ద యుద్ధమే జరిగింది. ఆమెను స్వయంవరంలో గెలిచినవాడు, అతని సోదరులు యుద్ధంలో కూడా గెలిచి, తమ తల్లి దగ్గరకు తీసుకువెళ్ళారు. అక్కడ వారి తల్లి అనాలోచితంగానో, ఆలోచితంగానో అన్న మాటకు కట్టుబడి ఆమె ఆ అయిదుగురు సోదరులనూ పెళ్ళి చేసుకోవలసి వచ్చింది. ఆ తర్వాత వారు పాండుకుమారులని ఆమెకు తెలిసింది. ఐదుగురు పతులతోనూ ఆమె సుఖజీవనం ప్రారంభించింది. పాండవులు ప్రచ్ఛన్నవేషాలు వీడి ఇంద్రప్రస్థంలో జీవించటం మొదలుబెట్టాక చాలా విశేషాలు జరిగాయి. ద్రౌపదితో ఏకాంతోల్లంఘన లేకుండా ఒక్కొక్కరూ ఒక సంవత్సరం గడపాలని అన్నదమ్ములు చేసుకొన్న ఒప్పందాన్ని ఉల్లంఘించిన అర్జునుడు ఏడాది పాటు తీర్థయాత్రలకు వెళ్ళి మూడు వివాహాలు చేసుకొని, శ్రీకృష్ణుడి చెల్లెలు సుభద్రను ఏకంగా ఇంద్రప్రస్థానికే తెచ్చాడు. పాండవులు రాజసూయం చేశారు. వారి ఆధిపత్యాన్ని చూసి కన్నెర్ర జేసుకొన్న దుర్యోధనుడు, మాయాద్యూతంలో గెలిచి పాండవులనూ, ద్రౌపదినీ బానిసలుగా చేసుకొన్నాడు. అంతకుముందు ఏ మహారాణికీ జరగని అవమానాలు ద్రౌపదికి జరిగాయి. ఏకవస్త్ర ఐన ద్రౌపదిని నిండుసభకు జుట్టుపట్టుకుని ఈడ్చుకువచ్చాడు దుశ్శాసనుడు. దుర్యోధనుడు ఆమెను కూర్చోమని తన తొడను చూపించాడు. ఆమె పతులముందే ఆమెను వివస్త్రను చేయబూనాడు. ఆ ప్రయత్నం విఫలమైన తర్వాత మరోసారి జూదమాడి పాండవులను అడవుల పాలు చేశాడు. ద్రౌపది పాండవులతో పాటు పన్నెండేళ్ళు వనవాసం చేయవల్సివచ్చింది. ఆ సమయంలోనే సైంధవుడు ద్రౌపదిని అపహరించడానికి ప్రయత్నించాడు. వనవాసం ముగిశాక అజ్ఞాతవాసం కోసం విరాటపురం వెళ్ళినప్పుడు. ద్రౌపది విరాట రాణికి సైరంధ్రిగా ఉండవలసి వచ్చింది. కీచకుడు ఆమెను బలవంతంగా అనుభవించటానికి ప్రయత్నించి భీముని చేతిలో మరణించాడు.

అజ్ఞాతవాసం తరువాత రాయబారాలు, సంధి ప్రయత్నాలు జరుగుతున్నప్పుడు ద్రౌపది వాటిని వ్యతిరేకించింది. యుద్ధం జరిగి, తనను అవమానించినవారిని తన భర్తలు నిర్జించి తన పగ తీర్చాలని ఆమె కోరుకొంది. ఆ కోరిక నెరవేరే క్రమంలో తన పుత్రులను కోల్పోయి పెద్ద మూల్యమే చెల్లించుకోవలసి వచ్చింది. ఆ తర్వాత ఆమె కొన్నేళ్ళు హస్తినాపుర పట్టమహిషిగా జీవించింది. కొన్నాళ్ళకు కృష్ణుడు మరణించాడు. పాండవులు మహాప్రస్థానం ప్రారంభించారు. ఆ యాత్రలో అందరికన్నా ముందు మరణించింది ద్రౌపది.

★★★

# కార్టూన్ పేజి

# నవ్వండి ప్లీజ్







శ్రీనివాస్ కార్టూన్లు


**నవ్వటం ఒక యోగం ,**

**నవ్వలేక పోవటం ఒక రోగం ,**

**తరువాత మీ ఇష్టం**











బుకర్ ప్రైజ్ 2025
'బాను ముస్తాక్'

. 'హార్ట్ ల్యాంప్' అనే చిన్న కథల సంకలనానికి గాను ప్రతిష్ఠాత్మక బుకర్ ప్రైజ్ 2025ను కన్నడ రచయిత్రి బాను ముస్తాక్ గెలుచుకున్నారు. ఈ ప్రతిష్టాత్మక బహుమతి అందుకున్న తొలి కన్నడ రచయిత్రిగా బాను నిలిచారు. లండన్లో ప్రదానం చేసిన ఈ సాహితీ పురస్కారాన్ని రచయిత్రి బానూ ముష్తాఖ్(77).. కథలను ఆంగ్లంలోకి అనువదించిన దీపా భస్తితో కలిసి స్వీకరించారు. పురస్కారం కింద అందుకున్న రూ.57.55 లక్షల నగదు బహుమతి ఇద్దరూ పంచుకోనున్నారు.

కర్ణాటకలోని హాసనకు చెందిన బానూ ముష్తాఖ్ 1990–2023 మధ్య రాసిన చిన్న కథల సమాహారం 'హసీనా అండ్ అదర్ స్టోరీస్'. ఈ సంకలనానికి దీపా భస్తి చేసిన ఆంగ్ల అనువాదమే 'హార్ట్ ల్యాంప్'. మన సమాజంలో మహిళలు అనునిత్యం ఎదుర్కొంటున్న సమస్యలకు అక్షర రూపమే ఈ పుస్తకం. కర్ణాటక నుంచి బుకర్ పురస్కారం పొందిన తొలి రచయిత బానూ ముష్తాఖ్ కావడం విశేషం. పుస్తకం గురించి బుకర్ జ్యూరీ స్పందిస్తూ.. మొత్తం 12 చిన్న కథల్లో మహిళల జీవన చిత్రాన్ని పరిశీలనాత్మకంగా విశ్లేషించారని కొనియాడింది. కదిలించే భావాలు, కలవరపెట్టే ఉద్వేగాలను చమత్కారంతో ఉత్సాహపరిచే శైలిలో ఆయా పాత్రలతో చెప్పించారని అభినందించింది. ఆయా కథలు చదువుతుంటే నిజ జీవితంలో మనకు తారసపడే తల్లి, చెల్లి, పిల్లలు, బామ్మలే కళ్లముందు కదలాడుతారని వివరించింది.

# వార్తల్లో వ్యక్తి

ముస్లిం కుటుంబంలో జన్మించిన బాను.. పాఠశాల విద్యను అభ్యసిస్తోన్న సమయంలోనే తొలిసారి ఒక షార్ట్ స్టోరీ రాశారు. అయితే, 26 ఏళ్ల వయసులో తన కథ పత్రికలో ప్రచురితమైంది. దాంతో ఆమె ప్రతిభ వెలుగులోకి వచ్చింది. తన తండ్రి ప్రోత్సాహంతో చదువులో రాణించిన ఆమె.. కన్నడ భాషపై పట్టు సాధించారు. తర్వాత ఆమె రిపోర్టర్గా, లాయర్గా వృత్తిజీవితాన్ని కొనసాగించారు. ఆమె రచయితగానే కాకుండా మహిళల హక్కుల కోసం గళమెత్తారు. మహిళలు ప్రశ్నించకుండా మతం, సమాజం వారిని ఎలాంటి కట్టుబాట్లలో ఉంచుతాయో తన కథల రూపంలో వ్యక్తీకరించారు. హార్ట్యంప్ తో పాటు ఆరు చిన్న కథల సంకలనాలు, ఒక నవల, మరికొన్ని రచనలు చేశారు. ఆ సాహితీ సేవలకు గుర్తుగా కర్ణాటక సాహిత్య అకాడమీ, దాన చింతామణి అతిమబ్బె అవార్డులు అందుకున్నారు.

బాను ముష్టాక్కు ముందునుంచి తిరగబడే స్వభావం ఉంది. మగపిల్లలతో కలిసి సైకిల్ నేర్చుకుంటున్న ఆమెను ముస్లిం పెద్దలు ఆపి ఇలా సైకిల్ తొక్కకూడదని హెచ్చరించారు. అయినా ఆమె లెక్క చేయలేదు. పెద్దలు కుదిర్చిన పెళ్లిళ్లు మాత్రమే జరిగే కాలంలో ప్రేమించి, పెళ్లి చేసుకున్నారు. 1974లో కట్నం ప్రస్తావన లేకుండా ఆమె పెళ్లి జరిగింది.

అయితే వాచ్ రిపేరర్ అయిన భర్తకు సరైన సంపాదన లేకపోవడం, అత్తింటివారి నుంచి ఇబ్బందులు, ఉమ్మడి సంసారం కలిగిన ఇంటిలో వారితో కలిసి ఉండటం.. ఇవన్నీ ఆమెను మానసికంగా బలహీనురాలిని చేశాయి. దీంతో ఆత్మహత్య చేసుకోవాలని అనుకున్నారు. ఒంటిపై పెట్రోల్ పోసుకున్నారు. అగ్గిపుల్ల వెలిగించే సమయంలో భర్త ఆపారు. చివరకు ఆమె షరతులకు భర్త ఒప్పుకోవడంతో ఆత్మహత్య, విడాకుల ఆలోచనలు మానుకున్నారు. అప్పటినుంచి ఆమెకు కాస్త స్వేచ్ఛ లభించింది.

'ముస్లిం మహిళలు సినిమాలు చూడటం నేరమా?' అనే అంశంపై ఆమె రాసిన వ్యాసం కన్నడ పత్రిక 'లంకేశ్ పత్రికె'లో ప్రచురితమై విశేషమైన పేరు తెచ్చింది. దాంతో అదే పత్రికలో రిపోర్టరుగా చేరారు. అనంతరం కొన్ని నెలలపాటు బెంగళూరు ఆలిండియా రేడియోలో పని చేశారు. 1978లో తండ్రి ప్రోద్బలంతో మీద ఆమె మున్సిపల్ ఎన్నికల్లో అభ్యర్థినిగా పోటీ చేశారు. ఎన్నికల గుర్తు 'కుట్టు మిషన్'. తండ్రితో కలిసి ఇంటింటికీ వెళ్లి ఆమె ప్రచారం చేశారు. అయితే ఇలా చేయడం స్థానిక ముస్లిం పెద్దలకు నచ్చలేదు.

ఓటు వేయొద్దని వారు వ్యతిరేక ప్రచారం చేశారు. అలా ఒక్క ఓటు తేడాతో ఆమె ఓడిపోయారు. మొదటి ప్రయత్నంలో ఓడిపోయినా, ఆ తర్వాత రెండుసార్లు హాసన్ మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసి, గెలిచారు. బాను ముస్తాక్ రచయితగానే కాక, సామాజిక కార్యకర్తగానూ తన ప్రయాణాన్ని ప్రారంభించారు. అందరికీ సమానహక్కులు దక్కాలని, సామాజిక న్యాయం అందాలని పోరాడారు. తొలుత దళిత హక్కుల ఉద్యమ పరిచయంతో మొదలైన పోరాట జీవితం ఆ తర్వాత అనేక అంశాలపై పోరాడేందుకు బాటలు వేసింది. ఆ కాలంలో మొత్తం జిల్లాలో అలాంటి పోరాటాల్లో పాల్గొన్న ఏకైక ముస్లిం మహిళ ఆమే. బాను ముస్తాక్ కన్నడతోపాటు హిందీ, దక్కనీ ఉర్దూ, ఇంగ్లిష్ మాట్లాడగలరు. ఆమె రచనలు ఉర్దూ, హిందీ, తమిళం, మలయాళ, పంజాబీ, ఇంగ్లిషు భాషల్లోకి అనువాదమయ్యాయి. ఇస్లాం ప్రకారం స్త్రీలకు మసీదుల్లో ప్రవేశం ఉందని, కేవలం మగవారే వారిని ఆపుతున్నారు అని ఆమె చేసిన వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా సంచలనంగా మారి, తీవ్ర దుమారానికి దారి తీశాయి. ఆమెను, ఆమె కుటుంబాన్ని మూడు నెలలపాటు సామాజికంగా బహిష్కరించారు. కర్ణాటకలో ముస్లిం బాలికలు స్కూళ్లలో హిజాబ్ వేసుకునే హక్కు కోసం పోరాడిన సమయంలో బాను ముస్తాక్ వారికి మద్దతుగా నిలిచారు. 1990లో లా చదివిన బాను ముస్తాక్, లాయర్గా స్త్రీల సమస్యలపై నిరంతరం పోరాడుతున్నారు. ఇప్పటివరకూ వేలాది కేసులపై ఆమె వాదించారు.

★★★

**కొత్త సీరియల్**

క్రైం సీరియల్

# ఆమె ఎవరు?

## జరిగిన కథ:

మేఘమాల కళ్ళు తెరిచే టప్పటికి ,తను ఉన్న ప్రదేశం కొత్తగా అనిపిస్తుంది .తన గదిలోకి ఓ అపరిచిత స్త్రీ వచ్చి మేఘమాలా లండన్ లో ని తన సొంత ఇంట్లో ఉన్నదని చెపుతుంది .మేఘమాలకి ఏమి అర్ధం కాదు.విశాల్ కేంద్ర మంత్రి కి మాఫియా సంబంధాల ను పత్రికలో ప్రచురించాలని చూస్తాడు .ఎడిటర్ అడ్డుకోవటం తో నిరాశపడుతున్న విశాల్ ను స్మిత ఓదారుస్తుంది .హోం మినిస్టరుచిదమబరం కూతురు తప్పిపోతుంది .ఆమె ఆచూకి కోసం పోలీసులు ప్రయత్నం చేస్తుంటారు .ఆమెలాగే మేఘమాలా ఉండటం తో ఆశ్చర్యపోతారు .విశాల్ మేఘమాల విషయం కనుగొనాలని ప్రయత్నిస్తుంటాడు .మంత్రి పి ఏ ని చంపేస్తారు శత్రువులు .లండన్లో ఉన్న మేఘమాల హోం మినిస్టర్ కూతుర్ ఒక్కరేనా అని నిరుపించాతానికి బయలుదేరతాడు విశాల్

**ఇక చదవండి**



కొండగుంట వెంకటేష్.

మరునాడు విశాల్ కొంచం పెందళాడే పార్క్ కు చేరుకున్నాడు. బెర్లీ ఉంటే ఫర్వాలేదు కాని టోని ఉంటే మేఘమాలతో మాట్లాడలేడు. జరిగిన విషయం బెర్లీ కి చెప్తాడు. దాంతో వాళ్ళిద్దరు అలర్ట్ అవుతారు. అందుకే వాళ్ళకు కనిపించకుండ దూరంగా ఒక చెట్టు చాటున నిలబడ్డాడు.

అనుకున్న సమయానికి మేఘమాల వచ్చింది. ఆమెతో బెర్లీ వచ్చింది. కాని విచిత్రంగా టోని రాలేదు. బెర్లీ అలవాటు ప్రకారం దూరంగా కూర్చుంది. సెల్ లో ఎవరితోనో నవ్వుతూ మాట్లాడుతోంది. ఒంటరిగా కూర్చుంది మేఘమాల

టోని లేడు. అందుకే భయపడకుండ మేఘమాల దగ్గరకు వెళ్ళాడు.

ఆమె నవ్వుతూ అతని వైపు చూసింది.

“ఏదో మాట్లాడాలని అన్నారు”అన్నాడు.

ఆ మాట ఆమెను పూర్తిగా కదిలించింది. ఉపోద్ఘాతం లేకుండ అంతా వివరంగా చెప్పింది.

తన మానసిక పరిస్థితి రాత్రి పడుతున్న కష్టాలు అన్ని చెప్పింది.

"అంటే మీరు గతం పూర్తిగా మరిచిపోయారంటున్నారు అవునా? అడిగాడు.

"వాళ్ళ మాటలు నేను కొంచం కూడా నమ్మటంలేదు. నా తండ్రిగా ఉన్న వ్యక్తి మీద కూడా నాకు నమ్మకం లేదు. అతను నటిస్తున్నాడని నాకు అనుమానంగా ఉంది. కాని గతం గుర్తుకురాకపోవటం వల్ల ఏం చెయ్యలేకపోతున్నాను"అంది.

జాలిగా చూశాడు విశాల్.

"మీరు బాధపడకండి. ఈ క్షణం నుంచి అంతా నేను చూసుకుంటాను. మీ వెనుక ఉన్న రహస్యం ఏమిటో తెలుసుకుంటాను. అప్పుడప్పుడు మీతో మాట్లాడవలసి వస్తుంది. అందుకే సెల్ తెచ్చాను. అవసరమనుకున్నప్పుడు కాల్ చేస్తాను. మీరు కూడా నాకు చెయ్యండి. బెర్లీ గురించి భయం లేదు. టోని నన్ను ఉంతకుముందు చూశాడు. అని జరిగిన దంతా చెప్పాడు.

"మీతో నన్ను చూస్తే వాడు అనుమాన పడతాడు. అందుకే ఈ సెల్"

బెర్లీకి అనుమానం వస్తుందని వెళ్ళిపోయాడు విశాల్. ఆ రోజు చాల సంతోషంగా ఉంది మేఘమాలకు. తనకు ఒక మనిషి తోడున్నాడు. తన బాధను అర్ధంచేసుకుని సహాయం చేస్తానని చెప్పాడు. అంతకంటే కావల్సింది ఏముంది. చాల రోజుల తరువాత మొదటిసారి రాత్రి వేళ భయపడకుండ నిద్రపోయింది మేఘమాల.

XXXX

ఆ రోజు ఆదివారం. బెర్లీ టోని చర్చ్ కు వెళ్ళారు. తనకు తలనొప్పిగా ఉందని రానని చెప్పింది మేఘమాల. వాళ్ళు వెళ్ళిన తరువాత విశాల్ కు కాల్ చేసింది.

"ఇంట్లో ఎవరు లేరా?అడిగాడు విశాల్.

"చర్చ్ కు వెళ్ళారు. రెండు మూడు గంటలవరకు రారు."

"గుడ్ అయితే మనం ఫ్రీగా మాట్లాడుకోవచ్చు. నువ్వు లండన్ లో పుట్టావని చెప్పారు కదు."

"అవును."

"ఏ హస్పటల్ లో. తేది సంవత్సరం తెలుసా."

"తెలియదు. బెర్లీ కి తెలుసనుకుంటాను."

"ఎలాగు ఇంట్లో ఎవరు లేరు. వెతుకు. ఏదో ఒకటి దొరక్కపోదు"అన్నాడు విశాల్.

సరే అని చెప్పి లైన్ కట్ చేసింది. తరువాత గదంతా వెతికింది. ఏం దొరకలేదు. తండ్రి గదిలోకి వెళ్ళింది. తండ్రి డ్రాయర్ లో ఒక ఫైలు కనిపించింది. అందులో చాల డాక్యుమెంట్స్ ఉన్నాయి. ముఖ్యంగా ఆమె తీసుకున్న డిగ్రీ సర్టిపికేట్ కూడా ఉంది. వాళ్ళు చెప్పింది నిజమే. ఆమె లండన్ లో ఆక్స్ ఫర్డ్ యూనివర్సటిలో చదివింది. దాంతో పాటు ఆమె బర్త్ సర్టిఫికేట్ కూడా కనిపించింది.

అందులో పుట్టిన తేది సంవత్సరం టైం కూడా ఉంది. వాటిని ఒక కాగితంలో నోట్ చేసుకుంది. తరువాత ఫైలును డ్రాయర్ లో పెట్టి తన గది చేరుకుంది. విశాల్ కు కాల్ చేసి వివరాలు ఇచ్చింది.

"ఇది చాలు. తరువాత కాల్ చేస్తాను బై"అని లైన్ కట్ చేశాడు.

తను కూడా సెల్ స్విచ్ ఆఫ్ చేసి బెడ్ కింద దాచేసింది.

ఉద్వేకంతో ఆమె గుండెలు వేగంగా కొట్టుకుంటున్నాయి. ఇందులో వివరాలు నిజమైతే వాళ్ళ మాటలు నిజమని నమ్మాలి. లేకపోతే కావాలని అబద్ధం చెప్పారని తెలుస్తుంది. దానికి కారణం ఏమిటో కూడా తెలుసుకోవాలి. ఆలోచిస్తూ కళ్ళు మూసుకుంది. సంతోషం, ఆనందం కలిసికట్టుగా ఆమెను కుదిపేస్తున్నాయి. పడుకుందామని ఎంతో ప్రయత్నించింది. కాని నిద్రరావటం లేదు. ఒక్కోక్కోసారి మనిషికి విపరీతమైన సంతోషం కలిగినప్పుదు, బాధ కలిగినప్పుదు నిద్రరాదు.

ఇది అందరికి జరిగే పరిణామం.

దీనికి మేఘమాల అతీతురాలు కాదు.

పన్నెండు గంటలకు వచ్చారు టోని బెర్లీ. మేఘమాలను గదిలో చూసి తేలికగా నిటుర్చారు. ఎట్టిపరిస్థితిలోను మేఘమాలను ఒంటరిగా విడిచి ఎక్కడకి వెళ్ళకూడదని అధినేత వాళ్ళకు చెప్పాడు. చర్చ్ కు వెళ్ళాలనే తొందరలో ఈ విషయం మరిచిపోయారు. చర్చ్ కు వెళ్ళిన తరువాత గుర్తుకువచ్చింది బెర్లీ. దాంతో చాల అసహనంగా ఫీలయింది.

టోని భోజనానికి బయటకు వెళ్ళిపోయాడు. బెర్లీ మేఘమాల భోజనం చేశారు. తరువాత మేఘమాల తన గదిలోకి వెళ్ళి తలుపువేసుకుంది. ఈ విషయం బెర్లీకి కొంచం ఆశ్చర్యం వేసింది. కాని పెద్దగా పట్టించుకోలేదు.

XXXX

మేఘమాల ఇచ్చిన సమాచారంతో విశాల్ లండన్ నగరానికి కొంచం దూరంలో ఉన్న హామ్ స్టడ్ అనే ఊరుకు చేరుకున్నాడు. రాయల్ హాస్పటల్ ముందు కారాపి లోపలికి వెళ్ళాడు. చీఫ్ డాక్టర్ ను కలుసుకుని తన దగ్గర ఉన్న కాగితాన్ని చూపించాడు. వాళ్ళు రికార్డ్స్ మొత్తం చెక్ చేశారు. ఆ టైంలో ఆ రోజు ఆ హాస్పటల్ లో ఎవరికి ఆడపిల్ల పుట్టలేదని తెలిసింది. ఆ రోజు అందరు బాబులే పుట్టారు. అయిన అనుమానం తీర్చుకోవటానికి ఒకటికి రెండు సార్లు రికార్డ్స్ చెక్ చేశారు. కాని ఫలితం కనిపించలేదు.

జరిగింది ఇప్పుడు అతనికి అర్ధమైంది. ఇండియాలో అయితే హాస్పటల్ అధికారులు అబద్ధం చెప్తారు. కాని ఇంగ్లాండ్ లో అలా చెయ్యరు. జరగదు. వాళ్ళ హెల్త్ కేర్ సిస్టమ్ అమెరిక కంటే చాల బాగుంటుంది. ఉన్నంతవగా ఉంటుంది. పైగా ఖర్చుకూడ తక్కువ.

అక్కడే చుట్టుపక్కల ప్రదేశంలో ఉన్న ఇంకో మూడు హాస్పటల్ కు వెళ్ళాడు. వాళ్ళ దగ్గర సరిఅయిన సమాచారం లేదు. కాని ఒక హాస్పటల్ లో మాత్రం అదే రోజు ముగ్గురు పాపలు పుట్టారు. వాళ్ళ అడ్రస్సు ఫోన్ నెంబర్ తెలుసుకున్నాడు.

తరువాత ఇంటికి చేరుకున్నాడు. గదిలోకి వెళ్ళి మేఘమాలకు కాల్ చేశాడు.

"ఏమైన తెలిసందా"ఆత్రంగా అడిగింది మేఘమాల.

"నీ బర్త్ సర్టిఫికేట్ నిజం కాదు. అది ఫేక్ సర్టిఫికేట్"అని తను తెలుసుకున్నదంతా చెప్పాడు.

"నాకు ఒక రోజు టైం ఇవ్వు. నీ సర్టిఫికేట్ అబద్ధం అని ఆధారాలతో నిరుపిస్తాను"అని లైన్ కట్ చేశాడు.

తరువాత మరుసటి రోజు అడ్రస్సు ప్రకారం ఒక ఇంటికి వెళ్ళాడు. వాచ్ మెన్ కు డబ్బు ఆశ చూపి ఆ ఇంటి వివరాలు తెలుసుకున్నాడు. హామ్ స్టడ్ హాస్పటల్ లో పుట్టిన పాపకు ఇప్పుడు ఇరవైరెండు సంవత్సరాలు. ఆమె ఆ రోజు ఇంట్లోనే ఉంది. కొంచంసేపయిన తరువాత ఆమె బయటకు రావటం చూశాడు విశాల్. దాంతో అతని అనుమానం తీరింది. మిగత ఇద్దరిని కూడా చూశాడు. సో ఆ ముగ్గురు పుట్టుక అబద్ధం కాదని తేలిపోయింది.

సంతోషంతో మళ్ళి మేఘమాలకు కాల్ చేశాడు.

"ఆ రోజు పుట్టిన ముగ్గురు పాపలకు నీ అంత వయస్సు ఉంటుంది. వాళ్ళందరు క్షేమంగా ఉన్నారు. నువ్వు మాత్రం ఇక్కడ పుట్టలేదని నిర్ధారణ అయింది. నీ ఫేక్ సర్టిఫికేట్ మాత్రం చాల పకడ్బందీగా తయారుచేశారు. ఎవరు క్లాస్ చెక్ చెయ్యరని అనుకున్నారు. కాని నిజం దాగదు. అది ఎప్పుడో ఒకప్పుడు బయటపడుతుంది."

"ఇప్పుడు నేను ఏం చెయ్యాలి విశాల్"బేలగా అడిగింది మేఘమాల.

"బాధపడకు. అసలు విషయం కొంచమైన తెలియాలంటే నీకు పోయిన జ్ఞాపకం తిరిగి రావాలి. యాక్సిడెంట్ జరగటం వల్ల నీకు మతిమరుపు వచ్చిందని రాజేష్ చెప్పాడు. అది కూడా అబద్ధం ఎందుకు కాకూడదు. అందుకే ఒక సారి హాస్పటల్ కు వెళ్ళి వాకబు చేస్తాను. ఒక వేళ ఆ విషయం అబద్ధం అయితే మిస్టరీ వీడిపోతుంది. దీని వెనుక ఎవరో పెద్ద తలకాయలు ఉన్నాయని తెలుస్తుంది. అది ఖచ్చితంగా తెలిస్తే తరువాత ఏం చెయ్యాలో ఆలోచిద్దాం. అంతవరకు నువ్వు కూల్ గా ఉండు. నీ బాధ కాని

# క్రైం సీరియల్

భయం కాని బయటకు వ్యక్తం చెయ్యకు. ముఖ్యంగా బెర్లీకి టోనికి అనుమానం రాకూడదు. గుర్తుంచుకో. ఉంటాను "అన్నాడు విశాల్.

XXXX

హోంసెక్రటరికి మేఘమాల గురించి సమాచారం ఇచ్చిన మనిషి రెస్టారెంటులో కూర్చుని కాఫీ తాగుతున్నాడు. అతనికి హోం సెక్రటరి చనిపోయిన విషయం రెండు రోజుల తరువాత తెలిసింది. ఆ రెండు రోజులు అతను మేఘమాలను ప్రతిక్షణం అనుసరించాడు. ఆమె ఇంటి చిరునామా తెలుసుకున్నాడు. బెర్లీ టోని గురించి కూడా తెలుసుకున్నాడు. ఈ విషయాలు హోంసెక్రటరికి చెప్పాలని అనుకున్నాడు. కాని ఈ లోగా ఆయన చనిపోయాడు. ఎవరో దారుణంగా కారులో బాంబు పెట్టి చంపేశారు. ఈ విషయం వినగానే అతనికి భయం కలిగింది. హోంమంత్రి శత్రువులు ఎవరో ఈ పని చేశారని అతనికి అర్ధమైంది. తనని కూడా విడిచిపెట్టరని అతనికి అర్ధమైంది. అందుకే కొన్నిరోజులు రహస్యంగా దాక్కున్నాడు. ఎవరికి కనిపించకుండ జాగ్రర్తపడ్డాడు.

కాని ఎన్నోరోజులు ఒంటరిగా ఉండలేకపోయాడు. ఏమైన అవ్వని అని రిస్క్ తీసుకుని బయటకు వచ్చాడు. రెస్టారెండులో కూర్చుని రిలాక్స్ అవుతున్నాడు.

కాఫీ తాగిన తరువాత ఆ మనిషి బయటకు వచ్చాడు. అటు ఇటు చూస్తూ మెల్లగా నడుస్తున్నాడు. అప్పుడే ఒక కారు వేగంగా దూసుకువస్తోంది. అతన్ని ఢీకొట్టి ముందుకు వెళ్ళిపోయింది. ఆ ఇంపాక్ట్ కు అతను ఎగిరి అవతలపడ్డాడు. తల బలంగా నేలను గుద్దుకుంది. తలపగిలి రక్తం బయటకు వచ్చింది. ఒక్క క్షణం గిలగిలకొట్టుకున్నాడు. తరువాత నిశ్చలంగా అయిపోయాడు. క్షణంలో అతని ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. అతన్నిగుద్దిన కారు ఆగలేదు. అదే వేగంతో ముందుకు దూసుకుపోయింది.

XXXX

ఆ రోజు మేఘమాల తండ్రి వచ్చాడు. మాములుగా నవ్వుతూ కూతురిని పలకరించాడు. ఎదురుగా ఉన్నది తన తండ్రి కాదని ఆమెకు తెలుసు. కాని ఆ విషయాన్ని ఆమె బయటకు చూపించలేదు. ఒక తండ్రి తో కూతరు ఎలా ఉంటుందో అలా ప్రవర్తించింది. మాములు పలకరింపులు అయ్యాయి. ఆయన తన గదిలోకి వెళ్ళిపోయాడు. క్షణం తరువాత బెర్లీ టోని కూడా ఆయన గదిలోకి వెళ్ళారు.

వెంటనే తలుపులు మూసుకున్నాయి.

ఈ విషయం మేఘమాల గమనించింది. అయిన పట్టించుకోలేదు. ఆమె విశాల్ కాల్ కోసం ఎదురుచూస్తోంది. ఈ రోజు హాస్పటల్ కు వెళ్ళి వాకబు చేస్తానని చెప్పాడు. ఆమెకు యాక్సిడెంట్ అయిన తరువాత ట్రీట్మెంట్ తీసుకున్న హాస్పటల్ అది. అక్కడ ఉన్న రికార్డ్స్ చూస్తే నిజం తెలుస్తుంది.

ఆమె ఎంతో సేపు ఎదురుచూడలేదు. ఫోన్ రింగ్ అయింది.

"నేను హాస్పటల్ కు బయలుదేరుతున్నాను " అన్నాడు.

"మళ్ళీ ఎప్పుడు కాల్ చేస్తావు"అడిగింది.

"ఆ హాస్పటల్ చాల పెద్దది. చీఫ్ మెడికల్ ఆఫీసర్ ను కలుసుకుని మాట్లాడాలి. ఎంతసేపు పడుతుందో ఖచ్చితంగా చెప్పలేను. అన్ని వివరాలు తెలుసుకున్న తరువాత కాల్ చేస్తాను."

"నా డూప్లికేట్ తండ్రి వచ్చాడు"అంది.

"ఆయనతో మాములుగా ఉండు. నవ్వుతూ పలకరించు. వీలుచూసుకుని తరువాత కాల్ చేస్తాను"అన్నాడు.

విశాల్ తో మాట్లాడిన తరువాత తండ్రి గది దగ్గరకు వెళ్ళింది. తలుపులు మూసి ఉన్నాయి. చుట్టు పక్కల బెర్లీకాని టోనికాని కనిపించలేదు. వాళ్ళిద్దరు ఇంకా గదిలో ఉన్నారని మేఘమాలకు అర్ధం అయింది. చేసేది లేక తన గదిలోకి వచ్చి కూర్చుంది.

పావుగంట తరువాత బెర్లీటోని బయటకు వచ్చారు. వాళ్ళవెనుక మేఘమాల తండ్రి వచ్చాడు.

## క్రైం సీరియల్

"ఇప్పుడు ఒంట్లో ఎలా ఉంది తల్లి "అడిగాడు ఆయన.

"బాగానే ఉంది. కాని ఇంకా పాతవిషయాలు గుర్తుకుమాత్రం రావటం లేదు"అంది విచారంగా మొహం పెట్టి.

"తొందరపడకు. ఇంకో మూడు నెలలు ఆగు. అన్ని విషయాలు గుర్తుకువస్తాయి"అన్నాడు నవ్వుతూ.

"మూడు నెలలా"విస్తుబోయింది. అంత ఖచ్చితంగా ఎలా చెప్పగలవు?

ఆయన కంగారుపడ్డాడు కాని జవాబు చెప్పలేదు.

"సరే నేను బయలుదేరుతాను. నీకు ఏదైన కావాలనుకుంటే బెర్లీని అడుగు. కాని ఒంటరిగా మాత్రం తిరగకు. అసలే రోజులు బాగా లేవు"అన్నాడు.

అలాగే అని తలూపింది.

తరువాత ఆయన వెళ్ళిపోయాడు.

"మేఘమాల నువ్వు గదిలోకి వెళ్ళి రెస్ట్ తీసుకో. మద్యాహ్నం రాజేష్ వస్తానని చెప్పాడు"అంది.

"దేనికి"అంది.

"డాక్టర్ ఎందుకు వస్తాడు. నిన్నుచెక్ చెయ్యటానికి "అని చెప్పి వెళ్ళిపోయింది బెర్లీ.

టోని బయటకు వెళ్ళిపోయాడు.

మేఘమాల కూడా తన గదిలోకి వెళ్ళింది. యధాప్రకారం కిటికి దగ్గర నిల్చుంది. XXXX

కారును హాస్పటల్ పార్కింగ్ స్పేస్ లో ఆపాడు విశాల్. కారు లాక్ చేసి లోపలికి వెళ్ళాడు. రిసప్షన్ దగ్గర చాల మంది ఉన్నారు. కౌంటర్ లో అందమైన అమ్మాయి ఉంది. చిరునవ్వు నవ్వుతూ విజిటర్స్ అడిగిన ప్రశ్నలకు జవాబు ఇస్తోంది.

దాదాపు పదిమంది ఉన్నారు.అందరు డిసిప్లిన్ గా క్యూలో నిల్చుని ఉన్నారు. ఎవరి మొహంలో కొంచమైన అసహనం కాని విసుగు కాని కనిపించలేదు. ఇది మామూలే అన్నట్టు కూల్ గా ఉన్నారు. పావుగంట తరువాత విశాల్ వంతు వచ్చింది.

"యస్ చెప్పండి"అంది ఆ అమ్మాయి.

"నాకు చిన్న ఇన్ ఫర్ మేషన్ కావాలి"అన్నాడు విశాల్. సంభాషణ అంతా ఇంగ్లీష్ లో జరుగుతోంది.

"మూడు నెలలకు ముందు మేఘమాల అనే అమ్మాయికి యాక్సిడెంట్ జరిగింది. ఆమె ఈ హాస్పటల్ లోనే ట్రీట్ మెంట్ తీసుకుంది. ఆమె వివరాలు కావాలి"అన్నాడు విశాల్.

"తిన్నగా వెళ్ళి కుడివైపుకు తిరగండి. ఎదురుగా రికార్డ్స్ రూమ్ కనిపిస్తుంది. అక్కడికి వెళ్ళి ఎన్ క్వైరీ చెయ్యండి"అని చెప్పింది ఆ అమ్మాయి.

నేరుగా రికార్డ్స్ రూమ్ లోకి వెళ్ళాడు విశాల్.

"ఏం కావాలి?అడిగాడు ఇన్ చార్జ్.

విశాల్ చెప్పాడు.

"సారీ పేషంట్స్ వివరాలు మేము ఇవ్వం. అది రూల్స్ కు విరుద్దం"అన్నాడు నవ్వుతూ.

అతని మాటాల్లో సీరియస్ నెస్ కనిపించలేదు. కాని ఉద్దేశం కనిపించింది. విశాల్ కు అది అర్థమైంది. వెంటనే జేబులోంచి పది పౌండ్లు తీసి టేబుల్ మీద పెట్టాడు. ఆత్రంగా అందుకుని జేబులో పెట్టుకున్నాడు. రికార్డ్స్ రూమ్ లోకి వెళ్ళి ఒక పెద్ద రిజిస్టర్ తీసుకువచ్చాడు.

విశాల్ దాన్ని ముందు పెట్టుకుని చూడటం మొదలుపెట్టాడు. మూడు నెలలకు ముందు మేఘమాలకు యాక్సిడెంట్ జరిగింది. తేది సరిగ్గా తెలియదు. ఇది ఆగస్ట్ నెల. అంటే మే లో కాని ఫ్రిబ్రవరి చివరలో కాని జరిగి ఉండాలి. ముందు ఫిబ్రవరి నెలలో చూశాడు. ఆ నెలలో యాక్సిడెంట్ కేసులు ఏం లేవు. తరువాత మేలో చూశాడు. ఆ నెలలో మూడు యాక్సిడెంట్ కేసులు ఉన్నాయి. వాటిలో ఇద్దరు ఆడవాళ్ళు ఒక మగవాడు. ఆడవాళ్ళ లో మేఘమాల పేరు లేదు. వేరే ఏదో పేరు ఉంది. ఒక వేళ పేరు మార్చి ఉండవచ్చు.

ఆ ఆలోచనతో వాళ్ళ వివరాలు చూశాడు. ఇద్దరు బ్రిటిష్ దేశస్థులు. ఒక అమ్మాయికి ఇరవై అయిదు సంవత్సరాలు ఉంటాయి. మరో అమ్మాయికి ఎనిమిది సంవత్సరాలు. ఆ తరువాత యాక్సిడెంట్ కేసులు ఏం లేవు. ఎందుకైన మంచిదని జనవరి నెల కూడా చూశాడు. ఆ నెలలో నాలుగు యాక్సిడెంట్ కేసులు నమోదు అయ్యాయి. కాని యాక్సిడెంట్ అయిన వాళ్ళందరు

మగవాళ్ళు.

చివరి ప్రయత్నంగా జూన్ నెల కూడా చూశాడు. ఏం లేదు. జూలై నెలలో కూడా మేఘమాల పేరు లేదు. దాంతో రాజేష్ అబద్ధం చెప్పాడని అతనికి అర్థమైంది.

రికార్డ్ ఇన్ చార్జ్ కు థ్యాంక్స్ చెప్పి హాస్పటల్ నుంచి బయటకు వచ్చాడు. టైం చూశాడు. పన్నెండు గంటలు కావస్తోంది. ఈ టైంలో మేఘమాల పడుకుని ఉంటుంది. రాత్రి వేళ డ్యాన్స్ ప్రోగ్రాం ఉంటుంది కనుక పగలు విశ్రాంతి తీసుకుంటుంది.

ఇంటికి చేరుకుని రిఫ్రెష్ అయ్యాడు విశాల్. రెండు చోట్ల అబద్ధం అని తేలిపోయింది. ఒకటి మేఘమాల పుట్టుక, ఇంకోకటి యాక్సిడెంట్. ఇంకో విచిత్రమైన విషయం మేఘమాల గతం గుర్తుకురాకపోవటం. అది ఎలా సాధ్యం. యాక్సిడెంట్ వల్ల ఆమె తలకు బలమైన గాయం తగిలిందని రాజేష్ చెప్పాడు. కాని ఆమెకు యాక్సిడెంట్ జరగలేదని నిర్ధారణ అయింది. మరి గతం ఎలా మరిచిపోయింది. ?

XXXX

ఆ రోజు కూడా డ్యాన్స్ పూర్తిచేసి ఇంటికి చేరుకుంది మేఘమాల. విశాల్ కాల్ కోసం పగలంతా ఎదురుచూసింది. కాని అతను చెయ్యలేదు. కొంచం కంగారుపడింది. తనే చేద్దామని అనుకుంది. కాని గదిలో ఆమెతో పాటు బెర్లీ టోని ఇద్దరు ఉన్నారు. అందుకే ఊరుకుంది. తరువాత డ్యాన్స్ ప్రోగ్రాం గురించి ఆలోచిస్తూ గడిపింది. ఇంకా ఈ నాట్యం ఎన్నిరోజులు చెయ్యాలో. గతం గుర్తుంటే అది వేరే. కాని బొత్తిగా ఏం గుర్తుకురావటంలేదు. ఆ విషయం ఆలోచిస్తుంటే ఏదేదో జరుగుతుంది. తలనొప్పి తో మొదలవుతుంది. తరువాత విపరీతమైన అలజడి మొదలవుతుంది. ఈ నరకయాతన ఎన్ని రోజులు అనుభవించాలో.

తలచుకుంటే తన మీద తనకే జాలి వేస్తుంది ఆమెకు. అప్రయత్నంగా కళ్ళు తడి అయ్యాయి. మంచం మీద పడుకుని కళ్ళు మూసుకుంది. కాని నిద్రరావటం లేదు. వచ్చిన పెద్దగా ప్రయోజనం ఉండదు. పీడకలలు వస్తాయి. దానికంటే నిద్రపోకుండ ఉండటమే బాగుంటుంది.

అప్పుడే ఆమె సెల్ చప్పుడు అయింది. గది తలుపులు మూసి ఉన్నాయి. బెర్లీ ఇంకో గదిలో నిద్రపోతుంది. టోని కింద అవుట్ హవుస్ లో ఉంటాడు. ఇద్దరికి సెల్ రింగ్ వినిపించే అవకాశం లేదు.

వెంటనే సెల్ ఆన్ చేసి "చెప్పు విశాల్ "అంది ఉద్వేకంగా.

"హాస్పటల్ లో రికార్డ్స్ చూశాను"అన్నాడు విశాల్ మెల్లగా.

"ఏమైన తెలిసిందా?

"డాక్టర్ చెప్పిందంతా అబద్ధం. రికార్డ్స్ లో నీ పేరు కాని నీ వివరాలు కాని ఎక్కడ లేవు. "

"అంటే రాజేష్ చెప్పింది అబద్ధమా?

"అవుననే తెలుస్తుంది."

"ఇప్పుడు ఏం చేద్దాం"బేలగా అంది.

"భయపడకు. దీని వెనుక చాల పెద్ద మిస్టరీ ఉంది. ఎవరో పెద్దవాళ్ళ ప్రమేయంతో ఇదంతా జరుగుతుంది. అసలు కారణం తెలియాలంటే ముందు నీకు గతం గుర్తుకురావాలి. యాక్సిడెంట్ వల్ల నువ్వు గతం మరిచిపోయావని రాజేష్ చెప్పాడు. అది అబద్ధం అని నిరూపితమైంది. అంటే కావాలనే నీ గతం మరిచిపోయేలా చేసి ఉండాలి"


"అది ఎలా సాధ్యం. ఒకరి గతం ఎలా చెరిపేస్తారు."

"ఈ ఆధునిక ప్రపంచంలో ఏదైన సాధ్యం అవుతుంది. టెక్నాలజి ఎంతో పెరిగింది. వాటి సహాయంతో మనిషిని పోలిన మనిషిని తయారుచెయ్యవచ్చు. ఇప్పుడు మనకు కనీసం కొన్ని నిజాలు తెలిశాయి. నీ గతం ఎలా చెరిగిపోయిందో కూడా తెలుసుకుందాం. అంతవరకు కంగారుపడకు. భయపడకుండ ధైర్యంగా ఉండు. నాకు రెండు మూడు రోజులు టైం ఇవ్వు. ఈలోగా నాకు తెలిసిన డాక్టర్స్ ను కలుసుకుని మాట్లాడతాను. తరువాత నీకు కాల్ చేస్తాను సరేనా"అన్నాడు అనునయంగా.

"సరే "అంది మేఘమాల.

(ఇంకా ఉంది )

## చదవాల్సిన పుస్తకం




# అంతర్ముఖం

అంతర్ముఖం యండమూరి రాసిన నవల. . పర్సనాలిటీ అన్న పదం 'పెర్సానే' అన్న లాటిన్ పదం నండి వచ్చింది. పెర్సానే అంటే ముసుగు అదే వ్యక్తిత్వం. మొహం మీదా మనసుమీదా ఉన్న పొర. ముఖం మనిషి మనసుకి ప్రతిరూపం అంటారు. ప్రతీ మనిషికీ రెండు ముఖాలు ఉంటాయి. పైకి కనిపించేది కృత్రిమమైన చిరునవ్వుని పులుముకున్న అందమైన ముఖం. రోజు రోజుకీ కుళ్ళిపోయి వికృత రూపం దాల్చేది లోపలి ముఖం – అదే అంతర్ముఖం. మనిషి యొక్క అంతర సౌందర్యాన్ని చూపించేదే అంతర్ముఖం. 70 ఏళ్ల నిండు జీవితం ముగింపు దశలో ఇక భరించింది చాలు సెలవు తీసుకో అనుకునే కుటుంబ సభ్యుల మధ్యన శరీరంలో అన్ని అవయవాలు స్వాధీనం తప్పి మృత్యు కుహరం అంచున ఉన్న ఓ వ్యక్తి తనగతంలోకి తొంగి చూసుకునే కథే ఈ అంతర్ముఖం.

"ప్రతి మనిషికీ రెండు ముఖాలుంటాయి. అందులో పైకి కనిపించేది కృత్రిమ చిరునవ్వు పులుముకున్న అందమైన ముఖం. రోజు రోజుకి కుళ్లిపోయి వికృతంగా మారేది అంతర్ముఖం" అని ఇతని భావన. యండమూరి వీరేంద్రనాథ్రాసిన అనేక నవలల్లో ప్రత్యేకత కలిగిన నవల ఇది.సాధారణంగా యండమూరి రచనలు ఎక్కువగా పత్రికల్లో ధారావాహికగా వచ్చేవి. ఇది అందుకు భిన్నంగా నేరుగా వచ్చిన నవల.

# చదవాల్సిన పుస్తకం

శ్రీ శ్రీ గారి కెరీర్ కి మహాప్రస్థానం ఎలాంటిదో యండమూరి వీరేంద్రనాథ్ గారి కెరీర్ కి “అంతర్ముఖం” అలాంటిది.

చలం గారు మహాప్రస్థానం ముందుమాటలో చెప్పినట్టు ఇందులోనూ సెక్సుని ఉద్రేకపరిచే విషయాలు ఉండవు. మనల్ని మనం చూసుకునేలాంటి పాత్రలు, చెంప చెళ్లుమనిపించేలాంటి సన్నివేశాలు భావాలు చదవటం అయిపోయాక గూడా కలవరపరుస్తాయి. ఆలోచింపజేస్తాయి.

మంచానపడి చనిపోవడానికి సిద్ధంగా ఉన్న ఓ వృద్ధుడి మనోభావాల్ని బయటకు తెలియజేస్తూ కథ ప్రారంభమౌతుంది. కొద్దిసేపటికి చనిపోయి స్వర్గానికి చేరుకుంటాడు. అక్కడ దేవుడితో వాదించి అసలు మరణమే లేకుండా వరం కోరుకుంటాడు. కానీ తన పొరపాటు వల్ల బ్రతికినంత కాలం అలా మంచాన పడిపోవాల్సి వస్తుంది. తను ఎంతో ప్రేమించిన కుటుంబ సభ్యులు రానూ తన గురించి పట్టించుకోవడం మానేస్తారు. ముందుగా సెంటిమెంట్లంటే పడని కథానాయకుడిని ప్రేమకు బానిసను చేసిన కథను గుర్తు చేసుకుంటాడు. తన మీద ప్రేమతో జీవితాన్నే త్యాగం చేసిన ప్రణవి గుర్తుకు వస్తుంది. అంతవరకూ తను చనిపోతానని ఎదురు చూసిన కుటుంబ సభ్యులు చివరకి అతన్ని ఓ ప్రభుత్వాసుపత్రిలో పడేస్తారు. అక్కడి నుంచి అతన్ని బయటికి లాగేస్తారు.. దీనాతి దీనమైన పరిస్థితుల మధ్య దేవుణ్ణి తనకిచ్చిన వరాన్ని వెనక్కి తీసుకుని మరణాన్ని ప్రసాదించాల్సిందిగా కోరుకుంటాడు.

హీరోయిన్ చనిపోయే విజయవంతమైన ఇతర నవలలన్నీ ఒక ఎత్తు. అంతర్ముఖం ఒక ఎత్తు! ఇందులో ప్రతి పాత్ర మన పక్కింట్లోనో, ఎదురింట్లోనో ఆఫీసులోనో చూసినట్లుగా అనిపిస్తుంది. అందుకే నవల చదవటం పూర్తయినా ఆ పాత్ర లు మన చుట్టూ తిరుగాడుతున్నట్టు అనిపిస్తాయి.



ఈ నవలలో అద్భుతమైన కొటేషన్స్ ప్రతి ఒక్కరికీ నచ్చుతాయి.

“రకరకాల పరిస్థితులలో మనుషులు రకరకాలుగా ప్రవర్తిస్తారు. అబద్దాలాడతారు. నటిస్తారు. లోపల ఒక రకంగా ఫీలవుతూ, పైకి మరో రకంగా ప్రవర్తిస్తుంటారు.”

“మనిషి తన గురించి ఆలోచించే సమయం కన్నా ఎదుటి మనిషిని గురించి ఎక్కువగా ఆలోచిస్తాడు”

“కులాలు, డబ్బు, జాతకాలు అంటూ అనవసరపు విషయాలకు ప్రాధాన్యం ఇచ్చే కంటే మనిషి అభిరుచులకి విలువ ఇచ్చి చేసుకుంటే ఇన్ని పెళ్ళిళ్లు ఫెయిల్యూర్ కావేమో”

“నువ్వు నన్ను ప్రేమిస్తున్నది నీ ఓదార్పు కోసం, నీ సమస్యలు తీర్చుకోవడం కోసం, నీ సెక్యూరిటీ కోసం’ అని నేను అనుకున్నంత కాలం నేను నిన్ను మనస్ఫూర్తిగా ఎలా ప్రేమించగలను” మనిషి బాహ్య ప్రవర్తననీ, అంతర్లీనంగా మనిషిలో జరిగే సంఘర్షణనీ, అతని చుట్టూ అల్లుకున్న బంధాలనీ, ప్రేమ గొప్పతనాన్ని, ప్రేమిస్తున్నావన్న భ్రమలో తమని తమే మోసం చేసుకునే వ్యక్తుల్నీ, నిజాయితీ చచ్చిపోతే మనుషుల మధ్య పెరిగే దూరాలనీ — ఇవన్నీ సమగ్రంగా ఒక కథా రూపంలో కూరిస్తే ఆ నవల కచ్చితంగా గుండె లోతుల్ని తాకుతుంది అన్న దానికి నిదర్శనం “అంతర్ముఖం”.పది సంవత్సరాల కాలంలో పదిసార్లు ముద్రణ జరిగి అత్యద్భుత నవలగా పాఠకులు ప్రశంసించిన నవల అంతర్ముఖం. మానవ సంబంధాలు మధ్య ముఖ్యంగా ప్రేమ, స్వార్థం, అవకాశవాదం, ఆధారపడటం గురించి లోతుగా చర్చిస్తూ సాగే నవల.వృద్ధుల యొక్క

## చదవాల్సిన పుస్తకం

భావావేశాలు, ఆలోచనలు చక్కగా వివరిస్తూ రచించిన కథనం.

నిజాయితీ లేని ప్రేమ ఎంత భయంకరంగా మారుతుందో; ఎంతో ప్రేమతో హృదయాన్ని హత్తుకున్న కన్న పిల్లలే, ఓపిక క్షీణిస్తే, చివరి దశలో ఎంత గట్టిగా గుండెల్ని తన్నుతారో; ప్రేమ ముసుగు వేసి ఎంతో నాటకీయతనీ, తెలివితేటల్ని ప్రదర్శిస్తారో కళ్ళకు కట్టినట్లు చూపిస్తూ, పాఠకుడి అంతర్ముఖాన్ని ఒక్కసారి తన జీవిత దర్పణంలో చూసుకునేలా చేస్తుందీ “అంతర్ముఖం”.ఈ కథలో నాయకుడు అవసాన దశలో ఉంటాడు. అతని కన్న కూతురూ, కొడుకులూ ఎప్పుడు మరణం సంభవిస్తుందా అని ఎదురు చూస్తూ ఉంటారు.మరణం తర్వాత కన్న వాళ్ళపై ప్రేమను ఎవ్వరూ చెరిపివేయలేరని అది ఆ భగవంతుని తరం కూడా కాదని దేవునితో వాదించి తాను పోయినా సంతానం తనకోసం ఎదురు చూస్తూంటారని చెప్పి బ్రతికి భూమ్మీదికొస్తాడు.

ఆయన బ్రతకటం వారి కుటుంబ సభ్యులకు నరకంగా మారుతుందని వారు ఎంత నీచానికి దిగజారుతారో అతనికి అర్ధం అవుతుంది. అంపశయ్య మీద పడుకొన్న ఆయనకు గతంలో అయని తల్లి అందించిన ప్రేమ, తండ్రి వదిలేస్తే పడ్డ కష్టాలు గుర్తుకు వచ్చి ఆయన్ని స్థితప్రజ్ఞునిగా చేస్తాయి.

★★★

## నకిలీ పోలీస్ స్టేషన్

నకిలీ పోలీసులను , నకిలీ ఉద్యోగులను చూసాము , మొన్నటికి మొన్న మనం నకిలీ బ్యాంకుని కుడా చూసాము .ఇప్పుడు ఓ ప్రబుద్ధుడు ఏకంగా నకిలీ పోలీస్ స్టేషన్ నే ఏర్పాటు చేసాడు . బిహార్‌లోని పూర్నియా జిల్లాలో నకిలీ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేసి ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసం చేసిన కేసు ఒకటి వెలుగులోకి వచ్చింది.జిల్లాలోని మోహని పంచాయతీలో ఈ ఘటన జరిగింది. అక్కడ పోలీస్ స్టేషన్ క్యాంప్ ఆఫీస్ ఏర్పాటు చేసి, శిక్షణ ఇచ్చి, ఉద్యోగాలు కల్పించే పేరుతో మోసం జరిగిందని ఆరోపణలొచ్చాయి. బిహార్ గ్రామ రక్షా దళ్, హోంగార్డు ఉద్యోగాల పేరుతో ఈ శిక్షణ డిసెంబర్ 2024 నుంచి జనవరి 2025 మధ్య జరిగినట్టు చెబుతున్నారు.


రాహుల్ కుమార్ సాహ్ గురించి దొరికిన ఏకైక సమాచారం ఏంటంటే... ఆయన ఎన్‌సీసీ క్యాడెట్. ఎన్‌సీసీ ద్వారానే ఆయన చాలామందితో పరిచయం పెంచుకున్నారు.డిసెంబర్ 2024లో రాహుల్ బెతౌనాలోని మధ్య విద్యాలయంలో బిహార్ రాజ్య దళపతి, గ్రామ రక్షా దళ్ బ్యానర్‌ను ఏర్పాటు చేశారు. ఇప్పుడు అందుబాటులో ఉన్న ఈ బ్యానర్ చిత్రాల కింద కస్బా పోలీస్ స్టేషన్ అని రాసి ఉంది.ఖాళీగా ఉన్న పాఠశాలలో ఒక నెల పాటు శిక్షణ ఇచ్చిన రాహుల్, 2025 జనవరి 26న, పంచాయతీ అధిపతి శ్యామ్‌సుందర్ ఒరాన్‌ను అతిథిగా ఆహ్వానించారు.శిక్షణ పూర్తి చేసుకున్న యువతీ యువకులను శ్యామ్‌సుందర్ ఒరాన్ సత్కరించారు. శిక్షణ తర్వాత రాహుల్ కుమార్ సాహ్ గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. బిహార్‌లో నకిలీ పోలీస్ స్టేషన్‌కు సంబంధించిన సంఘటన ఇది మొదటిది కాదు. 2022 సంవత్సరం మొదట్లో, బాంకా జిల్లాలో ఇలాంటి కేసు వెలుగులోకి వచ్చింది. దీనిలో ఇన్‌స్పెక్టర్ నుంచి వాచ్‌మెన్ వరకు అందరూ నకిలీలే.



## చూడాల్సిన సినిమా

ఆణిముత్యాలు

# ‘ సితార ‘






ఈదర శ్రీవిద్య

శంకరాభరణం , సాగరసంగమం వంటి కళాఖండాలు తీసిన ఏడిద నాగేశ్వరరావు గారి పూర్ణోదయా బేనరుపై వచ్చిన ఈ సితార సినిమా మరో క్లాసిక్ గా నిలిచిపోయింది . సంగీత సాహిత్య నాట్య సమ్మిళితం ఈ సితార . వేటూరి పాటలు , ఇళయరాజా సంగీతం , యం వి రఘు ఫొటోగ్రఫీ , శేషు నృత్య దర్శకత్వం , వంశీ సృజనాత్మక దర్శకత్వం , భానుప్రియ కళ్ళు , నవ్వు , నాట్య ప్రావీణ్యత సినిమాను ఓ సంగీత దృశ్య మాలికగా తీర్చిదిద్దాయి .

జి లిబిలి పలుకుల చిలిపిగ పలికిన ఓ మైనా మైనా , కిలకిల నగవుల వలపులు చిలికిన ఓ మైనా మైనా , మిలమిల మెరిసిన తార మిన్నులు వీడిన సితార . ‘ల’లను నర్తింపచేసారు వేటూరి . కిన్నెరసాని వచ్చిందమ్మా వెన్నెల పైటేసి . వెన్నెల పైట వేయటం !! అలా పైట వేయించటం వేటూరికే సాధ్యం . సాగరసంగమం కోసం వ్రాసుకున్నారట . ఈ సితార సినిమాలో తళుక్కుమంది .

# చూడాల్సిన సినిమా

చతుర నిర్వహించిన నవలల పోటీలలో బహుమతి పొందిన వంశీ రచించిన మహల్లో కోకిల నవల ఆధారంగా ఈ సినిమాను తీసారు . వంశీకి ఇది రెండో సినిమా . అద్భుతంగా చిత్రీకరించారు . బాపు+విశ్వనాథ్ = వంశీ . బాపు లాగా ప్రకృతే కేన్వాసుగా , విశ్వనాథ్ లాగా సంగీత సాహిత్య నాట్యాలను మిళితం చేసి , ఓ గొప్ప సినర్జీని వండారు .

స్వయంగా శాస్త్రీయ నృత్యకారిణి అయిన భానుప్రియ చేత నృత్య దర్శకుడు శేషు అద్భుతమైన నృత్యాలను చేయించాడు . మొదటి సినిమా అయినా భానుప్రియ పరిపక్వతతో నటించింది . దక్షిణ భారత చిత్ర రంగానికి లభించిన అందాల భరిణ .

ప్రధానంగా చెప్పుకోవలసింది పాటలు , నృత్యాలు . పగటి వేషగాళ్ళ బృందంలో సభ్యుడిగా రాజా గారి అంతఃపురం ముందు సుమన్ నృత్యాలు సూపర్బ్ . సువర్ణతో కలిసి సుమన్ నృత్యించిన నృత్యాలు ఫ్రేంలో ఉన్నది సుమనా కమల్ హాసనా అని అనిపిస్తుంది . సాగరసంగమంలో కమల్ హాసనే గుర్తుకొస్తాడు . అచ్యుతమంత్రం అపురూపం అంటూ సాగే ఆ పాటను వేటూరి ఎంత గొప్పగా వ్రాసారో !

వెన్నెల్లో గోదారి అందం అది కన్నుల్లో కన్నీటి రూపం పాట మరో గొప్ప శ్రావ్యమైన పాట . ఈ పాటకే జానకమ్మకు జాతీయ స్థాయిలో అవార్డు కూడా వచ్చింది . కుకుకూ కోకిల రావే డ్యూయెట్ సుమన్ , భానుప్రియల మీద చాలా బాగుంటుంది . నీ గానం మృదుమధురం పావనం మరో శ్రావ్యమైన పాట .

ఈ సినిమా ఘనవిజయానికి ప్రధాన కారణాలు పాటలు , నృత్యాలు , లోకేషన్లు . సినిమా కథకు ఎలాంటి కోట కావాలో కరెక్టుగా అలాంటి పాతబడ్డ కోట దొరకటం కూడా కలిసొచ్చింది . వెంకటగిరి దగ్గర పాతబడ్డ కోట అట . కోటకు సంబంధించిన సీన్లన్నీ అక్కడ తీసి మిగిలిన సినిమా అంతా గోదావరి ప్రాంతంలో షూటింగ్ చేసారు .

ఒకప్పుడూ గొప్పగా వెలిగి ఆరిపోయిన రాజాస్థానాలలో ఒకదాని యజమాని చెల్లెలు సితార (భానుప్రియ). ఆమెను గొప్ప జమిందారుకు ఇచ్చి పెళ్ళి చేయాలని అనుకుంటాడు ఆమె అన్న. ఆ సంస్థానానికి పగటి వేషగాళ్ళుగా వచ్చిన వారిలో కల ఒక వ్యక్తిని (సుమన్) ప్రేమిస్తుంది సితార. కాని అతడితో పెళ్ళి మాత్రం సాధ్యపడదు. తదనంతర కాలంలో ఆమె గొప్ప నటి అవుతుంది. ఆఖరున ఆమెను అతడు కలవడంతో కథ సుఖాంతమవుతుంది.

ఫ్రీలాన్స్ ఫోటోగ్రాఫర్ దేవదాస్ (శుభలేఖ సుధాకర్) రైలులో ప్రయాణం చేస్తూ, టికెట్ లేకుండా ప్రయాణిస్తున్న ఓ అమ్మాయి (భానుప్రియ) కి సహాయం చేయడం కోసం టికెట్ కలెక్టర్ కి ఆమెని తన భార్య సితారగా పరిచయం చేస్తాడు. ఆమెకి ఎవరు లేరని తెలుసుకుని తన ఇంట్లో ఆశ్రయం ఇవ్వడంతో పాటు ఆమె మోడలింగ్ అవకాశాలు ఇస్తాడు. తన గతాన్ని గురించి అడగరడనే కండిషన్ పై అతనితో కలిసి పనిచేస్తుంటుంది సితార. ఆమెకు సినిమా అవకాశాలు రావడంతో తక్కువ కాలంలోనే టాప్ హీరోయిన్ గా మారుతుంది. డబ్బు, కీర్తి ప్రతిష్ఠలు సంపాదించినా, తన గతాన్ని తల్చుకుని బాధపడే సితారకి ఆ బాధని తనతో పంచుకోమని సలహా ఇస్తాడు తిలక్.

గోదావరి తీరంలోని ఓ పల్లెటూళ్ళో రాజుగారుగా పిలవబడే చందర్ (శరత్ బాబు) చెల్లెలు కోకిల. పాడుబడ్డ భవంతిలో ఆ అన్నాచెల్లెళ్ళు మాత్రమే ఉంటూ ఉంటారు. ఆస్తులు పోయినా, పరువుకి ప్రాణం ఇచ్చే చందర్, ఓ కోర్ట్ కేసు గెలవడం ద్వారా ఆస్తులు తిరిగి సంపాదించాలని ప్రయత్నిస్తూ ఉంటాడు. రాణివాసంలో ఉండే కోకిలకి బయటి ప్రపంచం తెలీదు. చిన్నప్పుడు నేర్చుకున్న సంగీతం, నాట్యాలతో కాలక్షేపం చేస్తూ ఉంటుంది. కోర్ట్ కేసు నిమిత్తం చందర్ ఓ పది రోజులు కోట విడిచి వెళ్తాడు. అదే సమయంలో ఊళ్లోకి వచ్చిన పగటి వేషగాళ్ళ నృత్యాలను కోటలోంచి రహస్యంగా చూస్తూ ఉంటుంది కోకిల. ఆ బృందంలో రాజు (సుమన్) ని ఇష్టపడుతుంది. రాజుతో ఆమె పరిచయం ఊరి జాతరకి రహస్యంగా అతనితో కలిసి వెళ్ళడం వరకు వస్తుంది. కోర్ట్ కేసు ఓడిపోవడంతో కోటకి తిరిగి వచ్చిన చందర్ కి కోకిల ప్రేమ కథ తెలియడంతో రాజుని చంపించి, తను ఆత్మహత్య చేసుకుంటాడు.

# చూడాల్సిన సినిమా

తన పుట్టు పూర్వోత్తరాలు రహస్యంగా ఉంచమని కోకిలనుంచి మాట తీసుకుంటాడు చందర్. తిలక్ కి సితార తన గతాన్ని చెప్పడం విన్న తిలక్ స్నేహితుడైన ఓ జర్నలిస్టు (ఏడిద శ్రీరామ్) ఆమె కథని ఓ పుస్తకంగా ప్రచురిస్తాడు. తన గతం అందరికి తెలియడానికి తిలక్ కారణమని నమ్మిన సితార అతన్ని ద్వేషిస్తుంది. ఐతే ఆ పుస్తకం కారణంగా రాజు బ్రతికే ఉన్నదని తిలక్ కి తెలుస్తుంది. జర్నలిస్టు సహాయంతో ఆటను రాజుని వెతికి, ఆత్మహత్య చేసుకోబోతున్న సితారతో కలిపి ఆమెని రక్షించడంతో సినిమా ముగుస్తుంది


భానుప్రియ , సుమన్ల తర్వాత అభినందించవలసింది శరత్ బాబునే . చాలా గొప్ప పాత్ర లభించింది . చినిగిపోయిన చొక్కాను , దారిద్ర్యాన్ని కప్పిపుచ్చుకునేందుకే కోటు వేసుకునే బతికి చెడ్డ రాజా వారిగా , ఫ్రస్ట్రేషన్లో చిలకల్ని హింసించే సేడిస్టుగా , మంచితనాన్ని పూర్తిగా పోగొట్టుకోలేని మనిషిగా ఆత్మహత్యే కరెక్ట్ అనుకునే పాత్రలో శరత్ బాబు ప్రేక్షకులు మరచిపోలేని నటనను ప్రదర్శించాడు .

మరో ముఖ్య పాత్ర శుభలేఖ సుధాకరిది . కథానాయికకు స్నేహితుడిగా , సంరక్షకుడిగా బాగా నటించాడు . మరో ముఖ్య పాత్ర సువర్ణది . సుమన్ తో సమానంగా నర్తించింది . ఇతర పాత్రల్లో సాక్షి రంగారావు , రాళ్ళపల్లి , ప్రభాకరరెడ్డి , మల్లిఖార్జునరావు , జె వి సోమయాజులు , ప్రభృతులు నటించారు .

సినిమా విడుదలయిన మొదటి వారం పది రోజుల్లో శంకరాభరణం లాగానే నిరుత్సాహ పరిచిన ఈ సినిమా కేవలం ప్రక్షకుల నోటి ప్రచారంతోనే ఘనవిజయం సాధించింది . 12 కేంద్రాలలో వంద రోజులు ఆడింది . రష్యాలో కూడా రిలీజయింది . జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రాంతీయ చిత్రంగా అవార్డు పొందింది .

విశ్వనాథ్ కళాఖండాలయిన శంకరాభరణం , సాగరసంగమం , స్వర్ణ కమలం , సిరివెన్నెల సినిమాల సరసన చోటు లభించింది ఈ సితారకు . బహుశా మాతరంలో చూడనివారు ఎవరూ ఉండరు . ఈతరంలో ఎవరయినా ఉంటే అర్జెంటుగా చూసేయండి ఈ శ్రవణ దృశ్య కావ్యాన్ని .

★★★★





# "యుద్ధం ఆపిన మొనగాడు ఎవ్వరు ?"

వెనకటికి ఇల్లుకాలి ఒకడు ఏడుస్తుంటే ,చుట్టకునిప్పు అడిగాడట ఇంకొకడు". ఇంతకీ ఈ సామెత ఇప్పుడు ఎందుకు చెబుతున్నానంటారా ?ఇంతకి ఎవరి ఇల్లు కాలింది... చుట్టకు నిప్పు అడిగిన మహానుభావుడు ఎవరనేనా మీ అనుమానం?అయితే యుద్ధానికి వెళ్దాం రండి . అదేనండి మన దాయాది పాకిస్తాన్ తో యుద్ధంజరుగుతోంది గదా అక్కడికి వెళ్దాం . యుద్ధం ఆగిపోయింది అంటారా ?అంటే యుద్ధం ఆగిపోయినందుకు బాధ పడుతున్నారా ?

'యుద్ధం' అంటే మన దేశ ప్రజల ఛాతీలు ఆరు అంగళాలు ఉప్పొంగుతాయి . భారత్ పాకిస్తాన్ క్రికెట్ మ్యాచ్' అంటే నే రెండు దేశాల మధ్య ఓ యుద్ధం వచ్చినట్లు మన వాళ్ళు సిద్ధమైపోతారు, ఇంటిల్లి పాది టీవీలకు అతుక్కుపోయి కన్నార్పకుండా చూస్తారు. మన వాళ్ళు గెలవా ని గుళ్ళలో పూజలు, హోమాలు, యజ్ఞాలు చేసి తమ దేశ భక్తిని చాటు కుంటారు. అటువంటిది నిజంగా యుద్ధం వస్తే మన వాళ్ళు వూరుకుంటారా?

# కబుర్లు... ఉత్తినే

మన వాళ్ళ అమాయకత్వం తెలిసిన మన టెలివిజన ఛానళ్ళ యుద్ధాన్ని ఉద్వేగ స్వరాలతో త్రిడి లో చూపించ టానికి విశ్వప్రయత్నం చేసాయి .ఓ తెలుగు టి.వి ఛానల్ యాంకరు అయితే, తానే యుద్ధంలో పాల్గోనట్టు ఫీలై పోయి అరుపులు కేకలతో వీక్షకుల బిపి మరింత పెంచే ప్రయత్నం చేసాడు.

ఇంతలా దాయాది దేశం మీద మన దేశ ప్రజలు ద్వేషం పెంచుకోటాని



కారణం మతవిద్వేషమా ? లేక దాయాది దేశం తీవ్ర వాదుల్ని మనదేశం మీదకు ఉసిగొల్పటమా ? కారణం ఏదైనా ఇరు దేశాలలో సందర్భం దొరికినప్పుడల్లా మతవిద్వేషాలను రెచ్చగొడుతూ పబ్బం గడుపుకుంటున్న కొంతమంది రాజాకీయనాయకులు మరో కారణం.

ఒక పక్క మనకు పాకిస్థాను యుద్ధం మొదలైన సంగతి తెలిసిందే కదా.. కాశ్మీర్ లో తీవ్రవాదులు మన దేశానికి చెందిన 26 మందిని పొట్టిన పెట్టుకున్నారు, దానికి ప్రతీకారంగా, 'ఆపరేషన్ సిందూర పేరుతో పాకిస్తాన్ పై యుద్ధం ప్రకటించింది కేంద్ర ప్రభుత్వం. ఆదెబ్బతో కేంద్ర ప్రభుత్వానికి దేశప్రజల్లో ఎక్కడ లేని పేరు ప్రక్యాతులు వచ్చిపడ్డాయి. ఇంకా చెప్పాలంటే ఆపరేషన్ సిందూర్ " అనీ పేరు పెట్ట పెట్టటంలో కూడా ప్రభుత్వ పెద్దలు చాలా ముందు చూపారు.తీవ్ర వాదుల వల్ల ప్రాణాలు కోల్పోయిన వారి భార్యల సింధూరం చెరిగి పోయినందుకే ఆ పేరు పెట్టాం అని చెప్పటంతో ముఖ్యంగా మహిళల్లో మోడి ప్రభుత్వంపై ఎక్కడ లేని ప్రేమాభి మానాలు వెల్లువేత్తాయి . ఇది చాలదన్నట్లు యుద్ధాన్ని నడిపించాల్సిన త్రివిధ దళాధిపతులను తెరవెనుకకు తోసి ఇద్దరు మహిళా ఆఫీసర్లను తెర మీదు తీసుకు రావటం కూడా రాజకీయ వ్యూహంలో భాగమే.

సోఫియా ఖురేషి, వ్యామికా సింఘ్, నిన్నటి దాకా వీళ్ళు సాధారణ ఆర్మీ ఆఫీసర్లు, కాని నేడు దేశాన్ని ముందుకు నడిపిస్తున్న వీర వనితలుగా ప్రసిద్ధిచెందారు. ఇప్పుడు దేశంలో ఏ ఇద్దరు మాట్లాడుకున్నా వీరి గురించే

ఇలా యుద్ధం ద్వారా అధికారంలో వున్న వారికి జనం లో ఎక్కడ లేని మంచి పేరు రావటం తో ప్రతి పక్షాల కడుపులు కాలిపోయి, కళ్ళు మండసాగేయి.ఎలాగైనా తాము పేరు మంచి సంపాదింపాలని 'దూరా'లోచనలు చేసాయి . వెంటనే యుద్ధానికి మద్దతు తెలుపు తూ భారీ ఎత్తున ఐక్యత ర్యాలీలు నిర్వహించారు. అప్పటి కప్పుడు

అందుబాటు లో వున్నమాజీ సైనికుల్ని పోగేసి , అమర్ వీరుల స్థూపాల దగ్గరకెళ్ళి ఘనంగా నివాళులు అర్పించటం మొదలు పెట్టారు. వీళ్ళందర్నీ చూస్తుంటే ఇప్పటిదాకా ఇంతగా పొంగి ప్రవహిస్తున్న దేశభక్తి ఎక్కడ దాక్కుందా అనిపిస్తోంది.

యుద్ధం మొదలై నప్పటినుంచి చాలామంది తమ చొక్కా జేబుల మీద త్రివర్ణ పతకాన్ని గుచ్చుకుని తిరుగుతున్నారు, మరికొంత మంది తమ కార్లలో త్రివర్ణ



పతకాన్ని రెపరెపలాడిస్తుంటే, ఇంకొంత మంది ఏకంగా సైనిరదుస్తులలో దర్శనం ఇవ్వసాగారు.

నిన్నటిదాకా శతృదేశాన్ని వెనకేసుకు వచ్చిన శతృ వర్గానికి చెందిన మనదేశస్థులు కూడా యుద్ధం మొదలైన దగ్గర నుంచి తమ స్వరం మార్చి శత్రువును తిట్టి పోస్తున్నారు. అంతా మైలేజి మహిమ . ఇంకా మన బాలివుడ్ ను శాసిస్తున్న అనేకమంది ఖాన్లకు ఏం మాట్లాడాలో తెలియక తెలు కుట్టిన దొంగల్లా నోళ్ళు కుట్టేసుకున్నారు. ఎందుకంటే వీళ్ళ సినిమాలు మన దేశంతో పాటు శత్రు దేశం లో కుడా కలక్షన్ల వర్షం కురుపిస్తాయి , అది కాక వీళ్ళ పీలకలు శతృ దేశం మాఫియా చేతుల్లో ఉండటం కుడా వీళ్ళని నోరు తెరవనివ్వలేదు.

యుద్ధం మొదలయిన తరువాత ఇరు దేశాల మధ్య సైనికులు, పౌరులు ప్రాణాలు పోగట్టుకోవటం సర్వ సామాన్యం . సామాన్యంగా యుద్ధం జరుగుతున్నప్పుడు చాలా మంది సామాన్యుల ప్రాణాలు కూడా పోతుంటాయి. ఎక్కువ మంది మరణిస్తే ప్రభుత్వానికి కూడా చెడ్డ పేరు వస్తుంది. ఎక్కువకాలం సాగితే ఇరు దేశాలలో మిగిలేవి స్మశానాలే. ఇప్పటికే గాజాలో మనం చూస్తున్నాము వేల కొద్ది మరణాలు , మరుభూమి తలపిస్తోన్న నివాసాలు .

18 రోజులు కురుక్షేత్రం లో, జరిగిన మహాభారత యుద్ధంలో 16,60,020,000 మంది చనిపోగా చివరికి మిగిలింది ఎనిమిది మంది. పాండవులు ఇదుగురు, శ్రీకృష్ణుడు, సాత్యకి, యుయుత్సుడు. 26 మంది ప్రాణాలు పోయాయని ప్రతికరంగా మొదలు పెట్టిన యుద్ధం లో అంతకన్నా ఎక్కువ మందే ప్రాణాలు పోగోట్టుకుని ఉంటారు . ఒకదేశానికి శతృవు మరోదేశానికి సైనికుడన్న విషయం, మనం మరచి పోరాదు. వాళ్ళకు కుటుంబాలు వుంటాయి. కుటంబాలు యుద్ధం తరువాత ఏ ఆధారం లేకుండా అనాథలుగా మారతారు అన్న విషయం గుర్తు పెట్టుకోవాలి .ఎక్కువమంది అనాధలున్న సామజం నేరాలతో నిండి పోతుంది . పాండవులు గెలిచారా అంటే, గెలిచారు, కాని ఆ గెలుపుకు ఉపయోగం ఏంవుంటుంది. అందుకే యుద్ధం త్వరగా ముగియాలి. తనవాపు బలుపు కాదన్న విషయం తెలుసుకున్న శతృవు శరణు

# కబుర్లు ...ఉత్తినే

వేడటంతో యుద్ధాన్ని తాత్కాలికంగా విర మించారు. ఈ మధ్యలో ,ఈ కాల్పుల విరమణకు మేమే కారుకులం  అని పెద్దన్న ప్రచారం చేసుకోవటం మొదలు పెట్టాడు. దానితో, అసలు యుద్ధం ఎందుకు మొదలు పెట్టారు, ఎందుకు ఆపారు, ఏం సాధించారు, ఆపటానికి పెద్దన్న ఎవడు అంటవా ప్రతిపక్షాలు విరుచుకు పడటం మొదలుపెట్టారు.

వచ్చిన మంచి పేరు కాస్తా ఎక్కడ చేజారి పోతుందో అని ప్రభుత్వ పెద్దలు అధికారుల చేత యుద్ధంలో శత్రువును ఎలా చీల్చి చెండాడారో చేపుతూ ఉన్నవి లేనివి టి వి చానళ్లలో ఊదర గొట్టటం మొదలు పెద్ద మొదలుపెట్టారు. తామేమన్నా తక్కువ తిన్నామా అని, శతృ దేశంకూడా తాము కుడా అర  వీర భయంకరంగా విరుచుకుపడ్డాము అని తమదేశ ప్రజలను నమ్మింప చూసింది. దాంతో ఇరు దేశాలకు చెందిని అల్ప సంతోషులు విధుల్లోకి వచ్చి సంబరాలు కూడా చేసు. కున్నారు.


ప్రపంచంలో ఎక్కడ యుద్ధం జరిగినా ఇరు వర్గాలకు ఆయుధాలు అమ్మేది  ఒకరిద్దరు పెద్దన్నలే . ఓ పెద్దన్న దగ్గర  కొన్న ఆయుధాలు దీపావళిటపాసుల్లా పేలకుండా తుస్సుమన్నాయనిప్రచారం జరగటంతో ఆ పెద్దన్న అప్రమత్తమై పోయాడు . ఎక్కడ తన వ్యాపారం దెబ్బతింటుందో  అని వెంటనే మన దేశపు యుద్ధ టాంకులను , మిసైళ్ళను విధ్వంసం చేసినట్టు దాయాది  దేశం చేత సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేయించాడు

ఇక మనుషుల రూపంలో వున్న మరో రకం , రాబందులున్నాయి. శవాలు ఎక్కడ కనిపిస్తే అక్కడ వాలిపోయి, మొసలి కన్నీళ్ళు కారుస్తుంటాయి. యుద్ధం లో మరణించిన సైనికుల ఇళ్ళకు వెళ్లి, అండగా వుంటాము, ఆదుకుంటాం అంటు  సొల్లు కబుర్లుచెప్పి ఫోటోలు దిగి , పక్క రోజు పేపర్లలో వేయించుకుని  మైలేజి పొందుతుంటారు . బతికున్నపుడు ఈ రాబందులు  జవాన్లకు గాని రైతన్నలకు గాని పది రూపాయలు సహాయంకూడా చేసి ఎరుగరు. చచ్చాక మాత్రం శవాల మీద పడి గోలగోల చేస్తాయి.అసలు వీళ్ళని యుద్ధానికి పంపాలి .దేశానికి పట్టిన పీడా వదిలి పోతుంది .

యుద్ధం అయిపోయిన తరువాత శవాల్ని పిక్కు తింటాయి నిజమైన రాబందులు . ఇప్పు యుద్ధం అయిపోయిన తరువాత మన రాజకీయ రాబందులు మైలేజి కోసం నానా తిప్పలు పడుతూ న్నారు . అసలు యుద్ధాన్ని ఆపటానికి పెద్దన్న ఎవడు , మనకు మనమే పెదాన్న అని ప్రతి పక్షాలు దుమ్మెత్తి పోస్తుంటే . అబ్బే అదేమీ లేదు , అసలు పెద్దన్న ,గిద్దన్న ఎవడు మేమే ప్రాణ నష్టం ఎందుకు దాయికి తగిన గుణ పాటం చెప్పం ,దాయాదే శరణు శరణు అంటూ మన కాళ్ళ దగ్గరకు వచ్చింది అని అధికార పక్షం బీరాలు పలుకుతోంది . మధ్యలో వీళ్ళ మాటలు విన్న పెద్దన్నకు కోపం వచ్చిందో ఏమో తన చేతిలో ఉన్న మంత్రం దండం తిప్పి పన్నుల మోత మోగించటం మొదలు పెట్టాడు.

ఇప్పటికైనా అర్థం అయ్యిందా ఎవరి ఇల్లు కాలిందో  , ఎవరు చుట్ట వెలిగించు కుంటున్నాడో ?ఉంటామరి ..

★★★★



# భీష్ముడు చెప్పిన కథలు



ఆచార్య ఇరపని మాధవి




మహా భారతంలోని భీష్మ పర్వంలో ధర్మరాజుకి కలిగిన అనేక ధర్మ సందేహాలను తీర్చటానికి అంపశయ్య మీదున్న భీష్ముడు అనేక సంవాదాలను, కథలను ఉదాహరణలుగా చెబుతూ సందేహ నివృతి చేశాడు. అటువంటి కథలలో పశుపక్ష్యాదులను కూడా పాత్రలను చేయటం విశేషం.

## పులి నక్క కథ

" సౌమ్యులు అసౌమ్యులుగాను, అసౌమ్యులు సౌమ్యులుగాను కనిపిస్తున్నారు. ఎవరు ఎలాంటివారో అంతుపట్టడం లేదు, కనుక్కొనే సులువైన మార్గం చెప్పు" అన్న ధర్మరాజుకి భీష్ముడు చెప్పిన ఈ వ్యాఘ్రు గోమాయు సంవాద కథలో పులి, నక్కే పాత్రలు. పురిక అనే నగరాన్ని పౌరికుడు అనే రాజు పరిపాలించేవాడు. అతడు క్రూరకర్మలు చేసిన కారణంగా తర్వాతి జన్మలో నక్కగా పుట్టాడు. ఆ నక్కకి పూర్వజన్మ జ్ఞానం ఉన్న కారణంగా మాంసం ముట్టనని, సాటి జీవులను చంపనని వ్రతం పట్టింది.

# మన పురాణాలు

అడవిలో రాలిపడిన పండ్లు ఆకులలములు తింటూ బ్రతుకు గడుపసాగింది. ఇది చూచిన తోటి నక్కలు ఇదెక్కడి నియమం, మాంసాన్ని తెచ్చి పెడతాం సుఖించమన్నాయి. నక్క వాటి మాటలు వినలేదు. ఈ నక్క విషయమంతా ఆ అడవి పులిరాజుకు తెలిసింది. ఆ పులి నక్క దగ్గరకు వచ్చి “ఓ పుణ్యాత్ముడా! నీవు చాలా మంచివాడవని విన్నాను. నాతో కలిసి ఉండు. ఎన్నో సౌఖ్యాలు అనుభవించు. లోకం నన్ను క్రూర జంతువనుకుంటుంది. నీ ఉపదేశాలతో దానిని పోగొట్టు, నాకు స్నేహితుడిగా ఉండు” అని కోరింది. దానికి నక్క ”పులిరాజా! నువ్వు ఆశ్రయించదగినవాడవే. కాని, నా మనసు సుఖాల మీదకి పోకుండా ఉంది.

అందువలన నీ మాటలు నాకు నచ్చటం లేదు” అంది. పులి మళ్లీ అభ్యర్థించగా నక్క “ సుఖాలు అనుభవించకపోతే ఏమి, నాకు తెలిసినంత వరకు నీకు మంచీచెడులు చెబుతూ నీతో స్నేహంగా ఉంటాను. మన స్నేహాన్ని నీ మూలభృత్యులు ఓర్వలేక నిందిస్తారు. నిన్ను కలవరపరచి విరోధం పెట్టుకుంటారు. నువ్వు వారి మాటలు వినకుండా నేను చెప్పినట్లు నడుచుకుంటేనే నీ దగ్గర ఉంటాను” అని అనగా పులి అలాగే ఉంటానని ఎంతో సంతోషంగా బాస చేసింది.

నక్క పులితో వెళ్లి దానికి మంచి మాటలు చెబుతూ దానితోనే ఉండిపోయింది. పులి కూడా ఎంతో సంతోషంగా ఉంది. కొంతకాలం గడిచేసరికి నక్కను పులి ఆప్యాయంగా ఆదరించటం, నక్క ఎంతో విచక్షణతో మంత్రిత్వాన్ని నిర్వహించటం మూలభృత్యులకు గిట్టలేదు. వారందరూ ఒకటై సమావేశమై ఆలోచించారు. ఒకరోజు పెద్దపులి తినే మాంసాన్ని మూలభృత్యులు చాకచక్యంగా తీసుకెళ్లి నక్క ఉండే కొండగుహలో ఒకమూల దాచిపెట్టాయి. పులి మాంసాన్ని దాచిపెట్టే పని కూడా నక్కదే. ఎప్పటిలాగా మాంసం దాచబోగా కనిపించలేదు. ఎవరో ఎత్తుకుపొయ్యి ఉంటారని భావించి ఆ విషయాన్ని పులికి తెలిపింది. పులి వెంటనే



వెదకటానికి పురమాయించింది. అది గమనించిన కపటి సేవకులు కుట్రపన్ని ఆ మాంసం వెదికే వారి కంట పడేటట్లు చేశాయి. దానితో పులికి నక్క మీద మనసు విరిగిపోయింది. అది గమనించిన సేవకులు” నక్క ఏమిటి, వ్రతం ఏమిటి, నీ మాంసం కాజేసినట్లే అందుబాటులో ఉంటే సంకోచించకుండా మరింకేమైనా చేసేది. ఈ నక్క పాపభావాలు కలది, ధర్మమనే మాయతొడుగు తొడుక్కున్నది. నక్క అట, మాంసాహారి కాదట. ఇంతకాలం ఎంత మోసగించింది. ఈ నక్కే అన్ని రాచకార్యాలు చూచుకుంటుంది కదా అని మేము మీ శాసనానికి కట్టుబడి పల్లెత్తు మాట అనాలంటే భయపడేవారం” అంటూ ఇంకా పులి కోపాన్ని పెంచాయి.

ఆ మాటలు విన్న పులి కోపంతో మండిపడుతూ” నక్కను వెంటనే పట్టుకురండి, చంపండి” అంటూ ఆజ్ఞాపించింది. ఇదంతా వినిన పులి తల్లి కుమారుడి దగ్గరకు వచ్చి “ ఇట్లాంటి లేనిపోని కల్పితాలు కల్పించటం నక్కకు చేతవుతుందా, ఎంత మూర్ఖుడివి. సేవకులు పుట్టుకతోనే వంచకులు. ఏమైనా చేయగలరు, నీ తెలివి తెల్లారిందా! మంచివారిని చూచి చెడ్డవారు, గొప్పవారిని చూచి తక్కువవారు, అందమైనవారిని చూచి అందవిహీనులు సహించలేరు. లేనిపోని దోషాలు ఆరోపిస్తారు. ఈపాటి విషయాలు నీకు నువ్వు గ్రహించుకొనవద్దా? ధర్మం అధర్మంలాగా, అధర్మం ధర్మంలాగా అనిపించవచ్చు. ధర్మం ఇదీ అని తెలుసుకోదలచినవాడు తనకు తేటతెల్లమయ్యేవరకు ఆలోచించుకోవాలి. ఈ నక్క వచ్చినప్పటి నుంచి చేసిన ఉపకారాన్ని చూచి అయినా

ఇలాంటివాడు ఇలా చేస్తాడా అని ఒక్క క్షణం ఆలోచించవద్దా? వంచకుల మాయమాటలలో పడి మన మంచిని కోరే మంత్రిని చంపాలనుకోవటం భావ్యమేనా? రాజైనవాడు వెనుకా ముందూ పరిశీలించుకోకుండా హానిచేయ పూనుకోవటం సరైన నిర్ణయం కాదు. రాజు ప్రతిపనీ విచారించి అమలుచేయాలి" అని హితబోధ చేసింది.

తల్లి బోధలకు బుద్ధి తెచ్చుకొని పులి నక్కను రమ్మని కబురు పంపింది. వచ్చిన నక్కను అక్కున చేర్చుకొని కంటనీరు పెట్టుకుంటూ మాట్లాడింది, ఆదరించింది. అప్పుడు నక్క పులిని " ఓ పులిరాజా! ఒక విషయం విను, ఒకరోజు నన్ను సభలో అందరిముందూ మెచ్చుకున్న నువ్వే ఈరోజు నా అభిమానాన్ని, నా పరువును చివరంటా చెరిపేశావు. నీవు నన్ను అధికారిని చేయాలని నిర్ణయించుకున్నప్పుడే నీ భృత్యుల దురాలోచనలో తలదూర్చనని, నా అభిప్రాయం ప్రకారం నడచుకుంటానని ప్రమాణం చేశావు కదా! తెలిసో తెలియకో మరొకరిని చిన్నబుచ్చి ఆ తర్వాత స్నేహితుడిగా చేసుకోవటం మంచిదేనా? అలా అవమానించబడీ తిరిగి ఉండే వాడికి మంచి జరుగుతుందా?" అని అడిగి పులిని వదిలిపెట్టి అడవిలోకి వెళ్లిపోయింది. నిరాహార దీక్ష పూని తన మంచితనంతో పై లోకాలకు చేరుకుంది.

★★★

## కుక్క కథ

మంచివాడైన సేవకుడు పదవికి తగినట్లు జతపడకపోతే రాజు ఏం చేయాలని ధర్మరాజు అడిగిన ప్రశ్నకు సమాధానంగా భీష్ముడు కుక్క నీచత్వాన్ని తెలిపే కథను చెప్పాడు.

పూర్వం ఒక ముని ఎవరూ చేయనంతగా తపస్సు చేశాడు. అతడు దయాదాక్షిణ్యాలు కలవాడు. అతడి ఆశ్రమంలో అన్ని జంతువులు హాయిగా చీకూ చింతా లేకుండా బ్రతుకుతుండేవి. వాటిల్లో ఒక కుక్క ఎంతో విశ్వాసంతో ఆ మునిని సేవిస్తూ ఉండేది. ఆ ముని ఎటు వెళితే అటు వెంబడించి వెళుతూ ఉండేది. అది చూచి సహించలేక ఒక పులి కుక్క మీద ద్వేషం పెట్టుకొని పంజాతో కొట్టబోయింది. ప్రాణభయంతో ఆ కుక్క ఆ ముని చాటుకుపోయింది. ఆ ముని దానిమీద జాలిపడి, దానికంటే పెద్దదైన పులిగా మార్చాడు. మొదట మీదపడిన అసలు పులి దీనిని చూచి భయపడి పారిపోయింది.

అలా ఆ ముని ఆ కుక్కను పెద్ద పులిగాను, ఏనుగు వెంటాడితే మదించిన ఏనుగుగానూ, సింహం తరిమితే సింహంగానూ, శరభం దాడిచేస్తే మరింత ఉత్సాహంకల శరభంగానూ మార్చి, ఎప్పటికప్పుడు భయాన్ని పోగొట్టి గెలిపించాడు. ఇలా రోజురోజుకూ ఆ కుక్క మరింత బలం పుంజుకొని శరభమృగంగా ఎంతో గర్వంగా తిరుగుతుంది. అయినా కుక్క ముందటి తన నీచస్వభావాన్ని


పోనిచ్చుకోలేకపోయింది. ఆ కుక్క " శరభంలా ఉన్న నన్ను చూచి వేరే జంతువు భయపడి పారిపోవచ్చు. ఆ జంతువు మీది జాలితో ఈ ముని దానిని నాకంటె మిన్నగా చేయవచ్చు. అలా అయితే నేను గర్వంగా తల ఎత్తుకొనితిరగలేను. కాబట్టి అలాంటి స్థితి రాకుండా నా శక్తినీ యుక్తినీ కలబోసి ఈ మునిని చంపేయాలి" అనుకుంది. ముని దివ్యదృష్టితో కుక్క చెడ్డ తలంపును గ్రహించాడు. "నీచమైన కుక్కకు ఉదాత్తమైన స్వభావం తెలియదు. కనుక ముందటి కుక్క రూపాన్ని మళ్లీ పొందుతుంది కాక" అనగానే శరభరూపంలో ఉన్న కుక్క మామూలు కుక్కగా మారిపోయింది.

కాబట్టి నీచజాతి వారిని ఎప్పుడూ ఎక్కువగా ఆదరించకూడదు. అలాగే వ్యక్తి ఆంతర్యాన్ని తెలిసికోకుండా కేవలం తన కులంవాడని దుష్టుడిని అందలం ఎక్కించకూడదు. సేవకులు ఎలాంటివారో చూచుకొని వారివారి యోగ్యతలను బట్టి ఉత్తమ, మధ్యమ, అధమ స్థాయి పదవులలో ఉంచటం రాజధర్మం. పరాక్రమం, నిజాయితీ, మంచి చెడుల వివేకం, సేవాభావం, గాంభీర్యం కలవాడు సంపదకు యోగ్యుడవుతాడు. అలాంటివాడికి కులంతో పనిలేదు. అలాగని దీన్నే పరమ ప్రామాణికం అనుకోకూడదు. ఏవిధంగా అయినా మంచి గుణవంతుడిని, మంచి కులవంతుడిని వెదకి మరీ పెద్ద పదవిలో నిలపాలని భీష్ముడు ధర్మరాజుకు బోధించాడు.

★★★



## కొత్త సినిమా –కథా కమీషు




# "నెల మీది తారలు"

ఆమిర్ ఖాన్ నటించి, నిర్మించిన 'సితారే జమీన్ పర్' ఇది సమాజాన్ని మేల్కొలిపే, కనువిప్పు కల్పించే చిత్రం. మానసికంగా ఇంకా ఎదగని పిల్లల్ని, వారి మనస్తత్వాన్ని బయటి సమాజం అంతగా అర్థం చేసుకోలేదు.. వారంతా ఎంతో సెన్సిటివ్‌గా ఉంటారు.. వారి మనసు ఎంతో నిర్మలంగా ఉంటుంది.. ఈ విషయాలన్నీ ఎంతో గొప్పగా చిత్రీకరించారు. వారి హృదయం ఎంతో స్వచ్ఛంగా ఉంటుంది.. కాబట్టే ఎప్పుడూ నవ్వుతూ, ఆనందంగా కనిపిస్తుంటారు.. వారిని చూసి మనం ఎంతో నేర్చుకోవాల్సి ఉంటుంది.. వారి ప్రపంచంలో వారే గొప్పగా ఆలోచిస్తుంటారు.. ఈ సమాజంలో వారిని కూడా సాధారణంగానే ట్రీట్ చేసే రోజులు వస్తాయి. తారే జమీన్ పర్ చిత్రంలో ఆమిర్ ఖాన్ ఓ టీచర్‌గా నటించారు. అందులో టీచింగ్ మెథడ్ మీద సెటైర్లు వేశారు. పిల్లలు అంతా కూడా ఒకే విధంగా ఉండారని, కాస్త భిన్నంగా ప్రవర్తించే వారు కూడా ఉంటారని, వారికి కూడా విద్యను ఎలా బోధించాలో చూపించారు. ఇక సితారే జమీన్ పర్ ట్రైలర్ చూస్తుంటే దివ్యాంగులు, వారితో బాస్కెట్ బాల్ ఆడించే కోచ్, కోచ్‌కు ఎదురైన పరిస్థితులే ఇతివృత్తంగా ఈ మూవీని తెరకెక్కించారని అర్థం అవుతోంది.

# వాల్ పోస్టర్

ఇషాన్ నందకిషోర్ అవస్థి (దార్శీల్ సఫారీ) అనబడే ఎనిమిది సంవత్సరాల బాలుడికి పాఠశాల అంటే అయిష్టం. ప్రతి పాఠ్యాంశం అతనికి కష్టమైనదే. పరీక్షలలో నిరంతరం విఫలమవుతూ ఉంటాడు. అతనికి చలన సమన్వయ నైపుణ్యాలలో కూడా లోపం ఉండటంవల్ల బంతిని తిన్నగా వేయడానికి కూడా చాలా కష్టపడతాడు. అతని అధ్యాపకులు, తోటి విద్యార్థులు అతనికి సహాయం చేయకపోగా, ఎప్పుడూ బహిరంగంగా అవమానపరుస్తూ ఉంటారు.

అదేసమయంలో ఇషాన్ అంతర్గత ఊహా ప్రపంచం అద్భుతాలతో కూడి ఉంటుంది. అది ఎవ్వరూ గుర్తించినట్టూ, మెచ్చుకున్నట్టూ కనిపించదు. అది ఇంద్రజాలమైన నేలల రంగులు, చేతనాయుతమైన జంతువులతో కూడి ఉంటుంది. ఆరంభంలో ఎవరూ తెలుసుకోలేక పోయినప్పటికీ, అతను చిత్రకళలో అభిరుచి కలిగి ఉంటాడు.ఇంట్లో పరిస్థితి కూడా అంతకన్నా ఏమీ బాగుండదు. అతని తండ్రి, నంద కిషోర్ అవస్థి (విపిన్ శర్మ) కార్యదీక్ష గల అధికారి. ఇతను తన కొడుకుల వద్దనుంచి ఉన్నతమైన ఫలితాలను ఆశిస్తూ ఉంటాడు. అతని తల్లి, మాయా అవస్థి (టిస్కా చోప్రా) ఒక గృహిణి. ఇషాన్ ఉత్తీర్ణుడు కావడానికి సహాయం చేయలేక ఆమె తన అసమర్థతతో నిరంతరం విసిగిపోతూవుంది. ఇషాన్ అన్నయ్య యెహాన్ (సాచెట్ ఇంజనీర్) ఒక విజయవంతమైన విద్యార్థి / క్రీడాకారుడు. ఈ విషయాన్నిఅతని తల్లిదండ్రులు ఎప్పుడూ ఇషాన్ కు గుర్తుచేస్తూ ఉంటారు . ఇషాన్ బడికి వెళ్ళడం లేదని కనుగొన్నతర్వాత, దానికి తోడు చాలా తక్కువ మార్కుల శ్రేణిని పొందాడని తెలిసిన తర్వాత, అతని తల్లితండ్రులు అతను "క్రమశిక్షణ"లో పెట్టడానికి బోర్డింగ్ స్కూలులో ఉంచడం అవసరమని నిశ్చయించుకుంటారు.ఉత్తమ విద్యార్థులలో ఒకడైన రాజన్ దామోదరన్ (తనయ్ చెడ్డా) నుంచి సహాయం పొందినప్పటికీ బోర్డింగ్ స్కూలు జీవితం ఇషాన్ని ప్రయోజకుణ్ణి చేయటానికి సహాయపడదు. అసలే కుటుంబం నుంచి దూరంగా ఉండాల్సి రావడం వలన అతను నిరంతరం భయం, వ్యాకులంలో మునిగిపోతాడు. అయినప్పటికీ, కొత్తగా తాత్కాలికంగా వచ్చిన చిత్రలేఖన అధ్యాపకుడు రామ్ శంకర్ నికుంభ్ లేదా "నికుంభ్ సర్" (అమీర్ ఖాన్) ఇషాన్ బోర్డింగ్ పాఠశాలలో నియామకం పొందడంతో పరిస్థితులు మారిపోతాయి. నికుంభ్, తనకన్నా ముందున్న వారిలాగా కఠినంగా కాకుండా ప్రత్యేకశైలిలో బోధించటంవల్ల, త్వరగా విద్యార్థుల అభిమానం చూరగొంటాడు. ఇషాన్ సంతోషంగా లేదని, తరగతి కార్యకలాపాలలో అతను పాలుపంచుకోవటం లేదని ఇతను గమనించటం ఆరంభిస్తాడు (విద్యార్థులు ఉత్సాహంగా భాగం పంచుకునే వాతావరణం తరగతి గదిలో ఏర్పరిచినప్పటికీ). కలత చెందిన నికుంభ్, ఇషాన్ గతంలో చేసిన పనిని పరిశీలిస్తాడు. అతని వైఫల్యానికి కారణం డిస్లెక్సియా అనే మానసిక సమస్యగా గుర్తిస్తాడు.

అతని సెలవుదినం రోజు, నికుంభ్ ఇషాన్ తల్లితండ్రుల దగ్గరకు వెళతాడు. అతని పనిని నిశితంగా పరిశీలించాలని అడుగుతాడు. నిషాన్ చిత్రాల యొక్క సంక్లిష్టతను చూసి అతను నిశ్చేష్టుడౌతాడు. ఇషాన్ చాలా తెలివిగల విద్యార్థి అని అతను తరగతిలోని మిగిలిన విద్యార్థులకన్నా విభిన్నంగా వ్యవహరిస్తాడని నికుంబ్ ఇషాన్ తల్లితండ్రులకు చెబుతాడు. అతను డిస్లెక్సియా గురించి వారికి వివరిస్తాడు. ఇది ఒక నరాలసంబంధిత పరిస్థితే కానీ తక్కువ తెలివితేటలకు చిహ్నంకాదని విశదీకరిస్తాడు. ఇషాన్ ఉత్తీర్ణుడు కావటానికి సహాయపడే అధిక శిక్షణ అతను అందించవచ్చని కూడా వారితో చెప్తాడు. ఈ వాదనను బలపరుస్తూ, ఇషాన్ చాలా చిత్రలేఖనాలలో, సృజనాత్మక కళారూపాలలో అతని కళాత్మక సామర్థ్యాన్ని నికుంబ్ ముఖ్యాంశాలుగా తెలియజేస్తాడు. అతను చెప్పేదాన్ని స్పష్టం చేయటానికి, నికుంభ్ ఇషాన్ తండ్రిని ఒక బాక్స్ లో ఉన్న జపనీస్ సంఘటనని చదవమని ఒత్తిడి చేస్తాడు. అవస్థి తను ఆవిషయాన్ని చదవలేకపోతున్నానని చెప్తాడు, నికుంభ్ అతనిని కోప్పడతాడు. అలాచేయడం వల్ల, ఇషాన్ రోజువారీ పద్ధతిలో ఏమి పోరాటం చేస్తున్నాడనేది నికుంబ్ వారికి

సోదాహరణంగా వివరిస్తాడు.

అతను స్కూలుకి తిరిగి వచ్చింతర్వాత, నికుంభ్ ఒకరోజు డిస్లెక్సియా అంశాన్ని తరగతిలో లేవనెత్తుతాడు. డిస్లెక్సిక్ అని భావింపబడే కొంతమంది ప్రముఖుల జాబితాను అందిస్తాడు: ఆల్బర్ట్ ఐన్‌స్టీన్, లెనార్డో డా విన్సి, వాల్ట్ డిస్నీ, అగాథ క్రిస్టీ, థామస్ ఎడిసన్, పాబ్లో పికాసో, నటుడు అభిషేక్ బచ్చన్ అందులో ఉంటారు. విద్యార్థులు తరగతి గదిని వదిలివెళుతూ ఉంటే నికుంభ్ ఇషాన్ ను ఉండమని అడుగుతాడు. ఆ సమయంలో డిస్లెక్సియాతో తను కూడా అదేవిధమైన కష్టాలను అనుభవించానని నికుంభ్ వెలిబుచ్చుతాడు. నికుంభ్ అదే సమాచారాన్ని స్కూలు ప్రధానోపాధ్యాయుడు (M.K. రైనా) కు అందిస్తాడు. అతను ఇషాన్ కు శిక్షకుడిగా ఉండటానికి అనుమతి కోరతాడు. ప్రధానోపాధ్యాయుడి అనుమతి పొందినతర్వాత, డిస్లెక్సియా రంగంలో నిపుణులచే అభివృద్ధి చేయబడిన ప్రత్యేక పద్ధతులు ఉపయోగించి నికుంభ్ ఇషాన్ కు బోధించటం ఆరంభిస్తాడు. ఇషాన్ త్వరగానే భాషలో, గణితపరమైన నైపుణ్యాలపై మక్కువను అభివృద్ధి చేసుకుంటాడు. అతని ర్యాంకు కూడా వృద్ధి చెందుతుంది. సంవత్సరం చివరికి, నికుంభ్ సిబ్బందికి, విద్యార్థులకు ఒక కళా ప్రదర్శన నిర్వహిస్తాడు. ఈ పోటీ న్యాయనిర్ణయం లలితా లజ్మిచే చేయబడింది (తన పాత్రను తానే పోషించుకుంది). ఇషాన్, ప్రత్యేకంగా గమనించదగిన సృజనాత్మక శైలితో విజేతగా ప్రకటింపబడతాడు, అయితే అతని అధ్యాపకుడు నికుంభ్ (అతను ఇషాన్ యొక్క ఛాయాచిత్రాన్ని గీస్తాడు) రెండవస్థానం పొందినట్టు ప్రకటిస్తారు.

ఇషాన్ యొక్క తల్లితండ్రులు అతని అధ్యాపకులని స్కూలు చివరిరోజున కలుస్తారు. అతనిలో వచ్చిన మార్పులకు వారు నివ్వెరపోతారు. ఎందుకంటే అతను అన్ని పాఠ్యాంశాలలో అభివృద్ధిని సాధిస్తాడు. సెలవులకు వెళ్లపోయేముందు, ఇషాన్ పరిగెత్తుకు వచ్చి అతని అధ్యాపకుణ్ణి కౌగలించుకుంటాడు. నిషాన్ నికుంభ్ ను గాలిలోకి ఎగరవేసినప్పుడు అతను ఎగురుతున్నట్లుండే చట్రంలోని నిశ్చల చిత్రంతో ఈ చిత్రం ముగుస్తుంది.

★★★




# డియర్ డాడి

విస్మయ (వైష్ణవి)కి అమ్మ చంద్రిక (శరణ్య ప్రదీప్) కంటే నాన్న రవి (శశిధర్) అంటే చాలా ఇష్టం. అయితే చంద్రిక, రవి ఇద్దరూ విడాకులు తీసుకుంటారు. మైనర్ అవ్వడంతో విస్మయ అమ్మ వద్దే పెరుగుతుంది. మేజర్ అయిన తరువాత నాన్న వద్దకు వెళ్లొచ్చని విస్మయ ఆలోచిస్తూనే ఉంటుంది. అలా కొన్ని రోజులకు చంద్రిక తన కొలీగ్ అశోక్ (రవి వర్మ) ను పెళ్లి చేసుకుంటుంది. కానీ విస్మయకు మాత్రం అశోక్ అంటే గిట్టదు ఎందుకంటే తన నాన్న స్థానంలో ఇంకొకరిని ఊహించుకోలేకపోతుంది. ఇక సినిమా, డైరెక్షన్ అంటూ రవి తన లైఫ్‌లో బిజీ అయిపోతాడు. ఇక చంద్రిక మరణం తరువాత విస్మయ తన పెంపుడు తండ్రిని వద్దనుకుని సొంత తండ్రి వద్దకు వెళ్తుంది. అక్కడ విస్మయకు ఎలాంటి పరిస్థితులు ఎదురయ్యాయి? పెంచిన తండ్రి ప్రేమను విస్మయ అర్థం చేసుకుంటుందా? చివరకు నాన్నా అని విస్మయ ఎవరిని పిలుస్తుంది? అన్నదే కథ. డియర్ డాడీ అనే టైటిల్‌లోనే ఈ కథ ఏంటో అర్థం అవుతుంది. తండ్రి ప్రేమను చాటే ఓ చిన్న కథ అని చెప్పేయొచ్చు. అయితే ఇక్కడ కన్న ప్రేమ? పెంచిన ప్రేమ అన్నట్టుగా కథ సాగుతుంది. మామూలుగా మనకు కన్న ప్రేమే గొప్పదన్నట్టుగా చూపిస్తుంటారు. కానీ పెంచిన ప్రేమ, పెంచుకున్న ప్రేమ కూడా చాలా గొప్పగానే ఉంటుంది. ఇక ఇందులో ఆ పాయింట్‌ను చూపించారు దర్శకుడు. అసలు భార్యాభర్తలు ఎందుకు విడిపోయారు? ఆమె రెండో పెళ్లి ఎందుకు చేసుకుంది? అనే ఆలోచనలు ఆడియెన్స్‌కు కలిగిస్తాయి. విస్మయ పాత్రతో ఆడియెన్స్ కనెక్ట్ అయిపోతారు. కథలోని ఎమోషన్ కూడా మెల్లిమెల్లిగా ఆడియెన్స్ కనెక్ట్ అవుతుంది. అయితే చివరి పది నిమిషాలు మాత్రం గుండెను బరువెక్కిస్తుంది. అప్పటి వరకు చూసిన కోణం కాకుండా.. ఇంకో వర్షెన్‌లో మనకు కథను చూపిస్తారు దర్శకుడు. అక్కడే డైరెక్టర్ ప్రతిభ మనకు అర్థం అవుతుంది. కన్న తండ్రి కంటే పెంచిన తండ్రి విలువను ఆ కూతురు తెలుసుకునే క్షణం, తిరిగి పెంపుడు తండ్రి వద్దకు వచ్చే ఆ సీన్, క్లైమాక్స్‌లో చూపించిన ఆ ఒక్క సన్నివేశం గుండెల్ని హత్తుకుంటుంది.. మనసును కదిలిస్తుంది. ఇక టెక్నికల్‌గా చూసుకుంటే ఈ మూవీ పర్వాలేదనిపిస్తుంది. ఎడిటింగ్ సో సోగా అనిపిస్తుంది. మ్యూజిక్ అంత ఇంపాక్ట్ ఏమీ క్రియేట్ చేయదనిపిస్తుంది. మాటలు అయితే కొన్ని చోట్ల గుండెల్ని హత్తుకుంటాయి. ఏకాంతం, ఒంటరితనం అని చెప్పే డైలాగ్స్ సూటిగా మనసుల్ని తాకేలా ఉంటాయి. ఇక మొత్తం సీన్లను రామోజీ ఫిల్మ్ సిటీలోనే చుట్టేసినట్టుగా కనిపిస్తుంది.

సీరియల్



# పడిలేచిన కెరటం

యశోదా కైలాష్

ఇంటి వాతారణంలో ఏదో మార్పు గోచరిస్తోంది. ఇల్లంతా చిందర వందరగా ఏదో దుర్వాసన వస్తోంది. శ్రీకాంత్ అలాగే ఉన్నాడు. ఉద్యోగం పోయి సంవత్సరం దాటినా అతనిలో ఏ బాధా, టెన్షన్ కనపడడం లేదు.

తనే అడిగిందోసారి. “ ఏమిటి శ్రీ, ఇంత కాలమైనా నీకు ఉద్యోగం రాకపోవడమేమిటి?” అసలు సీరియస్ గా ప్రయత్నిస్తున్నావా? అనేసరికి అంతెత్తున ఎగిరాడు.

“నేను ఉద్యోగం చేస్తానో చేయనో అది నా ఇష్టం, నీకు భారంగా ఉన్నానంటే చెప్పు, వెళ్లిపోతాననేసరికి తెల్లబోయింది”.

తమ పెళ్లైన రెండు సంవత్సరాల లోనే ఎంత మార్పనుకుంటూ బాధపడసాగింది.

శ్రీకాంత్ ఇంట్లో ఉన్నా కూడా మహిమ ను ఎత్తుకుందామని గానీ ఆడించాలని అనుకోకపోవడం తపస్వికి చాలా ఆశ్చర్యంగా ఉంటుంది.

సాయంత్రం కారు తీసుకుని వెళ్లిపోయి ఎప్పుడో రాత్రి పది తరువాత ఇంటికివస్తాడు.

ఒకరోజు శ్రీకాంత్ తో "మనం ఇలా రెంటడ్ ఎపార్ట్ మెంట్ లో ఇరవైవేలు అద్దెకట్టుకుంటూ ఉండేకన్నా ఒక మంచి ఏరియాలో ఫ్లాట్ కొనుక్కుంటే బాగుంటుంది కదా శ్రీ. మనిద్దరి అకౌంట్ లో నున్న అరవైలక్షలు కాక మరో నలభైలక్షలకు బేంక్ లోన్ అప్లై చేస్తాను, ఏంమంటావ్?"

"నా అకౌంట్ లో ఇరవై లక్షలే ఉన్నాయి. నాకు ఉద్యోగమిప్పిస్తానంటే ఒక కన్సలెటెంట్ కి పది లక్షలు చెల్లించాను".

"లంచమా? దానిబదులు ఏవైనా కొత్త కోర్సులు నేర్చుకోపోయావా శ్రీ"?

"ఉద్యోగం ఉద్యోగం అంటూ సతాయిస్తావు. ఏదైనా మంచి పని చేస్తే సవాలక్ష సంజాయిషీలిచ్చుకోవాలి. ఛ, వెధవకొంప అనుకుంటూ" కోపంగా వెళ్లిపోయాడు.

రోజూ బాగా డ్రింక్ చేసి వస్తున్నాడు. పనిమనిషి కూడా ఒకసారి అంది తనతో. అమ్మా మీరింట్లో లేనప్పుడు అయ్యగారి స్నేహితులు బోల్డు మంది వచ్చేవారని, తాగేసిన డ్రింక్ బాటిల్స్ అన్నీ తనకు డబ్బులిచ్చి బయట పడేయమనేవారని చెప్పేసరికి నివ్వెరపోయింది.

శ్రీకాంత్ అసలు స్వభావేమిటో మెల్లిగా అర్థమవసాగింది. ఒక మూల దుఃఖం తన్నుకొస్తోంది. ఇంటికి తాగి రావడం, ఏదైనా అడిగితే గట్టిగా అరవడం మొదలు పెట్టాడు.

మరో నాలుగు నెలలు గడచిపోయాయి. శ్రీకాంత్ జాబ్ కోసం కన్సలెటెంట్ కి డబ్బులిచ్చాడన్నది అబద్ధమని అతని అకౌంట్ చెక్ చేస్తే తెలిసింది. బేంక్ లోనున్న డబ్బుని తాగుడికి, పార్టీలకు ఖర్చుపెడ్తున్నాడని అర్థమైంది.

ఒకరోజు ఉండబట్టలేక, "ఉద్యోగం లేకపోయినా ఫరవాలేదు, డ్రింక్ చేయకు శ్రీ అంటే," "చెప్పొచ్చావులే!" కుంటిదానివైనా నేను కాబట్టి నిన్ను పెళ్లి చేసుకున్నాను. లేకపోతే నిన్ను పెళ్లాడేదెవరూ, నోరుమూసుకుని ఒకమూల పడుండనేసరికి " తట్టుకోలేకపోయింది.

"నన్ను ప్రేమించానని వెంటపడ్డావు, నా అవిటితనం ముఖ్యం కాదన్నావ్? ఇదంతా నటనా శ్రీకాంత్"?

"అవును, నటనే, నీవెనుకనున్న ఆస్తిని చూసాను, లేకపోతే కుంటిదాన్ని ఎందుకు చేసుకుంటాను"?

"నీకు ఇంతటి సుఖ భోగాలిచ్చినందుకు నాకేమి లాభం"? నీ ఆస్తిలో సగం నా పేరుమీద వ్రాసివ్వు. ఉద్యోగం వచ్చేటట్లు లేదు, ఏదైనా వ్యాపారం చేస్తాను.

"ఏ వ్యాపారం చేయద్దు శ్రీ, చక్కగా జాబ్ చేసుకో. ఈ వ్యాపారాలూ, టెన్షన్ లు ఎందుకు చెప్పు"? "మనకున్నది చాలు, దాన్ని జాగ్రత్తగా కాపాడుకుందాం".

"ఇందాకటి నుండి చూస్తున్నాను తమరి సలహాల కోసం ఎవరూ ఎదురుచూడడం లేదు. నేను జాబ్ చేయదలచుకోలేదు".

"మరి నీ జాబ్ కోసం ఆ కన్సలెటెంట్ కిచ్చిన పదిలక్షలు"?

"ఏమిటే, పైసా పైసా కి లెక్కలడుగుతున్నావు!" నీ ముందు చేతులు కట్టుకుంటూ సంజాయిషీలివ్వాలా"? మాట ముద్దగా వస్తోంది. తాగినట్టున్నాడు.

"తరువాత లెక్కలు చెపుతాగానీ, ముందు ఓ ఏభైలక్షలివ్వు, ఒక కనస్ట్రక్షన్ వ్యాపారంలో పెట్టుబడి పెట్టడానికి". అన్నట్లు, బేంక్ లో మిగిలున్న ఇరవై లక్షలు తీసి అడ్వాన్స్ గా ఇచ్చేసాను.

అయిపోయింది. ఆ ఇరవైలక్షలూ కూడా కర్పూరంలా హరించుకు పోయాయన్నమాట.

శ్రీకాంత్ నిజాయితీగా కష్టపడే వాడైతే తన ఆస్తినంతటనూ అతనికిచ్చేసేది. కానీ అతను చెప్పే అబద్ధాలు, వ్యసనాలు, అతని నిర్లక్ష్యపు ధోరణి కళ్లెదుట ప్రత్యక్షంగా కనపడుతుంటే అతన్ని ఎలా నమ్ముతుంది?

ఒక్క పైసా అతనికి ఇచ్చేది

# సీరియల్

లేదనుకుంటూ, "నా దగ్గర లేదు శ్రీకాంత్, నేను ఫ్లాట్ కొనడానికి కమిట్ అయిపోయాను. నా అకౌంట్ లో ఉన్న ముప్పైలక్షలూ బిల్డర్ కి అడ్వాన్స్ గా పే చేసేసాను".

"ఫరవాలేదు మహారాణీగారు ఆస్తిపరులు కదా"! ఏదో ఒకటి తీసి అమ్మేసినా లక్షలొస్తాయి."

"ఒక ఎకరం పొలం అమ్మేద్దాం. లేకపోతే వైజాగ్ లో ఫ్లాట్ అమ్మేద్దాం. ఏభై లక్షలు మ్యూచువల్ ఫండ్ లో పెట్టానన్నావు కదా? అవన్నీ ఉంచుకుని నాకు డబ్బు ఇవ్వడానికి లేదంటావేమిటి"?

"నేను చచ్చినా వాటిని అమ్మను. మా బావకు తెలిస్తే ఊరుకోడు".

"ఏమిటే మా బావా మా బావా అంటూ"? అది మన ఆస్తి. అతనికేమి సంబంధం? అయినా చూస్తున్నాను, ఎప్పుడూ వాడ్ని నెత్తిమీద పెట్టుకుని పూజిస్తావు. నీ భుజాలమీద చేతులేస్తూ, నీ తల మీద రాస్తూ అతగాడి ఆ అతి చనువేమిటి? ఆరోజు బారసాలనాడు నీవు మీ బావ ఒళ్లో తల పెట్టుకుని ఏడ్వడం అతగాడు నిన్ను బుజ్జగిస్తూ ఊరడించడం నేను చూడలేదనుకున్నావా? 'స్టేండ్ బై గా నిన్ను వాడుకుంటున్నాడా'?

తోక తొక్కిన త్రాచే అయింది భర్త మాటలకు. కళ్లల్లో నిప్పులు కురుపిస్తూ ''మరోసారి మా బావనంటే చంపేస్తానురా ఇడియట్''.

'తల్లినయ్యానన్న ఆనందంలో, అమ్మా నాన్నా గుర్తొచ్చి తండ్రి లాంటి బావ ఒడిలో తల పెట్టుకుని ఏడ్చాను. నేను గర్భవతినైనానని ఆ ఆనందాన్ని మొట్టమొదటి సారి నీతో పంచుకోవాలని ఎంతగానో తహ తహ లాడాను. ఎంతో అపురూపమైన విషయాన్ని వినీకూడా నీలో ఏ స్పందనా లేదు. నోటికి హితవు లేక ఒక్కపూట వంట చేసి పెట్టమంటే నీ స్థానంలో ఎవరున్నా ఆప్యాయంగా నోట్లో తినిపిస్తారు. నీవు నన్ను దగ్గరకు తీసుకుంటూ ప్రేమగా నీ గుండెలకు హత్తుకుంటావని ఎదురుచూసాను'.

''నీకేమి తెలుసురా మా బావ గురించి''? 'నాకు ఏక్సిడెంట్ అయి ప్రాణాపాయ స్థితిలో ఉన్నపుడు తల్లడిల్లిపోయాడు. నా ఎడమకాలు తీసేసినపుడు నా వెన్నంటే ఉండి నాలో మానసిక స్థైర్యాన్ని నింపుతూ ఒక కూతురిలా నన్ను కంటికి రెప్పలా కాపాడుకున్నాడు. అటువంటి దేవుడిని పట్టుకుని ఇలాంటి అప్రాచ్యపు మాటలు అనడానికి నీది నోరా పెంట కుప్పా?''

''ఏమన్నావే కుంటి ముం......!''

దెబ్బతిన్న పిట్టలా విలవిల్లాడింది అతని మాటలకు.

"ఫోరా రాస్కెల్, నా ఆస్తిలో ఒక చిల్లుగవ్వ నీకిచ్చేది లేదు. బిజినెస్ చేస్తానంటూ లక్షలు గుంజుకోడానికి చూస్తున్నావు. ఆస్తికోసం నన్ను మోసం చేసి పెళ్లిచేసుకున్నావని, నన్ను శారీరకంగా మానసికంగా హింసిస్తున్నావని కేసు పెడ్తాను. నిజంగానే నన్ను హింస పెడ్తున్నావు. జైల్లో ఊచలు లెక్క పెడ్దువు గాని. హాయిగా కష్టపడకుండా చిప్పకూడు తినచ్చు. ఈ కుంటిదానితో కలసి ఉండనవసరం లేదు. డైవర్స్ పేపర్లు అరేంజ్ చేస్తాను. నోరు మూసుకుని సంతకం చేయి. నేనిచ్చిన ముప్పైలక్షలూ నాలుగురోజుల్లో నా అకౌంట్ కి ట్రాన్స్ ఫర్ చేయి. లేకపోతే తీవ్ర పరిణామాన్ని ఎదుర్కోవలసి వస్తుందంటూ తన గదిలోకి వెళ్లిపోయి తలుపులేసుకుంది."

తపస్వి అలా ఎదురు తిరుగుతుందని కలలో కూడా ఊహించలేదు శ్రీకాంత్. కుంటిది, పెళ్లి చేసుకుంటాననేసరికి మహాభాగ్యం అనుకుంటూ తనకు లొంగి ఉంటుందనుకున్నాడు. ఆమె ఆస్తినంతటినీ తనపేరు మీద రాయించుకోవాలను కున్నాడు. పెళ్లికి ముందు పరిచయంలోనే ఆమె స్థితిగతులను తెలుసుకున్నాడు. కానీ తన ప్రయత్నం నెరవేరేటట్లు కనపడడం లేదు.

తపస్వి శారీరకంగా బలహీనురాలైనా మానసికంగా చాలా ధైర్యం కలది. ఎప్పుడైతే శ్రీకాంత్ తాగడం మొదలుపెట్టి అబద్ధాలాడడం గమనించిందో అప్పటినుండే తను అతని విషయంలో ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో గట్టిగా నిర్ణయించుకుంది. అతని ప్రేమలో నిజాయితీ లేదని తెలుసుకుంది. తను ప్రేమకు విలువనిస్తుంది. డబ్బుకి కాదు. కానీ ఆ ప్రేమ బూటకం అని తెలిసి

తను మోసపోయానని తెలిసినప్పుడు, తన ఆస్తిని గుడ్డిగా అతని చేతిలో పెట్టదలచుకోలేదు.

ఆరునెలల తరువాత కోర్టునుండి విడాకులు పొందింది తపస్వి. అక్క తనను దగ్గరకు తీసుకుని ఏడుస్తుంటే "ఎందుకక్కా ఏడుస్తావు? ఇదంతా చేతులారా నేను చేసుకున్నది కాదా?" ముక్కూ ముఖం తెలియని ఒక వ్యక్తిని గుడ్డిగా ప్రేమించాను. అతను నా వెనుకనున్న ఆస్తిని మాత్రమే ప్రేమిస్తున్నాడన్న విషయాన్ని గ్రహించుకోలేకపోయాను. అతను పెళ్లి చేసుకుంటాననేసరికి, ఈ అవిటిదానికి అంతటి అదృష్టమా అనుకుంటూ ఎగిరెగిరి పడ్డాను. నాది అత్యాసే కదూ?"

''కుంటిదానివంటూ మాటి మాటికి గుర్తుచేస్తూ నన్ను కుళ్లబొడిచే వాడక్కా!" అంటూ అక్కను చుట్టేసుకుని హృదయవిదారకంగా ఏడుస్తోంది. తపస్విని ఏనాడూ ఒక చిన్న మాటకూడా అనకుండా అల్లారుముద్దుగా పెంచుకున్నారు తాము.

సందీప్ బాధను తట్టుకోలేక కన్నీళ్లను తుడుచుకుంటున్నాడు. "భగవంతుడు నీకే ఇన్ని కష్టాలు ఇవ్వాలా తపస్వీ, విధివంచితరాలివమ్మా", అనుకుంటూ విలవిల్లాడిపోతున్నాడు.

'నీవిక్కడ ఒంటరిగా ఉండద్దు తపస్వీ, మాకు దగ్గరలో ట్రాన్స్ ఫర్ కు పెట్టుకుని వచ్చేయమంది మానస'.

''ఒంటరినెందుకు అవుతానక్కా, మహిమ లేదూ?"

''నా జీవితానికి అర్థం అదే కదా!" అంటున్న చెల్లెలి వైపు చూస్తూ బాధగా నిట్టూర్చింది మానస.

అక్కా బావగారూ తపస్వికి బోల్డన్ని జాగ్రత్తలు చెపుతూ, ఎప్పుడు ఏ అవసరానికైనా మేమున్నామని, ఏ క్షణంలో పిలిచినా నీ పక్కనే ఉంటామని ధైర్యం చెపుతూ వెళ్లిపోయారు.

ఇంక ఆ ఇంట్లో తపస్వీ, పాపాయి.

పనిమనిషి సీత మహిమను చూసుకుంటుంటే తను బేంక్ కి వెళ్లి వస్తోంది.

తన జీవితం ఇలా అవుతుందని కలలో కూడా ఊహించలేదు. తను ఎంతో అదృష్టవంతురాలినని పొంగిపోయింది. కానీ తెలియకుండా మోసపోయింది. శ్రీకాంత్ మేక వన్నె పులి అని తెలిస్తే తను ఈ రొంపిలో దిగేదే కాదు. కానీ తను ఇప్పటికైనా అతని స్వభావం తెలుసుకుని బయట పడింది. లేకపోతే తననుండి మొత్తం ఆస్తిని కొట్టేసి తనను రోడ్డుమీదకు తరిమేసేవాడు. అతని ఆలోచనలు, చేష్టలు గుర్తుకొచ్చి గజ గజా వణికిపోయింది. ఇంక తన జీవితంలో శ్రీకాంత్ అనే వ్యక్తి లేడు. ఆ ఛాప్టర్ క్లోజ్ అయిపోయింది. ఇప్పుడు తన ముందు ఒకే ఒక ఆశయం. మహిమను బాగా పెంచి, మంచి చదువు చెప్పించి దాన్ని ఉన్నతమైన స్థానంలో నిలబెట్టాలి. తనలా అది మోసపోకూడదు. ఒక దృఢమైన నిశ్చయానికి వచ్చేసరికి తపస్వి మనస్సులోని అలజడి, దుఃఖం దూదిపింజాల్లా విడిపోయాయి.

(ఇంకా ఉంది )

వాస్తవ కధలు

# ఘటశ్రీ గారికి ఘన సన్మానం



ఈదర శ్రీనివాస రెడ్డి

ఉగాది రానూ వచ్చింది పోనూ పోయింది, పాపం వెంకటేశ్వర్లుకు మాత్రం తనని ఎవరన్నా కవి సమ్మేళనానికి పిలవకపోరా? ఓ చిన్న సత్కారం అన్నా చేయక పోరా? అని ఎదురు చూసి చూసి కళ్ళు రెండూ కాయలు కాచిపోయాయి కాని ఒక్కడంటే ఒక్కడు కూడా పిలిచిన పాపాన పోలేదు.

చివరికి తన ఇంటి పక్క గుళ్లో ఉగాదికి పంచాంగ శ్రవణం తర్వాత కొత్త ఏడాదికి స్వాగతం పలుకుతూ తన కవితలను ఉచితంగా వినిపిస్తానంటే, రోజూ తాను పళ్లెంలో వేసే దక్షిణ కోసం చాటంత మొఖం చేసుకుని ఎదురుచూసే పూజారి కూడా వద్దు పొమ్మనటంతో మరింత కుంగిపోయాడు వెంకటేశ్వర్లు.

వెంకటేశ్వర్లు వృత్తిరీత్యా ఉపాధ్యాయుడు, బడికి వచ్చే పిల్లలు రానురాను తగ్గిపోవడంతో గోళ్లు గిల్లుకుంటూ కూర్చోవటం అలవాటు చేసుకున్నాడు. ఏమీ తోచక ఒకరోజు తన స్నేహితుడి బలవంతంమీద ఒక పేరున్న కవి గారి సత్కార సభకు హాజరయ్యాడు వెంకటేశ్వర్లు. అక్కడ కవి గారికి తొడిగిన బంగారపు గండపెండేరం, ఏనుగు మీద అంబారీ ఊరేగింపు, దారి పొడుగునా పూలవర్షంతో భారీ స్థాయిలో జరిగిన సత్కారం

# వాస్తవ కథలు

## చూసి హా అప్పటికప్పుడే తాను కూడా ఒక గొప్ప కవిగా పేరు తెచ్చుకోవాలని నిర్ణయం తీసేసుకున్నాడు వెంకటేశ్వర్లు

నిర్ణయం తీసుకోవడం అయితే తీసుకున్నాడు గాని కవిత్వం ఎలా రాయాలో వెంకటేశ్వర్లుకు అసలు అంతుపట్టలేదు. కవిత్వం రాయాలంటే ముందుగా పేరున్న రచయితల రచనలన్నీ ఒక పట్టుబట్టాలని ఎవరో చెబితే మార్కెట్లో ఉన్న పేరున్న రచయితల కవితా సంపుటాలు అన్నీ అప్పు చేసి మరీ కొనేశాడు. కొనటం అయితే కొన్నాడుగాని, చదువుదామని చూస్తే ఒక్క ముక్క కూడా కొరుకుడు పడలేదు.

ఇక లాభం లేదనుకునే, తను పనిచేసే స్కూల్లోనే తెలుగు మాస్టారి చేత వాటి అర్థం, ప్రతి పదార్థం చెప్పించుకోవడం మొదలుపెట్టాడు. క్రమేణా కొద్ది కొద్దిగా అవి అర్థం అవసాగాయి.

కవిత్వం అర్థం అయినంత మాత్రాన మెదడులో అక్షరాలు మొలకెత్తాలని ఎక్కడా రూల్ లేదు కదా? మన వాడి విషయంలోనూ అదే జరిగింది. ఎంత తల బాదుకున్నా ఒక్క అక్షరం కూడా బుర్రలో నుంచి బయటకు రాలేదు. కవిత్వం మాట దేవుడెరుగు, నాలుగు వాక్యాలు రాయడం కోసం నిద్రలేని రాత్రులు గడుపుతూ పెట్టెలకు పెట్టెలు సిగరెట్లు ఊది పారేయడంతో చిక్కి సగమై శవంలా మారాడు.

చివరికి 30 రోజుల్లో కవిత్వం రాయడం ఎలా? అనే పుస్తకాలు ఏమన్నా మార్కెట్ లో దొరుకుతాయేమోనని కాళ్లరిగేలా తిరిగినా ఫలితం మాత్రం దక్కలేదు. బహుశా ఎవరూ కూడా 30 రోజుల్లో కవిత్వం రాసి ఉండకపోవచ్చు అని సరిపెట్టుకుని, ఇక కవిత్వం రాయటం అనే మహా యజ్ఞానికి మంగళం పాడుదాం అనుకున్న సమయంలో,వెంకటేశ్వర్లు బాధ చూడలేక, అతని స్నేహితుడు గండపెండేరం తొడికగించుకున్న ఓ కవి గారి దగ్గరికి తీసుకెళ్లాడు ఆయన ఏమన్నా కవిత్వం రాయడానికి సలహాలు ఇస్తారేమోనని.

ఆ గ.పె.కవి గారు మన వేంకటేశ్వరుడిని ఓ పది రోజులు తన చుట్టు తిప్పించు కున్నాడు కాని కవిత్వం ఎలా రాయాలో అని ఒక్క సలహా కూడా ఇచ్చిన పాపాన పోలేదు.వెంకటేశ్వర్లుకు మాత్రం ఆ పది రోజులు గ .పె .కవి గారికి ఇష్టమైన పళ్ళు ఫలహారాలు తీసుకువెళ్ళటానికే ఓ వెయ్యి రూపాయల పైనే అయివుంటుంది. అయినా కూడా మన వాడు ఏమాత్రం చలించకుండా,స్వాతిముత్యం లో కమలహాసన్ లా పట్టు విడవకుండా, గ .పె .కవిగారు ఎక్కడికి వెళితే అక్కడికి వెళ్ళి విసిగించటంతో,చివరికి కవిగారు మనవాడి చెవిలో గాయత్రి మంత్రోపదేశం చేసినట్టు కవితలు ఎలా రాయాలో ఉపదేశం చేసాడు.

ఇంకేముంది మన వాడు ఎగిరి గంతేసి , కవిత్వం రాయటం ఇంత తేలికా అనుకుంటూ పుంఖాను పుంఖాలుగా కవితలు రాయటం మొదలు పెట్టాడు .

ఒక నెల రోజుల్లోనే ఓ వంద కవితలు రాసి పారేసాడు మన వాడు . ఏమిటి ఆశ్చర్య పోతున్నారా ? నిజం సుమండీ ..అప్పుడెప్పుడో శ్రీ శ్రీ గారు "కుక్క పిల్ల ,అగ్గి పుల్ల , సబ్బు బిళ్ళ కాదేది కవితకు అనర్హం "అన్నట్టు , మనవాడు పిల్లి పిల్లలు , వేప పుల్లలు , మందు బిళ్ళలు ఇలా ఒకటేమిటి ఏది కనిపిస్తే దాని మీద కవిత్వం రాయటం మొదలుపెట్టాడు .

రాయటం అయితే రాసాడు కాని , ఆ కవితలు వినటానికి ఎవ్వరు ముందుకు రాలేదు .చివరికి తను పనిచేసే స్కూల్లో తోటి ఉపాధ్యాయులకు వినిపించ పోతే మనవాడి ప్రతిభముందుగానే తెలిసిన వాళ్ళు కాబట్టి ముఖం చాటేశారు . చివరికి స్కూల్లో పిల్లలకు చాక్లెట్లు , ఐస్ క్రీం లు కొనిపెట్టి ,వాళ్లను చుట్టూ కూర్చోబెట్టి వినిపించేవాడు .వాళ్ళు మాత్రం ఎన్నని వింటారు , మనవాడి కవితల దెబ్బకు వాంతులు, విరోచనాలు అవ్వటం తో బడికి రావటమే మానేశారు .విషయం తెలిసిన వాళ్ళ తల్లిదండ్రులందరూ కూడబలుక్కుని మనవాడి మీద ఓ రోజు దండయాత్రకు రావటం తో " పిల్లలతో కవితలు " అనే కార్యక్రమాన్ని నిరవధికంగా వాయిదా వేసాడు .

వాయిదా వెయ్యటం అయితే వేసాడు కాని , ఇంత కష్టపడ్డా తన కవితలు వెలుగు లోకి రావటం లేదని , తనని ఎవ్వరు గుర్తించటం లేదని లోలోపల తగ కుమిలి పోయే వాడు .

మన వాడి బాధ చూడలేక , స్కూల్ హెడ్ మాస్టారు ఒక రోజు పిలిచి ,"నీ

కవితలన్నీ ఓ సంపుటిగా అచ్చు వేసి ,ఎవరన్నా ఓ పేరు మోసిన కవి గార్ని పిలిచి పుస్తకావిష్కరణ చేయించి , నీ పుస్తకాన్ని ఓ ప్రముఖునికి అంకితం ఇస్తే అప్పుడు నీకు గుర్తింపు అదే వస్తుంది " అని అసలు విషయం చెప్పాడు

మన పుస్తకాన్ని మనమే అచ్చు వేసుకుని , మనమే పుస్తకాన్ని ఆవిష్కరణ చేయిస్తే ఏమి బాగుంటుంది అని నసిగాడు .

దానికి ఆ పెద్దాయన నవ్వుతూ , "నీ పుస్తకాన్ని నువ్వు కాకపోతే ఎవరు అచ్చు వేస్తారు? ఎవరు ఆవిష్కరిస్తారు చెప్పు ..పుస్తకం అంటే మన చేతుల్లో పుట్టిన ఆడ పిల్ల లాంటిది , మనం మన ఆడ పిల్లని ఎలా పెంచి పెద్ద చేసి , పెళ్లి చేసి ఓ అయ్యా చేతి లో పెడతామో ? అలాగే పుస్తకాన్ని కుడా దగ్గరుండి ఓ అయ్య చేతి లో పెట్టాలి .

" అయితే నా పుస్తకాన్ని మీకే అంకితం ఇస్తాను" అన్నాడు వెంకటేశ్వర్లు

దానికి ఆయన మరింత పెద్దగా నవ్వుతు " పూర్వం కవులు తాము రాసిన పుస్తకాలను రాజులకు అంకితం ఇచ్చే వాళ్ళు .వాళ్ళు అందుకు ప్రతిఫలంగా కానుకలు ఇచ్చేవాళ్ళు .నువ్వు నాకు అంకితం ఇస్తే నేనేమి ఇస్తాను చెప్పు మహా అయితే ఓ మంచి పెన్ను కొనిపెడతాను . అందుకని ఎవరన్నా చదువురాని , చదువుకోని బాడా బాబులను చూడు ..వాళ్ళైతే కనీసం నీ పుస్తకం అచ్చు వెయ్యటానికి అయిన ఖర్చన్నా ఇస్తారు " అంటూ చెపు కొచ్చాడు

ఆయన ఉపదేశం తో మనవాడు దేశం మీద పడ్డాడు వెతకటానికి, ఎవరన్నా డబ్బు ఉన్నవాళ్ళు తన పుస్తకాన్ని స్వీకరిస్తారేమోనని

మన వాడికి తెలిసిన వాళ్ళందరూ నవ్వేసి," పుస్తకమా ? మాకు అంకితం ఇస్తారా ? ఏమి చేసుకొనండి" అంటూ సున్నితంగా కాదనేసారు

ఇంకా మనవాడికి ఏ దారి కనపడక పోవటం తో , మళ్ళి హెడ్ మాస్టారి దగ్గరకే వచ్చి ,"నా వల్ల కావటం లేదు, మీరే ఎదో ఒకటి చెయ్యాలి " అంటూ బతిమి లాడాడు .

" సరే నాకు తెలిసిన ఒక తెలుగు సాహితి సాంస్కృతిక సమాఖ్య ఉంది ,వాళ్ళు ఇటువంటి కార్యక్రమాలు చేస్తుంటారు ,..అడిగి చూద్దాం పదా " అంటూ వెంట బెట్టుకు వెళ్ళారు .

★★★★★

పరిచయాలు అయ్యిన తరువాత , వచ్చిన విషయంచెప్పారు హెడ్ మాస్టారు

" ఓస్ అదెంత పని సార్ ..మేము రోజు చేసేది అదే కదా .."అన్నాడు సాహితి సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షుడు

ఆ మాటలతో మనవాడికి ఎక్కడ లేని ఉత్సాహం వచ్చింది , తన పుస్తకానికి జ్ఞానపీట్ అవార్డు వచ్చినంత ఆనంద పడిపోయాడు

" చెప్పండి మమ్మల్ని ఏమి చెయ్యమంటారు ." అంటూ వినయంగా అడిగారు హెడ్ మాస్టారు

" నాకు ఒక పుస్తక అవిష్కరణ సభకు వెళ్ళాల్సిన సమయం అయ్యింది , మీరు మా సెక్రటరిని కలవండి అన్నీ ఆమె చూసుకుంటుంది "అంటూ తను అక్కడ నుంచి నిష్క్రమించాడు

పోతు పోతు ,ఇద్దరిని అతని సెక్రటరి అనబడే ఓ పాతికేళ్ళ పడుచు ముందు దిగబెట్టి వెళ్ళాడు సా .సా.స .అధ్యక్షుడు

" చెప్పండి సార్ ..ఆర్డినరీ పాకేజీనా ?లేదా స్పెషల్ పాకజీనా .." అని అడిగింది

" పాకేజీనా ? " ఇద్దరూ ఆశ్చర్య పోయారు

" అదేమిటి సార్ , సార్ చెప్పలేదా ? హడావిడిలో చెప్పటం మర్చి పోయి ఉంటారు .మా పాకేజీ లో పుస్తకం ప్రింటు చెయ్యటం దగ్గరనుంచి , ఆవిష్కరించటం , అంకిత మివ్వటం , సన్మానం చెయ్యటం వరకు అన్నీ మేమే చూసుకుంటాము ...దానికి యాభై వేలు అవుతుంది " అంటూ వివరించింది

" యాభై వేలా .." అంటూ ఇద్దరు నోళ్ళు వెల్లబెట్టారు

" యాభై వేలది ఏముందండి ..అదే స్పెషల్ పాకేజీ అయితే లక్ష నుండి ..ఐదు లక్షల దాక ఉంది "

" స్పెషల్ పాకేజీ అంటే ఇంకేమి చేస్తారు ..."

" సిల్వర్ పాకేజీ అయితే , మన

ఊళ్ళో పేరున్న రచయతలను పిలిచి మీ పుస్తకం ఆవిష్కరిస్తారు .వాళ్లలోనే ఒకరికి అంకితం ఇస్తాం .సన్మానం కుడా, వాళ్ళతోనే ..మొత్తం ఒక లక్ష దాక అవుతుంది ”

“ మరి గోల్డు పాకేజీ ..”అంటూ నసిగాడు వెంకటేశ్వర్లు

“ గోల్డు పాకేజీ లో రాష్ట్ర స్థాయి లో పేరున్న ఓ కవిగారి చేత అవిష్కరణ జరుగుతుంది , ఓ ఎం ఎల్ ఏ గారిని పిలిచి మీ పుస్తకం అంకితం ఇప్పిస్తాం , వాళ్ళ చేత మీకు సన్మానం ఉంటుంది.. సుమారు రెండు లక్షలు దాక అవుతుంది “

“ అసలు ఇంత ఖర్చు ఎందుకవుతుంది తల్లి ..” అని హెడ్ మాస్టారు సందేహం వెలి బుచ్చారు

“ ఎందుకేవిటి సార , మీరు చాలా అమాయకుల్లా ఉన్నారు , మీరు పిలవంగానే వాళ్ళు వచ్చేస్తారా ఏమిటి , వాళ్లకు పని పాత లేదా ఏమిటి చెప్పండి . వాళ్లకు కుడా డబ్బు ఇస్తేనే వస్తారు సార్ . మళ్ళీ వాళ్ళకు హోటళ్ళు , కార్లు ఇంకా బోలెడన్ని ఏర్పాట్లు ఉంటాయి ఆ ఖర్చులు ఎవరు పెట్టుకుంటారు చెప్పండి “ అంటూ విడమర్చి చెప్పింది

“ డైమెండు పాకేజీ కుడా ఉందా ..” చిన్నగా గొణిగాడు మనవాడు

“ఉంది సార్, ఐదు లక్షల దాక అవుతుంది ..” అన్నది పొడి పొడి గా

“ అందులో ఏముంటుంది తల్లి ..: హెడ్ మాస్టారు అడిగారు

“ సినిమాలకు కధలు రాసే ఓ పేరున్న కవిగారి చేత మీ పుస్తకం ఆవిష్కరింప బడుతుంది , ఓ మంత్రి గారికి మీ పుస్తకం అంకితం ఇప్పిస్తాము , మీకు గండ పెండేరం తోడుగుతాము , మీకు ఓ మంచి బిరుదు కుడా ఇచ్చి ఘన సన్మానం చేస్తాము ,మీ పుస్తకం గురించి అన్నీ పత్రికల్లో సమీక్షలు వచ్చేటట్లు చూస్తాము “ అంటూ ముగించింది

“ సరేనమ్మా ..అలోచించుకుని మళ్ళీ వస్తాము “అంటూ లేవ బోయాడు హెడ్ మాస్టారు

కాని మనవాడు మాత్రం కుర్చీ లోనుంచి కదలలేదు .అప్పటికే ,గండపెండేరం , బిరుదులతో సన్మానం జరిగినట్లు ఉహించుకుంటూ ఉహా లోకాల్లోకి వెళ్ళిపోయాడు .

“వెంకటేశ్వర్లు వెళ్దామా “ అంటూ భుజం పట్టుకుని గుంజారు మాస్టారు

ఆ దెబ్బకి మనవాడు ఈ లోకం లోకి వచ్చి “ ఎక్కడికి మాస్టారు ..” అన్నాడు అయోమయంగా

“ ఆలోచించుకుని మళ్ళీ వద్దాం “ అన్నారు అనునయంగా

““ఇంకా ఆలోచించేది ఏమి లేదు మాస్టారు ..డైమండు పాకేజీ ఖాయం చేసేద్దాం “ అంటూ అప్పటి కప్పుడు తన జేబులో ఉన్న ఐదు వేలు తీసి అడ్వాన్సుగా ఉంచుకోమని చెప్పాడు

“సరే సార్, మా సారూ రాగానే మాట్లాడి మిగిలిన విషయాలన్నీ మీకు ఫోన్ చేసి చెపుతాను “ అంది ఇంకా వెళ్ళ మన్నట్టు

తిరిగి వచ్చే దారిలో “ తొందర పడ్డావేమో వెంకటేశ్వర్లు , అంత డబ్బు ఎక్కడనుంచి తెస్తావు ..” అన్నారు మాస్టారు

“ నా పి ఎఫ్ డబ్బులు ఉన్నాయి కదా సార్ ..వాటినుంచి తీసుకుంటా “ అన్నాడు ఏమాత్రం భయపడకుండా

ఇంక వెంకటేశ్వర్లుకు ఎవరు చెప్పినా వినడని అర్ధమయిన మాస్టారు మౌనంగా ఉండిపోయారు

★★★★

వెంకటేశ్వర్లు పుస్థకావిష్కరణ సభ తేదీ , వేదిక ఖరారు చేసి తెలియ చేసారు సా .సా .స . వాళ్ళు .మిగిలిన డబ్బు తం అకౌంట్లో వేసి,ఓ వంద్మందినన్న తీసుకోచ్చుకునే ఏర్పాట్లు చేసుకోమని చెప్పారు .

మనవాడు వెంటనే ఆహ్వాన పత్రాలు అచ్చువేయించి తనకు తెలిసిన వాళ్ళకి తెలియని వాళ్ళకి ఆహ్వాన పత్రం తో పాటు తన కవితల పుస్తకాన్ని కుడా పంచి పెట్టాడు

రేపు సభ జరగబోతోంది అనగా , సా .సా .స వాళ్ళు ఫోన్ చేసి ,క్షమించాలి అనుకోకుండా మనం అనుకున్న సభా వేదికను ప్రభుత్వం వాళ్ళు తీసుకున్నారు , అందుకని మీ పుస్తకావిష్కరణ సభను అక్కడికి దగ్గరలోని ప్రభుత్వ పాఠశాల లో ఏర్పాటు చేసాం “అని చెప్పారు .

దానితో కాస్త కంగారు పడిన మనవాడు అడ్రస్ మారితే పిలిచిన

వాళ్ళు వస్తారో లేదో అనుకుని,
అందరిని రాజకీయ సభలకు జనాన్ని
బస్సులు పెట్టి తోలినట్లు ,మనవాడు
ఆటోలు ,కార్లు పెట్టి మరి తోలాడు
.కాని పట్టుమని పదిమంది కుడా రా
లేదు , బహుసా ముందుగానే పుస్తకం
చదివారో ఏమో మరి ?

ముఖ్య అతిథిగా రావాల్సిన
మంత్రిగారు తనకు అందాల్సిన పర్సు
అందక పోవటం తో ముఖ్యమైన పని
ఉందని దుమ్మా కొట్టేసారట .ఇక
ఎప్పుడో బ్లాక్ అండ్ వైట్ చిత్రాలకు
కథలు రాసిన ఒక అవుట్ డేటెడ్
కవిగారిని తీసుకొచ్చి పుస్తకావిష్కరణ
చేయించారు .సా.సా.స . అధ్యక్షుడే
మనవాడి కవితల పుస్తకం మీద సమీక్ష
రాసి చదివి వినిపించాడు .చివరగా
ఓ ఇత్తడి కడియాన్ని గండపెండేరం
అంటూ వెంకటేశ్వర్లు చేతికి తొడిగి,
"ఘట శ్రీ " అనే బిరుదు తో సత్కారం
చేసి పంపారు సమాఖ్య వాళ్ళు

వెధవది డబ్బులు పోతే పోయాయి
, బిరుదు మాత్రం గట్టిదే ఇచ్చారని
సంతోష పడుతూ మనవాడు తిరుగు
ప్రయాణం కట్టాడు

దారి మధ్యలో హెడ్ మాస్టారు ,"
వెంకటేశ్వర్లు ఇంతోద్ది దాని అంత
డబ్బు తగలేయ్యాలా , మన స్కూల్లోనే
ఆ సభ ఎదో ఏర్పాటు చేఉకుని , మన
డి ఐ ఓ గారిని ముఖ్య అతిధి గా పిలిస్తే
నీనీకు పేరుకు పేరు వచ్చేది , డబ్బుకు
డబ్బు మిగిలేదికదా "అన్నారు

"కాని కరుణ శ్రీ ,అంత గొప్ప బిరుదు
ఇవ్వరు కదా మాస్టారు " అన్నాడు

"అసలు ఘట శ్రీ అంటే అర్ధం తెలుసా
నీకు " అని అడిగారు

"తెలియదు మాస్టారు .." అంటూ
సిగ్గుపడ్డాడు

"ఘటం అంటే కుండ , కుండ
మట్టితో చేస్తారు , అంటే నీది మట్టి
బుర్ర అని చెప్పకనే చెప్పారు "అని
విడమర్చి చెప్పారు

"ఘన సన్మానం అంటే ఎదో
అనుకున్నా , ఇదా మాస్టారు ...
అందుకనేనా అందరు అంత గట్టి
గా చప్పట్లు కొట్టారు ..."అంటూ
వాపోయాడు

" మరి ఘటశ్రీ గారికి ఘన సన్మానం
అంటే ఆమాత్రం ఘనంగా
చప్పట్లు కొట్టాలి కదా .." అంటూ
వెక్కిరించారు మాస్టారు

తను చేసిన తెలివితక్కువ పని కి
సిగ్గుపడుతూ తల దించుకున్నాడు
వెంకటేశ్వర్లు

★★★

# ధర్మ సందేహాలు



సహస్ర వ్యాస కవి

## ఏ గుడికి ఎప్పుడు వెళ్ళాలి ?

### గుడిలో ఎందుకు ప్రదక్షిణలు చేస్తారు?

"ప్రదక్షిణం " లో "ప్ర" అనే అక్షరము పాపాలకి నాశనము, "ద" అనగా కోరికలు తీర్చమని, "క్షి" అనగా అజ్ఞానము పారద్రోలి ఆత్మ జ్ఞానము ఇమ్మని. గుడిలో భగవంతుడి చుట్టూ తిరిగే ప్రదక్షిణంలో ఇంత అర్ధం ఉంది. పూర్వం ఆదిలో వినాయకుడు పార్వతి, పరమేశ్వరుల చుట్టూ తిరిగి విశ్వానికి ప్రదక్షిణ చేసిన ఫలం పొందాడు. కాబట్టి భగవంతుని చుట్టూ చేసే ప్రదక్షిణ విశ్వా ప్రదిక్షణఅవుతుంది. ఆత్మ ప్రదక్షిణ అవుతుంది. భగవంతుడా నేను అన్ని వైపులా నుంచి నిన్నే అనుసరిస్తూ ద్యానిస్తున్నాని అర్ధం.

### ఏ గుడికి ఏ ఏ వేళల్లో వెళితే ఎంత పుణ్యం?

ఉదయాన్నే శ్రీ మహావిష్ణువు ఆలయానికి, సాయంత్రం పరమేశ్వరుని ఆలయానికి వెళ్ళడం మంచిది. శ్రీ మహావిష్ణువు స్థితికారుడు.కాబట్టి ఆయన మన జీవన పోరాటంలో నిత్యం వచ్చే సమస్యలను తొలగిస్తాడు. మన బుద్ధి ద్వార ఆపదలను తొలగించి మనల్ని సుఖంగా ఉండేలా చూస్తాడు. మహేశ్వరుడు లయకారుడు. కాబట్టి రోజు పూర్తి అవుతున్న సమయంలో దర్శిస్తే రెట్టింపు ఫలాన్ని అందిస్తాడు. తొందర పడకుండా ప్రశాంతంగా నెమ్మదిగా భగవంతున్ని దర్శించాలి.


### గుడికి వెళ్ళేటప్పుడు తలస్నానం చేసి వెళితే మరింత శుబమా?

తలస్నానం చేసి వెళితే శరీరం మొత్తం శుచిగా ఉంచుకొని దర్శనం చేసుకున్నట్టు. మన నిత్య కృత్యాలతో మనసు ఎల్లప్పుడూ అనేక విధాలుగా కామ, క్రోధ, లోభ ,మదాలతో నిండి ఉంటుంది. ఆ మనసుని పవిత్రంగా పరిశుద్ధంగా చేసుకొని వెళ్ళే ఆధ్యాత్మిక శక్తి మనకు లేదు కనుక కనీసం శరీరం మొత్తాన్ని శుభ్రపరచుకొని దర్శించుకుంటున్నాము.ఈ శరీరంలా మనసుని శుచిగా, నిర్మలంగా ఉండేలా చెయ్యమనే అర్ధమే పూర్తి స్నానం యొక్క భావము.


### గుడిలో శడగోప్యం (శతగోపనం) తలమీద పెట్టడం ద్వారా ఎం ఫలితం వస్తుంది?

దేవాలయం లో దర్శనం అయ్యాక తీర్ధం, శాదగోపం తప్పక తీసుకోవాలి. శతగోపనం అంటే అత్యంత రహస్యం. అది పెట్టె పూజారికి కూడా విన్పించానంతగా కోరికను తలచుకోవాలి. అంటే మీ కోరికే శదగోపం. మానవునికి శత్రువులైన కామం. క్రోధం, లోభం, మొహం మదం, మాత్సర్యములు వంటి వాటికి ఇక నుండి దూరంగా ఉంటామని తలుస్తూ తల వంచి తీసుకోవడం మరో అర్ధం.

# పిల్లల సైన్స్ కథలు ..



## గెలీ లియో కథ



గెలీలియో టెలిస్కోప్‌పై చేసిన కృషికి ప్రసిద్ధి
అధ్యయనానికి బలమైన పునాదులు వేయడం
చేశారు. ఆయన అత్యంత ముఖ్యమైన పని ఏ
శక్తి) ను ప్రయోగం ద్వారా వస్తువుల కదలిక
ద్వారా నిరూపించటం .

బరువైన ఇనుప బంతిని ఎత్తు నుండి పడవేస్తే అది తేలికైన దానికంటే త్వరగా పడిపోతుందనే సిద్ధాంతం తో సహా అనేక పాత సిద్ధాంతాలను ఆయన తోసిపుచ్చారు. పిసాలోని వాలు టవర్ పై నుండి రెండు ఇనుప బంతులను పడవేయడం ద్వారా ఆయన తన అభిప్రాయాన్ని నిరూపించుకున్నారని ఒక కథ ఉంది. ఒకటి పది పౌండ్లు (4.5 కిలోలు), మరొకటి ఒక పౌండ్ (0.45 కిలోలు); రెండూ ఒకేసారి నేలను చేరుకున్నాయి.

గేలీలియో ఎన్నో మూఢ నమ్మకాలను శాస్త్ర వాదనల ద్వారా ప్రయోగాల ద్వారా తొలగించ గలిగాడు. 20 సంవత్సరాల వయస్సప్పుడు ఈయన ఒక రోజు ప్రార్ధన కోసం చర్చికి వెళ్ళాడు. చీకటి పడుతున్న వేళ అది. చర్చి సేవకుడు ఒకడు దీపాలు వెలిగిస్తున్నాడు. ఎన్నో దీపాలు చర్చి పైభాగం నుండి వ్రేలాడుతూ ఉన్నాయి. ఈ దీపాలు ఉయ్యాల మాదిరి అటు, యిటూ ఊగటం గమనించాడు. వాటి డోలనా సమయాలు ఒకటేనని లెక్క వేశాడు. గెలీలియో కాలంనాటికి కచ్చితంగా కాల నిర్ణయం చేసే గడియారాలు లేనప్పటికి ఈయన డోలన కాలాలను గణించటం విశేషం

# తాతయ్య కథలు ..

వైద్య విద్యార్థి కాబట్టి, నాడి కొట్టుకోవటం, గుండె కొట్టుకోవటం పై పరిచయం ఉంది కాబట్టి కాలనిర్ణయాన్ని తేలికగా చేయగలిగాడని అనుకోవచ్చు. ఈ పరిశీలన ఆధారంగా గెలీలియో "పల్స్ మీటరు" రూపొందించాడు. ఆ తదుపరి ఆయన కుమారుడు విన్సెన్జీ గోడ గడియారాన్ని తయారు చేశాడు. ప్రస్తుతం మనం వాడుతున్న లోలక గడియారానికి కూడా మూలసూత్రం యిదే.

కదిలే వస్తువులపై తన పరిశీలనల నుండి, ఏదైనా కదలడం ప్రారంభించిన తర్వాత దానిని ఆపడానికి ఏదైనా చర్య తీసుకునే వరకు అది అలాగే కొనసాగుతుందని గెలీలియో నిర్ధారించాడు. గ్రహాలు కదలకుండా ఉండటానికి శక్తి అవసరం లేదని వివరించడానికి అతను ఈ 'జడత్వ సూత్రం'ను ఉపయోగించాడు.


గెలీలియో గెలీల ఇటలీకు చెందిన ప్రముఖ భౌతిక శాస్త్రవేత్త, గణితజ్ఞుడు, భౌగోళిక శాస్త్రజ్ఞుడు, తత్వవేత్త. టెలిస్కోపు (దూరదర్శిని) ను వాడుకలోకి తెచ్చాడు.

గెలీలియో ఇటలీలోని పీసా నగరంలో జన్మించాడు. చిన్న వయసులో తండ్రి వద్దనే విద్యాభ్యాసం చేశాడు. తరువాత పీసా విశ్వవిద్యాలయంలో వైద్య విద్యార్థిగా చేరాడు. అయితే అక్కడి గణితశాస్త్ర ఉపన్యాసాలకు ప్రభావితుడై వైద్యవిద్యను విడిచి, గణిత శాస్త్రాన్ని అధ్యయనం చేశాడు. ఆ తరువాత అక్కడే గణితశాస్త్రంలో ఉపన్యాసకులుగా చేరాడు.

1638లో అతని పుస్తకం 'డిస్కోర్సెస్ అండ్ మ్యాథమెటికల్ డెమోన్స్ట్రేషన్స్ కన్సర్నింగ్ టూ న్యూ సైన్సెస్' ప్రచురించబడింది. తన సొంత దేశంలో అతనికి మరింత ఇబ్బంది కలిగిస్తుందనే భయంతో ఇది హాలండ్‌లోని లైడెన్‌లో ముద్రించబడింది.

ఎన్నో విశ్వ రహస్యాలను గెలీలియో ఛేదించగలిగాడు. బృహస్పతి గ్రహానికి ఉన్న ఉపగ్రహాలను గెలీలియో చూడగలిగాడు.గెలీలియో అప్పుడే కనుగొన్న టెలిస్కోపు ద్వారా శుక్రగ్రహ ఉపగ్రహాలను ప్రజలకు చూపించి నికోలస్ కోపర్నికస్ సూర్యకేంద్రక సిద్ధాంతాన్ని ధ్రువీకరించారు. మన పాలపుంతలో కోట్లాది నక్షత్రాలు ఉన్నాయని ఊహించి చెప్పగలిగాడు.ఈ టెలిస్కోప్ ను ఉపయోగించి సేకరించిన సమాచారాన్ని బట్టి కోపర్నికస్ యొక్క సూర్య కేంద్రక సిద్ధాంతాన్ని బలపరిచాడు. సా.శ. 1616 లో గెలీలియో విశ్వానికి సూర్యుడే కేంద్రమని సూర్యుని చుట్టే భూమి తిరుగుతుందని నిర్ధ్వందంగా ప్రకటించాడు

★★★★



1.
2.
3.
4.
5.
6.
7.
8.
9.
10.




## దారి కనిపెట్టటానికి సహాయం చెయ్యండి



## బొమ్మకు రంగులు వెయ్యండి




## తేడాలు కనిపెట్టండి



# రాశి ఫలాలు

## ఈ నెల మీ అదృష్టం....



కొలుకుల చంద్ర శేఖర్






ఈ నెలలో మేష రాశి వారికి సానుకూల సమయం ఉంటుంది. సూర్యుడు మరియు బుధుడు 3వ ఇంట్లో సంచరిస్తుండటం వలన మీ కమ్యూనికేషన్ నైపుణ్యాలు మెరుగుపడతాయి, దీని ఫలితంగా కెరీర్‌లో సానుకూల వాతావరణం ఏర్పడుతుంది. గత కొంతకాలంగా రాహువు 11వ ఇంట్లో ఉండటం వలన సామాజిక కార్యకలాపాలు మరియు ఆదాయ వనరులు మెరుగుపడ్డాయి, ఈ నెలలో కూడా ఈ అనుకూలత కొనసాగుతుంది.




ఈ నెలలో వృషభ రాశి వారికి మిశ్రమ ఫలితాలు ఉంటాయి. సూర్యుడు మరియు బుధుడు 2వ ఇంట్లో సంచరిస్తుండటం వలన ఆర్థిక స్థిరత్వం మరియు కమ్యూనికేషన్ నైపుణ్యాలు మెరుగుపడతాయి. అయితే, రాహువు 10వ ఇంట్లో మరియు కుజుడు 4వ ఇంట్లో ఉండటం వలన కెరీర్ మరియు గృహ సంబంధిత విషయాలలో జాగ్రత్త అవసరం. శని 11వ ఇంట్లో స్థిరంగా ఉండటం వలన సామాజిక కార్యకలాపాలు మరియు ఆదాయ వనరులు స్థిరంగా ఉంటాయి.





ఈ నెలలో మిథున రాశి వారికి మిశ్రమ ఫలితాలు ఉంటాయి. సూర్యుడు, బుధుడు, మరియు గురుడు 1వ ఇంట్లో సంచరిస్తుండటం వలన మీ వ్యక్తిత్వం మరియు కమ్యూనికేషన్ నైపుణ్యాలు మెరుగుపడతాయి, కానీ శని 10వ ఇంట్లో మరియు కుజుడు 3వ ఇంట్లో ఉండటం వలన కెరీర్ మరియు ఆరోగ్యంలో కొన్ని సవాళ్లు ఎదురవుతాయి. రాహువు 9వ ఇంట్లో ఉండటం వలన ఊహించని అవకాశాలు లభిస్తాయి, అయితే ఆర్థిక విషయాలలో జాగ్రత్త అవసరం.




ఈ నెలలో కర్కాటక రాశి వారికి మిశ్రమ ఫలితాలు ఉంటాయి. బుధుడు 1వ ఇంట్లోకి ప్రవేశించడం (జూన్ 22 నుండి) మరియు కుజుడు 2వ ఇంట్లో ఉండటం వలన కెరీర్ మరియు ఆర్థిక విషయాలలో సానుకూలత ఉంటుంది. అయితే, సూర్యుడు మరియు గురుడు 12వ ఇంట్లో ఉండటం వలన ఆర్థిక ఖర్చులు మరియు ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం. శని 9వ ఇంట్లో ఉండటం వలన జ్ఞాన విస్తరణ మరియు భాగస్వామ్య సంబంధాలలో స్థిరత్వం కొనసాగుతుంది. ఈ నెల మీరు ఆధ్యాత్మికంగా మరియు మానసికంగా అభివృద్ధి చెందుతారు.




ఈ నెలలో సింహ రాశి వారికి అద్భుతమైన ఫలితాలు ఉంటాయి. సూర్యుడు, బుధుడు, మరియు గురుడు 11వ ఇంట్లో సంచరిస్తుండటం వలన కెరీర్, ఆర్థికం, మరియు సామాజిక కార్యకలాపాలలో విజయం సాధిస్తారు. అయితే ఆరోగ్యంపై కొద్దిగా శ్రద్ధ అవసరం. శని 8వ ఇంట్లో ఉండటం వలన ఆరోగ్యం మరియు భాగస్వామ్య సంబంధాలలో జాగ్రత్త వహించాలి.





ఈ నెలలో కన్యా రాశి వారికి సానుకూల ఫలితాలు ఉంటాయి. సూర్యుడు, బుధుడు, మరియు గురుడు 10వ ఇంట్లో సంచరిస్తుండటం వలన కెరీర్‌లో విజయం మరియు గుర్తింపు లభిస్తాయి. శుక్రుడు 9వ ఇంట్లో ఉండటం వలన ఆర్థిక స్థిరత్వం మరియు జ్ఞాన విస్తరణకు అవకాశాలు ఉంటాయి. అయితే, కుజుడు మరియు కేతువు 12వ ఇంట్లో ఉండటం వలన ఆర్థిక ఖర్చులు మరియు ఆరోగ్యంపై జాగ్రత్త అవసరం. శని 7వ ఇంట్లో ఉండటం వలన భాగస్వామ్య సంబంధాలలో స్థిరత్వం కొనసాగుతుంది.

# రాశి ఫలాలు



## ఈ నెల మీ అదృష్టం....




ఈ నెలలో తుల రాశి వారికి మిశ్రమ ఫలితాలు ఉంటాయి. సూర్యుడు, బుధుడు, మరియు గురుడు 9వ ఇంట్లో సంచరిస్తుండటం వలన విద్యా, జ్ఞాన విస్తరణ, మరియు ప్రయాణ సంబంధిత అవకాశాలు లభిస్తాయి. అయితే, కుజుడు 11వ ఇంట్లో మరియు శని 6వ ఇంట్లో ఉండటం వలన కెరీర్ మరియు ఆర్థిక విషయాలలో కొన్ని సవాళ్లు ఎదురవుతాయి.





కెరీర్‌లో ఈ నెల సవాళ్లతో కూడిన సమయం. కుజుడు 10వ ఇంట్లోకి ప్రవేశించడం వలన అదనపు పనిభారం, ఒత్తిడి, మరియు బాధ్యతలు పెరుగుతాయి. కొందరు ఉద్యోగరీత్యా సుదూర ప్రయాణాలు లేదా వేరే ప్రదేశంలో పని చేయవలసి రావచ్చు. సూర్యుడు 8వ ఇంట్లోకి ప్రవేశించడం వలన ఉన్నతాధికారులు మరియు సహోద్యోగుల నుండి తక్కువ మద్దతు లభించవచ్చు, మరియు అపార్థాలు రావచ్చు. అనవసర వాగ్వాదాలను నివారించడానికి తక్కువగా మాట్లాడండి .




ఈ నెలలో ధనుస్సు రాశి వారికి మిశ్రమ ఫలితాలు ఉంటాయి. సూర్యుడు, బుధుడు, మరియు గురుడు 7వ ఇంట్లో సంచరిస్తుండటం వలన భాగస్వామ్య సంబంధాలు మరియు కెరీర్ సంబంధిత అవకాశాలు బలపడతాయి. కుజుడు మరియు కేతువు 9వ ఇంట్లో ఉండటం వలన జ్ఞాన విస్తరణ మరియు ప్రయాణాలకు అవకాశాలు ఉంటాయి, అయితే ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం.




. ఈ నెలలో మకర రాశి వారికి మిశ్రమ ఫలితాలు ఉంటాయి. సూర్యుడు, బుధుడు, మరియు గురుడు 6వ ఇంట్లో సంచరిస్తుండటం వలన కెరీర్‌లో శత్రువులపై విజయం మరియు ఆరోగ్యంలో మెరుగుదల లభిస్తాయి. శుక్రుడు 5వ ఇంట్లో ఉండటం వలన సృజనాత్మక కార్యకలాపాలు మరియు కెరీర్ అవకాశాలు బలపడతాయి. అయితే, కుజుడు మరియు కేతువు 8వ ఇంట్లో ఉండటం వలన ఆర్థిక ఖర్చులు మరియు ఆరోగ్యంపై జాగ్రత్త అవసరం.




ఈ నెలలో కుంభ రాశి వారికి సాధారణ ఫలితాలు ఉంటాయి. సూర్యుడు, బుధుడు, మరియు గురుడు 5వ ఇంట్లో సంచరిస్తుండటం వలన సృజనాత్మక కార్యకలాపాలు, విద్య, మరియు ఆర్థిక వృద్ధిలో సానుకూలత ఉంటుంది. కుజుడు మరియు కేతువు 7వ ఇంట్లో ఉండటం వలన కెరీర్ మరియు భాగస్వామ్య సంబంధాలలో కొన్ని సవాళ్లు ఎదురవుతాయి. ని 2వ ఇంట్లో ఉండటం వలన ఆర్థిక విషయాలలో జాగ్రత్త అవసరం.




ఈ నెలలో మీన రాశి వారికి మిశ్రమ ఫలితాలు ఉంటాయి. సూర్యుడు, బుధుడు, మరియు గురుడు 4వ ఇంట్లో సంచరిస్తుండటం వలన గృహ సంబంధిత విషయాలు, కెరీర్ అవకాశాలు, మరియు వ్యక్తిగత అభివృద్ధిలో సానుకూలత ఉంటుంది. కుజుడు మరియు కేతువు 6వ ఇంట్లో ఉండటం వలన ఆరోగ్యం మరియు కెరీర్‌లో కొన్ని సవాళ్లు ఎదురవుతాయి. శని 1వ ఇంట్లో మరియు రాహువు 12వ ఇంట్లో ఉండటం వలన ఆర్థిక ఖర్చులపై జాగ్రత్త మరియు వ్యక్తిగత జీవితంలో శ్రద్ధ అవసరం

# సుమతి

అంతర్జాల సమగ్ర కుటుంబ మాసపత్రిక

## సుమతి ఇప్పుడు ఆన్లైన్లో

**సుమతి** అంతర్జాల కుటుంబ మాసపత్రిక ఇప్పుడు ఆన్లైన్ లో వెలువడుతోంది . మీ మొబైల్ నుండి కాని లేదా మీ కంప్యూటర్ నుండి ఆన్లైన్ లో హాయిగా చదువుకోండి .

www.sumathimasapathrika.com


**సుమతి** మాసపత్రిక అంతర్జాల పత్రిక విడి ప్రతి వెల.


**రూ. 25 /-** రూపాయలు

సంవత్సర చందా కి కేవలం **రూ. 250/-**

ఐదు సంవత్సరాల చందా కేవలం **రూ. 1,200/-**

ఐదు సంవత్సరాలు చందా కట్టిన వారిక రూ.200 విలువచేసే పుస్తకాలను ఉచితంగా పంపబడును




చందా కట్టదలచిన వారు కింది నెంబరుకు గూగుల్ పే లేదా ఫోన్ పే చెయ్యండి

7 8 9 3 1 1 1 9 8 5

చందా కట్టిన వారికి ప్రతి నెల flip బుక్ పాస్ వర్డ్ తో పంపబడును

